www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

తిరగబడ్డ తెనాలి

సీఎం కోసం ట్రాఫిక్ నియంత్రణలో సర్కారు 'అతి'పై తిరుగుబాటు 14

తెనాలిలో పోలీసులపై దండెత్తిన జనం

బరిలో ఎవరెక్కడ?

ప్రధాన పార్టీల అభ్యర్థుల వివరాలు

నేటి 'జన కేతనం'లో..

జనంపై బాదుడే బాదుడు 12 13

పెద్దిరెడ్డి ఇలాకాలో

విధ్వంసం

మంత్రి గ్రామంలో ప్రచారానికి వచ్చారని రామచంద్రయాదవ్‌పై హత్యాయత్నం 14

రాళ్లు, కర్రలతో దాడి.. అడ్డుకున్న సీఆర్పీఎఫ్

20 మంది బీసీవై కార్యకర్తలకు తీవ్ర గాయాలు

స్టేషన్‌కు వెళ్లినా ఆగని దాడి..15 వాహనాలు ధ్వంసం

మంగళవారం | 30-4-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 14 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి ఉ. 7.05, సప్తమి తె. 5.45 వరకు; నక్షత్రం: ఉత్తరాషాఢ తె. 4.09 తదుపరి శ్రవణం; వర్జ్యం: మ. 12.31-2.04; దుర్ముహూర్తం: ఉ. 8.24-9.15, రా. 10.14-10.58; అమృతఘడియలు: రా. 9.53-11.27; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.53; సూర్యాస్తమయం: 6.31 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇంటికొచ్చి ఇచ్చేందుకు ఇంకేం బాధ?

పింఛన్లపై ఎందుకీ వికృత క్రీడ?

నెల కిందట అలా...

"డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా సామాజిక పెన్షన్ల పంపిణీ సాధ్యం కాదు. లబ్ధిదారులందరికీ బ్యాంకు అకౌంట్లు లేవు. ఉన్నా అవి యాక్టివ్‌గా ఉండే అవకాశాలు తక్కువ. బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ సీడ్ కాలేదు. వలంటీర్లు లేనందున వాటిని చెక్‌చేసే అవకాశం లేదు. దానివల్ల చనిపోయిన వాళ్లకు కూడా పెన్షన్‌ను ఖాతాల్లో వేయాల్సి వస్తుంది"

- పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఈ నెల 2న ఇచ్చిన మెమో

ఇప్పుడు ఇలా...

"రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పంపిణీని రెండు విధానాల్లో చేపడతాం. దివ్యాంగులు, వయోవృద్ధులు, మంచానపడిన వారికి మాత్రం ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తాం. మిగిలిన లబ్ధిదారులందరీ వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తాం"

- శశిభూషణ్ కుమార్ ఈ నెల 28న ఇచ్చిన మెమో

ఎన్నికల వేళ... అందునా మండుటెండలో సామాజిక పెన్షన్లను అడ్డం పెట్టుకుని జగన్ సర్కార్ కొనసాగిస్తున్న వికృత క్రీడ అత్యంత అమానవీయం. ఏప్రిల్ నెలలో ఈ దురాగతానికి 32 మంది వృద్ధులు మరణించారు. మరి మే నెల కూడా అదే పంథా కొనసాగిస్తారా?



అవ్వాతాతలను బ్యాంకుల చుట్టూ తిప్పాలా?

రేపటికి ఖజానాకు కావాల్సినన్ని నిధులు

ఇంటింటి పంపిణీకి సచివాలయ సిబ్బందీ సిద్ధం

ఒకట్రెండు రోజుల్లోనే పూర్తిచేయగలమని వెల్లడి

జాబ్ చార్ట్‌లో లేని పనులెన్నో చేయిస్తున్నారు

మద్యం షాపుల ముందూ మమ్మల్ని నిలబెట్టారు

పెన్షన్ల పంపిణీకి మాత్రం మేం పనికిరామా?

బ్యాంకు ఖాతాల్లో వేయడమూ 'రాజకీయమే'

సచివాలయ సిబ్బంది స్పష్టీకరణ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకటో తేదీ నాటికి పూర్తిస్థాయిలో నిధులు అందుబాటులోకి వస్తున్నాయి. ఉత్తర్వులు అక్కర్లేదు... వాట్సాప్‌లో మెసేజ్ పెట్టినా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు 100 శాతం పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది చెబుతున్నారు. మరి... అవ్వాతాతలకు ఇళ్ల వద్దే పింఛను అందించేందుకు ఇంకేం బాధ? డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు తంటాలు పడటం... ఖాతాలో పడిన పింఛను తీసుకునేందుకు ఏటీఎం లేదా బ్యాంకు చుట్టూ తిరగడం... మండు

మిగతా 11వ పేజీలో...





నంద్యాల జిల్లా డోన్‌లో సభకు భారీగా హాజరైన ప్రజలు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, బైరెడ్డి శబరితో చంద్రబాబు

వృద్ధుల ప్రాణాలతో

చెలగాటం

పెన్షన్ డబ్బు బ్యాంకు ఖాతాల్లో వేస్తారా?

అన్ని గ్రామాల్లో బ్యాంకులు ఉన్నాయా?

5-10 కిలోమీటర్లు వెళ్లాలి

గత నెలలో 33 మంది చనిపోయారు

ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలి: చంద్రబాబు

ఉద్యోగులకు అండగా!

సీపీఎస్‌పై ప్రత్యేక విధానం: చంద్రబాబు

సకాలంలో పీఆర్సీ, పెన్షన్ ఇస్తాం.. ఉద్యోగులపాలిట రాక్షసుడిగా జగన్

వారంలో సీపీఎస్ రద్దన్నాడు.. అలాంటి వారాలు చాలా పోయాయి

ఫిట్‌మెంట్ ఇవ్వకుండా ఇబ్బందులు.. డీఏల్లేవు.. రివర్స్ పీఆర్సీ

25 వేల కోట్లకు పైగా బకాయిలు.. ఒక్క నెలలోనూ 1న పెన్షన్ ఇవ్వలేదు

మద్యం షాపుల వద్ద టీచర్లు కాపలా.. ప్రజల భూములు కొట్టేసేందుకు పన్నాగం

గత ఎన్నికల్లో కోడికత్తి డ్రామా.. ఇపుడు గులకరాయి నాటకం

పిట్టకథల బుగ్గన తిన్నదంతా కక్కిస్తా.. ప్రజాగళంలో టీడీపీ అధినేత హెచ్చరిక

నంద్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగికీ న్యాయం జరగలేదని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. సీఎం జగన్ వారి పాలిట రాక్షసుడిలా మారారని ధ్వజమెత్తారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)పై ప్రత్యేక విధానం తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగులకు న్యాయం చేస్తామని.. పీఆర్సీ, పింఛన్ సకాలంలో ఇచ్చి అండగా ఉంటామని వెల్లడించారు. ప్రజాగళంలో భాగంగా సోమవారం నంద్యాల జిల్లా డోన్, నందికొట్కూరుల్లో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. ఐదేళ్లుగా సచివాలయానికి వెళ్లని సీఎం, ఐదేళ్లలో ఒక్క పత్రికా సమావేశం కూడా నిర్వహించని సీఎం జగన్ తప్ప దేశంలో మరెవరూ లేరన్నారు. సొంత ప్రయోజనాల కోసం కేబినెట్‌ను పెట్టుకుని పరిపాలన సాగిస్తున్నాడన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తీసుకొచ్చి ప్రజల ఆస్తులను కొట్టేయాలని చూస్తున్నారని.. బంగారు భవిష్యత్ ఉన్న యువతకు ఉద్యోగాలివ్వకుండా వారి జీవితాలను నాశనం చేశారని మండిపడ్డారు. సైకో జగన్‌రెడ్డికి ఒళ్లంతా అహంకారం పెరిగిపోయి, వ్యవస్థలను ధ్వంసం చేశారని.. అభివృద్ధిని విచ్ఛిన్నం చేసి, ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. 'డ్రగ్స్ రాష్ట్రంగా మార్చి యువతను గంజాయికి బానిసలుగా

మిగతా 14వ పేజీలో...



ఏలూరు జిల్లా గణపవరం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న పవన్



బద్దలుకొడుతున్నాం

అరాచక వైసీపీని చెత్తబుట్టలో పడేద్దాం

మన భూముల పాసు పుస్తకాలపై ముఖ్యమంత్రి ఫొటోలు ఎందుకు?

దస్తావేజులు లేవు.. సర్వర్‌లో ఉంచుతారట

తమ ఆస్తిని ప్రజలు రుజువు చేసుకోవాలా?

మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే ఆస్తులు గల్లంతే

జగన్ పాలనలో డీఎస్సీ లేదు.. ఉపాధీ లేదు

కేంద్ర సహకారం ఉంటేనే అభివృద్ధి పరుగు

కాకినాడ, ఏలూరు సభల్లో పవన్ కల్యాణ్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

"వైసీపీ ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయి. అరటిపండు తొక్కలాంటి జగన్ ప్రభుత్వాన్ని చెత్తబుట్టలో పడేద్దాం. రాబోయేది కూటమి ప్రభుత్వమే" అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో సోమవారం ఆయన 17 గ్రామాల మీదుగా రోడ్‌షో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మతో కలిసి దారిపొడవునా ప్రజలు, రైతులు, కార్మికులను పలకరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. మరికొద్ది రోజుల్లో జగన్ అవినీతి కోటలు బద్దలు కొడుతున్నామన్నారు. వైసీపీ దుష్టపరిపాలనకు చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు. ఇంకా ఏమన్నారంటే.. మన భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలపై

మిగతా 2వ పేజీలో...

అక్రమ ఇసుక తవ్వకాలు

ఆపండి

ఏపీ సర్కారుకు సుప్రీం ఆదేశం

అలసత్వం లేకుండా అక్రమార్కులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయండి

మే 9 లోపు అఫిడవిట్లు వేయండి

ఏపీ సర్కారు, కేంద్రానికి ఆదేశం

ఎన్నికల నేపథ్యంలో సమయం కోరిన ప్రభుత్వ న్యాయవాదిపై కోర్టు ఆగ్రహం

ఎన్నికలకన్నా పర్యావరణమే ముఖ్యమని వ్యాఖ్య



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టులో జగన్ ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలింది. రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అక్రమ తవ్వకాలకు పాల్పడినవారిపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సూచించింది సోమవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో నదీ భూగర్భ

మిగతా 11వ పేజీలో...

'గ్లాసు'పై కుట్ర

ఓట్ల చీలికకు వైసీపీ పన్నాగం

జనసేన పోటీలో లేనిచోట కామన్ సింబల్‌గా అందరికీ అందుబాటులోకి గాజుగ్లాసు 11

16 అసెంబ్లీ, 3 ఎంపీ స్థానాల్లో కేటాయింపు

జనసేన అభిమానులను గందరగోళపరిచే కుట్ర

అర్ధరాత్రిదాకా రిటర్నింగ్ ఆఫీసర్ల సహకారం!

'యు'టర్నింగ్ అధికారులు!

3

నామినేషన్లలో లోపాలపై వైసీపీవారికి మేళ్లు

కేసులు, ఆస్తులు దాచేసినా మౌనం

కనీసం ఫిర్యాదులూ పట్టని వైనం

'అన్నీ చిన్నవే'నంటూ.. కనికరం

అస్మదీయ అధికారులను నియమించుకున్న తీరును ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

న్యాయానికి జగన్ సంకెళ్లు!

సివిల్ కోర్టుల ప్రమేయాన్ని నిషేధించిన టైటిల్ చట్టం

కొత్త చట్టంలో రైతులకు న్యాయం పొందే హక్కు నిరాకరణ.. భూ సమస్య వస్తే ఇక అధికారుల దయపైనే ఆధారం

అధికారి నిర్ణయం నచ్చకపోతే ల్యాండ్ అప్పీలేట్‌కు.. అప్పీళ్ల కోసం ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సిందే

చివరి పరిష్కారంగానే హైకోర్టుకు వెళ్లే అవకాశం.. టైటిల్ అధికారులకు సూపర్ పవర్ 11

బెయిల్ కోసం సోనియా వద్దకు రాయబారం

జగన్ తల్లిని, చెల్లిని పంపారు.. షర్మిల చెప్పింది నిజమే

కడపలో ఆమె గెలుపు ఖాయం.. నెల్లూరులో నాదే విజయం



'బిగ్ డిబేట్'లో మాజీ ఐఏఎస్ రాజు 2



అబ్ కీ బార్?

ఆరో దశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా ఆరో దశ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈసీ సోమవారం విడుదల చేసింది. 7 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 57 స్థానాలకు ఈ దశలో ఎన్నికలు జరగనున్నాయి. బిహార్, హరియాణా, ఝార్ఖండ్, ఒడిశా, యూపీ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీలోని పార్లమెంటు స్థానాలకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. మే 25న పోలింగ్ జరుగుతుంది. నామినేషన్ల స్వీకరణ సోమవారం ప్రారంభమైంది. ఈ దశలో తెలంగాణకు చెందిన శ్రీకళారెడ్డి యూపీలోని జౌన్‌పూర్ స్థానం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కన్హయ్యకుమార్ నార్త్ ఈస్ట్ ఢిల్లీ నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో నిలవనున్నారు.

కాంగ్రెస్‌కు మరో షాక్!

» నామినేషన్ ఉపసంహరించుకొని బీజేపీలో చేరిన ఇండోర్ అభ్యర్థి అక్షయ్ బమ్.. తప్పుకున్న ముగ్గురు ఇండిపెండెంట్లు



కైలాస్ విజయవర్గీయతో కారులో అక్షయ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి తక్కువ స్థానాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బమ్ చివరి నిమిషంలో తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని బీజేపీలో చేరారు. అక్షయ్ బమ్‌తో పాటు మరో ముగ్గురు అభ్యర్థులు కూడా తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని జిల్లా కలెక్టర్ ఆశిష్ సింగ్ మీడియాకు తెలిపారు. మే 13న ఈ నియోజకవర్గంలో పోలింగ్ జరగాల్సి ఉంది. సోమవారం మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ నేత కైలాష్ విజయ్ వర్గీయ తన కారులో అక్షయ్ బమ్‌ను చూపిస్తూ తీసిన ఫొటోను 'ఎక్స్'లో పోస్టు చేయడంతో నామినేషన్ విత్‌డ్రా అంశం వెలుగులోకి వచ్చింది. అక్షయ్ బమ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీఎం మోహన్‌యాదవ్ బీజేపీలోకి ఆహ్వానిస్తున్నట్లు పోస్టులో ఆయన పేర్కొన్నారు. కాగా, గతవారం సూరత్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభానీ నామినేషన్ తిరస్కరణకు గురవడం, వెనువెంటనే స్వతంత్ర అభ్యర్థులు కూడా తప్పుకోవడంతో ఎన్నికల ఫలితాలకు ముందే బీజేపీ బోణీ కొట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఇండోర్‌లో కూడా బీజేపీకి ప్రధాన పోటీదారు అయిన కాంగ్రెస్ పోటీ నుంచి తప్పుకోవడంతో.. బరిలో చిన్న పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులే ఉండటంతో కమలం అభ్యర్థి శంకర్ లాల్వానీ గెలుపు లాంఛనమే కానుంది.

మోదీపై అనర్హత వేయాలన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: దేవుళ్ల పేరున ఓట్లు అడుగుతున్న ప్రధాని మోదీ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేళ్ల పాటు నిషేధం విధించాలని కోరుతూ సోమవారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆయన ఎన్నికల ప్రచారంలో దేవుళ్లు, ప్రార్థనా స్థలాల పేరున ఓట్లు అడుగుతున్నారని, ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధమని పేర్కొంటూ న్యాయవాది ఆనంద్ ఎస్ జోంధాలే ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన జస్టిస్ సచిన్ దత్తా ధర్మాసనం ఇందులో ఎలాంటి మెరిట్ లేదంటూ తిరస్కరించింది. ఇదే విషయమై ఆయన ఈ నెల పదో తేదీన ఈసీకి ఫిర్యాదు చేశారని, అక్కడ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే కోర్టును ఆశ్రయించడం ఏమిటని ప్రశ్నించింది. ఒకవేళ ఈసీ తగిన నిర్ణయం తీసుకోలేదని భావిస్తే అప్పుడు కోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది.

వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించాలన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: లోక్‌సభ ఎన్నికల వేళ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో (ఈవీఎం) నమోదైన ఓట్లతో పాటు వీవీప్యాట్ స్లిప్పులను కూడా లెక్కించాలంటూ దాఖలైన మరో పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టేసింది. అత్యున్నత న్యాయస్థానంలోని మరో డివిజన్ బెంచ్ ఇటీవలే ఇటువంటి అభ్యర్థనను తిరస్కరించిందని.. ఈ నేపథ్యంలో ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మిశ్రాల ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెలలో జరగనున్న చార్టెడ్ అకౌంటెన్సీ (సీఏ) పరీక్షల్లో కొన్నింటిని వాయిదా వేయాలంటూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. విచారణలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) తరఫు న్యాయవాది.. పోలింగ్ రోజున దేశంలో ఎక్కడా పరీక్షను నిర్వహించడం లేదన్నారు. తేదీలను మారిస్తే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. దీంతో, పిల్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సీఏ పరీక్షలు మే 2 నుంచి 17 వరకు జరగనున్నాయి.

గాండే అసెంబ్లీకి కల్పనా సోరెన్ నామినేషన్

రాంచీ, ఏప్రిల్ 29: ఝార్ఖండ్‌లోని గాండే అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో జేఎంఎం తరఫున మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ పోటీ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఆమె నామినేషన్ దాఖలు చేశారు. జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. మే 20న రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలతో పాటు గాండే అసెంబ్లీ ఉప ఎన్నిక జరగనుంది.

మూడో దశలో మహిళా అభ్యర్థులు 123 మందే!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థుల సంఖ్య నామమాత్రంగానే ఉంటోంది. ఎన్నికల మూడో దశలో భాగంగా 94 స్థానాలకు పోటీ చేస్తున్న మొత్తం 1,352 మంది అభ్యర్థుల్లో మహిళలు కేవలం 123 మంది(9%) మాత్రమే ఉన్నారు. కాగా, 18శాతం మంది అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను విశ్లేషించిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) ఈ మేరకు నివేదిక విడుదల చేసింది. నేరచరిత్ర ఉన్న 244మంది అభ్యర్థుల్లో ఐదుగురిపై హత్య, మరో 24మందిపై హత్యాయత్నం, 38మందిపై మహిళలపై నేరాలకు పాల్పడిన కేసులు, 17మందిపై విద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. మొత్తం అభ్యర్థుల్లో 392 మంది (29%) కోటీశ్వరులు. మూడో దశలో పోటీకి నిలిచినవారిలో 5 నుంచి 12వ తరగతి చదివినవారు 639 మంది (47%) కాగా, గ్రాడ్యుయేషన్, ఆపై విద్యార్హతలు కలిగినవారు 591మంది (44%) ఉన్నారు. వయసుల వారీగా చూస్తే 25నుంచి 40ఏళ్ల లోపువారు 411 మంది (30%). 41 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కులు 712 మంది (41%) ఉన్నారు. కాగా, మూడో దశ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ మే 7న జరగనుంది.

కర్ణాటకలో డర్టీ పిక్చర్

దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల సంచలనం



ప్రజ్వల్ రేవణ్ణకు వ్యతిరేకంగా కర్ణాటకలో యూత్ కాంగ్రెస్ నిరసన

బెంగళూరు, న్యూఢిల్లీ, హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజకీయాలను మాజీ ప్రధాని దేవెగౌడ మనవడి డర్టీపిక్చర్ కుదిపేస్తోంది! ఇప్పటికే ఒక దశ ఎన్నికలు ముగిసి, మే 7న మరో దశ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఆ రాష్ట్రంలో.. దేవెగౌడ పెద్దకుమారుడైన రేవణ్ణ కొడుకు.. హసన్ సిట్టింగ్ ఎంపీ అయిన ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన 2976 అశ్లీల వీడియోల వ్యవహారం పెనుసంచలనం సృష్టిస్తోంది. ఆ వీడియోల్లో వందలాది మంది సాధారణ మహిళలతోపాటు.. పలువురు ప్రభుత్వ ఉద్యోగినులు కూడా ఉన్నట్లు సమాచారం. ఆ వీడియోలన్నీ అతడి ఫోన్‌లో రికార్డ్ చేసుకున్నవే! ఎలా బయటపడ్డాయోగానీ.. ఆ వీడియోల పెన్‌డ్రైవ్‌లు కర్ణాటకలో పలు పార్టీల నేతలకు, జాతీయ స్థాయిలో పలువురు కాంగ్రెస్ నేతలకు కూడా చేరాయి. సామాజిక మాధ్యమాల్లో కూడా ఆ వీడియోలు విపరీతంగా వైరల్ కావడం.. ఈ వ్యవహారం మీడియా ద్వారా ప్రపంచమంతా టాం టాం కావడం జేడీఎస్‌ను, ఆ పార్టీతో జట్టు కట్టిన బీజేపీని ఇరుకున పెడుతోంది. నిజానికి ప్రజ్వల్ కామలీలల గురించి బయటి ప్రపంచానికి తెలిసింది ఇప్పుడేగానీ.. ఆ వీడియోలు కన్నడనాట గత డిసెంబరు నుంచే వైరల్ అవుతున్నాయి! 2023 డిసెంబరు 8వ తేదీన.. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు, కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్రకు కర్ణాటక బీజేపీ నేత దేవరాజె గౌడ రెండు పేజీల సుదీర్ఘ లేఖ కూడా రాశారు. "మన (ఎన్డీయే) కూటమిలో ఉన్న జేడీఎస్ అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ సహా దేవెగౌడ కుటుంబానికి చెందిన పలువురు నేతలపై కిడ్నాప్, రేప్ వంటి దారుణమైన ఆరోపణలు వస్తున్నాయి. వారిలో.. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ స్త్రీలోలుడు, సైకో. అతడు మహిళలతో లైంగికచర్యల్లో పాల్గొంటూ తన ఫోన్‌లో వీడియోలు తీసుకున్నాడు. ఆ వీడియోలతో కూడిన పెన్‌డ్రైవ్ ఒకటి కాంగ్రెస్ నేతల వద్దకు చేరింది. అలాంటిదే మరో పెన్‌డ్రైవ్ నా వద్దకు కూడా వచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ వీడియోలను ట్రంప్ కార్డులా వాడుకుంటుంది" అని ఆయన ఆ లేఖలో పార్టీ అధిష్ఠానాన్ని ముందే హెచ్చరించారు. అయినప్పటికీ జేడీఎస్ ప్రజ్వల్ రేవణ్ణకే హసన్ సీటు కేటాయించడం.. బీజేపీ అందుకు అభ్యంతరం చెప్పకపోవడం గమనార్హం. దేవరాజెగౌడ అంచనా వేసినట్టుగానే.. ఏప్రిల్ 26న కర్ణాటకలో జరిగిన తొలిదశ ఎన్నికల సమయంలో విపక్ష నేతలు ప్రజ్వల్ అకృత్యాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ ప్రచార ప్రభావం ఎన్నికలపై పడే ప్రమాదాన్ని గ్రహించిన ప్రజ్వల్ రేవణ్ణ.. ఎన్నికల్లో లబ్ధి కోసం తన మార్ఫ్‌డ్ ఫొటోలు, వీడియోలతో కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కానీ, ఈ వీడియోల వ్యవహారం రోజురోజుకూ పెద్దదై మహిళా కమిషన్ దృష్టికి వెళ్లడంతో.. ఎన్నికలైన మర్నాడే ఆయన జర్మనీకి వెళ్లారు. అంతలోనే.. రేవణ్ణ ఇంట్లో గతంలో పనిచేసిన ఒక మహిళ(47).. రేవణ్ణ, ప్రజ్వల్ తనను లైంగికంగా వేధించారని ఫిర్యాదు చేసింది.

మాకేం సంబంధం లేదు..

ప్రజ్వల్ అశ్లీల వీడియోల వ్యవహారం జాతీయస్థాయిలో చర్చనీయాంశం కావడంతో బీజేపీ.. దీంతో తమకు సంబంధం లేనట్టు ప్రవర్తిస్తోంది. "ఆ వీడియోలతో మా పార్టీకి ఏ సంబంధమూ లేదు" అని కర్ణాటక రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ఎస్ ప్రకాశ్ ప్రకటించారు. జేడీఎస్‌నైతే ఈ వ్యవహారం తీవ్ర సంక్లిష్ట పరిస్థితిలో పడేసింది. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని సొంతపార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. అయితే.. ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ మాత్రం ఆ వీడియోలు ఇప్పటివి కావని, నాలుగైదేళ్ల కిందటివంటూ తేలిగ్గా తీసిపారేసే ప్రయత్నం చేయడం గమనార్హం. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక కూడా ఈ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వందలాది మంది మహిళల జీవితాలు నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె.. 'ఇంత జరిగినా ఇంకా మౌనంగానే ఉంటారా?' అని మోదీని నిలదీశారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్.. ప్రజ్వల్‌తో పాటు రేవణ్ణకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే.. ప్రజ్వల్ ఇప్పటికే విదేశాలకు వెళ్లగా, కేసుల నుంచి ఉపశమనం పొందేందుకు రేవణ్ణ హైకోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నట్టు సమాచారం.

ప్రజ్వల్‌ను రప్పించి శిక్షించాలి

జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ విదేశాలకు పరారయ్యేందుకు మిత్రపక్షం బీజేపీ సహకరించిందని ఏఐసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు అల్కా లంబా ఆరోపించారు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ద్వారా జర్మనీ ప్రభుత్వంతో చర్చించి ప్రజ్వల్‌ను వెనక్కి రప్పించాలని ఆమె కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అయితే.. ప్రజ్వల్ నిజంగా విదేశాలకు వెళ్లి ఉంటే అతణ్ని వెనక్కి రప్పించే బాధ్యత సిట్‌దేనని కర్ణాటక హోం మంత్రి జి.పరమేశ్వర అన్నారు. ఇక..



ప్రజ్వల్‌ను వెంటనే దేశానికి రప్పించి చట్టప్రకారం శిక్షించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. మహిళలపై లైంగిక వేధింపుల విషయంలో బీజేపీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. అలాగే.. మహిళలను లైంగికంగా వేధించినవారికి, అవినీతిపరులు, దొంగలకు బీజేపీ అండగా నిలుస్తోందని సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ విమర్శించారు.

నా కుటుంబంపై కుట్ర: రేవణ్ణ



ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన రాసలీలల వివాదంపై ఆయన తండ్రి, మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ తొలిసారి స్పందించారు. బెంగళూరులో తన తండ్రి, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడను కలిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. తనతో పాటు తన కుటుంబంపై కుట్ర జరిగిందని ఆరోపించారు. దీనిపై తాను న్యాయ పోరాటం చేస్తానన్నారు. తాను అజ్ఞాతంలోకి వెళ్లానని ప్రచారం చేస్తున్నారని, తాను ఎక్కడికీ వెళ్లలేదని స్పష్టం చేశారు. ప్రజ్వల్ విదేశాలకు వెళ్లడానికి, కేసు నమోదుకు సంబంధం లేదన్నారు. ముందస్తుగా నిర్ణయించుకున్న విధంగానే ప్రజ్వల్ విదేశాలకు వెళ్లాడని తెలిపారు. ఆ తర్వాత కేసు నమోదయిందని పేర్కొన్నారు.

చెప్పుకోవడానికి ఏంలేక గాంధీ కుటుంబాన్ని తిడుతున్నారు



గుర్‌మిట్కల్(కర్ణాటక), ఏప్రిల్ 29: 'ప్రధాని మోదీకి చెప్పుకోవడానికి సొంతంగా సాధించిన విజయాలేమీ లేవు. అందుకనే గాంధీ కుటుంబాన్ని దుర్భాషలాడుతున్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మొదటి రెండు దశల్లోనూ కాంగ్రెస్ ముందంజలో ఉంది. అది మోదీని తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 'మోదీ పుట్టక ముందు, పుట్టిన తరువాత ఈ దేశంలో ఏం జరిగిందో ప్రతి ఒక్కరికీ తెలుసు. చెప్పుకోవడానికి తనకంటూ విజయాలేమీ లేకపోవడంతో ఆయన ఇప్పటికీ నెహ్రూ, ఇందిర, రాజీవ్, రాహుల్, ప్రియాంకను దుర్భాషలాడుతున్నారు. మోదీలో నిరాశ, నిస్పృహ పెరిగిపోయాయి. అందుకనే కాంగ్రెస్ ప్రజల ఆస్తులు లాక్కొని ముస్లింలకు పంచిపెడుతుందని ఆరోపిస్తున్నారు. అది రాజ్యాంగంలో కానీ, మా మేనిఫెస్టోలో కానీ ఎక్కడా లేదు. హిందూ, ముస్లిం ప్రస్తావన ఎప్పుడూ తీసుకొని రాలేదు. పేదల కోసం ఇందిర హయాంలోనే భూసంస్కరణలు తీసుకొచ్చాం. బ్యాంకులు, ఎల్ఐసీ జాతీయకరణ చేశాం. యూపీఏ పాలనలో ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారు. పేదలకు ఉపయుక్తమైన ఇలాంటి పనులేమైనా మోదీ చేశారా? దేశాన్ని బలోపేతం చేస్తామని మోదీ చెపుతున్నారు. మేం బలహీనపరుస్తామా! పాకిస్థాన్‌ను రెండుగా చీల్చిందే మేము. మీరేం చేశారు' అని ఖర్గే అన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే..

కులగణన, ఆర్థిక సర్వే

» గుజరాత్‌లో ఎన్నికల ప్రచారంలో రాహుల్

పాటణ్, ఏప్రిల్ 29: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కులగణన, ఆర్థిక సర్వే నిర్వహిస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. సర్వేతో దళితులు, ఓబీసీలు, గిరిజనులు, ఓసీల్లో పేదల జనాభా కచ్చితంగా తెలుస్తుందని, తద్వారా వివిధ రంగాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచుతామని చెప్పారు. దేశ జనాభాలో 90% మంది ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలేనని, అయితే బ్యూరోక్రాట్లుగా కానీ, కార్పొరేట్, మీడియా రంగాల్లో, ప్రైవేటు ఆస్పత్రులు, యూనివర్సిటీల్లో కానీ వారి ప్రాతినిధ్యం మాత్రం కనిపించదన్నారు. కేంద్రంలో 90 మంది ఐఏఎస్ అధికారుల్లో కేవలం ముగ్గురే వెనుకబడిన కులాలకు చెందిన వారు ఉన్నారని, అదీ అప్రాధాన్య పోస్టుల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనలో బీజేపీ ఆర్థిక అసమానతలను పెంచి పోషించిందని, 22 మంది వ్యక్తుల వద్ద సంపదంతా పోగుపడిందన్నారు.

బెయిల్ కోసం సోనియా వద్దకు రాయబారం!



» జగన్ తల్లిని, చెల్లిని పంపారు
» షర్మిల చెప్పింది నిజమే: కొప్పుల రాజు
» 'బిగ్ డిబేట్'లో మాజీ ఐఏఎస్

నెల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో జగన్మోహన్‌రెడ్డి జైల్లో ఉన్నప్పుడు.. బెయిల్ కోసం ఆయన తన తల్లిని, చెల్లిని నాటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ వద్దకు పంపారని ఆ పార్టీ సీనియర్ నేత కొప్పుల రాజు ధ్రువీకరించారు. అలాగే రాజశేఖర్‌రెడ్డి పేరు సీబీఐ చార్జిషీటులో చేర్చాలని తాను చెప్పలేదని షర్మిలకు సోనియా క్లియర్‌గా చెప్పారని.. దీనివల్లే ఆమె ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందని తెలిపారు. కడప లోక్‌సభ స్థానంలో ఆమె విజయం ఖాయమని చెప్పారు. రాష్ట్ర ఐఏఎస్ అధికారి అయిన రాజు.. మూడేళ్ల సర్వీసు ఉండగానే రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో వివిధ పదవులు నిర్వహించారు. తాజా ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి పార్టీ తరఫున పోటీచేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌లో జరిగిన, జరుగబోయే పరిణామాలపై 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎండీ వేమూరి రాధాకృష్ణ సోమవారం నిర్వహించిన 'బిగ్ డిబేట్‌లో' కొప్పుల రాజు మనసు విప్పి మాట్లాడారు. ముఖ్యాంశాలివీ..

ఆర్.కె: ఏపీలో కాంగ్రెస్ నుంచి లోక్‌సభకు పోటీ చేయాలనే సాహసం ఎందుకు చేశారు?

కొప్పుల రాజు: సాహసంగా అనిపిస్తోంది. చాలా ఎంజాయ్ కూడా చేస్తున్నా. ఇదో కొత్త అనుభూతి. 11 ఏళ్లు ఏఐసీసీలో క్రియాశీలంగా పనిచేశా. ప్రత్యక్ష ఎన్నికల్లోకి దిగడం ఇదే మొదటిసారి. ఇది కొత్త అనుభూతి.

2013లో కాంగ్రెస్ అధికారం కోల్పోయే సమయంలో ఆ పార్టీలో ఎందుకు చేరారు?

నేను ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థలో పని చేస్తున్నప్పుడు సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు బలోపేతం చేశా. ఈ ప్రోగ్రామ్ మొదలుపెట్టినప్పుడు మొదట్లో డ్వాక్రా సంఘాలకు రూ.500 కోట్లు రుణం ఇచ్చేవారు. నేను చేపట్టిన విస్తరణ కారణంగా రూ.15 వేల కోట్లకు పెరిగాయి. అప్పటి సీఎంలు రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రవేశపెట్టిన వడ్డీ రాయితీ, వడ్డీ లేని రుణాలు బాగా ఉపయోగపడ్డాయి. తర్వాత జాతీయ ఉపాధి హామీ పథకం అమలు మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టా. ఆ చట్టం పేదవాడికి న్యాయం చేసేలా కట్టుదిట్టంగా రూపకల్పన చేశారు. ఈ క్రమంలో రాహుల్‌గాంధీ దృష్టిలో పడ్డాను. ఆయన ఇక్కడకు వచ్చి ఉపాధి హామీ పథకం పనితీరును స్టడీ చేశారు. నన్ను అమేఠీ తీసుకెళ్లి నియోజకవర్గ అధికారులతో ఈ పథకంపై శిక్షణ ఇప్పించారు. ఈ పరిచయంతో రాహుల్ నన్ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. 20 సెకన్లు కూడా ఆలోచించకుండా పార్టీలో చేరిపోయా.

బెయిల్ కోసం జగన్ తన తల్లిని, చెల్లిని సోనియా వద్దకు పంపారట.. నిజమేనా?

నిజమండీ. నాక్కూడా తెలుసు. నేనూ విన్నాను. షర్మిలమ్మ బహిర్గతం చేసిన ఆ విషయం నూరు పాళ్లు నిజమనే నమ్ముతున్నాను.

మీకు తెలియకుండా ఎట్లా ఉంటుంది? ఇందులో డిప్లమసీ ఎందుకు?

అప్పుడు నేనక్కడ లేను. విన్నానంతే.

రాజశేఖర్‌రెడ్డి పేరు సీబీఐ చార్జిషీటులోకి రావడానికీ వీళ్ల అడ్వకేట్ కారణమట కదా!

అది వాస్తవం. చాలా క్లియర్‌గా సోనియాగాంధీ షర్మిలమ్మకు చెప్పారట! రాజీవ్‌గాంధీ పేరు సీబీఐ (బోఫార్స్ కేసు) ఎక్కించినప్పుడు నేను చాలా బాధపడ్డాను.. రాజశేఖర్‌రెడ్డి పేరు చేర్చాలని నేను చెప్పలేదని స్పష్టంగా చెప్పారట! అది విన్నాక షర్మిలమ్మ ఆలోచనా విధానంలోనూ మార్పు వచ్చింది.

షర్మిల కాంగ్రెస్‌లో చేరాలనుకున్నప్పుడు తాత్కాలికంగా బ్రేక్ వేసింది కాంగ్రెస్ నేతలే కదా!

నేను కూడా విన్నాను. జగన్ ఫోన్ చేసి.. అవసరమైతే నా మద్దతు కూడా మీకిస్తాను.. ఆమెను పార్టీలో చేర్చుకోవద్దని చెప్పారట! అది నిజమో కాదో నిర్ధారించలేను. అందుకే షర్మిల చేరిక ఆలస్యమైందంటున్నారు.

రేపు 10, 15 ఎంపీ స్థానాలు అవసరమైతే జగన్‌ను ఒళ్లో కూర్చోబెట్టుకోరన్న గ్యారెంటీ ఏమిటీ?

ఏపీ విషయంలో హైకమాండ్ క్లారిటీగా ఉంది. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తేవాలని కృతనిశ్చయంతో ఉంది.

ఆ పరిస్థితి వస్తే జగన్‌నే కాంగ్రెస్‌లో చేరిపొమ్మంటుందేమో?

ఏమో.. భవిష్యత్‌లో చాలా జరుగుతాయండీ..

షర్మిలను తీసుకెళ్లి కడపలో జగన్‌కు అత్యంత సన్నిహితుడిపై పోటీకి నిలబెట్టారు!

మా గ్రౌండ్ రిపోర్టు ప్రకారం కడపలో షర్మిలమ్మ గెలువబోతున్నారు. ఇది వంద శాతం నిజం కాబోతోంది. ప్రజలకు నిజానిజాలు తెలుస్తున్నాయి. తప్పకుండా ఆమె గెలుస్తారు.

తెలంగాణ ఇచ్చిన విధానమే తప్పయితే.. రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత జగన్మోహన్‌రెడ్డిని హ్యాండిల్ చేయడంలో కూడా విఫలమయ్యారనేది విస్తృత అభిప్రాయం. దీనికేమంటారు?

ముఖ్యమంత్రి పదవి ఎప్పుడిస్తారో ఏమో అనే విషయంలోనే జగన్ డిఫర్ అయ్యారు. కానీ ఆయనకు ఆ పదవి ఇవ్వబోమని చెప్పారని మాత్రం నేననుకోను. ఇక, కేసులు పెట్టింది కాంగ్రెస్ కాదు. సీబీఐ.

జగన్ కోట బద్దలుకొడుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

రాజముద్ర ఉండాలి. అంతేగానీ జగన్ ఫొటోలు ఎందుకు. పాస్‌పోర్టు సహా అన్ని ముఖ్యమైన పత్రాలపై కేంద్రం, మనదేశ అధికార ముద్ర ఉంటుంది. అంతేగానీ ప్రధాని మోదీ ఫొటో ఉండదు. అక్కడ లేనిది ఇక్కడ ఏంటి? ఇదేం తీరు? ఇకనుంచి దస్తావేజులు ఉండవట. జిరాక్స్ ప్రతులు ఇస్తారట. అసలు పత్రాలు సర్వర్‌లో ఉంటాయని చెబుతున్నారు. ఇది ఎంతవరకూ భద్రం. అదే జరిగితే అందరి ఆస్తులు పోతాయి. మన ఆస్తి మనది అని మనమే రుజువు చేసుకోవాలట. ఇదెక్కడి చట్టమో అర్థం కావడం లేదు. ఎవరో వచ్చి ఇది నా ఆస్తి అంటే ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. మన ఆడపడుచులు, పిల్లలకు ఆస్తులు ఎలా ఇవ్వగలుగుతాం. ఇవన్నీ ప్రజలు ఆలోచించాలి. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న ఆస్తులు, వనరులు అన్నింటినీ వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి లాంటి వారికి పంచిబెడుతున్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే మన ఆస్తులకు రక్షణ ఉండదు. కష్టపడ్డ ఆస్తులు, భూములకే దిక్కులేనప్పుడు పేదల పట్టా, అసైన్డ్ భూములకు రక్షణ ఎక్కడ ఉంటుంది.

రాష్ట్రం కోసమే పొత్తు

రాష్ట్ర క్షేమాన్ని ఆకాంక్షించి టీడీపీ, బీజేపీతో పొత్తు పెట్టుకున్నాం. వైసీపీ అధికారంలోకి వచ్చాక జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులపై దాడులు పెరిగిపోయాయి. అనేక మంది హత్యకు గురయ్యారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారు. నన్ను రాష్ట్ర సరిహద్దులో ఆపేశారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు లాంటి నాయకుడు అవసరం. బీజేపీతో కలిసి ఉంటే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని గట్టిగా నమ్ముతున్నాను. చంద్రబాబు లాంటి విజన్ ఉన్న నాయకుడిని అన్యాయంగా, దుర్మార్గంగా 53 రోజులు జైలులో పెట్టిన ఘటన బాధ కలిగించింది.

వైసీపీకి పొలిటికల్ హాలిడే

"వైసీపీకి పొలిటికల్ హాలిడే ప్రకటిద్దాం. జగన్ వక్రబుద్ధి పాలనలో ఒక్క డీఎస్సీ రాలేదు.. ఓ ఉపాధీ లేదు. ఓ ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు. అలాంటి ప్రభుత్వానికి హాలిడే ఇద్దాం" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం గణపవరంలో ఆయన మాట్లాడారు. "2019లో రోడ్డు మీద తిరిగి నేనున్నాను అంటూ సీఎం అయిన జగన్ ప్రజలను దగా చేశాడు. జగన్ ప్రభుత్వ హయాంలో 62 వేల మంది పిల్లలు చనిపోతే ఒక్క సర్వే కూడా చేయలేదు. పసిపిల్లలకు ఇచ్చే చిక్కీలలో కక్కుర్తి పడి రూ.67 కోట్లు బొక్కేశాడు. పిల్లల నోటు పుస్తకాలపై జగన్ బొమ్మలెందుకు? ఈయనేమన్నా దేశ నాయకుడా? జాతి నేతల చిత్రాలుంటే పిల్లలకు స్ఫూర్తి. జగన్ బొమ్మలెందుకు?" అని నిలదీశారు. సొంత చెల్లికే ద్రోహం చేశారని విమర్శించారు. "ఐదేళ్లు జగన్ బెయిల్‌పై ఉండి రాష్ట్రాన్ని పాలించాడు. ఈయన బెయిల్ సీఎం. 39 కేసులున్న వ్యక్తి ముఖ్యమంత్రిగా మనకు అవసరం లేదు. సీపీఎస్ గురించి అసెంబ్లీలో అడుగెట్టిన తొలి సమావేశంలోనే చర్చిస్తా. నేను ఉద్యోగి కొడుకునే. పెన్షన్ విలువ నాకు తెలుసు. జగన్ ప్రభుత్వం డిజిటలైజేషన్ పేరుతో మన సమాచారాన్ని హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉంచింది. ఒక రైతుకు ఎన్ని చెరువులు, పొలాలు ఎక్కడెక్కడ ఎన్నాయో ఆ వివరాలన్నీ సేకరించి జనాన్ని మోసం చేస్తున్నాడు. మనదగ్గరున్న పొలం స్టాంప్ పేపర్లకు విలువ లేకుండా చేశాడు. మనకు సంబంధం లేకుండా ఓనర్‌షిప్ ట్రాన్స్‌ఫర్ అవుతోంది. మళ్లీ జగన్‌కు ఓటేస్తే మన ఆస్తుల పత్రాలన్నీ పెట్రోలు పోసుకొని తగలబెట్టుకోవాల్సి వస్తుంది. పులివెందుల గుండాల చేతిలోకి మన ఆస్తులు పోతాయి. జగన్‌ను మనం సాగనంపాలి. మరి కొద్దిరోజుల్లో జరిగే ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధి

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తామని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. తాడేపల్లిగూడెంలో ఆయన మాట్లాడుతూ.. అవినీతి పరులను విడిచిపెట్టేది లేదని స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టు సత్యనారాయణ 'కేటాక్స్' వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. దేవదాయ శాఖ మంత్రిగా శ్రీశైలం మల్లికార్జున స్వామి మహా కుంభాభిషేకాన్ని కొట్టు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌ది దివాలాకోరు విధానం: మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: కాంగ్రెస్ దివాలా కోరు విధానాలను అనుసరిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ పార్టీది అర్బన్ నక్సల్ ఆలోచన ధోరణి అని చెప్పారు. సంపద పునఃపంపిణీ ప్రతిపాదన ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కొన్ని వార్తా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలపై ఆయన తన మనసులోని మాట బయటపెట్టారు. కాంగ్రెస్, వామపక్షాలు జట్టుకట్టి కేరళ రాష్ట్రాన్ని ఇప్పటికే దివాలా అంచులకు చేర్చాయని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో సైతం అదే పనిలో ఉందని ఆయన అన్నారు. ప్రజల మధ్య విభజన రేఖ గీయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని, దేశభక్త ప్రజానీకం దీన్ని అంగీకరించబోదని ఆయన అన్నారు. దక్షిణ భారత రాష్ట్రాల నుంచి వెలువడే ఫలితాలు అనేక భ్రమల్ని పటాపంచలు చేస్తాయన్నారు. తన మాటే తన గ్యారెంటీ అని ప్రధాని స్పష్టం చేశారు. ఎక్స్-రే లేదా సామాజిక-ఆర్థిక సర్వే చేపట్టనున్నట్టు ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ప్రకటన గురించి మాట్లాడుతూ.. ఎక్స్-రే అంటే ప్రతి ఇంటిపై దాడి చేయడమని, ఎవరైనా మహిళ ధాన్యాలు నిల్వ ఉంచే చోట బంగారాన్ని దాచి ఉంచితే దాన్ని కూడా ఎక్స్-రే చేస్తారని చెప్పారు. మరోవైపు వారసత్వ పన్నుపై కాంగ్రెస్ సీనియర్ నేత శ్యాం పిట్రోడా చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాని మాట్లాడుతూ.. తాను అభివృద్ధి, వారసత్వం గురించి మాట్లాడుతుంటే.. వారు వారసత్వాన్ని దోచుకోవడం గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై ముస్లింలీగ్ ముద్ర ఉందని ఆయన అన్నారు. ఆ మేనిఫెస్టోపై తాను మొదటిరోజే స్పందించానని చెప్పారు.


ఏఐతో కాంగ్రెస్ కుట్ర

ముంబై, ఏప్రిల్ 29: ఎన్నికల్లో కృత్రిమ మేధ(ఏఐ)తో కాంగ్రెస్ కుట్రలకు పాల్పడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. "మా ప్రసంగాలను వక్రీకరిస్తూ ఫేక్ వీడియోలను సృష్టిస్తున్నారు. ముఖ్యంగా నా ప్రసంగాలు, అమిత్‌షా, జేపీ నడ్డా ఉపన్యాసాలకు ఫేక్ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మహారాష్ట్రలోని సతారా, కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో జరిగిన ర్యాలీల్లో మాట్లాడారు. ఫేక్ వీడియోలు ఇప్పుడు పెద్ద ముప్పుగా మారాయని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు.

గుజరాత్‌లో 173కిలోల డ్రగ్స్ పట్టివేత

పోరుబందర్, ఏప్రిల్29: గుజరాత్‌లోని అరేబియా సము ద్రతీరంలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఇండియన్ కోస్ట్‌గార్డ్, గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్‌ల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆపరేషన్‌లో పోరుబందర్ తీరంలోని ఓ పడవలో 173 కిలోల మాద క ద్రవ్యాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పడవ లోని ఇద్దరు భారతీయులను అదుపులోకి తీసుకున్నారు.

లోకం తీరు



'యు'టర్నింగ్ అధికారులు!

నామినేషన్లలో లోపాలపై వైసీపీ అభ్యర్థులకు మేళ్లు

- తప్పుల తడకలకూ ఆమోదం
- కేసులు, ఆస్తులు దాచేసినా మౌనం
- కనీసం ఫిర్యాదులూ పట్టని వైనం
- 'అన్నీ చిన్నవే'నంటూ.. కనికరం
- ఎన్నికల నిబంధనలకు పాతర
- విపక్ష అభ్యర్థులవైతే బుట్టదాఖలు
- అస్మదీయ అధికారులను ముందే నియమించుకున్న సీఎం జగన్
- రుణం తీర్చుకునే పనిలో ఆర్వోలు
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సమర్పించే నామినేషన్లకు, అఫిడవిట్లకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని నియమాలను పాటిస్తుంది. ఎవరైనా అభ్యర్థి ఒకసారి నామినేషన్, అఫిడవిట్‌ను దాఖలు చేసిన తర్వాత.. వాటిని మార్చుకునే అవకాశం లేదు. ఏమైనా లోపాలుంటాయని భావిస్తే మరో సెట్ నామినేషన్ దాఖలు చేసుకోవాలి. వీటిలోనూ ఏమైనా తప్పులు కానీ, ప్రకటించాల్సిన ఆస్తులు, కేసులు కానీ దాచినా.. పరిశీలన సమయంలో ఎలాంటి పక్షపాతం లేకుండా ఎన్నికల సంఘం అధికారులు వాటిని తోసిపుచ్చుతారు. ఈ విషయంలో చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. కానీ, ప్రస్తుతం ఏపీలో ముగిసిన నామినేషన్ల పర్వం.. అనంతరం చేపట్టిన పరిశీలనలో వైసీపీ అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లలో లోపాల పుట్టలు బయటపడ్డాయి. మరి రిటర్నింగ్ అధికారులు ఏం చేయాలి? నిష్పక్షపాతంగా వాటిని తోసిపుచ్చాలి. కానీ, అలా చేయలేదు. యూటర్న్ తీసుకుని తప్పుల తడకలుగా ఉన్న నామినేషన్లను, అఫిడవిట్లను కూడా పలు నియోజకవర్గాల్లో ఆమోదించేశారు. దీనికి కారణం ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న 'ముందస్తు' జాగ్రత్త. తన అనుకున్నవారిని ఆయన 4 మాసాల ముందుగానే కీలకస్థానాల్లో నియమించుకున్నారు. ఫలితంగా వైసీపీ అభ్యర్థుల తప్పులు కూడా పట్టించుకోలేనంతగా సదరు అధికారులు స్వామి భక్తి ప్రదర్శించారు. అయితే, ఈ వ్యవహారం నిప్పులాంటి ఎన్నికల సంఘంపై అనుమానాలు రేకెత్తించేలా చేసింది.

ఏం జరిగింది?

తాజా ఎన్నికలకు సంబంధించి పలువురు వైసీపీ అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్‌లలో ఆస్తులు, కేసుల వివరాలు పేర్కొనలేదు. 'అయినా ఏం కాదు. మేం చూసుకుంటాంలే' అని భరోసా ఇచ్చేలా కొందరు ఆర్వోలు వ్యవహరించారు. గుడివాడ, బాపట్ల, పెందుర్తి, విశాఖ తూర్పు నియోజకవర్గాల పరిధిలోని రిటర్నింగ్ అధికారుల(ఆర్వో) తీరే దీనికి నిదర్శనం. సాధారణంగా అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను ఆర్వోకు సమర్పించే ముందు తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఏవైనా క్రిమినల్ కేసులు పెండింగులో ఉండి వాటిని అఫిడవిట్‌లో ప్రస్తావించకపోతే నామినేషన్‌ను తిరస్కరించే ప్రమాదం ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ విషయంలో జాగ్రత్తలు పాటిస్తారు. ఈ కారణంతోనే చంద్రబాబు సహా పలువురు టీడీపీ నేతలు తమపై ఉన్న కేసుల వివరాలు ఇచ్చేలా పోలీసు శాఖను ఆదేశించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

కదిరి బాబూరావు. టీడీపీ నేత. ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి 2009లో టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో ప్రతి పేజీపైన సంతకాలు చేయాలి. అన్నిచోట్ల సక్రమంగా ఉన్నా, ఒక పేజీలో పొరపాటున సంతకం చేయలేదు. అంతే! ఆ కారణంతోనే బాబూరావు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ఆ వెంటనే బాబూరావు సుప్రీం కోర్టుకు వెళ్లారు. పిటిషన్‌ను విచారించిన కోర్టు నామినేషన్‌ను తిరస్కరించిన తర్వాత తామేమీ చేయలేమని స్పష్టం చేసింది. ఇదీ ఎన్నికల కమిషన్ అధికారాలకు ఉన్న శక్తి. మరి ఇప్పటి సంగతేంటి?!

కొడాలిపై ఎంత కనికరం!

గుడివాడ ఆర్డీవో పద్మావతి ఆ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు. ప్రభుత్వం గత డిసెంబరులో ఆర్డీవోలను బదిలీ చేసింది. వీరిలో ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టి పట్టుమని ఆరు మాసాలు నిండని వారు కూడా ఉన్నారు. కానీ, గుడివాడలో రెండేళ్ల నుంచి ఆర్డీఓగా ఉన్న పద్మావతిని మాత్రం మార్చలేదు. ఎందుకిలా జరిగిందో అప్పుడు తెలియకపోయినా ఇప్పుడు అందరికీ అర్థమైంది. 'కొడాలి వెంకటేశ్వరరావు' అనే దళిత దివ్యాంగుడు నామినేషన్ వేయడానికి వస్తే తొలుత అనుమతించలేదు. అక్కడి వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పేరు, దివ్యాంగ అభ్యర్థి పేరు ఒక్కటే కావడంతో, ఆయనకు ఏమైనా ఇబ్బంది వస్తుందా? అని సంశయించి నామినేషన్ తీసుకోలేదు. మీడియాలో ఈ విషయం రావడంతో ఆ దివ్యాంగుడి నామినేషన్ తీసుకున్నారు. ఇక, వైసీపీ అభ్యర్థి కొడాలి నాని సమర్పించిన నామినేషన్‌లో తప్పులున్నాయని టీడీపీ నేతలు ఆధారాలతో ఫిర్యాదు చేసే ప్రయత్నం చేయగా తీసుకునేందుకు నిరాకరించారు. మున్సిపల్ భవనాన్ని క్యాంపు కార్యాలయంగా వినియోగించిన అంశాన్ని కొడాలి తన అఫిడవిట్‌లో పేర్కొనలేదు. ఉద్దేశ పూర్వకంగానే ఆయన ఈ పనిచేశారని, అనర్హుడిగా ప్రకటించాలని టీడీపీ కోరితే పద్మావతి అసలు ఫిర్యాదే తీసుకోలేదు. అంతేకాదు, కొడాలి తనపై ఉన్న 5 క్రిమినల్ కేసులకుగాను మూడింటి వివరాలే అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మరో రెండు కేసుల వివరాలు అసంపూర్తిగా సమర్పించారు. నామినేషన్ పరిశీలన సమయంలో టీడీపీ నేతలు ఈ అంశంపై వివరాలు ఇచ్చేందుకు ప్రయత్నించినా ఆమె స్పందించలేదు. ఆమెపై టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె దిగివచ్చి.. నానీపై ఉన్న కేసుల వివరాలు తీసుకున్నారు. టీడీపీ నేతలు ఇచ్చిన ఆధారాలు, ఫిర్యాదులోని అంశాల ఆధారంగా కొడాలి నామినేషన్‌ను తిరస్కరించడమో లేక ఆయనను అనర్హుడిగా తేల్చడమో చేయాలి. కానీ, పద్మావతి నామినేషన్‌ను గుడ్డిగా ఆమోదించేశారు.

అప్పుడే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

ఎన్నికల సంఘం(ఈసీ) నియమాలను రిటర్నింగ్ అధికారులే ధిక్కరించి నేతలకు మేలు చేసే ప్రమాదం ఉందని, జగన్ తన అస్మదీయులకు కీలక ప్రాంతాల్లో పోస్టింగులు ఇచ్చారని 'ఆంధ్రజ్యోతి' గత ఏడాది డిసెంబరు, జనవరి మాసాల్లో పలుమార్లు చెప్పింది. ఆర్డీవోలే రిటర్నింగ్ అధికారులుగా ఉంటారు. ఈ నేపథ్యంలో తమ అస్మదీయులు, ఏది చెప్పినా తలూపేవారిని ఆయా పోస్టుల్లో నియమించారని గత ఏడాది డిసెంబరు 10న 'జీ హుజూర్ అంటేనే' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. డిప్యూటీ కలెక్టర్ల పోస్టింగ్‌ల్లో అస్మదీయులకు పెద్దపీట వేస్తున్నారని, తటస్థంగా, నిజాయితీగా పనిచేసేవారిని మార్చేస్తున్నారని పేర్కొంది. ఇప్పుడు ఆ వార్తను నిజం చేస్తూ కొందరు అధికారులు పనిచేస్తున్నారు. జగన్ వేసిన ముందస్తు ప్లాన్‌ను తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నారు.

చిన్నదే అంటూ పెద్ద మేలు

పెందుర్తి రిటర్నింగ్ అధికారి వైసీపీ అభ్యర్థికి పెద్ద మేలే చేశారు. వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అఫిడవిట్‌లో 4-5 పేజీల్లో సరైన సమాచారం ఇవ్వలేదు. ఈ విషయాన్ని జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్ బాబు తరఫు న్యాయవాది ఆర్వో దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆర్వో వివరణ కోరారు. ఆ రోజంతా హై డ్రామా నడిచింది. చివరకు 'అవన్నీ చిన్న చిన్న విషయాలే' అంటూ పంచకర్ల అభ్యంతరాలను తోసిపుచ్చారు. అదేవిధంగా విశాఖ తూర్పులో వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ విద్యార్హతలపై టీడీపీ అభ్యంతరాలు తెలిపింది. గత ఎన్నికల్లో ఆయన తన విద్యార్హతను పదో తరగతిగా చూపించారని, ఇప్పుడు పీహెచ్‌డీ చేస్తున్నట్లు పేర్కొన్నారని ఆర్వో దృష్టికి తీసుకెళ్లింది. దీనిని ఆర్వో లైట్ తీసుకున్నారు. "ఇదేమైనా పెద్ద విషయమా? చిన్నదే కదా" అంటూ ఎంవీవీ నామినేషన్‌ను ఆమోదించారు. బాపట్ల వైసీపీ అభ్యర్థి కోన రఘుపతి అఫిడవిట్‌లో ఇంటి స్థలంపై తప్పుడు వివరాలు ఇచ్చారని టీడీపీ అభ్యంతరం తెలిపింది. బీఎస్పీ అభ్యర్థి ఆర్వోకు ఫిర్యాదు చేశారు. దీనిని విచారించకుండానే ఆర్వో తోసిపుచ్చారు. చీరాలలో కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ నామినేషన్‌పైనా అభ్యంతరాలు వచ్చాయి. ఈ నామినేషన్‌ను తొలుత పెండింగ్‌లో ఉంచిన ఆర్వో.. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో ఆమోదించేశారు.

పార్టీ చేసుకుని వస్తూ.. పరలోకాలకు

- కోనసీమ జిల్లాలో లారీని ఢీకొన్న ఆటో.. నలుగురు మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

అమలాపురం రూరల్, ఏప్రిల్ 29: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ భట్నవిల్లిలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మామిడికుదురు మండలం నగరం గ్రామ శివారు కోటమెరకకు చెందిన కొల్లాబత్తుల జతిన్ అలియాస్ హ్యాపీ సోమవారం పుట్టినరోజు నేపథ్యంలో ఏడుగురు మిత్రులతో కలిసి ఆటోలో యానాం వెళ్లాడు. అక్కడ మద్యం సేవించి ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆటోలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. భట్నవిల్లి వనువులమ్మ గుడి సెంటర్‌కు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని వీరు ప్రయాణిస్తున్న ఆటో వేగంగా ఢీకొట్టింది. ఆటో నడుపుతున్న హ్యాపీ(26), వల్లూరి అజయ్(22), సాపే నవీన్(19), నెల్లి నవీన్‌కుమార్ (22) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిని అమలాపురం కిమ్స్‌కు తరలించారు.

2 నుంచి ఏపీఆర్‌సెట్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీఆర్‌సెట్ మే 2 నుంచి 5వ తేదీ వరకు జరగనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో సోమవారం విడుదల చేశారు.

ఆత్మకూరులో 46 డిగ్రీలు

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో సోమవారం తీవ్రమైన ఎండలు, పలుచోట్ల వడగాడ్పులు వీచాయి. నంద్యాల జిల్లా ఆత్మకూరులో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో ఇదే అత్యధికం. రాష్ట్రవ్యాప్తంగా 78 మండలాల్లో వడగాడ్పులు వీయగా, 59 మండలాల్లో తీవ్రవడగాడ్పులు వీచాయి. రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్రంలో పలుచోట్ల వడగాడ్పులు వీస్తాయని, మిగిలినచోట్ల వేడి వాతావరణం కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

నిర్దోషి అయితే... నార్కోటిక్ టెస్ట్‌కు సిద్ధమా?

- సునీల్‌యాదవ్ బెయిల్ పిటిషన్‌లో సీబీఐ ప్రశ్న..

హైదరాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వివేకా హత్యకేసులో రెండో నిందితుడిగా ఉన్న సునీల్‌యాదవ్ నిరపరాధి అయితే నార్కోటిక్ అనాలసిస్ పరీక్షకు ఎందుకు సిద్ధపడటం లేదని సీబీఐ ప్రశ్నించింది. వివేకా హత్యకేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సునీల్‌యాదవ్ ఆరోసారి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. సీబీఐ తరఫు న్యాయవాదులు అనిల్ తన్వర్, జగదీశ్ వాదనలు వినిపించారు. హత్యకేసులో సంబంధం లేదని.. ఏ పాపం తెలియదని పేర్కొంటున్న పిటిషనర్ నార్కోటిక్ అనాలసిస్ పరీక్షకు సిద్ధమా అని ప్రశ్నించారు. సునీల్‌యాదవ్ ప్రత్యక్షంగా హత్యలో పాల్గొన్నాడని.. కుట్ర, హత్య, ఆధారాల చెరిపివేత ఇలా మూడుదశల్లో అతడి పాత్ర ఉందని పేర్కొన్నారు. శివశంకర్‌రెడ్డికి బెయిల్ వచ్చింది కాబట్టి తనకూ బెయిల్ ఇవ్వాలన్న వాదనలో అర్థం లేదు. పిటిషనర్ బెయిల్‌కు అనర్హుడు' అని పేర్కొన్నారు. సునీల్‌యాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది బి.రమేశ్, న్యాయవాది నయన్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. కొత్తగా వివాహం అయిన పిటిషనర్ ఇప్పటివరకు వైవాహిక జీవితం అనుభవించలేదని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. 'ఇలాంటి తీవ్ర ఆరోపణలున్న సీరియస్ కేసుల్లో సానుభూతి పొందడానికి ప్రయత్నించొద్దు' అని వ్యాఖ్యానించింది. తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

ప్రెస్‌మీట్‌లో బెదిరించినట్లు ఆధారాల్లేవ్

- క్యాట్‌లో ఏబీవీ వాదనలు... తీర్పు రిజర్వు

హైదరాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు అనంతరం విధుల్లో చేరుతున్న సందర్భంగా నిర్వహించిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ప్రెస్‌మీట్‌లో ఎవరినీ బెదిరించినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు పేర్కొన్నారు. ఒకేరకమైన ఆరోపణలతో రెండోసారి తనను సస్పెండ్ చేయడం చెల్లదని పేర్కొంటూ హైదరాబాద్ క్యాట్‌లో ఏబీవీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై క్యాట్ సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ శ్రీరాం వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తును ప్రభావితం చేసే విధంగా, దర్యాప్తు అధికారులను బెదిరించేలా పిటిషనర్ ప్రెస్‌మీట్ పెట్టారని పేర్కొన్నారు. అఖిల భారత సర్వీస్ రూల్ 3(3) ప్రకారం రెండోసారి సస్పెండ్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఈ మేరకు పలు రాష్ట్రాల హైకోర్టు తీర్పులను ఉటంకించారు. ఏబీవీ తరఫు న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. ఏజీ ప్రస్తావించిన తీర్పులకు ప్రస్తుత కేసుకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఒకే విధమైన ఆరోపణలపై రెండోసారి సస్పెండ్ చేయడం చెల్లదని.. దీనిని సమర్థించుకునేందుకు ఏవో కారణాలు చూపుతున్నారని తెలిపారు. ప్రెస్‌మీట్‌లో బెదిరించినట్లు.. దర్యాప్తును ప్రభావితం చేసినట్లు ఆధారాలు ఉంటే చూపాలని కోరారు. ఎలాంటి వివరణ ఇవ్వకుండా సస్పెండ్ చేయడం, దానిని రివ్యూ చేయకుండా కొనసాగించడం చట్టవిరుద్ధమని విన్నవించారు. వాదనలు నమోదు చేసుకున్న క్యాట్.. ప్రెస్‌మీట్‌కు సంబంధించి తర్జుమా కాపీలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు రిజర్వు చేసింది.

అక్రమాలపై ఆధారాలివ్వండి!

- గ్రూప్-1 మూల్యాంకనంపై పిటిషనర్లకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ 2018లో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో చోటు చేసుకున్న అక్రమాలను నిరూపించేందుకు సంబంధిత ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. దీనిపై విచారణను మే 8కి వాయిదా వేసింది. ఉద్యోగాలు చేసుకుంటున్న 167మందిని తొలగించవద్దని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దుచేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అప్పట్లో ఉద్యోగాలు పొందిన కొందరు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. ఈ అప్పీళ్లపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం ఇప్పటికే ఉద్యోగాలు పొందిన వారిని విధుల నుంచి తొలగించవద్దని స్పష్టంచేసింది. ఈ అప్పీళ్లు సోమవారం మరోసారి విచారణకు రాగా సింగిల్ జడ్జి వద్ద గతంలో పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్, న్యాయవాది జొన్నలగడ్డ సుధీర్ వాదనలు వినిపించారు. 2021, డిసెంబరు 5నుంచి 2022, ఫిబ్రవరి 26మధ్య మాన్యువల్ విధానంలో మూల్యాంకనం జరిపారని ఆ ఫలితాలను ఏపీపీఎస్సీ ప్రకటించలేదన్నారు. మార్చి 25నుంచి మే 26 మధ్య జరిపిన మూల్యాంకనం ఫలితాలను మాత్రమే వెల్లడించారన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారన్నారు. ఏపీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. 2021, డిసెంబరు 5 నుంచి 2022, ఫిబ్రవరి 26 మధ్య మాన్యువల్ విధానంలో మూల్యాంకనం జరిగిందన్న పిటిషనర్ల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆ సమయంలో కేవలం సన్నాహకాలు మాత్రమే జరిగాయని వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సునాక్ ప్రణాళిక

బ్రిటన్ పార్లమెంటు గతవారం ఆమోదించిన రువాండా బిల్లుతో కన్సర్వేటివ్ పార్టీమీద ప్రజాభిప్రాయంలో మార్పువస్తుందని, రాజకీయంగా బలహీనంగా ఉన్న బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్‌కు ఇది సానుకూలతను సాధించిపెడుతుందని విశ్లేషకుల అభిప్రాయం. అక్రమవలసలతో సతమతమవుతున్న బ్రిటన్‌ను కాపాడుకోవడానికి దీనిని మించిన దారిలేదని వాదిస్తూ, బ్రిటన్‌లోకి చొరబడిన అక్రమ వలసదారులను ఆఫ్రికాదేశమైన రువాండాకు తరలించే విధానాన్ని రిషీ సునాక్ తీసుకువచ్చారు. విపక్షాలు అడ్డుపడినా, ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తంచేస్తున్నా ఆయన వెనక్కుతగ్గలేదు. ఆశ్రయం కోరుతున్నవారిని మరోదేశానికి పంపించేయడం చట్టవిరుద్ధం, ఇది ఒక కొత్తతరహా అనుచిత విధానానికి అన్ని దేశాలను పురిగొల్పుతుంది, ప్రపంచవ్యాప్తంగా ప్రమాదకరమైన పరిస్థితులను సృష్టిస్తుంది అని ఐక్యరాజ్యసమితి ఒక పక్క హెచ్చరిస్తుంటే, అంతర్జాతీయ వలసల నిర్వహణలో ఇంత కుమించిన అద్భుతమైన విధానం మరొకటి లేదు అని సునాక్ వాదిస్తున్నారు.

అనుకున్నదానికంటే ముందుగానే బ్రిటన్‌లో సోమవారం నుంచి గాలింపులు కూడా ఆరంభమైనాయని, అక్రమవలసదారుల వేట మొదలైందని వార్తలు వస్తున్నాయి. ఇమ్మిగ్రేషన్ సర్వీస్ ఆఫీసులముందు క్యూలు కడుతున్నవారిని సైతం దొరకబుచ్చుకుంటారట. దేశవ్యాప్తంగా ఓ రెండువారాల పాటు విస్తృతంగా గాలింపులు జరిపి అక్రమవలసదారులను అరెస్టులు చేసి, ప్రత్యేక శిబిరాలకు తరలించడం వంటి పనులు వేగవంతమవుతాయట. ఇంగ్లండ్‌లో గురువారం లోకల్ కౌన్సిల్ ఎన్నికలు జరగబోతున్నాయి, ఉన్నవాటిలో సగం సీట్లను టోరీలు కోల్పోతారన్న ప్రచారమూ జరుగుతోంది. అక్రమవలసల నిరోధాన్ని టోరీలు ఈ ఎన్నికల్లో ప్రధానాంశంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల దృష్ట్యా కూడా వలసదారులమీద ప్రభుత్వం అధికంగా దృష్టిపెట్టినట్టు కనిపిస్తోంది. ఇక, అక్రమ వలసదారులతో నిండిన ఒకటి రెండు విమానాలు ఆరునూరైనా బ్రిటన్‌నుంచి నాలుగైదువారాల్లో బయలుదేరి రువాండాలో వాలాలని సునాక్ పట్టుదలగా ఉన్నారట. తరలింపు ఆరంభమైనపక్షంలో ప్రజల్లో టోరీలమీద నమ్మకం పెరుగుతుందని, మాటకు కట్టుబడినందుకు మెచ్చుకుంటారని సునాక్ నమ్మకం. డజను విమానాలు సిద్ధంగా ఉన్నాయి, దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారు ఇక విమానం ఎక్కి రువాండా పోవాల్సిందేనని ఆయన చెబుతున్నారు.

బ్రిటన్‌లోకి అక్రమవలసలు పెరుగుతున్నమాట నిజం. ఇంగ్లీష్ చానెల్ ఈదుతూ, పడవల్లో ప్రయాణిస్తూ వందలమంది మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. తామంతా బ్రిటన్‌కు కాక, రువాండాకు తరలిపోతామన్న భయం ఉన్నప్పుడు వారు అంతటి సాహసానికి ఉపక్రమించరని, క్రిమినల్ గ్యాంగుల కార్యకలాపాలకు కూడా అడ్డుకట్టపడుతుందని సునాక్ వాదన. రువాండా ప్లాన్ భయంతో ఇప్పటికే చిన్నచిన్న పడవల్లో వచ్చేవారి సంఖ్య బాగా తగ్గిపోయిందని టోరీలు చెప్పుకుంటున్నారు. వలసదారులను తరలించగలిగేంత సురక్షితదేశంగా రువాండాను పరిగణించలేమంటూ గత ఏడాది నవంబరులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సునాక్ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ. దానిని దృష్టిలో పెట్టుకొని, ఆ ఆఫ్రికాదేశాన్ని సురక్షితమైనదిగా పేర్కొంటూ సేఫ్టీ ఆఫ్ రువాండా బిల్ తయారైంది. అక్రమంగా వచ్చేవారిని ఆరున్నరవేల కిలోమీటర్ల దూరంలోని ఈ దేశానికి విమానాల్లో తరలించి, రాజధాని కిగాలీలోని ప్రత్యేక శిబిరాల్లో ఉంచుతారు. దస్త్రాల పరిశీలనతో పాటు, న్యాయపరమైన వివాదాల పరిష్కారానికి పాతికకోర్టు రూములు, నూటయాభైమంది న్యాయమూర్తులు అక్కడ ఉంటారు. దాదాపు మూడువందల మిలియన్ పౌండ్లను బ్రిటన్ ఇప్పటివరకూ ఈ వ్యవహారం కోసం ఖర్చుచేసింది. యుద్ధం, కరువు, తిరుగుబాట్లు, ఆకలి ఇత్యాది అనేకానేక సమస్యలతో తమదేశాలను వదిలి బ్రిటన్‌లోకి ప్రవేశిస్తున్నవారిని మరో దేశానికి తరలించేందుకు సునాక్ సిద్ధపడుతున్నారు. బ్రిటన్ వెళ్ళగొడుతున్న వారిని తనదేశంలో ఉంచుకొని పోషించేందుకు అంగీకరించి రువాండా ఆర్థికంగానూ ప్రయోజనం పొందుతోంది. నిజానికి, బ్రిటన్‌కు ఏటా అక్రమంగా వలసవచ్చేవారి సంఖ్యతో పోల్చితే, రువాండా ఆశ్రయం కల్పించబోయేవారి సంఖ్య చాలా తక్కువ. తమ దేశాల్లో పరిస్థితులను భరించలేక ప్రాణాలకు తెగించి మరీ బ్రిటన్ చేరుతున్న వలసదారులను ఈ నిర్ణయం భయపెడుతుందన్న నమ్మకమేమీ లేదు. శరణార్థుల విషయంలో జర్మనీ మాదిరిగా బ్రిటన్ ఉన్నతంగా వ్యవహరించడం లేదని, వలసదారుల ప్రాణాలను డబ్బుతో కొలుస్తూ, ఒక దుర్మార్గమైన దేశానికి వారిని అప్పగిస్తున్నదన్న అప్రదిష్ట, ఖజానాఖాళీకావడం వినా ఈ కార్యక్రమం బ్రిటన్‌కు ప్రయోజనం చేకూర్చదని కొందరి వాదన. రాజకీయంగా కష్టాల్లో ఉన్న సునాక్‌ను ఈ పథకం ఈ ఏడాది ఎన్నికల్లో ఒడ్డునపడేస్తుందో లేదో చూడాలి.

అవినీతి వారసులా సంపదను పంచేది?

ప్రధానమంత్రి నరేంద్రమోదీ చాలా క్లిష్టమైన సైద్ధాంతిక విషయాలను ప్రజల్లోకి సరళమైన భాషలో తీసుకువెళ్లడంలో ఆరితేరినవారనడంలో సందేహం లేదు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికను విడుదల చేసిన తర్వాత ఆయన కాంగ్రెస్ భావజాలాన్ని ప్రజలకు వివరించేందుకు చాలా సరళమైన ఉదాహరణలను ఇచ్చారు. 'మీ ఇంటి ఆస్తులను, మీ స్త్రీల ఒంటి మీద నగలను కూడా కాంగ్రెస్ వారు పంచిపెడతా'రని ఆయన అనడంలో ఒక నిగూఢమైన సిద్ధాంతం ఉన్నది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ఉన్న అంశాలను, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను, గతంలో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ చేసిన వ్యాఖ్యలను, శ్యామ్ పిత్రోడా వంటి ఆ పార్టీ సలహాదార్ల ప్రకటనలను చూసిన తర్వాత కాంగ్రెస్ ఉద్దేశాలను మోదీ చాలా తేలిక భాషలో ప్రజల్లోకి తీసుకువెళ్లారు. వారసత్వ పన్ను విధిస్తామని, సామాజిక ఆర్థిక జన గణన చేసి సంపదను పంచిపెడతామని ప్రజలకు తాము చెప్పిన విషయాలనే ప్రధాని ప్రజలకు సరళమైన భాషలో వివరిస్తే ఆయన తమ మాటల్ని వక్రీకరిస్తున్నారని కాంగ్రెస్ నేతలు విరుచుకుపడుతున్నారు. సోనియాగాంధీ చేతిలో కీలుబొమ్మగా వ్యవహరించిన మన్మోహన్ సింగ్ ఈ దేశ వనరుల్లో, సంపదలో ముస్లింలకు తొలి హక్కు ఉంటుందని చెప్పిన మాట నిజమా కాదా? కుల, మత, జాతి గణనను నిర్వహించి జాతి సంపదను సమానంగా పంచిపెడతామని రాహుల్ గాంధీ హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఎన్నికల మేనిఫెస్టో విడుదల సందర్భంగా ప్రకటించిన విషయం వాస్తవమా కాదా? హైదరాబాద్‌లో మేనిఫెస్టో విడుదల చేయడం ద్వారా ఆయన ఏ వర్గానికి సంకేతం పంపించదలచుకున్నారో అర్థం చేసుకోవాలి.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

అమెరికాలో వారసత్వ పన్నును ఉదహరిస్తూ సీనియర్ కాంగ్రెస్ నేత శ్యామ్ పిత్రోడా ఇదే సమయంలో వ్యాఖ్యలు చేయడాన్ని యాదృచ్ఛికమని భావిద్దామా? ఒక వ్యక్తి మరణించిన తర్వాత ప్రభుత్వం అతడి సంపదలో 55 శాతం స్వాధీన పరుచుకునే విధానాన్ని భారతదేశం పరిశీలించాలని శ్యామ్ పిత్రోడా ఎందుకు అన్నారు? ఉదాహరణకు ఒక వ్యక్తి అమెరికన్ డాలర్లలో రూ. కోటి సంపాదిస్తే రూ. 55 లక్షలు ప్రభుత్వానికి, రూ. 45 లక్షలు మాత్రమే అతడి పిల్లలకు చెందుతుందని ఆయన ఇచ్చిన ఉదాహరణ యథాలాపంగా చేసిన వ్యాఖ్యగా ఎందుకు అనుకోవాలి? ఆరు దశాబ్దాలకు పైగా ఈ దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీతో చేతుల కలిపిన కుల, మత పార్టీలకు ఇప్పుడు కుల, జన గణన, సంపదను పంచిపెట్టడం గురించి ఆలోచన ఎందుకు వచ్చింది?

18వ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ వరుసగా మూడోసారి అఖండ విజయం సాధిస్తుందని తెలిసినందువల్లే దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్‌కు దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలు గుర్తుకు వస్తున్నాయి. తామే ఈ అసమానతలను సృష్టించిన విషయం కాంగ్రెస్ మరిచిపోయింది. కాంగ్రెస్‌కే కనుక నిజాయితీ ఉంటే తమ హయాంలోనే మండల్ కమిషన్‌ను అమలు చేసి సామాజిక న్యాయానికి పూనుకునేది. కమిషన్ నివేదికను కాంగ్రెస్ తొక్కి పెట్టినందువల్లే విపి సింగ్ ఈ కమిషన్ నివేదికను ప్రజల ముందు పెట్టి రాజకీయాలు ఆడగలిగారు. తమ హయాంలో ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు సరిగా అమలు కాలేదని కాంగ్రెస్‌కు తెలుసు. తామిచ్చిన వంద రూపాయల్లో రూ. 15 కూడా పేదలకు చేరదని, మిగతా మొత్తాన్ని దళారులే కొట్టివేస్తారని ఒకప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ కూడా వాపోయారు. కాని ఆయనేం చేశారు? అధికారం రాగానే భీకరమైన అవినీతికి పాల్పడ్డారు.



మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దాదాపు రూ. ఆరున్నర లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ మొత్తం చేరింది అణగారిన వర్గాలకే కాదా? ఎవరు సామాజిక, ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు చర్యలు తీసుకున్నట్లు? కాంగ్రెస్ ప్రభుత్వమా, బీజేపీ ప్రభుత్వమా? కొత్తగా కులజనగణన చేసి ఎవరికి న్యాయం చేయాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు?

పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి ఉండకపోతే ఇవాళ దేశం ఆర్థికంగా నిలదొక్కుకుని ఉండేదే కాదు. ప్రధాని మోదీ ఈ సంస్కరణలను మరింత వేగవంతంగా, మరింత నిర్మాణాత్మకంగా అమలు చేస్తూ దేశంలో వేగంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నందువల్లే ప్రపంచంలో మన దేశం ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగగలిగింది. అందుకే కాంగ్రెస్ ద్వంద్వ నీతిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బట్టబయలు చేస్తూ ఆ పార్టీ అధికారంలోకి వస్తే జరిగే దోపిడీని గుర్తు చేస్తున్నారు. సామాజిక ఆర్థిక న్యాయం పేరుతో ప్రజల ఆస్తులను దోపిడీ చేసి, వాటిని పంచిపెడతామంటూ అణగారిన వర్గాలను నమ్మించి తాము మాత్రం అధికారాన్ని అనుభవించాలన్నదే కాంగ్రెస్ కుట్ర. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి రాగానే చేసిన మొదటి పని ప్రజల బ్యాంకు ఖాతాలను, మొబైల్‌ను, ఆధార్‌ను అనుసంధానం చేయడం. దీని ద్వారా సంక్షేమ కార్యక్రమాలకు చెందిన డబ్బులు నేరుగా జనం ఖాతాల్లో పడడం మొదలైంది. వారికెంత డబ్బు వచ్చిందో మొబైల్‌లోనే సమాచారం తెలుసుకునేందుకు ప్రజలు అలవాటు పడ్డారు. ఆధార్ మూలంగా దళారులు మధ్యలో డబ్బులు స్వాహా చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఇవాళ సగటున రోజుకు రూ.90 లక్షల మేరకు ప్రజల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దాదాపు రూ. ఆరున్నర లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో డబ్బులు చేరాయి. రాజీవ్ గాంధీ లెక్కల ప్రకారమే అయితే ఇందులో రూ. అయిదు లక్షల కోట్లు ప్రజలకు చేరి ఉండేదే కాదు. ఈ మొత్తం చేరింది అణగారిన వర్గాలకే కాదా? ఎవరు సామాజిక, ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు చర్యలు తీసుకున్నట్లు? కాంగ్రెస్ ప్రభుత్వమా, బీజేపీ ప్రభుత్వమా? కొత్తగా కులజనగణన చేసి ఎవరికి న్యాయం చేయాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు? ఇదే ప్రశ్నను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వేస్తే కాంగ్రెస్ నేతలు గుమ్మడికాయ దొంగలు భుజాలు తడుముకుంటున్నట్లు మాట్లాడుతున్నారు.

ఈ దేశాన్ని ఆరు దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ నేతలు దేశాన్ని ఎన్ని విధాల దోపిడీ చేయాలో అన్ని విధాల దోపిడీ చేశారు. పెద్ద ఎత్తున ఆస్తులు పోగు చేసుకున్నారు. తమ తర తరాలకు సరిపోయేంత సంపదను సంపాదించారు. అందువల్ల వారసత్వ పన్ను గురించి, సంపద పంపిణీ చేయడం గురించి మాట్లాడిన కాంగ్రెస్ నేతలపైనే నిజానికి వారసత్వ పన్ను వేయాలి. వారే తమ పార్టీల్లో నేతలను, వారి కుమారులను, భార్యలను, మనుమలను పెంచి పోషించారు. తండ్రి ముఖ్యమంత్రి అయిన వెంటనే తండ్రితో పాటు కొడుకు, కూతురు దోపిడీ చేసే సంస్కృతిని మనం మన తెలుగు రాష్ట్రాల్లోనే చూశాం. ఒక్క చిన్న ఉదాహరణ చెప్పాలంటే తన తండ్రి ఆరేళ్లు కూడా పూర్తిగా ముఖ్యమంత్రిగా లేనప్పటికీ ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి వేల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించారో అందరికీ తెలుసు. ప్రతి వ్యాపారవేత్త నుంచీ వాటాలను లాక్కున్నారు. జగన్ మాయ మాటల్ని నమ్మి ప్రజలు ఆయనను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోపెట్టారు. ఈ ఐదు సంవత్సరాల అరాచక పాలనలో ఆయన ఇంకెంత సంపాదించారో, ఆయన చెల్లెలు కూడా ఎందుకు ఏపీలో కాంగ్రెస్ పగ్గాలు చేబట్టారో మనం ఊహించవచ్చు. కాంగ్రెస్ నాయకత్వం ఇలాంటి వారినే దేశమంతా పెంచి పోషించింది. వారే ఇప్పుడు విషప్పురుగుల్లా దేశాన్ని పీల్చుకుతింటున్నారు. వారా దేశ సంపదను పేదలకు పంచేది? ఎవర్ని మోసగిస్తున్నారు?


(బీజేపీ జాతీయ కార్యదర్శి)

పథకం ప్రకారమే దళిత సంక్షేమానికి ఎసరు

రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో నాలుగైదు దశాబ్దాల కిందట పలకాబలపం పట్టి బడికి వెళ్తున్న దళితబాలలు పదే పదే ఒక గద్దింపుమాట వినాల్సివచ్చేది. అక్కడి ఊళ్లోని పెద్ద మనుషులు వారిని ఉద్దేశించి, 'మీరంతా బడుల్లో దూరిపోతుంటే మా పశువుల్ని ఎవడు మేపుతాడు? మా పశువుల శాలల్ని ఎవడు కడుగుతాడురా?' అంటూ ఉండేవారు. బోయి భీమన్న 'పాలేరు నాటకం' ఈ నేపథ్యం నుంచి సృజియించినదే. ఇక రాయలసీమ సంస్కృతిలో దళితవెతలు అన్నీ ఇన్నీ కావు. ఈ పరిస్థితుల్ని చెప్పే చరిత్ర, సాహిత్యం చాలానే ఉన్నా, 'సమర సింహారెడ్డి గారూ.. మీరు చల్లం గుండాలే' పాటలో గోరటి వెంకన్న వాటిని బాగానే ప్రతిబింబించారు. అంచెలంచెలుగా మెరుగవుతున్న దళితుల బతుకుల మీద దాడులు ఎప్పుడూ ఏదోరూపంలో కొనసాగుతూనే ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇవి ముమ్మరం కావడం పాత పాలేర్లకాలాన్ని తలపిస్తోంది.

సంక్షేమంలో కొత్తచరిత్ర సృష్టించామని చెప్పుకుంటూనే దళితుల నిర్మాణాత్మక ప్రగతికి కాలడ్డిన జగన్ సర్కార్ దగా పాలన మీద రాష్ట్రవ్యాప్తంగా తీవ్రవ్యతిరేకత వ్యక్తమవుతోంది. మానప్రాణాలకు రక్షణ ఇవ్వలేని ప్రభుత్వం తీరును, సామాజిక న్యాయాన్ని డిమాండ్ చేసే గొంతుకల్ని పిసికేసే కుట్రల్ని దళితమేధావులు ఎండగడుతూనే ఉన్నారు. కొంతమంది మాజీ ఉన్నతాధికారులు రాష్ట్రంలోని ప్రధానపట్టణాల్లో పర్యటించి వీటిపైన సమావేశాలు కూడా నిర్వహించారు. ప్రభుత్వ కుతంత్రాల్ని నిర్భయంగా ప్రశ్నిస్తున్న బాధిత ప్రజానీకం సామాజికన్యాయం పునరుద్ధరించడం కోసం కృతనిశ్చయంతో వ్యవహరించాల్సి ఉంది.

ఐదేళ్ళ వైసీపీ పాలనలో దళితులు కుట్రలకు, కక్షలకు, అణచివేతకు బలైపోయారన్న విషయం రాష్ట్రమంతా ఎరిగినదే. ఏదో కొద్దిమందిని వెంట తిప్పుకుంటూ దళిత సామాజికవర్గం మొత్తంగా తన సొంతమేనని వైసీపీ చాటుకుంటుంటే సరిపోతుందా? ఎన్నికల్లో సీట్ల గురించో, ఏవైనా పథకాల గురించో ప్రకటిస్తున్నప్పుడు దళితుల్ని పక్కన కూర్చోబెట్టుకున్నంత మాత్రాన వారికి న్యాయం చేసినట్లేనా? ఎన్నెన్నో అధికారిక కార్యక్రమాల్లో దళిత సామాజికవర్గానికి చెందిన మంత్రులు, పార్లమెంటుసభ్యులు, శాసనసభ్యులు నిలబడే ఉండటాన్ని రాష్ట్రమంతా ఇంతకాలం చూస్తూనే ఉంది. ముఖ్యమంత్రి పక్క రెండు కుర్చీల మధ్యలో ఒక మంత్రి ఇరుకించుకుని మోకాళ్ళమీద కూర్చోవడాన్ని మీడియా ప్రపంచం మొత్తానికి చూపించింది. ప్రోటోకాల్‌లో ఉన్న ప్రజాప్రతినిధులు సైతం పార్టీ ప్రాంతీయ ఇన్‌చార్జిల కోసం కుర్చీల్లోంచి లేచి అవతలకు వెళ్లి నిలబడిన అనేక దృశ్యాల్ని పత్రికలు ప్రజానీకానికి కోకొల్లలుగా చూపించాయి. ఇలాంటివెన్నో చూసిచూసి రాయలసీమ నేతలు సైతం వైసీపీ పాలన మీద మండిపడ్డారు.



రాష్ట్రంలో దాదాపు ఇరవైశాతం ఉన్న దళిత సామాజికవర్గంలో కనీసం సగంమంది అంబేద్కర్ సిద్ధాంతాల్ని అనుసరిస్తున్నారు. వారిలో కొందరు హిందువులు, మరికొందరు బౌద్ధులు. అయితే దళితులందరూ క్రైస్తవులేనని వైసీపీ శ్రేణులు ప్రచారం చేయడాన్ని ముమ్మాటికీ తమ సామాజిక అస్తిత్వం మీద జరుగుతున్న దాడిగానే అంబేద్కర్‌వాదులు పరిగణించారు.

రాష్ట్రంలో దాదాపు ఇరవైశాతం ఉన్న దళిత సామాజికవర్గంలో కనీసం సగంమంది అంబేద్కర్ సిద్ధాంతాల్ని అనుసరిస్తున్నారు. వారిలో కొందరు హిందువులు, మరికొందరు బౌద్ధులు. అయితే దళితులందరూ క్రైస్తవులేనని వైసీపీ శ్రేణులు ప్రచారం చేయడాన్ని ముమ్మాటికీ తమ సామాజిక అస్తిత్వం మీద జరుగుతున్న దాడిగానే అంబేద్కర్‌వాదులు పరిగణించారు. 'దళిత క్రైస్తవుల్ని ఎస్సీల్లో కలుపుకుంటే కలుపుకోండి. అంతేగాని దళితులందరూ క్రైస్తవులే అంటే మాత్రం సహించేది లేద'ని గట్టిగానే హెచ్చరించారు. ప్రస్తుత ఎన్నికల్లో మాదిరిగా గతంలో ఎప్పుడూ మతానికి ఇంత ప్రాధాన్యం ఉండేది కాదు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావం తర్వాతే రాష్ట్రంలో క్రైస్తవం కీలకాంశంగా మారింది. ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి బంధువులే చర్చిల్లో సమావేశాలు నిర్వహించి రాజకీయాలు మాట్లాడుతున్నారు.

విద్యావ్యవస్థకు సంబంధించి కూడ దళితుల మీద వైసీపీ రాజకీయ నీలినీడలు ఎక్కువగానే పడ్డాయి. దళిత, ఆదివాసీ, వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం తెలుగుదేశం ప్రభుత్వం 1983లో గురుకుల పాఠశాలలను నెలకొల్పింది. లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి.బాలయోగి మరణానంతరం ఎస్సీ సంక్షేమపాఠశాలలకు ఆయన పేరు పెట్టారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆయన పేరు తొలగించి అంబేద్కర్ పేరు పెట్టింది. ఒక నాయకుడిగా బాలయోగి సేవాతత్పరతను, కోనసీమలో ఆయన చేసిన అభివృద్ధిని సహించలేకపోయిన వైసీపీ ప్రభుత్వానికి అంబేద్కర్ మీద గౌరవం ఉందనుకుంటే అది తప్పే. ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఉన్న ఎన్టీఆర్ పేరును తొలగించి వైఎస్ఆర్ పేరును, విదేశీ విద్యాపథకానికి అంబేద్కర్ పేరు తొలగించి తన పేరును ముఖ్యమంత్రి పెట్టుకున్నారు. కొల్హాపూర్ సంస్థానాధీశుడు షాహూ మహారాజ్ మంజూరు చేసిన స్కాలర్‌షిప్‌తో అంబేద్కర్ లండన్ వెళ్ళి బార్ ఎట్ లా డిగ్రీ చదివారు. ఆయన పొందినన్ని డాక్టరేట్ డిగ్రీలను ఈ రోజుకీ ఏ భారతీయుడూ పొందలేదు. దేశంలో అస్పృశ్యులానికి చెందిన ఓ వ్యక్తికి స్కాలర్‌షిప్ మంజూరుచేయడం అప్పటి నుంచే మొదలయింది. విదేశీవిద్యకు అంబేద్కర్ పేరు పెట్టడంలో ఇంత స్ఫూర్తి చరిత్ర ఉంటే దాన్ని విస్మరించి జగన్ సర్కార్ ఇలా వ్యవహరించడాన్ని దళితులపైన జరిపిన మానసికదాడిగానే కనీస అవగాహనగలవారెవరైనా పరిగణిస్తారు. ఇలాంటి పనులు చేసేటప్పుడు ఆయా సంస్థలకు ఎస్సీ అధికారులను నియమించి వారితోనే ప్రభుత్వాదేశాలను అమలు చేయించడం ఒక కొసమెరుపు.

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో పథకాలకు లేదా సంస్థలకు పేర్లు పెట్టిన ముఖ్యమంత్రుల వ్యక్తిత్వం, పాలనాసామర్థ్యాలు అందరెరిగినవే. వాళ్లతో జగన్మోహన్‌రెడ్డిని పోల్చిన ప్రతిసారీ హాస్యాస్పద వ్యాఖ్యలు వినిపిస్తుంటాయి. అయినా ఎలాంటి వెరపు లేకుండా పథకాలన్నింటికీ ఆయన తన పేరు పెట్టుకున్నారు. విదేశీవిద్య, విద్యాదీవెన, విద్యాకానుక, అమ్మఒడి, వసతిదీవెన వంటి పథకాలన్నిటి ముందు జగనన్న అని ఉంటుంది. గతంలో వీటన్నింటికీ ఆంధ్రప్రదేశ్ అధికారచిహ్నంతో ప్రభుత్వ ఉపకారవేతనం అని మాత్రమే ఉండేది. ప్రచారలబ్ధి కోసం ఈ పథకాలను అడ్డుపెట్టుకుని వ్యవహరిస్తున్న సర్కార్, తన ఉద్యమరథాన్ని ముందుకు తీసుకెళ్ళలేకపోతే అక్కడే ఉంచేయమన్న అంబేద్కర్ మాటల్ని ఆ రథచక్రాల కిందే వేసి తొక్కేసింది. దళితుల్లో ఆత్మస్థైర్యం నింపకపోగా వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడం కోసం గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకూ ఎసరుపెట్టేసింది. దళితుల కోసం గత ప్రభుత్వాలు అమలు చేసిన సుమారు 25 పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసేసింది.

గతంలో ప్రతి ఏటా పదోతరగతిలో ప్రతిభ చూపించిన వేయిమంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యనందించి ఐఐటి, మెడికల్ ప్రవేశపరీక్షలకు సిద్ధం చేసేవారు. దేశవ్యాప్తంగా ప్రధాననగరాల్లో ఉన్న కోచింగ్‌సెంటర్లలో సివిల్‌సర్వీసు పరీక్షలకు శిక్షణ అందించేవారు. టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలుగా నగదుబహుమతి ఇచ్చేవారు. జగన్ సర్కార్ వీటన్నింటినీ నిర్దాక్షిణ్యంగా రద్దు చేసినా ఏ ఒక్క ప్రజాప్రతినిధీ ప్రశ్నించలేదు. వీటికితోడు ఎస్సీ కార్పోరేషన్‌ను మూడు ముక్కలు చేసి మూలన పడేసింది. కులాంతర వివాహాలకు ఒక్క పైసా ప్రోత్సాహకాన్ని అందించలేదు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం విడుదల చేసే నిధులు దళితులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు. దీని మీద కూడ పెత్తనం చెలాయించే అధికారాన్ని ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారని మాజీ దళిత ఉన్నతాధికారులు వైసీపీ సర్కార్‌ను నిలదీస్తున్నారు. కనీసం రిజర్వుడు స్థానాల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులయినా ఎప్పటికప్పుడు ప్రభుత్వతీరు మీద నిరసనగళాన్ని ఎక్కుపెట్టి ఉంటే దళితసంక్షేమం ఇంత విక్షతంగా మారేది కాదు. గత ఐదేళ్లుగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ దళితసంక్షేమాన్నీ తిరోగమనబాట పట్టించి ముప్పై ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిన ఈ నిరంకుశ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే దళిత సామాజికవర్గం మళ్లీ అభివృద్ధిబాటలోకి మళ్లగలుగుతుంది.

■ డాక్టర్ జీకేడీ ప్రసాద్

విద్వేషంతో విజయం సాధించలేరు!

భారత పార్లమెంటుకు ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికలను బయటినుంచి చూసేవాళ్ళు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వేడుకగా అభివర్ణిస్తుంటారు. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మాత్రం ఎన్నికలు ఒక సార్వత్రిక ఉత్సవంగా గాక వివాదాలు వేదికగా మారుతున్నాయి. జరుగుతున్న ప్రచారం, ప్రసారమాధ్యమాల్లో చర్చలు, వాదోపవాదాలు చూస్తుంటే దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడినట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా మొదటి దశ పోలింగ్ ముగిసిన తర్వాత, దేశంలో దశాబ్దం పాటు అధికారంలో ఉండి ప్రజలను కట్టడి చేసిన బీజేపీ ఉన్నట్టుండి ఎన్నికల ఎజెండా మార్చివేయడం ఇప్పుడు దేశాన్ని కలవరపెడుతోంది. భిన్నత్వానికి ప్రతీకగా చెప్పుకునే దేశాన్ని ఏకత్వ దిశగా మలిచేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. ఇంతకాలం 'జాతీయవాద' ముసుగులో లోపాయికారిగా ఉన్న హిందూత్వను ఇప్పుడు ప్రధాన ఎజెండాగా చేసుకుని ఆ పార్టీ ప్రచారం చేస్తోంది. ప్రజల మధ్య మత ప్రాతిపదికన విభజన రేఖ గీసి మరీ వేరు చేయాలని చూస్తోంది. నిజంగానే ఎన్నికల సభలు, రోడ్ షోలు ఇప్పుడు విద్వేష విష ప్రచారాల వీధులుగా మారిపోతున్నాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధారణంగా ఎన్నికల ప్రచారం ప్రజలకు తాము ఏమి చేశాం, ఏమి చేస్తాం అనే అంశాల ప్రాతిపదికన జరగాలి. అధికారంలో ఉన్న పార్టీ తాము గతంలో చేసిన పనులను, ప్రజలకు జరిగిన మేలును వివరిస్తే ప్రతిపక్ష పార్టీలు తాము భిన్నంగా ఏమి చేయాలని అనుకుంటామో చెప్పాలి. కానీ ఇందుకు భిన్నంగా ఇప్పుడు ప్రజల ఆలోచనలను విద్వేషం వైపు మలిచే విధంగా ప్రచారం జరుగుతోంది. దానికి ప్రధానమంత్రి ప్రసంగాలు కారణం కావడం చాలామందిని కలవరపెడుతోంది. నరేంద్ర మోదీ రాజస్థాన్ ప్రచారంలో ముస్లింల మీద మొదలుపెట్టిన దాడి గురించి దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా విమర్శించాల్సింది పోయి, ఆ పార్టీని అడ్డం పెట్టుకుని మోదీ ముస్లిం ప్రజల పట్ల అక్కసు వెళ్లగక్కుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ ప్రజల సంపద వివరాలు సేకరించి, దానిని ముస్లింలకు, ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి, చొరబాటుదారులకి పంచుతారు అని మొదలైన ఈ దాడి మూడు రోజుల్లో ముస్లిం రిజర్వేషన్లు, షరియా, పర్సనల్ లా వంటి విషయాల ప్రస్తావన దాకా వచ్చింది. అవి ఎన్నికల్లో చర్చకు రావడం తప్పు కాదు, ఆయన తమ ప్రభుత్వ విధానాన్ని, పార్టీ సిద్ధాంతాన్ని ప్రకటిస్తే అభ్యంతరం ఉండదు. కానీ ఆయన కాంగ్రెస్ పార్టీ మీద నిందలు వేసే పనికి పూనుకున్నారు. కాంగ్రెస్ వస్తే హిందువులకు రక్షణ ఉండదు అంటూ ఒక అడుగు ముందుకేసి హిందూ మహిళల తాళిబొట్లకు కూడా రక్షణ ఉండదు అనేదాకా వెళ్లారు. ఇది నిజానికి తీవ్ర ఆరోపణ. ఒక ప్రధానమంత్రి స్థాయికి తగని నిరాధారపూరిత నింద. సాధారణ ప్రజలు, మహిళల భావోద్వేగాలను రెచ్చగొట్టి కలవరపెట్టే మాట. అలా ప్రధాని మాట్లాడిన మాటలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి మాత్రమే కాదు మౌలికంగా ఈ దేశ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం, నైతికంగా ఒక ప్రధాన మంత్రి స్థాయికి తగనిది. ఈ వ్యాఖ్యల పట్ల మోదీజీ కనుసన్నల్లో ఉన్న జాతీయ మీడియా సన్నాయి నొక్కులు నొక్కుతున్నా ప్రపంచ వ్యాప్తంగా అన్ని మీడియా సంస్థలు ఆందోళన చెందుతూ కథనాలు ప్రచురించాయి. ప్రజల మధ్య ఇటువంటి విభజనరేఖ గీసి ఓట్లు రాబట్టుకోవడం ప్రజాస్వామ్యానికి, భారతదేశ భవిష్యత్తుకు మంచిది కాదని హితవు పలుకుతున్నాయి. తానే విశ్వగురువునని నమ్ముతున్న మోదీకి ఇప్పుడు ఈ హితవచనాలు చెవికెక్కేలా లేవు.

అంబేద్కర్ బ్రిటిష్ అధికారులను కలిసి భారత దేశంలో కులం, మతం, సంపద, ఆడ, మగా అనే తేడా లేకుండా పౌరులందరికీ ఓటు హక్కు ఉండాలని వాదించారు. ఓటు హక్కు ద్వారా ప్రజలకు సమానమైన, విలువ, గౌరవం, గుర్తింపు లభిస్తాయని ఆయన గట్టిగా నమ్మారు. అదే ప్రజాస్వామ్యానికి పునాది అవుతుందని కూడా విశ్వసించారు. ఆ మేరకు భారత రాజ్యాంగాన్ని ఒక బలమైన అస్త్రంగా దేశానికి అందించారు. రాజ్యాంగం ప్రకారం భారత పౌరులందరికీ సమాన హక్కులు, గౌరవం, గుర్తింపు ఉంటాయి.

బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఆ పార్టీ మౌలిక సిద్ధాంతాల నుంచి దూరమవుతూ వచ్చింది. 'సమష్టి' నాయకత్వం స్థానంలో కేంద్రీకృత, ఏకవ్యక్తి ఆరాధనకు మళ్లింది. బీజేపీ మాతృక అయిన జనసంఘ్ నుంచి వారసత్వంగా వచ్చిన జాతీయవాదంతో కూడుకున్న సమగ్ర మానవతావాదం తన సిద్ధాంతంగా ప్రకటించుకుంది. ప్రజలను విడివిడిగా కులాలు మతాలతో కూడిన వ్యక్తులుగా కాకుండా సమాజంలో, దేశంతో భాగస్వామిని చేసి ఆర్థికాభివృద్ధిలో భాగం చేసి సమష్టి శక్తిగా మార్చే సమగ్ర అభివృద్ధి తమ సైద్ధాంతిక సారంగా ప్రకటించుకుంది. అలాగే సర్వ ధర్మ సంభావ్యతతో కూడుకున్న గుణాత్మక లౌకిక వాదం తమ విధానమని, సర్వ మతాలకు సమానమైన గౌరవం కల్పించే 'సర్వ పంథా సమభావం' తమ మౌలిక విలువ అని ప్రకటించుకుంది. గాంధీ ప్రతిపాదించిన సామ్యవాదం, సమరస సమాజం తమ ఆచరణగా పేర్కొంది. ఈ అంశాలతో ఎవరికీ పేచీ లేదు. కానీ ఈ సారి మాత్రమే గెలవడానికి భారతీయత అనే వసుధైక కుటుంబ భావన నుంచి దేశమంతా మోదీ కుటుంబం అని చెప్పుకునే స్థితికి చేరుకుంది. గత ఐదేళ్లుగా ఆ పార్టీ తన సిద్ధాంతాలను, సమష్టి నాయకత్వాన్ని పక్కనపెట్టి మోదీని మహిమాన్వితుడిగా, మహా పురుషుడిగా, విశ్వగురువుగా మార్చి ప్రచారం చేస్తూ వస్తోంది. అదే పద్ధతిలో మోదీ వేషభాషలను, హావభావాలనూ మార్చివేసి నిజంగానే ఆయనే రక్షకుడు అని నమ్మించే స్థాయికి తీసుకు వచ్చారు. ఇప్పుడు దేశంలో కొందరు అలా నమ్ముతున్నారు కూడా. ఇక్కడి వరకు పేచీ లేదు. కానీ ఈ ఐదేళ్లలో మోదీ చాలావరకు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని ప్రజాస్వామ్య సూత్రాలకు విఘాతం కలిగిస్తున్నాడనే విమర్శ ఉంది. నోట్ల రద్దుతో మొదలై కశ్మీర్, రైతాంగ ఉద్యమాలు, పౌరసత్వ చట్టాలు, కోవిడ్ కేర్, లాక్‌డౌన్ ఇట్లా అనేక నిర్ణయాలు విమర్శలకు కారణం అయ్యాయి. అలాగే పార్లమెంటులో చర్చకు తావులేకుండా, ప్రతిపక్షాల మాటకు విలువ లేకుండా అన్ని నిర్ణయాలు ఏకపక్షంగానే తీసుకున్నాడని, ప్రజాభిప్రాయానికి విలువలేకుండా చేస్తూ దేశాన్ని హిందుత్వ వైపు నడిపిస్తున్నాడనే విమర్శలను ఆయన పెద్దగా పట్టించుకోలేదు. దీనికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వ క్షీణత కూడా కారణం అయ్యింది. రాహుల్ గాంధీ యాత్రలు, ప్రసంగాలతో స్పష్టమైన ప్రజల గొంతుకగా నిలబడుతున్నా ఆయన ఈ పదేళ్ల కాలంలో తమ పార్టీకి నాయకుడిగా ఎదగలేక పోయాడు, సీనియర్లను కలుపుకుపోయి, కాపాడుకోలేకపోయాడు. బీజేపీకి పరిపూర్ణ ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీని మలచలేకపోయాడు. అలాగే ఇండియా కూటమికి సరైన దిశ చూపించడంలో కూడా విఫలం అయ్యాడు. అయినప్పటికీ రాహుల్ దేశంలో ఒక కొత్త సమష్టి వాదానికి ప్రతినిధిగా ఎదుగుతున్నాడు. భిన్నత్వంలో ఏకత్వం ప్రధానం అని ఆయన దళితులు, ఆదివాసులు, ముస్లింలు, ఇతర మైనారిటీలతో మమేకం అవుతూ సామూహిక రాజకీయాలను ప్రతిపాదిస్తున్నాడు. రాహుల్ వెంట నడిచే మేధావులు, పౌర సమాజం, ప్రజా సమూహాల సంఖ్య ఈ ఐదేళ్లలో పెరిగింది. వారిని తుకుడే తుకుడే గ్యాంగ్ అనో, అర్బన్ నక్సల్స్ అనో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా రాహుల్ గాంధీ పట్ల సమాజంలో కొంత సానుభూతి, కొంత గౌరవం పెరిగినట్టుగా బీజేపీ భావిస్తోంది. నిజానికి మోదీ ఈ ఎన్నికల సందర్భంగా ఆదిలాబాద్‌లో చేసిన తొలి ప్రసంగంలో ఈ దేశమంతా తన పరివారమని, దేశంలో ఉన్న 140 కోట్లు తన కుటుంబ సభ్యులని అన్నారు. ఇది మంచి పరిణామమని, దేశ ప్రధాని కుల మత జాతి విబేధాలు లేకుండా మాట్లాడాడని అంతా భావించారు. కానీ తొలి విడత పోలింగ్ తరువాత ఆయన మనసు మారింది, మాట కూడా మారింది. అనుకున్న మేరకు అనుకూల వాతావరణం కనిపించకపోవడంతోనే మోదీ, ఆయన పార్టీ ప్రతికూల అంశాలను లేవనెత్తుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.



నిజానికి రాజకీయ వ్యవస్థ అదుపుతప్పినప్పుడు దానిని దారికి తెచ్చే ఆయుధం ఓటు అని నమ్మి దేశంలో ఓటు హక్కు సార్వత్రికం కావాలని కలలుగన్న మొట్టమొదటి భారతీయుడు డా. బాబాసాహెబ్ అంబేడ్కర్. 1919లోనే యువ అంబేడ్కర్ బ్రిటిష్ అధికారులను కలిసి భారత దేశంలో కులం, మతం, సంపద, ఆడ, మగా అనే తేడా లేకుండా పౌరులందరికీ ఓటు హక్కు ఉండాలని వాదించారు. ఓటు హక్కు ద్వారా ప్రజలకు సమానమైన, విలువ, గౌరవం, గుర్తింపు లభిస్తాయని ఆయన గట్టిగా నమ్మారు. అదే ప్రజాస్వామ్యానికి పునాది అవుతుందని కూడా విశ్వసించారు. ఆ మేరకు భారత రాజ్యాంగాన్ని ఒక బలమైన అస్త్రంగా దేశానికి అందించారు. రాజ్యాంగం ప్రకారం భారత పౌరులందరికీ సమాన హక్కులు, గౌరవం, గుర్తింపు ఉంటాయి. దేశంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, అంతరించిపోతున్న ఆలోచించే స్వేచ్ఛను, భావప్రకటన స్వాతంత్ర్యాన్ని, మన విశ్వాసాలను కాపాడుకునే అవకాశాలను రాజ్యాంగం హామీ ఇచ్చింది. ఇప్పుడు రాజకీయ పార్టీలు మనుషులందరికీ సమాన గౌరవం, సమాన విలువ, సమాన ప్రాతినిధ్యం ఇవ్వగలిగే వ్యవస్థలను, పటిష్ఠమైన పరివారాన్ని నిర్మించాలి తప్ప విద్వేషాలను రగిల్చి విడదీయరాదు. ఇంకా కులాల, మతాల పేరుతో వైషమ్యాలు పెంచి పోషించుకుంటూ విభజన రేఖలు గీసుకుంటూపోతే పరివారమే కాదు, దేశం కూడా నిలదొక్కుకోలేదు. ఈ పరిస్థితుల్లో ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాలి.

● ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి
రాజకీయ విశ్లేషకులు

సోషలిజాన్ని శ్వాసించిన మహాకవి

'కష్టజీవికి ఇరువైపులా ఉండేవాడు కవి' అని కవికి ఉండవలసిన లక్షణాన్ని నిర్వచించాడు శ్రీరంగం శ్రీనివాసరావు. కష్టజీవుల స్వేదానికి ఖరీదు కట్టగల షరాబు లేడని కూడ సవాలు విసిరాడు. చైనాలోని రిక్షావాలాను, చెక్ దేశపు గని పనిమనిషినీ, ఐర్లండులోని ఓడ కళాసినీ మొత్తంగా ఖండాంతర నానా జాతుల్నీ, అణగారిన ఆర్తులందరినీ తన కవిత్వంలో స్పృశించాడు. సామ్రాజ్యపు దండయాత్రలో సాహసించిన సామాన్యుడిని, ప్రభువెక్కిన పల్లకి మోసే బోయీలను, నైలు నది నాగరికతలో సామాన్యుడి జీవితాన్ని గురించి ప్రశ్నించాడు. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీల పక్షాన తాను నిలబడ్డాడు. 'బలవంతుల పన్నాగాలు, ధనవంతుల దౌర్జన్యాలు ఇకముందు సాగవని హెచ్చరించాడు. 'బతుకు కాలి, పనికిమాలి శనిదేవత రథచక్రపు టిరుసులలో పడి నలిగిన హీనులను, దీనులను ఓదార్చిన మహామనీషి కష్టజీవులకు, కర్మవీరులకు నిత్యమంగళం నిర్దేశించాడు. 'అంతేలే పేదల గుండెలు, అశ్రువులే నిండిన కుండలం'టూ బడుగుల జీవితాలను తడిమాడు. 'పాతబడిన భావాలను లోతుగ పాతర వేయగ మహిళాలోకాన్ని కదలి రమ్మన్నాడు. నెత్తురు మండే, శక్తులు నిండే యువకులను తన మరో ప్రపంచానికి ఆహ్వానించాడు. వాళ్ళను రాబోవు యుగం దూతలుగా వర్ణించాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి వారసులైన భూమయ్య, కిష్టాగౌడ్‌లు ఎమర్జెన్సీ కాలంలో ఉరితీయబడ్డప్పుడు వారిని 'భూమ్యాకాశాలు'గా కీర్తించాడు. సమాజానికి కాలం పెట్టిన అప్పును వారు తమ ప్రాణాలతో తీర్చుకున్నారని తీర్పు చెప్పాడు. సామ్రాజ్యవాద శక్తులను వ్యతిరేకించాడు. పౌరహక్కులను భుజాన వేసుకు మోశాడు. 'సామ్యవాదమే నా గమ్యం... అది నా కవిత్వంలోను, జీవితంలోను' అని ప్రకటించిన స్వాప్నికుడు.

ఒకరేమిటి ఆ మహాకవి రాయనిదెవరిగూర్చి, పాడనిదెవరిమీద? అందుకే ఆయన ఇరవయ్యో శతాబ్దపు మహాకవిగా కొనియాడబడ్డాడు. వివాదాలెన్నున్నా ఆయన్ను మహాకవి కాదనలేకపోవడమే ఆయనలోని గొప్పదనం. ఆయన రక్తంతో రాగాలాపన చేయించాడు, మాటలతో మంటలు పుట్టించాడు. ప్రపంచపు బాధనంతా తనబాధగా చెప్పుకున్నాడు. అందుకే ఆయన ఒక నవయుగ వైతాళికుడు, ఒక యుగకర్త, ఒక దార్శనికుడు. ఆయన చేసిన అనువాద కవితలు బహుభాషాకోవిదుడని చెప్పకనే చెబుతాయి. జర్మన్, ఫ్రెంచ్, లాటిన్ భాషలు ఆయనకు కరతలామలకం. లెక్కలేనన్ని అవార్డులు ఆయనకే సొంతం. ఈనాటికైనా ఉద్యమాలకు ఆయన గేయాలే స్ఫూర్తి. అనేకులకు, అశాంతులకు, అనాథలకు, అభాగ్యులకు ఆయన కవిత్వం ఒక మంచి టానిక్. జీవితంలో ఓడిపోయినవారికి ఆయన గీతాలే దిక్కు. ఆయన ఈ జన సాహిత్యసముద్రం మీద చేసిన 'సంతకాన్ని ఏ గాలీ చెరిపివేయ'లేకపోయింది. ఆయన సాహిత్యాన్ని, భావజాలాన్ని భావితరాలకు అందించడమే మహాకవి శ్రీశ్రీకి మన ఘన నివాళి.

కవీ! నీ గళగళన్గంగళ/ కళాకాహళ హళాహళిలో/ కలిసిపోతిని కరిగిపోతిని/ కానరాకేకదలిపోతిని.

– శ్రీశ్రీకుమార్

(నేడు శ్రీశ్రీ జయంతి)

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru







ఆంధ్రజ్యోతి
నవ్య
డాక్టర్
మంగళవారం • 30 ఏప్రిల్ 2024

ఫ్రూట్ డైట్, మిల్లెట్ డైట్, ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్, కీటో, పాలియో... ఇలాంటి డైట్లను దీర్ఘ కాలం పాటు కొనసాగించడం కష్టం. కాబట్టి వీటికి బదులుగా హైపో క్యాలరిక్ డైట్ (శరీరం ఖర్చు చేసే క్యాలరీ కంటే, తక్కువ క్యాలరీలున్న ఆహారం) అనుసరించాలి.



లివర్ కేర్



సమతులాహారం, వ్యాయామం... ఇవి రెండూ కాలేయానికి ప్రాణ స్నేహితులు. ఈ రెండింటి మీదా దృష్టి పెడితే కాలేయాన్ని దెబ్బ తీసే ఫ్యాటీ లివర్, లివర్ కేన్సర్ లాంటి శత్రువులు దరి చేరకుండా ఉంటాయంటున్నారు వైద్యులు.

కాలేయం కులాసాగా..

కాలేయానికి సంబంధించిన సమస్య కామెర్లు అనే విషయం మనందరికీ తెలుసు. లక్షణాలను బట్టి కామెర్లను కనిపెట్టేసి, కొద్ది రోజుల పాటు జాగ్రత్తలు పాటించి నయమైపోయిందని అనుకుంటూ ఉంటాం. కానీ ఎన్నో రకాల కాలేయ వ్యాధులు కామెర్ల రూపంలోనే బయల్పడుతూ ఉంటాయి. కాబట్టి మూల కారణాన్ని కనిపెట్టడం అవసరం. ప్రధానంగా రెండు రకాల వైరస్‌ల మూలంగా కామెర్లు వస్తూ ఉంటాయి. కలుషితాహారంతో సోకే హెపటైటిస్ 'ఎ'వైరస్ పిల్లలకు సోకితే, హెపటైటిస్ 'ఇ' వైరస్ పెద్దలకు సోకుతూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కొన్ని రకాల మందుల వల్ల కూడా కాలేయం దెబ్బతిని, కామెర్ల రూపంలో సమస్య బయల్పడుతూ ఉంటుంది. ఫైబ్రోసిస్ లేదా స్కార్ టిష్యూ కలిగి ఉన్న కాలేయ సమస్య క్రానిక్ హెపటైటిస్. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే అది సిర్రోసిస్‌గా మారి, అంతిమంగా లివర్ ఫెయిల్యూర్‌కు దారి తీస్తుంది. కాలేయ కేన్సర్ కూడా కామెర్లతోనే బయటపడుతుంది. కాబట్టి కామెర్లకు మూల కారణాన్ని కనిపెట్టి, తదనుగుణ చికిత్స తీసుకోవడం అవసరం.

అపోహలు వీడాలి

కామెర్లు సోకితే పత్యం ఉంటూ ఉంటాం. కానీ నిజానికి జబ్బుపడిన కాలేయం త్వరగా కోలుకోవడం కోసం బలవర్థకమైన ఆహారం తీసుకోవడం అవసరం. కామెర్లు సోకినప్పుడు గ్లూకోజ్, చెరకు రసం, నూనె, ఉప్పు, కారం లేకుండా వండిన పదార్థాలు, పెరుగన్నం తీసుకుంటూ ఉంటాం. కానీ ఈ సమయంలో ఎక్కువ క్యాలరీలుండే ఆహారం తీసుకోవాలి. కామెర్లు సోకిన వాళ్లందరూ ఇంట్లో వండిన, సాధారణ వంటకాలన్నింటినీ తినవచ్చు. ప్రధానంగా మాంసాహారానికి బదులుగా శాకాహారం తీసుకోవాలి. మాంసాహారం తేలికగా అరగదు కాబట్టి కాలేయం మీద అదనపు భారం పడకుండా ఉండడం కోసం సమస్య అదుపులోకొచ్చేవరకూ మాంసాహారానికి దూరంగా ఉండాలి.

తీవ్ర కాలేయ సమస్యలో...

క్రానిక్ లివర్ డిసీజ్ మొదటి దశలో, స్కార్ ఏర్పడినా కాలేయం సమర్థంగానే పని చేస్తూ ఉండవచ్చు. రెండో దశలో కాలేయం పనిచేయడం మందగించే స్థితికి చేరుకుంటుంది. ఈ దశలో పొట్ట వాపు ఉంటుంది. నిస్సత్తువ కూడా వేధిస్తుంది. ఆకలి కూడా తగ్గుతుంది. చివరి దశలో కాలేయం పని చేయడం మానేస్తుంది. పొట్ట, కాళ్ల వాపు, మైకం, చిగుళ్ల నుంచి రక్తస్రావం లాంటి లక్షణాలు ఈ దశలో ఉంటాయి. లివర్ ఫెయిల్యూర్ దశకు చేరుకున్న వాళ్లకు కాలేయ మార్పిడి ఒక్కటే పరిష్కారం. కాబట్టి కాలేయ సమస్యను తొలి దశలోనే కనిపెట్టి సమర్థమైన చికిత్స తీసుకోవాలి. కాలేయ కేన్సర్ సమస్య క్రమేపీ పెరుగుతోంది. ఇంతకు ముందు హెపటైటిస్ 'బి' వల్ల కేన్సర్ తలెత్తితే, ప్రస్తుతం ఫ్యాటీ లివర్ డిసీజ్ కారణంగా కేన్సర్ బారిన పడుతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. అల్ట్రాసౌండ్ స్కాన్ చేసుకున్న వాళ్లలో ఎక్కువ మందికి ఫ్యాటీ లివర్ ఉంటూ ఉంటుంది. కాబట్టి ఇదంత పట్టించుకోవలసిన విషయం కాదనే ఒక ధోరణి సర్వత్రా పెరిగిపోయింది. దాంతో ఆ సమస్యను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ ఇదే సమస్య అంతిమంగా కాలేయ కేన్సర్‌కు దారి తీస్తుందనే విషయం అందరూ గుర్తుపెట్టుకోవాలి. మెటబాలిక్ సింద్రోమ్, మధుమేహం, డిస్‌లిపిడీమియా, హైపర్‌గ్లిసరైడీమియా, అధిక రక్తపోటు, ఒబేసిటీ, విల్సన్స్ డిసీజ్... ఫ్యాటీ లివర్‌కు ప్రధాన కారణాలు. కాబట్టి ఫ్యాటీ లివర్ కేన్సర్‌కు దారి తీయకుండా ఉండాలంటే, అందుకు మూల కారణాలను సరిదిద్దుకోవాలి.

ఈ లక్షణాలు గమనించాలి

తొలి దశలో

- కళ్లు, చర్మం, మూత్రం పచ్చబడడం
- తల తిరగడం
- వాంతులు
- ఆకలి మందగించడం
- దురదలు
- నీరసం

తీవ్ర దశలో...

- ఏకాగ్రత లోపించడం
- ఆకలి లేకపోవడం
- నీరసించిపోవడం
- కాళ్లు, పొట్ట వాపు
- మైకం
- మానసిక అసతులనం
- కండరాల క్షీణత



నాటు మందులు వద్దు

కామెర్లకు నాటుమందులు వాడడం ప్రమాదకరం. వాటిలోని హెవీ మెటల్స్ కాలేయానికి కీడు చేసి, సమస్యను తీవ్రతరం చేస్తాయి. నాటుమందులు తీసుకోవడం వల్ల ప్రయోజనం లేకపోగా, కాలేయం మరింత దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కాబట్టి నాటు మందుల జోలికి వెళ్లకుండా అవసరాన్ని బట్టి వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి. ఒకవేళ పదే పదే కామెర్లు వేధిస్తున్నా, నిస్సత్తువ, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కనిపిస్తున్నా కాలేయ వ్యాధిగా పరిగణించి, వైద్యులను ఆశ్రయించాలి.

సప్లిమెంట్లు వద్దు

ఏం తిన్నా కాలేయానికి చేరుతుంది. కాబట్టి అదనపు హెల్త్ సప్లిమెంట్లు, ప్రొటీన్ పౌడర్ల వాడకం మానేయాలి. వైద్యులు సూచించనిదే ఎలాంటి సొంత వైద్యం చేసుకోకూడదు. శరీర బరువు తగ్గించుకోవాలన్నా, పెంచుకోవాలన్నా ఆ ఫలితం ఆహారం ద్వారా దక్కేలా చూసుకోవాలి. శరీర బరువులో ప్రతి కిలోకు 20 నుంచి 30 కిలోక్యాలరీల చొప్పున లెక్కించి, సరిపడా క్యాలరీలున్న ఆహారం తీసుకోవాలి. అలాగే ఒక కిలో శరీర బరువుకు ఒకటి నుంచి ఒకటిన్నర గ్రాము ప్రొటీన్ అందేలా చూసుకోవాలి. అలాగే ఉప్పు, రోజుకు 4 నుంచి 5 గ్రాములకు మించకుండా చూసుకోవాలి.

బరువు తగ్గాలి

అధిక బరువును ఆహార నియమాలతో, వ్యాయామంతో తగ్గించుకోవాలి. అయితే బరువు తగ్గడం కోసం నచ్చిన డైట్‌లను అనుసరించేవాళ్లు ఉంటారు. కొందరు ఫ్రూట్ డైట్, మిల్లెట్ డైట్, ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్, కీటో, పాలియో... ఇలాంటి డైట్లను దీర్ఘకాలం పాటు కొనసాగించడం కష్టం. కాబట్టి వీటికి బదులుగా హైపో క్యాలరిక్ డైట్ (శరీరం ఖర్చు చేసే క్యాలరీ కంటే, తక్కువ క్యాలరీలున్న ఆహారం) అనుసరించాలి. ఉదాహరణకు 10 నుంచి 15% అదనపు బరువు ఉన్నవాళ్లు, రోజులో తీసుకునే ఆహారంలో 300 నుంచి 500 కిలోక్యాలరీలను తగ్గించుకోవాలి. అలాగే ఎవరు, ఎంత సమయం పాటు వ్యాయామం చేయాలనేది వాళ్ల వయసు, గుండె గరిష్ఠ వేగం మీద ఆధారపడి ఉంటుంది. వారంలో 150 నుంచి 180 నిమిషాల పాటు కార్డియో వ్యాయామాలు చేయాలి. 50 నుంచి 75 నిమిషాల పాటు రెసిస్టెన్స్ ట్రైనింగ్ చేయాలి. అలాగే అధిక బరువును నెమ్మదిగా, స్థిరంగా తగ్గించుకోవాలి. కాలేయంలో స్కార్ టిష్యూ ఉన్నవాళ్లు శరీర మొత్తం బరువులో 10% బరువును తగ్గించుకోవాలి. ఉదాహరణకు 100 కిలోల బరువున్నవాళ్లు, ఆరు నుంచి తొమ్మిది నెలల వ్యవధిలో పది కిలోల బరువు తగ్గడం లక్ష్యంగా పెట్టుకోవాలి.

డాక్టర్ ధర్మేష్ కపూర్
సీనియర్ హెపటాలజిస్ట్ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్.



హెల్త్ వెల్త్



ఈ వేసవి ప్రతాపంతో ఒంట్లోని ఓపికంతా ఆవిరైపోతోంది. వేడి వాతావరణాన్ని తట్టుకోలేక నీరసం ఆవహిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం!

ఎండల్లో చల్లచల్లగా...

వేసవిలో వేడి సహజం. ఫలితంగా శరీరంలోనూ వేడి పుడుతుంది. దాంతో అలసట, బడలిక కలుగుతాయి. విపరీతమైన స్వేదం, చర్మం పొడిబారడం, తలనొప్పి, మగత, ఒళ్లు నొప్పులు లాంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు. ఈ లక్షణాలన్నీ ఒంట్లో వేడి పెరగడం వల్ల కలిగేవే!

ఎండ ప్రభావం

ఎండ వేడిమికి శరీర ఉష్ణోగ్రత క్రమేపీ పెరుగుతూ 104 డిగ్రీలకు చేరుకుంటే ఎండదెబ్బకు గురవుతాం! అత్యధిక ఉష్ణోగ్రతలకు గురయినా లేక వేడి వాతావరణంలో శారీరక శ్రమ వల్ల శరీర ఉష్ణోగ్రత ఆ మేరకు చేరుకున్నా ఎండదెబ్బకు గురవడం సహజం. ఈ రెండు సందర్భాలను వివరంగా చెప్పుకోవాలంటే...

- **వేడి వాతావరణానికి బహిర్గతం కావడం:** ఎక్కువ సమయంపాటు ఎండలో గడపడం వల్ల శరీర కేంద్ర ఉష్ణోగ్రత (కోర్ టెంపరేచర్) పెరుగుతుంది. ఇలాంటి స్థితి వేడిగా, తేమగా ఉన్న వాతావరణంలో ఎక్కువ సమయంపాటు గడపడం వల్ల సంభవిస్తుంది.
- **శారీరక శ్రమ:** వేడి వాతావరణంలో అత్యధిక శారరీక శ్రమకు గురయినా శరీర కేంద్ర ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగి ఎండదెబ్బకు గురవుతాం. ఆ స్థితిలో అయోమయం, స్పృహ కోల్పోవడం, వాంతులు, ఒళ్లు వేడిగా మారడం, శ్వాస, గుండె కొట్టుకునే వేగం నెమ్మదించడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

కారణాలు

ఎలాంటి ఎండదెబ్బకు గురయినా అందుకు పలు కారణాలు ఉంటాయి. వాటిలో ప్రధానమైనవి ఏవంటే...

- గాలి ధారాళంగా చొరబడని దుస్తులు, చమటను పీల్చుకునే వీలు లేని దుస్తులు ధరించడం. వేడిని గ్రహించే వీలున్న నల్ల దుస్తులు ధరించడం.
- మద్యం తీసుకోవడం. మద్యం తాగడం వల్ల ఉష్ణోగ్రతను క్రమబద్ధం చేసే శక్తి శరీరం కోల్పోతుంది.
- స్వేదం ద్వారా శరీరం కోల్పోయిన నీటిని భర్తీ చేయకపోవడం.

నివారణ తేలికే!

ఎండదెబ్బకు గురయి బాధ పడేకంటే, ఆ స్థితి రాకుండా జాగ్రత్త పడడం మేలు. వేసవి వేడి, ఎండల ప్రభావానికి గురవకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు పాటించాలిజ

- **దుస్తులు:** ధరించే దుస్తులు తేలికగా, గాలి చొరబడేలా, చమట పీల్చేలా సౌకర్యంగా ఉండాలి. వీలైనంతవరకూ తెల్లని దుస్తులే ధరించాలి.
- **సూర్యరశ్మి:** సూర్యరశ్మి నేరుగా సోకితే, శరీరం తనంతట తాను చల్లబడే స్వభావాన్ని కోల్పోతుంది. కాబట్టి ఎండలో బయటకు వెళ్లవలసివస్తే తలకు టోపీ, కళ్లకు చలువ కళ్లద్దాలు, గొడుగు తప్పనిసరిగా వాడాలి. వైద్యులు సూచించే సన్‌స్క్రీన్ వాడడం వల్ల చర్మం కమిలిపోకుండా, పొడిబారకుండా ఉంటుంది.
- దాహం వేసేవరకూ ఆగకుండా గంటకొకసారి నీళ్లు తాగుతూ ఉండాలి. నీళ్లతోపాటు కొబ్బరినీరు, మజ్జిగ కూడా తరచుగా తాగుతూ ఉండాలి. ఇలా ఒంట్లో నీటి పరిమాణాన్ని సక్రమంగా ఉంచుకుంటే ఎండ ప్రభావం నుంచి తప్పించుకోగలుగుతాం.
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండ తీవ్రత ఎక్కువ. కాబట్టి ఆ సమయాల్లో నీడ పట్టున గడపాలి. వ్యాయామానికి ఎండ లేని సమయాలను కేటాయించాలి.

దాహం తీరట్లేదా?

ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరదు. ఏం చేయాలో అర్థం కాదు. వేసవిలో కొందరి పరిస్థితి ఇది. ఇలా మీకూ అనిపిస్తూ ఉంటే, గ్లాసుడు నీళ్లలో ఒక స్పూను తేనె కలుపుకుని తాగి చూడండి. ఆ తర్వాత తాగే నీళ్లతో మీ దాహం తీరడం ఖాయం. అన్నట్టు, చల్ల నీళ్లతో దాహం తీరదు. ఫ్రిజ్‌లో నుంచి గడ్డకట్టిన నీళ్ల బాటిల్ తీసి తాగటం వృథా! అతి చల్లని నీళ్లు జీర్ణమై రక్తంలో కలవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఆలోగా ఒంట్లోని ప్రతి కణం దాహార్తితో అల్లాడిపోతుంది. కాబట్టి జీర్ణాశయం ఉష్ణోగ్రతకు దగ్గరగా ఉండేలా గోరు వెచ్చని నీళ్లు తాగితే దాహం తీరుతుంది.

చెమట పొక్కులకు చక్కని చిట్కాలు

వేసవిలో చెమటను భరించటమే కష్టం. దీనికి చెమట పొక్కులు తోడైతే ఇక ఆ చిరాకును మాటల్లో చెప్పలేం. ఈ చెమట పొక్కులు మంట పెట్టకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించాలి.

- మెత్తగా పొడి చేసిన ఓట్లను చల్లని నీళ్లతో నింపిన స్నానాలతొట్టిలో వేసి కలపాలి. నీళ్లు పాల రంగులోకి మారాక స్నానాలతొట్టిలో 30 నిమిషాలు సేదతీరాలి. తర్వాత మెత్తని టవల్‌తో తడి అదుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే చెమట పొక్కులు వదులుతాయి.
- వస్త్రంలో ముంచు ముక్కలు మూటగట్టి సమస్య ఉన్న ప్రదేశంలో 5 నుంచి 10 నిమిషాలపాటు ఉంచాలి. ఇలా ప్రతి నాలుగు గంటలకోసారి చేస్తూ ఉంటే 3 రోజులకి చెమట పొక్కులు మరింత పాకకుండా తగ్గిపోతాయి.
- గంధం పొడి, గులాబీనీరు సమపాళ్లలో కలిపి సమస్య ఉన్న ప్రదేశంలో పూయాలి. పూర్తిగా ఆరాక చల్లని నీళ్లతో కడిగేయాలి.
- ఒక కప్పు చల్లని నీళ్లలో ఒక టీస్పూను బేకింగ్ సోడా కలిపి, ఆ నీళ్లలో పలుచని వస్త్రం నానబెట్టి పిండేయాలి. దీన్ని చెమట పొక్కుల మీద 10 నిమిషాలు ఉంచినా ఉపశమనం కలుగుతుంది.
- ముల్తాని మట్టికి రోజ్‌వాటర్ చేర్చి ముద్దలా చేయాలి. దీన్ని చెమట పొక్కుల మీద పూసి ఆరాక చల్లని నీళ్లతో కడిగేయాలి.
- లేత వేప ఆకుల్ని మెత్తగా నూరి పూసి ఆరాక చల్లని నీటితో కడిగేసుకున్నా ఫలితం ఉంటుంది.

ఆరోగ్య సూత్రాలు

పరిపూర్ణ ఆరోగ్యం కోసం...

ఆరోగ్య సూత్రాలన్నీ అందరూ అనుసరించడానికి తగ్గట్టుగా సులభంగానే ఉంటాయి. అవేంటంటే....

- మద్యం విషంతో సమానం. ఆ అలవాటును వీలైనంత మేరకు తగ్గించేయాలి
- పీనట్ బటర్‌లో ప్రొటీన్లు తక్కువ. కాబట్టి ఆ అపోహను వదిలించుకోవాలి.
- నెమ్మదిగా తినడం అలవాటు చేసుకోవాలి. ఆకలి తీరిన తృప్తిని అందించే లెప్టిన్ హార్మోన్ విడుదలయ్యే సమయాన్నివ్వడం కోసం ఆహారాన్ని నెమ్మదిగా తినాలి
- వేగంగా క్యాలరీలను కరిగించడం కోసం కార్డియో చేయాలి. విశ్రాంత స్థితిలో మెటబాలిజాన్ని పరుగులు పెట్టించడం కోసం వెయిట్ ట్రైనింగ్ చేయాలి
- వీలైనన్ని పండ్లను తినొచ్చు. అవసరానికి మించి పండ్లను తినడం ఎవరి వల్లా కాదు
- బ్లాక్ కాఫీ, మంచి నీళ్లు ఆకలిని అరికడతాయి
- భోజనం తర్వాత చిరుతిళ్ల జోలికి వెళ్లకుండా ఉండడం కోసం, తిన్న వెంటనే బ్రష్ చేయాలి
- ఆహార పరిమాణం మన లుక్స్‌ను, ఆహార నాణ్యత మన మనసునూ ప్రభావితం చేస్తాయి
- వ్యాయామం చేయడానికి ఒళ్లు బద్ధకిస్తుంటే, వ్యాయామానికి ఉదయం వేళలే కేటాయించాలి
- గుడ్లు సూపర్‌ఫుడ్. కాబట్టి వాటిని క్రమం తప్పకుండా తింటూ ఉండాలి
- ద్రవ రూప క్యాలరీలు తగ్గించాలి. కూల్‌డ్రింక్స్, మిల్క్‌షేక్‌లు మానుకోవాలి
- కండరాలను పెంచడం ద్వారా మెటబాలిజంను పెంచవచ్చు
- అత్యధిక ప్రొటీన్ డైట్ అన్నిటికంటే ఉత్తమ డైట్
- నిద్రలేమి తర్వాతి రోజు ఆకలి హార్మోన్ల స్రావాన్ని పెంచుతుంది. కాబట్టి కంటి నిండా నిద్రపోవాలి
- 80% సహజసిద్ధ ఆహారాన్ని తిన్నంత కాలం పిజ్జా, బర్గర్, ఐస్‌క్రీమ్.... ఏది తిన్నా బరువు పెరగం
- సూర్యరశ్మి... మంచి నిద్రకూ, మానసిక ఆరోగ్యానికీ, ఎముకల దృఢత్వానికీ చర్మ ఆరోగ్యానికీ తోడ్పడుతుంది.



'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/H1tl6dmలో చదవండి.

గుడ్ ఫుడ్

వెలగ పండు తింటే?

వెలగ పండు ఎంతో అరుదుగా తింటూ ఉంటాం. విలువైన పోషకాలతో కూడిన ఈ పండును తరచుగా తింటూ ఉంటే, పోషక లోపాలు దరి చేరకుండా ఉంటాయి. ఈ పండులో...

- రోగనిరోధకశక్తిని పెంచే సి విటమిన్‌తో పాటు, గుండె ఆరోగ్యాన్ని కాపాడే పొటాషియం కూడా సమృద్ధిగా ఉంటుంది. అలాగే ఎముకల దృఢత్వానే పెంచే క్యాల్షియం కూడా ఈ పండులో మెండుగా ఉంటుంది.
- వెలగపండులోని పీచు పెద్ద పేగుల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. మలబద్ధకాన్ని తొలగించి, సుఖవిరోచనానికి తోడ్పడుతుంది. దీన్లోని సహజసిద్ధ లాక్సేటివ్స్ అయిన టానిన్లు, పేగుల కదలికలకు తోడ్పడతాయి.
- దీన్లో క్యాలరీలు తక్కువ, పీచు ఎక్కువ. కాబట్టి బరువు తగ్గాలనుకునేవాళ్లు ఈ పండును తరచూ తినవచ్చు. ఈ పండులోని ఫైబర్‌తో ఆకలి దరి చేరకుండా ఉంటుంది కాబట్టి బరువు తగ్గడం కోసం ప్రయత్నించే ఊబకాయులకు వెలగపండు ఉపయోగకరం.



ఫుడ్ ప్యాక్ట్

లవణ రహస్యం

ఖనిజ లవణాల పరిమాణం, ప్రాసెస్ ప్రక్రియల ఆధారంగానే లవణాన్ని ఆరోగ్యకరమైన లవణంగా పరిగణిస్తూ ఉంటారు. అయితే అన్ని రకాల లవణాల్లో సోడియం పరిమాణం సమానంగానే ఉన్నప్పటికీ కొన్నింటిలో ట్రేస్ మినరల్స్ అదనంగా ఉండడంతో పాటు, వాటిని ప్రాసెస్ చేసే ప్రక్రియ కూడా భిన్నంగా ఉంటుంది. కాబట్టి లవణాలు, రకాల గురించి తెలుసుకుందాం!



- **హిమాలయన్ పింక్ సాల్ట్:** లేత గులాబీ రంగులో ఉండే ఈ లవణంలో పొటాషియం, మెగ్నీషియం, క్యాల్షియం లాంటి ట్రేస్ మినరల్స్ కూడా ఉంటాయి. ఇవి పరిపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి.
- **సీ సాల్ట్:** సముద్రపు ఉప్పులో సముద్ర సంబంధ ఖనిజ లవణాలుంటాయి. కానీ దైనందిన వాడకం ద్వారా పింక్ సాల్ట్‌కు మించిన ఆరోగ్య ప్రయోజనాలు దీనితో పొందే అవకాశం ఉండదు.
- **పొటాషియం సాల్ట్:** సాధారణ టేబుల్ సాల్ట్ కంటే పొటాషియం సాల్ట్‌లో 70% తక్కువ సోడియం ఉంటుంది. పొటాషియం ఎక్కువగా ఉంటుంది కాబట్టి హృద్రోగులకు ఈ ఉప్పు ఉపయోగకరం.
- **టేబుల్ సాల్ట్:** సముద్రపు నీరు, ఉప్పు కయ్యల నుంచి తయారయ్యే టేబుల్ సాల్ట్‌ను తెల్లగా, జారుడుగా మార్చడం కోసం దాన్లోని మలినాలను తొలగించి, యాంటీ కేకింగ్ ఏజెంట్లను జోడిస్తారు. అయొడిన్ లోటును భర్తీ చేయడం కోసం అయొడిన్‌ను కూడా జోడిస్తారు.

ఏ ఉప్పు తీసుకున్నా దాన్లో ఉండే సోడియం మోతాదు ఒకేలా ఉంటుంది కాబట్టి ఉప్పును వీలైనంత పరిమితంగా వాడుకోవాలి.

సమ్మర్ కేర్

పొట్ట చల్లగా...

వేసవిలో వేడి వేడిగా తినాలని అనిపించదు. శరీరాన్ని చల్లబరిచే చలచల్లని పదార్థాల వైపు మనసు లాగుతూ ఉంటుంది. అయితే ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్‌లు లాంటి వాటితో ఒంటిని చల్లబరుచుకోడానికి బదులుగా, బ్రేక్‌ఫాస్ట్‌లో పులిసిన పెరుగన్నం ట్రై చేయాలి.

రాత్రి మిగిలిపోయిన అన్నం పారేయకుండా ఒక మట్టి పాత్రలో వేసి, గోరువెచ్చని పాలు, చెంచా పెరుగు, ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలిపి మూత పెట్టాలి. ఉదయానికి చక్కగా గడ్డకట్టి కమ్మని పెరుగన్నం తయారవుతుంది. దీన్లో ఉప్పు కలుపుకుని నేరుగా తినొచ్చు. లేదంటే ఆవాలు, మెంతులు, జీలకర్ర, మినపప్పు, కరివేపాకులతో తాలింపు వేసుకుని తినొచ్చు. ఈ పెరుగన్నం ఎండ వేడి నుంచి శరీరాన్ని చల్లబరచడమే కాకుండా, జీర్ణాశయానికి శక్తినిచ్చి, జీర్ణ శక్తిని పెంచుతుంది. తేలికగా అరుగుతుంది కాబట్టి పెద్దలు కూడా నిస్సంకోచంగా తినొచ్చు.



ఇప్పటికీ నగదే రారాజు

ఆర్థిక వ్యవస్థలో చలామణిలో ఉన్న నగదు రెట్టింపు
ఏటీఎంల నుంచి సగటున నెలకు రూ.1.43 కోట్లు విత్‌డ్రాయల్స్



న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు, యూపీఐ చెల్లింపుల వంటి మార్పులెన్ని వచ్చినా.. దేశంలో ఇప్పటికీ కరెన్సీ నోట్లదే హవా. 2017 మార్చిలో ఆర్థిక వ్యవస్థలో రూ.13.35 లక్షల కోట్లుగా ఉన్న నగదు చలామణి (సీఐసీ) 2024 మార్చి నాటికి రూ.35.15 లక్షల కోట్లకు చేరడమే ఇందుకు సాక్ష్యం. బ్యాంక్ ఖాతాదారులూ, ఏటీఎంల నుంచీ పెద్ద మొత్తంలో నగదు విత్‌డ్రా చేస్తున్నారు. వీరు గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఒక్కో ఏటీఎం నుంచి నెలకు సగటున రూ.1.43 కోట్ల వరకు నగదును విత్‌డ్రా చేశారు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే ఇది 5.51 శాతం ఎక్కువని సోమవారం వెలువడిన 'సీఎంఎస్ కన్‌జంప్షన్ రిపోర్ట్' తెలిపింది. రూ.2,000 నోట్లలో 97.83 శాతం బ్యాంకుల్లో డిపాజిట్ అయినప్పటికీ దేశంలో నగదు వినియోగం పెరగడం విశేషం.

మెట్రోల్లో మరింత ఎక్కువ

దేశంలోని మెట్రో నగరాల్లో నగదు వినియోగం మరింత ఎక్కువగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే మెట్రో నగరాల్లో ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రాయల్స్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 10.37 శాతం పెరిగాయి. ఇదే సమయంలో సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రాయల్స్ 3.94 శాతం, సెమీ మెట్రో ప్రాంతాల్లో 3.73 శాతం మాత్రమే పెరిగాయి.

ఈ రాష్ట్రాల్లో మరింత ఎక్కువ: దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే కర్ణాటకలో ఏటీఎంల ద్వారా పెద్ద మొత్తంలో నగదు విత్‌డ్రా చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం అక్కడి బ్యాంక్ ఖాతాదారులు ఒక్కో ఏటీఎం నుంచి నెలకు సగటున రూ.1.83 కోట్లు విత్‌డ్రా చేశారు. రూ.1.82 కోట్లతో ఢిల్లీ రెండో స్థానంలో, రూ.1.62 కోట్లతో పశ్చిమ బెంగాల్ మూడో స్థానంలో ఉంది. పెద్ద ఎత్తున యూపీఐ చెల్లింపులు జరుగుతున్నా.. ఏటీఎంల ద్వారా ప్రతి నెలా విత్‌డ్రా చేసే నగదు గత ఆర్థిక సంవత్సరం 5.51 శాతం పెరగడం విశేషం. పెరుగుతున్న నగదు చెల్లింపులు, పెరుగుతున్న వినియోగ ఖర్చులకు సంకేతమని నివేదిక తెలిపింది.

వడ్డీ వసూళ్లలో అడ్డదారులొద్దు

బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఆర్‌బీఐ ఆదేశం



ముంబై: వడ్డీల విషయంలో అనుచిత ధోరణులకు పాల్పడవద్దని బ్యాంకులు, ఆర్థిక సంస్థలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆదేశించింది. ఒకవేళ ఇంతకు ముందే ఇలాంటి అనుచిత చర్యలకు పాల్పడి ఉంటే తగు దిద్దుబాటు చర్యలు చేపట్టి కస్టమర్ల నుంచి అదనంగా వసూలు చేసిన చార్జీలను వాపసు చేయాలని కోరింది. 2003 నుంచి నియంత్రిత సంస్థలకు (ఆర్ఈ) ఆర్‌బీఐ ఫెయిర్ ప్రాక్టీసెస్ కోడ్ కింద మార్గదర్శకాలు అందిస్తోంది. రుణచార్జీల విషయంలో వాటికి అవసరమైనంత స్వేచ్ఛ ఇస్తూనే వడ్డీ వసూళ్లపై స్పష్టత, పారదర్శకతలను ఈ కోడ్ ప్రోత్సహిస్తుంది. "2023 మార్చి 31వ తేదీతో ముగిసిన సంవత్సర కాలంలో ఆర్ఈలపై క్షేత్రస్థాయిలో నిర్వహించిన తనిఖీల్లో అవి వడ్డీ చార్జీల విషయంలో అనుచిత ధోరణులకు పాల్పడుతున్నట్టు తేలింది" అని ఆర్‌బీఐ తాజా సర్క్యులర్‌లో తెలిపింది. ఈ నేపథ్యంలో ఆర్ఈలన్నీ రుణ బట్వాడా, వడ్డీ రేట్లు, ఇతర చార్జీల నిర్ణయం విషయంలో తమ ధోరణులను సమీక్షించుకుని వ్యవస్థాపరమైన మార్పులు సహా అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ సర్క్యులర్ తక్షణం అమలులోకి వస్తున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. కొన్ని సంస్థలు అనుసరిస్తున్న నిర్దిష్టమైన అనుచిత ధోరణులకు ప్రత్యేకంగా వెలుగులోకి తెచ్చింది. ఆర్‌బీఐ ప్రస్తావించిన కొన్ని అనుచిత ధోరణులివే...

- రుణగ్రహీతకు వాస్తవంగా రుణం బట్వాడా చేసిన తేదీ నుంచి కాకుండా రుణం మంజూరైన తేదీ నుంచి లేదా రుణ అంగీకారంపై సంతకాలు చేసిన తేదీ నుంచే వడ్డీ వసూలు చేస్తున్నాయి.
- చెక్కును తయారుచేసిన తేదీ నుంచే ముక్కు పిండి వడ్డీ వసూలు చేస్తూ ఆ తర్వాత ఎన్నో రోజులకు కస్టమర్ చేతికి చెక్కును అందిస్తున్నాయి.
- రుణం తిరిగి చెల్లించే సమయంలో కూడా ఏ తేదీతో అయితే రుణం తీరిపోయిందో అంతవరకు కాకుండా నెల మొత్తానికి వడ్డీ వసూలు చేస్తున్నాయి.
- కొన్ని కేసుల్లో ఆర్ఈలు ఒకటి లేదా రెండు వాయిదాలు అడ్వాన్స్‌గా వసూలు చేసినా పూర్తి రుణ మొత్తానికి వడ్డీ వసూలు చేస్తున్నాయి.

ఈ చర్యలేవీ స్వచ్ఛత, పారదర్శకత పరిధిలోకి రావని, ఇవన్నీ తమను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని ఆర్‌బీఐ వ్యాఖ్యానించింది. ఆర్‌బీఐ బృందాల తనిఖీలో ప్రస్తావించిన ఈ తరహా కేసులన్నింటిలోనూ ఆర్ఈలు కస్టమర్ల నుంచి అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వాపసు చేయాలని ఆదేశించింది.

ఐవీఎంఏ ప్రెసిడెంట్‌గా కృష్ణ ఎల్లా

» వైస్ ప్రెసిడెంట్‌గా మహిమ దాట్ల

హైదరాబాద్: 'ది ఇండియన్ వ్యాక్సిన్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్' (ఐవీఎంఏ) కీలక పదవులకు ముగ్గురు తెలుగు తేజాలు ఎన్నికయ్యారు. భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కృష్ణ ఎం ఎల్లా ప్రెసిడెంట్‌గా, బయోలాజికల్-ఈ (బీఈ) మేనేజింగ్ డైరెక్టర్ మహిమ దాట్ల వైస్ ప్రెసిడెంట్‌గా, భారత్ బయోటెక్ సీఎఫ్ఓ టీ శ్రీనివాస్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. వీరు రెండేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగుతారు. ఐవీఎంఏ ప్రస్తుత డైరెక్టర్ జనరల్ డాక్టర్ హర్షవర్ధన్ అదే పదవిలో కొనసాగుతారు. 'అంతర్జాతీయ ఆరోగ్యానికి వ్యాక్సీన్లు ప్రధాన మూలస్తంభాలు. ఎవరు ఎక్కడ నివసిస్తున్నారనే దానిపై సంబంధం లేకుండా, ప్రతి వ్యక్తికీ వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో ఉండాలన్నదే ఐవీఎంఏ ధ్యేయం' అని కృష్ణ ఎం ఎల్లా ఒక ప్రకటనలో తెలిపారు.

హైసియా అధ్యక్షుడిగా ప్రశాంత్

హైదరాబాద్: హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నూతన అధ్యక్షుడిగా పస్ట్‌సోర్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) ప్రశాంత్ నందెళ్ల ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన హైసియా 32వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. 2024-26 కాలానికి ప్రశాంత్ ఈ పదవిలో ఉంటారు. ఇన్ఫోసిస్ హైదరాబాద్, ఇండోర్ క్యాంపస్ హెడ్ మనీషా సాబు నుంచి ఆయన ఈ బాధ్యతలు స్వీకరించారు. ప్రశాంత్ ఇంతకు ముందు హైసియా వైస్ ప్రెసిడెంట్‌గా, హైసియాకు చెందిన వివిధ కమిటీల్లో సభ్యుడిగా కీలక పాత్ర పోషించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,600 ▼	66,550 ▼	87,500 ▼
ముంబై	72,373 ▼	66,294 ▼	81,128 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	355	విజయవాడ	355
వరంగల్	357	గోదావరి	355
చిత్తూరు	453	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.48	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	గోదావరి	133
వరంగల్	127	విజయవాడ	133
కరీంనగర్	127	గుంటూరు	135
మహబూబ్‌నగర్	127	ఒంగోలు	135
కర్నూలు	127	చిత్తూరు	125
విశాఖపట్నం	125		



బుల్ జోష్

సెన్సెక్స్ 941 పాయింట్లు అప్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం భారీ లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ర్యాలీ సహా దేశీయంగా ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఇన్‌ఫ్రా రంగ షేర్లలో పెద్దఎత్తున కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. సెన్సెక్స్ 941.12 పాయింట్లు (1.28%) ఎగిసి 74,671.28 వద్దకు చేరుకోగా.. నిఫ్టీ 223.45 పాయింట్ల (1%) వృద్ధితో 22643.40 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 26 లాభపడ్డాయి. కొనుగోళ్ల జోరుతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.48 లక్షల కోట్లకు పైగా పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.406.52 లక్షల కోట్లకు (4.90 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

వచ్చే నెల 6 నుంచి ఇండిజీన్ ఐపీఓ: హెల్త్‌కేర్ టెక్నాలజీ కంపెనీ ఇండిజీన్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చే నెల 6న ప్రారంభమై 8న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా షేరు ధరల శ్రేణిని కంపెనీ రూ.430-452 గా నిర్ణయించింది.

బీఎస్ఈ షేరు 19% పతనం

రెగ్యులేటరీ ఫీజుపై సెబీ తాజా ఆదేశాలే కారణం

దేశంలో తొలి స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈ షేరు ఇంట్రాడే ట్రేడింగ్‌లో దాదాపు 19% క్షీణించి రూ.2,612.10 వద్దకు పతనమైంది. చివరికి 13.31% నష్టంతో రూ.2,783 వద్ద ముగిసింది. రెగ్యులేటరీ ఫీజుపై బీఎస్ఈకి మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ జారీ చేసిన తాజా ఆదేశాలే ఇందుకు కారణం. ఆప్షన్స్ కాంట్రాక్టుల వార్షిక టర్నోవర్‌పై ప్రీమియం విలువకు బదులు నోషనల్ వేల్యూ ఆధారంగా ఫీజు చెల్లించాలని బీఎస్ఈని ఆదేశించింది. దాంతో ఎక్స్ఛేంజ్ ప్రస్తుతం చెల్లిస్తున్న దాని కంటే అధిక రుసుము చెల్లించాల్సి వస్తుంది. ఇకపై చెల్లించబోయే రుసుముతో పాటు గత కాలానికీ కొత్త నిబంధన వర్తిస్తుందని సెబీ స్పష్టం చేసింది. కాబట్టి, గత సంవత్సరాలకు చెందిన వ్యత్యాస రుసుమును సైతం 15 శాతం వార్షిక వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించింది. దీన్నిబట్టి 2006-07 నుంచి 2022-23 వరకు వ్యత్యాస రుసుము కింద బీఎస్ఈ రూ.68.64 కోట్లు (జీఎస్‌టీ అదనం), 2023-24 ఆర్థిక సంవత్సరానికి మరో రూ.96.30 కోట్లు+జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.



మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓ

» ప్రారంభ ధర రూ.7.49 లక్షలు

ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో సరికొత్త ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓని విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.7.49 లక్షలు. కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో 3ఎక్స్ఓ సరికొత్త బెంచ్‌మార్క్‌ను సృష్టిస్తుందని ఎం అండ్ ఎం ఆటోమోటివ్ డివిజన్ ప్రెసిడెంట్ వీజే నక్రా తెలిపారు. 6-స్పీడ్ ఏఐఎస్ఐఎన్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో పెట్రోల్ వేరియంట్, 6 స్పీడ్ ఆటోషిఫ్ట్ ప్లస్‌తో డీజిల్ వేరియంట్స్ అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది. 1.2 లీటర్ ఎంస్టాలియన్ టీజీడీఐ ఇంజన్, సీఆర్‌డీఈతో 1.5 లీటర్ టర్బో డీజిల్ ఇంజన్‌తో ఈ ఎస్‌యూవీని తీసుకువచ్చినట్లు పేర్కొంది. ఈ ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓ బుకింగ్స్ మే 15 నుంచి ఆన్‌లైన్‌తో పాటు మహీంద్రా డీలర్‌షిప్స్‌లో ప్రారంభమవుతాయని తెలిపింది. అదే నెల 26 నుంచి ఈ కారు డెలివరీలను ప్రారంభించనున్నట్లు పేర్కొంది.

కాకినాడలో రూ.1,000 కోట్లతో ప్లాంట్

కోరమాండల్ ఇంటర్నేషనల్

హైదరాబాద్: ఎరువుల తయారీ కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. ఆంధ్రప్రదేశ్, కాకినాడలోని తన ఎరువుల ఫ్యాక్టరీ వద్ద బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా రూ.1,000 కోట్ల అంచనాతో ఫాస్ఫరిక్ యాసిడ్, సల్ఫ్యూరిక్ యాసిడ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. ఫాస్ఫరిక్ యాసిడ్ ప్లాంట్ రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 650 టన్నులు, సల్ఫ్యూరిక్ యాసిడ్ ప్లాంట్ రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 1,800 టన్నులు ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ రెండు ప్లాంట్ల నిర్మాణం రెండేళ్లలో పూర్తి కానుంది. డీఏపీ, ఎన్‌కేపీ ఎరువుల తయారీలో ఈ రెండు ఉత్పత్తులు కీలక ముడి పదార్థాలు. కాకినాడ ప్లాంట్‌కు అవసరమైన ఫాస్ఫరిక్, సల్ఫ్యూరిక్ యాసిడ్ అవసరాల్లో ఈ రెండు ప్లాంట్లు 50 శాతం తీరుస్తాయని అంచనా.

కర్ణాటకలో 'మేఘా'కు రూ.8,000 కోట్ల ప్రాజెక్ట్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)కు కర్ణాటకలో భారీ పవర్ ప్రాజెక్ట్ లభించింది. శరావతి నదిపై 2,000 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించే పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు నిర్మాణ కాంట్రాక్ట్ కంపెనీకి దక్కింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.8,000 కోట్ల వరకు పెట్టుబడి అవసరమవుతుందని కంపెనీ తెలిపింది. ఇది దేశంలోనే అతిపెద్ద పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు కానుంది. ఈ ప్రాజెక్ట్ కోసం జరిగిన బిడ్డింగ్‌లో ఎల్ అండ్ టీ కూడా పోటీపడింది. కానీ చివరికి ఈ ప్రాజెక్టు నిర్మాణ కాంట్రాక్టు ఎంఈఐఎల్‌కు దక్కింది.

స్పోర్ట్స్

పారిస్ ఒలింపిక్స్‌కు ఏడుగురు భారత షట్లర్లు





- సింధు, ప్రణయ్, లక్ష్య సేన్‌కు చోటు
- డబుల్స్‌లో సాత్విక్, అశ్వినీ జోడీలు
- శ్రీకాంత్‌కు మళ్లీ నిరాశే

న్యూఢిల్లీ: మాజీ వరల్డ్ చాంపియన్ పీవీ సింధు సహా ఏడుగురు భారత షట్లర్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. మహిళల సింగిల్స్‌లో సింధు, పురుషుల్లో హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్‌లు ఎప్పుడో తమతమ బెర్తులను ఖరారు చేసుకొన్నా.. కటాఫ్ డేట్ అయిన సోమవారం అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) అధికారికంగా ప్రకటించింది. నిబంధనల ప్రకారం 2023, మే 1 నుంచి 2024, ఏప్రిల్ 30 వరకు సాగే ఒలింపిక్ సైకిల్‌లో.. డెడ్‌లైన్ లోపు వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్-16లో ఉన్న వారు పారిస్‌కు అర్హత సాధిస్తారు. ఈ నేపథ్యంలో 12వ ర్యాంక్‌లో నిలిచిన సింధు.. 9, 13 ర్యాంక్‌లు సాధించిన ప్రణయ్, లక్ష్యసేన్‌లు అర్హత సాధించారు. సూపర్ ఫామ్‌లో ఉన్న డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట మూడో ర్యాంక్‌లో నిలిచి ఒలింపిక్ బెర్త్‌ను సొంతం చేసుకొంది. కాగా, మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 13వ స్థానంతో జాక్‌పాట్ కొట్టేయగా.. ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జోడీకి నిరాశే ఎదురైంది. ఈ ఏడాది పేలవ ప్రదర్శన చేసిన కిడాంబి శ్రీకాంత్ కూడా అర్హత సాధించలేక పోయాడు. శ్రీకాంత్ గత టోక్యో ఒలింపిక్స్‌కూ దూరమైన సంగతి తెలిసిందే.

థామస్ కప్ క్వార్టర్స్‌లో భారత్



చెంగ్డూ (చైనా) : డిఫెండింగ్ చాంపియన్ భారత్ ప్రతిష్ఠాత్మక థామస్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముందంజ వేసింది. గ్రూప్ 'సి'లో తలపడుతున్న మనోళ్లు సోమవారం జరిగిన రెండో పోరులో ఇంగ్లండ్‌ను 5-0తో చిత్తు చేసి క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టారు. ఉబెర్ కప్‌లో భారత మహిళల జట్టు ఇప్పటికే రౌండ్-8కి చేరిన విషయం విదితమే. తొలి పోరులో థాయ్‌లాండ్‌పై 4-1తో గెలిచిన పురుషుల జట్టు వరుసగా రెండో విజయంతో నాకౌట్ బెర్త్ ఖాయం చేసుకుంది. తొలి సింగిల్స్‌లో ప్రణయ్ 21-15, 21-15తో హ్యారీపై నెగ్గి జట్టుకు 1-0 ఆధిక్యం అందించాడు. మొదటి డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ 21-17, 19-21, 21-15తో బెన్/వెండీపై పోరాడి గెలిచారు. అనంతరం వరల్డ్ మాజీ నెం.1 కిడాంబి శ్రీకాంత్ 21-16, 21-11తో నదీమ్‌ని ఓడించడంతో భారత్ 3-0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. రెండో డబుల్స్‌లో అర్జున్/ధ్రువ్ 21-17, 21-19తో ఈస్టర్/అలెక్స్‌పై, చివరి మ్యాచ్‌లో కిరణ్ జార్జ్ 21-18, 21-12తో కయన్‌పై నెగ్గడంతో భారత్ విజయం పరిపూర్ణమైంది. బుధవారం జరిగే గ్రూపు చివరి పోరులో పటిష్ఠమైన ఇండోనేసియాతో భారత్ తలపడనుంది.

ఇప్పటికి వీరే..



పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
500 (10 మ్యాచ్‌లు)	14 (9 మ్యాచ్‌లు)

నేటి మ్యాచ్ — రాత్రి 7.30 గం. వేదిక: లఖ్‌నవూ

లఖ్‌నవూ X ముంబై

సంజూకే తొలి ప్రాధాన్యం

- కీపర్ పోటీలో పంత్, రాహుల్, ఇషాన్
- టీ20 వరల్డ్‌కప్ జట్టు ఎంపిక నేడు



న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో తలపడే భారత జట్టును నేడో.. రేపో ప్రకటించబోతున్నారు. ఈ జాబితాలో వికెట్ కీపర్‌గా తొలి ప్రాధాన్యం సంజూ శాంసన్‌కే దక్కనుందని సమాచారం. మరోవైపు ఈ స్థానం కోసం రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్ కూడా పోటీలో ఉన్నారు. అయితే రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా ఉన్న శాంసన్ చక్కటి ఫామ్‌లో ఉన్నాడు. తాజా సీజన్‌లో ఇప్పటిదాకా 161.08 స్ట్రయిక్ రేట్‌తో 385 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు అర్ధసెంచరీలున్నాయి. పంత్ సైతం ఫామ్ కనబరుస్తున్నా అతన్ని రిజర్వ్ కీపర్‌గా ఎంపిక చేయనున్నారు. కేవలం ఐపీఎల్ ఫామ్‌నే కాకుండా ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని బోర్డు అధికారి తెలిపాడు. యువ పేసర్ మయాంక్ యాదవ్ బౌలింగ్ వేగం సెలెక్టర్లను ఆకట్టుకున్నా అతడు గాయంతో బాధపడుతుండడంతో బెర్త్ దక్కడం కష్టమే. ఇక టాప్-4లో రోహిత్, యశస్వి జైస్వాల్, కోహ్లీ, సూర్యకుమార్ ఎంపిక దాదాపు ఖాయమే. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు శివమ్ దూబే, రింకూ సింగ్‌ల నుంచి గట్టి పోటీనే ఎదురవుతోంది. పైగా పాండ్యా పూర్తి స్థాయిలో బౌలింగ్ చేయలేకపోతున్నాడు. జడేజా, కుల్దీప్ స్పిన్నర్ల పాత్ర పోషించనుండగా, పేసర్లుగా బుమ్రా, అర్ష్‌దీప్‌లతో పాటు మూడో స్థానం కోసం అవేశ్, సిరాజ్‌ల మధ్య పోటీ నెలకొంది.

చాంపియన్స్ ట్రోఫీ వేదికలు

కరాచీ, లాహోర్, రావల్పిండి

లాహోర్: వచ్చే ఏడాది స్వదేశంలో జరగనున్న చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) కోసం కరాచీ, లాహోర్, రావల్పిండిని వేదికలుగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఖరారు చేసింది. అయితే ఇందులో టీమిండియా పాల్గొనే విషయమై ఎటువంటి స్పష్టతా రాలేదు. కానీ, భారత ప్రభుత్వం పాకిస్థాన్ వెళ్లేందుకు అనుమతించకపోతే.. హైబ్రిడ్ విధానంలో తటస్థ వేదికలో టీమిండియా మ్యాచ్‌లు నిర్వహించాలని ఐసీసీ భావిస్తున్నట్టు సమాచారం. అయితే, టోర్నీ మొత్తం తమ దేశంలోనే నిర్వహించాలని పాక్ క్రికెట్ బోర్డు పట్టుబడుతోంది.

రచిన్, హెన్రీకి చోటు

విలియమ్సన్‌కు సారథ్యం
టీ20 వరల్డ్‌కప్‌నకు కివీస్ జట్టు



ఆక్లాండ్: కేన్ విలియమ్సన్ సారథ్యంలోని 15 మంది సభ్యుల న్యూజిలాండ్ టీ20 వరల్డ్‌కప్ జట్టును సోమవారం ప్రకటించారు. రచిన్ రవీంద్ర, పేసర్ మ్యాట్ హెన్రీకి తొలిసారి పొట్టికప్ టీమ్‌లో చోటు దక్కింది. మెగా ఈవెంట్‌లో కివీస్ జట్టుకు విలియమ్సన్ నాలుగోసారి నాయకత్వం వహించనున్నాడు. గాయం కారణంగా ఐపీఎల్‌కు దూరమైన డెవాన్ కాన్వేకు కూడా టీమ్‌లో స్థానం లభించింది. అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న టీ20 వరల్డ్ కప్ జూన్‌లో జరగనుంది.

న్యూజిలాండ్ జట్టు: విలియమ్సన్ (కెప్టెన్), అలెన్, బౌల్ట్, బ్రేస్‌వెల్, చాప్‌మన్, కాన్వే, ఫెర్గూసన్, హెన్రీ, మిచెల్, నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, శాంట్నర్, సోథీ, టిమ్ సౌథీ, బెన్ సీర్స్ (ట్రావెల్ రిజర్వ్).

కోల్‌కతా అవలీలగా..

- ఫిల్ సాల్ట్ మెరుపు అర్ధ శతకం
- 7 వికెట్లతో ఢిల్లీ చిత్తు
- వరుణ్‌కు మూడు వికెట్లు



ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 68)



వరుణ్ చక్రవర్తి (4-0-16-3)

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో చివరి ఆరు మ్యాచ్‌ల్లోనూ 200కు పైగా స్కోర్లు నమోదు కాగా.. ఢిల్లీ క్యాపిటల్స్ చేసింది కేవలం 153 పరుగులే. దీంతో ఈ సునాయాస లక్ష్యాన్ని కోల్‌కతా నైట్‌రైడర్స్ అవలీలగా ఛేదించింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 68) తుఫాన్ ఇన్నింగ్స్‌తో పవర్‌ప్లేలోనే సగానికి పైగా రన్స్ అందించాడు. ఫలితంగా సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ ఏడు వికెట్లతో ఘనవిజయం సాధించింది. దీంతో 12 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచిన కోల్‌కతా ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత మెరుగుపర్చుకుంది. ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 153 పరుగులు చేసింది. కుల్దీప్ యాదవ్ (26 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 35 నాటౌట్), పంత్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 27) మాత్రమే రాణించారు. వరుణ్ చక్రవర్తికి మూడు.. హర్షిత్, వైభవ్ అరోరాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ ఛేదనలో కోల్‌కతా 16.3 ఓవర్లలో 3 వికెట్లకు 157 పరుగులు చేసి గెలిచింది. శ్రేయాస్ (23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 33 నాటౌట్), వెంకటేశ్ అయ్యర్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 26 నాటౌట్) ఆకట్టుకున్నారు. అక్షర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వరుణ్ చక్రవర్తి నిలిచాడు.

సాల్ట్ జోరు: కోల్‌కతా ఓపెనర్ సాల్ట్ ఎప్పటిలాగే తన ధాటిని కొనసాగిస్తూ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌నే సంచలన రీతిలో ఆరంభించాడు. విలియమ్స్ వేసిన ఈ ఓవర్‌లో అతడు 4,6,4,4తో 23 రన్స్ రాబట్టడంతో ఢిల్లీ ఓటమి ఖాయమనిపించింది. రెండో ఓవర్‌లోనే సాల్ట్ అవుటవ్వాల్సి ఉన్నా మిడాన్‌లో విలియమ్స్ క్యాచ్ వదిలేశాడు. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ మూడో ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లు బాదిన సాల్ట్.. ఆరో ఓవర్‌లో 4,6,4,4తో 26 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. ఈ బాదుడుకు కేకేఆర్ పవర్‌ప్లేలో 79 పరుగులతో నిలిచింది. అనంతరం వరుస ఓవర్లలో స్పిన్నర్ అక్షర్ పటేల్.. నరైన్ (15), సాల్ట్‌ల వికెట్లు తీయగా, వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన రింకూ సింగ్ (11) కూడా త్వరగానే నిష్క్రమించాడు. పదో ఓవర్‌లో విలియమ్స్ అతడి వికెట్ తీశాడు. కానీ అప్పటికే పటిష్ఠ స్థితిలో ఉన్న కోల్‌కతాకు కెప్టెన్ శ్రేయాస్, వెంకటేశ్ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడి 16.3 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

బౌలర్లదే హవా: భారీ ఛేదనను ప్రత్యర్థి ముందు ఉంచాలన్న లక్ష్యంతో టాస్ గెలవగానే ఢిల్లీ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ బరిలోకి దిగాక కోల్‌కతా బౌలర్లను ఎదుర్కోవడంలో బ్యాటర్లు దారుణంగా తడబడ్డారు. ఒక్కరు కూడా నిలకడగా ఆడలేక, వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయారు. కానీ టెయిలెండర్ కుల్దీప్ మాత్రం చివర్లో జట్టు పరువు కాపాడే ఇన్నింగ్స్ ఆడాడు. పేసర్ వైభవ్ అరోరా ఆరంభంలోనే రెండు వికెట్లతో దెబ్బతీయగా.. మధ్య ఓవర్లలో స్పిన్నర్ వరుణ్ ప్రభావం చూపాడు. దీంతో ఓ దశలో 150 పరుగులు కూడా కష్టంగానే అనిపించింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ పృథ్వీ షా (13) మూడు ఫోర్లతో ఆహా.. అనిపించినా అరోరా తన వరుస ఓవర్లలో షా, హోప్ (6) వికెట్లను తీశాడు. ఇక 6,4తో జోరు చూపిన హిట్టర్ ఫ్రేజర్ (12)కు స్టార్క్ షాకిచ్చాడు. ఈ దశలో అభిషేక్ పోరెల్ (18) 4,6,4తో 16 రన్స్ సాధించడంతో పవర్‌ప్లేలో ఢిల్లీ 67/3తో ఫర్వాలేదనిపించింది. అప్పటికి రన్‌రేట్ బాగానే ఉన్నా వికెట్లు కాపాడుకోవడంలో విఫలమైంది. పోరెల్-పంత్ నాలుగో వికెట్‌కు అందించిన 31 పరుగులే అత్యధికం. వరుసగా పోరెల్, పంత్, స్టబ్స్ (4), అక్షర్ (15), కుశాగ్ర (1) ఇలా వచ్చి అలా వెళ్లడంతో 111/8 స్కోరుతో డీసీ పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే కుల్దీప్ మాత్రం బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ 16వ ఓవర్‌లో 6,4తో 16 రన్స్ అందించాడు. అలాగే రసిక్ (6)తో తొమ్మిదో వికెట్‌కు 29 పరుగులు అందించడంతో పాటు, ఆఖరి బంతి వరకు మ్యాచ్ తీసుకెళ్లి జట్టు స్కోరును 150 దాటించాడు.

1 పవర్‌ప్లేలో ఎక్కువ పరుగులు (60) సాధించిన కోల్‌కతా బ్యాటర్‌గా సాల్ట్

3 ఈసీజన్‌లో పవర్‌ప్లేలో ఎక్కువ సిక్సర్లు (15) బాదిన మూడో బ్యాటర్‌గా సాల్ట్. అభిషేక్ (19), హెడ్, ఫ్రేజర్ (16) ముందున్నారు.

స్కోరుబోర్డు

ఢిల్లీ: పృథ్వీ షా (సి) సాల్ట్ (బి) వైభవ్ 13, ఫ్రేజర్ (సి) వెంకటేశ్ (బి) స్టార్క్ 12, అభిషేక్ (బి) హర్షిత్ 18, హోప్ (బి) వైభవ్ 6, పంత్ (సి) శ్రేయాస్ (బి) వరుణ్ 27, అక్షర్ (బి) నరైన్ 15, స్టబ్స్ (సి) సాల్ట్ (బి) వరుణ్ 4, కుశాగ్ర (సి) సాల్ట్ (బి) వరుణ్ 1, కుల్దీప్ (నాటౌట్) 35, రసిక్ (సి) శ్రేయాస్ (బి) హర్షిత్ 8, విలియమ్స్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 153/9; వికెట్లపతనం: 1-17, 2-30, 3-37, 4-68, 5-93, 6-99, 7-101, 8-111, 9-140; బౌలింగ్: స్టార్క్ 3-0-43-1, వైభవ్ అరోరా 4-0-29-2, హర్షిత్ రాణా 4-0-28-2, సునీల్ నరైన్ 4-0-24-1, వరుణ్ చక్రవర్తి 4-0-16-3, రస్సెల్ 1-0-10-0.

కోల్‌కతా: సాల్ట్ (బి) అక్షర్ 68, నరైన్ (సి) ఫ్రేజర్ (బి) అక్షర్ 15, రింకూసింగ్ (సి) కుల్దీప్ (బి) విలియమ్స్ 11, శ్రేయాస్ (నాటౌట్) 33, వెంకటేశ్ (నాటౌట్) 26, ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 16.3 ఓవర్లలో 157/3; వికెట్ల పతనం: 1-79, 2-96, 3-100; బౌలింగ్: లిజాడ్ విలియమ్స్ 3-0-38-1, ఖలీల్ అహ్మద్ 3-0-28-0, రసిక్ సలామ్ 2.3-0-30-0, అక్షర్ పటేల్ 4-0-25-2, కుల్దీప్ యాదవ్ 4-0-34-0.

పాయింట్ల పట్టిక


జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	9	8	1	0	16	0.694
కోల్‌కతా	9	6	3	0	12	1.096
చెన్నై	9	5	4	0	10	0.810
హైదరాబాద్	9	5	4	0	10	0.075
లఖ్‌నవూ	9	5	4	0	10	0.059
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
గుజరాత్	10	4	6	0	8	-1.113
పంజాబ్	9	3	6	0	6	-0.187
ముంబై	9	3	6	0	6	-0.261
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్





నిలిచిపోయిన జేజేఎం పైపులైన్ పనులు



నీరుగార్చారు..!

వైసీపీ ప్రభుత్వం వల్లే జిల్లాలో నీటి ఎద్దడి

- టీడీపీ హయాంలో రూ.1,000 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులు
- పనులు పురోగతిలో ఉండగా నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం
- వాటర్ మిషన్ పేరుతో కొద్దిరోజులు హడావిడి
- ఆ తర్వాత తెరపైకి కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ మిషన్
- కేంద్రం నిధులు విడుదల, రాష్ట్రం నుంచి రూపాయి వస్తే ఒట్టు
- ఈ పనులకు కూడా అర్ధంతరంగా బ్రేక్
- ఐదేళ్లుగా ఉమ్మడి కృష్ణాలో తీవ్ర తాగునీటి సమస్య

ప్రజలకు ఉపయోగపడే ఏ ప్రతిష్ఠాత్మక పథకాన్నైనా.. అది ఏ ప్రభుత్వ ఆలోచన అయినా.. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తప్పనిసరిగా కొనసాగిస్తుంది. కానీ, కేవలం టీడీపీపై ద్వేషం, పగతో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ప్రజాపయోగ పథకాలెన్నింటినో రద్దు చేసింది. అందులో ముఖ్యమైనదే రూ.1,000 కోట్ల అంచనాతో కృష్ణాజిల్లా పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఇంటింటికీ రక్షిత మంచినీటి పథకం. టీడీపీ హయాంలో శరవేగంగా ప్రారంభమైన ఈ వాటర్ గ్రిడ్ పనులను వైసీపీ వచ్చి అర్ధంతరంగా రద్దు చేసింది. దాని స్థానే.. కేంద్ర ప్రాయోజిత పథకం జల్ జీవన్ మిషన్ (జేజేఎం) ద్వారా వాటర్ మిషన్ ప్రాజెక్టును తెరపైకి తెచ్చిన వైసీపీ చివరికి ఆ పనులనూ పూర్తిచేయకుండా మధ్యలోనే వదిలేసింది. ఫలితంగా కృష్ణానది చెంతనే ఉన్నా వేసవిలో జిల్లావాసులు తీవ్ర మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

టీడీపీ హయాంలో..

• రూ.1,000 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులు

గ్రామీణ ప్రాంతాలకు రక్షిత మంచినీటిని అందించటానికి కిందటి టీడీపీ ప్రభుత్వం వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. కృష్ణాజిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. మొత్తం 970 పంచాయతీల్లో తలసరి మంచినీటి సరఫరాను 40 నుంచి 70 శాతానికి తీసుకెళ్లాలనుకుంది. మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న 2,484 రూరల్ ప్రాంతాలను గుర్తించింది. నూరుశాతం కనెక్షన్లు ఇవ్వాలని సూచించింది. మొత్తంగా వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించి రూ.994.26 కోట్లతో పిలిచిన టెండర్లను మేఘా సంస్థ కాంట్రాక్టును దక్కించుకుంది. 2019 ఎన్నికలకు ముందే ఈ పనులు ప్రారంభమయ్యాయి. విజయవాడ నగరం మినహా 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమాంతరంగా పనులు ప్రారంభమయ్యాయి. ఎంచుకున్న గ్రామాల్లో పైపులైన్లు, కుళాయి కనెక్షన్ల పనులు చేపట్టారు.

వైసీపీ వచ్చాక..

• రూ.1,000 కోట్ల పనులు ఆపేశారు

ఎన్నికల జరిగి, అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులన్నింటికీ బ్రేక్ వేసింది. గత ప్రభుత్వ పథకాన్ని అర్ధంతరంగా రద్దు చేసింది. 20 శాతం పనులు కూడా పూర్తి కాలేదన్న పేరుతో కాంట్రాక్టును రద్దు చేసింది. దీనిపై గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. నాలుక్కరుచుకున్న వైసీపీ ప్రభుత్వం కొత్త ఎత్తుగడ వేసింది. వాటర్ మిషన్ పేరుతో సమీక్ష చేపట్టింది. గత ప్రభుత్వ పథకాన్ని విస్తరిస్తామని చెప్పింది. మున్సిపాలిటీలు, పారిశ్రామిక అవసరాలను తీర్చటానికి వీలుగా సమగ్ర నివేదిక అందజేయాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ను కోరింది. ఉమ్మడి కృష్ణాజిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేయనున్నట్టు ప్రకటించింది. అయితే, ఒక్క ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే రూ.1,000 కోట్లతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. దీనిని దాదాపుగా రెండేళ్ల పాటు తొక్కిపెట్టారు.

జేజేఎం పనులకూ మంగళం

కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పేరుతో కేంద్ర ప్రాయోజిత పథకానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేయాలనే లక్ష్యంతో కేంద్రం భారీగా నిధులు కేటాయించింది. జిల్లాలవారీగా డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తే, అందులో సగం మొత్తాన్ని కేంద్రమే భరిస్తుంది. మిగిలిన సగం రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ వేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా గతంలో వాటర్ మిషన్‌కు తయారు చేయించిన డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్ర ప్రభుత్వం ఆ డీపీఆర్‌ను ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తొలి దశలో రూ.741 కోట్లతో జేజేఎం పనులు చేపట్టేందుకు ఎన్టీఆర్ జిల్లాకు అనుమతి ఇచ్చింది. టెండర్లకు అనూహ్య స్పందన వచ్చింది. కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయడంతో రూ.121 కోట్ల పనులు ప్రారంభమయ్యాయి. వీటి వరకు పనులు పురోగతిలో ఉన్నాయి. అయితే, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ జమకాకపోవటంతో కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదు. ఆ ప్రభావం రెండో దశ పనులపై పడింది. రూ.117 కోట్లకు సంబంధించి టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు ముందుకొచ్చినా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ రాకపోవడంతో పనులు చేయడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. రూ.100 కోట్ల మూడో దశ పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు టెండర్లు పిలిచారు. ఈ టెండర్లకు కాంట్రాక్టర్ల నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. వరుసగా ఐదుసార్లు టెండర్లు పిలిచినా స్పందనా రాకపోవటంతో అధికారులు విన్నకుండిపోయారు. దీంతో జేజేఎం పనులు నిలిచిపోయాయి.

బ్యాంకులా..

బాబోయ్..!

మళ్లీ మొదలైన పెన్షన్ టెన్షన్

- సచివాలయాల్లో కానీ, ఇంటింటికీ వచ్చి కానీ ఇవ్వాలంటున్న పెన్షనర్లు
- ఎండల్లో బ్యాంకుల చుట్టూ తిరగలేమని ఆవేదన
- క్యూల్లో నిలబడలేం.. ఫాంలు పూర్తిచేయలేమని విజ్ఞప్తి
- జిల్లావ్యాప్తంగా పెన్షన్లలో 70 శాతం పైబడి వృద్ధులే


విజయవాడ, ఆంధ్రజ్యోతి : పెన్షన్ తలనొప్పి మళ్లీ మొదలైంది. జిల్లావ్యాప్తంగా డీబీటీ విధానంలో పెన్షన్ పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తుండటం పింఛన్‌దారుల్లో ఆందోళన కలిగిస్తోంది. డీబీటీ విధానం అంటే అందరూ బ్యాంకులకు వెళ్లాల్సి ఉంటుంది. పెన్షన్లు ఇవ్వటానికే బ్యాంకులు పనిచేయవు. అదనపు సిబ్బంది ఉండరు. ఈ విధానం వల్ల బ్యాంకుల్లో గంటల తరబడి పడిగాపులు పడాల్సి ఉంటుందని వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. మండుటెండల్లో వృద్ధులు బ్యాంకులకు వెళ్లగలరా?, వెళ్లినా క్యూల్లో నిలబడగలరా?, డబ్బు తీసుకునే విత్‌డ్రా ఫాంలను పూర్తిచేయగలరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సచివాలయాలే బెటరా..?

గ్రామాల్లోని సచివాలయాల్లో పెన్షన్లు తీసుకోవాలంటేనే అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. గతనెల పెన్షన్ తీసుకోవటానికి మూడు రోజుల సమయం కూడా పట్టింది. మండలంలో ఒకేఒక బ్యాంకు శాఖ ఉంటుంది. అంటే ఆయా గ్రామాల, వార్డుల్లోని పెన్షన్‌దారులంతా ఆ బ్యాంకు దగ్గరకే వెళ్లడం వల్ల రద్దీ పెరుగుతుంది. వందల సంఖ్యలో వచ్చే వృద్ధులకు బ్యాంకులు తగిన ఏర్పాట్లు చేసే పరిస్థితి లేదు. భారీ ఎండల్లో వృద్ధులకు ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిదనే వాదన వినిపిస్తోంది. బ్యాంకుల్లో కంటే సచివాలయాల్లో తీసుకోవడమే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుత ఎండలను దృష్టిలో పెట్టుకుని ఇంటివద్దే పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

సగం పెన్షన్లు వృద్ధులవే..

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తం 2,36,041 మంది పెన్షనర్లు ఉన్నారు. మొత్తంగా 17 రకాల పెన్షన్లు అందుకునేవారు ఉన్నారు. వీరందరికీ నెలకు రూ.65.55 కోట్ల మేర చెల్లించాల్సి ఉంటుంది. వీటిలో వృద్ధాప్య పెన్షన్లే అగ్రభాగాన ఉన్నాయి. మొత్తం జిల్లావ్యాప్తంగా 1,14,254 మందికి వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాల్సి ఉంది. వీరిలో దాదాపు 60 శాతానికిపైగా 70 ఏళ్ల పైబడినవారే. వీరంతా ఎండల్లో బయటకు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరమైన అంశమే. 80 ఏళ్ల దాటి కదల్లేని స్థితిలో ఉన్నవారు 10 శాతం వరకు ఉంటారు. వీరంతా బ్యాంకులకు వెళ్లి డబ్బు తెచ్చుకోవడం కష్టమే. మందుల కోసం, ఇతర అవసరాల కోసం ఠంచనుగా పెన్షన్ తీసుకోవాలంటే బ్యాంకుల చుట్టూ తిరగక తప్పని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా 26,834 మంది దివ్యాంగ పింఛన్‌దారులు ఉన్నారు. వీరు ఇళ్ల నుంచి కదలటం కష్టమే. ఇక వితంతు పెన్షన్‌దారులు 68,464 మంది ఉన్నారు. వీరిలో కూడా చాలామంది అనారోగ్యంతో బాధపడుతూనే ఉన్నారు. చేనేత, ట్రాన్స్‌జెండర్లు, కల్లుగీత కార్మికులు, సైనిక్ వెల్ఫేర్ పెన్షనర్లు, కళాకారులు, డప్పు కళాకారులు.. వీరందరికీ బ్యాంకుల ద్వారానే పెన్షన్లు ఇస్తామంటున్నారు. వీరు కూడా బ్యాంకుల దగ్గర పడిగాపులు పడలేమని, ఇంటి వద్దే ఇవ్వాలని కోరుతున్నారు.



జంపింగ్ జపాంగ్

నిన్నటి వరకు తిట్టి.. నేడు ప్రచారానికా..

వైసీపీలోకి వచ్చిన వలస నేతలకు సీన్ రివర్స్

కుడితిలో పడ్డ ఎలకల్లా తయారైంది వైసీపీలోకి వలస వచ్చిన కొత్త నాయకుల పరిస్థితి. సొంత పార్టీలో ఇమడలేక ఎన్నికల ముందు వైసీపీలో చేరిన జంపింగ్ జంపాంగ్‌లకు ఇప్పుడు కొత్త సమస్య ఎదురైంది. నిన్నటివరకు జగన్‌ను తిట్టిపోసిన నాయకులు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని డివిజన్‌లో ప్రచారం చేస్తారని కొందరు నాయకులు ముఖం మీదే 'దయచేసి రావొద్దని' చెప్పేస్తున్నారు. చేసేదేమీ లేని కొంతమంది వలస నాయకులు సొంతంగా ప్రచారం నిర్వహించుకోవడమో, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడమో చేస్తుండగా, మరికొంతమంది మనకెందుకులే అని ఇళ్లకే పరిమితమవుతున్నారు.

- ప్రచారాలకు రావొద్దని తెగేసి చెబుతున్న పాత నేతలు
- చేసేదేం లేక ఇళ్లకే పరిమితమవుతున్న వలస నేతలు
- ఖాళీగా ఉండలేని కొందరు.. కేడర్‌తో సమావేశాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో జనసేన, టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి కొంతమంది అసంతృప్తులు వైసీపీలో చేరారు. విజయవాడ ఎంపీ కేశినేని నానితో పాటే ఆయన అనుచరులు కొందరు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. జనసేన పార్టీ నగర అధ్యక్షుడిగా ఉన్న పోతిన వెంకట మహేశ్ పశ్చిమ సీటు కోసం విశ్వప్రయత్నాలు చేసి చివరికి వైసీపీలో చేరారు. అలాగే, 'తూర్పు'లో కొంతమంది నేతలను వైసీపీ అధిష్ఠానం పిలిపించుకుని దేవినేని అవినాశ్‌కు పనిచేయాలని చెప్పింది. పార్టీ అధికారంలోకి వచ్చాక సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చింది. కానీ, వీరు ఇప్పుడు ఎటూ కదలడం లేదు. ఎవరి పనులు వారే చేసుకుంటుకున్నారు. ఇక పశ్చిమ, సెంట్రల్ నుంచి వైసీపీలో చేరిన నేతలకు క్షేత్రస్థాయిలో విచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి.

సీన్ రివర్స్

గతంలో వైసీపీ అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలను వారంతా వ్యతిరేకించారు. ప్రభుత్వంపైన, సీఎం జగన్‌పైన విమర్శలు చేస్తూ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. రాజకీయ పరిణామాలు మారాక వైసీపీ కండువాలు కప్పుకొని కొత్త అవతారమెత్తారు. ఇప్పుడు ఈ నేతలంతా వైసీపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయడానికి సిద్ధమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో తమకు పట్టు ఉందని నిరూపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిగడప తొక్కాలనుకున్నారు. దీనిని డివిజన్ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు వ్యతిరేకిస్తున్నారు. తమ డివిజన్లలో ప్రచారం చేయొద్దని, అసలు ప్రచారానికే రావొద్దని స్పష్టం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం వరకు వైసీపీ, జగన్, ప్రభుత్వంపై దారుణంగా విమర్శలు చేసిన ఈ నేతలంతా ప్రచారం చేస్తే అసలుకే ఎసరు వస్తుందన్న భావనలో డివిజన్ కమిటీలు ఉన్నాయి. తాము ప్రచారానికి వస్తున్నామని డివిజన్ కమిటీలకు వారు సమాచారం పంపగానే.. 'దయచేసి వద్దు' అనే సమాధానం వెళ్తోంది. ఈ పరిణామాలను జీర్ణించుకోలేక వలస నేతలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మరికొంతమంది తమ ఇళ్లకు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో మమ.. అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారు. పార్టీలో చేరిన ఆరంభంలోనే ఇలాంటి పరిస్థితులు ఎదురైతే ముందు ముందు ఎలాంటి పరిణామాలను చూడాల్సి వస్తుందోనని కొత్త నేతలు కలవరపడుతున్నారు.

సమావేశాలతో సరి

వలస నేతలకు క్షేత్రస్థాయిలో వైసీపీ డివిజన్ కమిటీల నుంచి నిస్సహాయత ఎదురవడంతో పార్టీలో తమ ముద్ర వేయించుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. స్థానిక నేతల సహాయం లేకుండా ప్రచారం చేస్తే వివాదాలు ముసురుకుంటాయని భావిస్తున్నారు. దీంతో కొత్త నేతలు సొంత ప్రణాళికలను అమలు చేసుకోవాల్సి వస్తోంది. అధికార పార్టీ అభ్యర్థుల తరఫున తామూ ప్రచారం చేశామని చెప్పుకోవడం కోసం సొంతంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు, అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తాము పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం చేశామని అధినాయకులకు చూపించుకుంటున్నారు. కొత్తగా పార్టీలో చేరిన నేతలకు ఇప్పటికే ఉన్న నేతలు సహకరించకపోవడంతో గ్రూపులు ఏర్పడుతున్నాయి. కష్టమంతా తమదంటే, తమదంటూ చెప్పుకోవడానికి గ్రూపులవారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లి..

గ్రామీణ ప్రాంతాల్లో భిన్న వాతావరణం కనిపిస్తోంది. ఉదయం వరకు ఒక పార్టీ కండువాను కప్పుకొన్న నేతలు సాయంత్రానికి కొత్త కండువా వేసేసుకుంటున్నారు. జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వ్యక్తి మూడు రోజుల్లో మూడు పార్టీలు మారాడు. కరిసే మధు అనే వ్యక్తి జైభీమ్‌రావు భారత్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశాడు. రిటర్నింగ్ అధికారి ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. ఆ మర్నాడు ఆయన టీడీపీ కండువా కప్పుకొన్నాడు. సోమవారం ఉదయం వరకు మధు మెడలో టీడీపీ కండువా కనిపించింది. సాయంత్రానికి అది కూడా మారిపోయింది. వెంటనే వైసీపీలో చేరి ఫొటోలకు పోజులిచ్చాడు.

డివైడర్‌ను ఢీకొని ఇద్దరు మృతి

- మృతులిద్దరూ బావ బావమరిది
- కృష్ణలంక స్క్యూబ్రిడ్జి వద్ద ఘటన

వన్‌టౌన్, ఏప్రిల్ 29 : కృష్ణలంక స్క్యూబ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మహానాడు 17వ రోడ్డులో ఉంటున్న బేగ్ రఫీ (21) సుమారు 14 నెలల క్రితం అశోక్‌నగర్‌కు చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. రఫీ, అతని బావమరిది ఇర్ఫాన్ (17) డెకొరేషన్ పనులు చేస్తుంటారు. ఆదివారం సాయంత్రం ఇర్ఫాన్ తన బైకుపై అశోక్‌నగర్ నుంచి మహానాడులో జరిగిన ఓ కార్యక్రమానికి వెళ్లాడు. ఆ తర్వాత తన బావ రఫీను తీసుకుని ఇర్ఫాన్ అశోక్‌నగర్ బయల్దేరాడు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో స్క్యూబ్రిడ్జి వద్దకు వచ్చేసరికి రఫీ నడుపుతున్న బైక్ అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రఫీ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. గాయపడిన ఇర్ఫాన్‌ను చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కన్నుమూశాడు. సమాచారం తెలుసుకున్న కృష్ణలంక పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి వివరాలకు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

చివరికి ఎవరు?

- నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మిగిలింది వీరే..
- విజయవాడ పార్లమెంట్‌కు 17, ఎన్టీఆర్‌లో మూడు అసెంబ్లీలకు 44 మంది

విజయవాడ, ఆంధ్రజ్యోతి : సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల వివరాల లెక్కతేలింది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం టీడీపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల తరఫున పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. కృష్ణాజిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 79 మంది అభ్యర్థులు, మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఇక ఎన్టీఆర్ జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాలకు 44 మంది అభ్యర్థులు, విజయవాడ పార్లమెంట్ స్థానానికి 17 మంది బరిలో నిలిచారు. కాగా, ఎన్టీఆర్ జిల్లా మిగిలిన నాలుగు నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థుల వివరాలను మంగళవారం ప్రకటించనున్నారు.

తప్పు ఎవరిది..?

ఆది నుంచి వివాదాస్పదంగా గుడివాడ ఆర్‌డీవో

- ఎమ్మెల్యే కొడాలి నాని నామినేషన్ ఆమోదంలోనూ అంతే
- మొదటి నుంచి వైసీపీకి అనుకూలమేనంటున్న ప్రతిపక్షాలు

గుడివాడ ఆర్‌డీవో, ఆర్వో పి.పద్మావతి తీరు వివాదాస్పదంగా మారింది. ఎమ్మెల్యే కొడాలి నాని సమర్పించిన నామినేషన్ పత్రంలో తప్పులున్నా.. టీడీపీ నాయకులు ఆధారాలతో సహా వాటిని నిరూపించినా ఆమె వ్యవహరించిన తీరు అధికార పార్టీకి అనుకూలంగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందడంతో స్పందించిన ఆర్వో నామమాత్రంగా నోటీసులు పంపడం, కొడాలి నాని తప్పు ఒప్పుకొన్నా చర్యలు తీసుకోకపోవడం వెనుక రహస్యమేమిటనే ఆరోపణలు వస్తున్నాయి.



కొడాలి నామినేషన్ స్వీకరిస్తున్న ఆర్‌డీవో పద్మావతి (ఫైల్)

గుడివాడ : కొడాలి నాని మంత్రిగా పనిచేసిన సమయంలో పౌరసరఫరాల శాఖ పాత మున్సిపల్ కార్యాలయాన్ని తన క్యాంపు కార్యాలయంగా అద్దె ప్రాతిపదికన తీసుకున్నారు. 2022, నవంబరు 30 నాటికి పౌరసరఫరాల శాఖ ఒప్పందం ముగిసింది. ఆ తరువాత కొడాలి నాని సదరు భవనాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంగా మార్చుకునేందుకు గుడివాడ మున్సిపాలిటీకి అర్జీ పెట్టుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే వరకు ఆ భవనం నాని ఆధీనంలోనే ఉంది. 2024, మార్చి 17వ తేదీన సదరు భవనాన్ని నాని నుంచి స్వాధీనం చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం ఆర్‌డీవో, రిటర్నింగ్ అధికారి పి.పద్మావతికి పత్రాలను సమర్పించారు.


నామినేషన్ పత్రాల్లో తప్పుడు సమాచారం

కొడాలి నాని తన నామినేషన్ పత్రాల్లో ఎటువంటి ప్రభుత్వ వసతిని వినియోగించుకోలేదని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ, అది తప్పుడు సమాచారమని రిటర్నింగ్ అధికారికి ముందే తెలుసు. స్క్రూటినీ సమయంలో టీడీపీ నాయకుల నుంచి ఫిర్యాదు వచ్చినా స్వీకరించకుండా, నామినేషన్‌కు ఆమోదం తెలపాలని ముందే ఆర్వో సిద్ధమయ్యారు. అభ్యంతరాలున్నాయా అని కూడా అడగకుండా ఆమోదం తెలిపారు. అభ్యంతరం తెలిపేందుకు లేచి నిలబడిన టీడీపీ నాయకులను పట్టించుకోలేదు. అంతేకాదు.. వారిపై తీవ్రస్థాయిలో చిందులు తొక్కారు. ఈ విషయంపై టీడీపీ నాయకులు జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించి నామమాత్రంగా నోటీసులు జారీ చేశారు. స్పందించిన కొడాలి నాని తాను పాత మున్సిపల్ కార్యాలయాన్ని వినియోగించుకున్నట్లు ఒప్పుకొంటూ అద్దె బకాయిలను చెల్లించినట్లు ఎన్‌వోసీని ఆర్వోకు సమర్పించారు. మళ్లీ నోటీసుకు జవాబుగా ప్రభుత్వ భవనాన్ని కార్యాలయంగా వినియోగించుకున్నానని చెబుతూ పత్రాలను సమర్పించారు. కాగా, వైసీపీ అభ్యర్థి కొడాలి నాని నామినేషన్‌ను ఏకపక్షంగా ఆమోదం తెలపడం అనుమానాలకు తావిస్తోంది. చేతిలో అధికారం ఉందనే ఆర్వో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కావాలనే ఎన్నికల కమిషన్ నిబంధనలు తుంగలో తొక్కారనే ఆరోపణలు వస్తున్నాయి.

వైసీపీ మునుగుతున్న నావ!

- కూటమి అభ్యర్థుల విజయం ఖాయం
- కొనకళ్ల నారాయణ, రవీంద్ర ధీమా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 29 : వైసీపీ పడవ మునిగిపోతోంది.. కృష్ణాజిల్లాలో ఉమ్మడి అభ్యర్థులందరూ అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారు.. అని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. మచిలీపట్నం 8వ డివిజన్ లక్ష్మణరావుపురంలో వైసీపీకి చెందిన సంకుల శ్రీనివాస్ బృందం ఆదివారం పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. తొలుత గజమాలలతో కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ, బండి రామకృష్ణలకు టీడీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పేర్ని నానిపై సంకుల శ్రీనివాస్ బృందం తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన కార్యకర్తలను టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యకర్తలతో కొల్లు రవీంద్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలో టీడీపీ, జనసేన అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారన్నారు. అన్ని నియోజకవర్గాల్లోని ప్రజలు కూటమి అభ్యర్థులను ఆదరిస్తున్నారన్నారని, స్వచ్ఛందంగా ర్యాలీలో ఎండను సైతం లెక్క చేయకుండా పాల్గొంటున్నారని చెప్పారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఎన్నికల నాటికి వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని వేధింపులకు విసిగిపోయిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ, జనసేనలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బండి రామకృష్ణ, బూరగడ్డ వేదవ్యాస్, కొనకళ్ల బుల్లయ్య, గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆదర్శనగర్‌లో, గాయిత్రీ కళ్యాణ మంటపంలో రోల్డుగోల్డు కార్మికులు పెద్ద సంఖ్యలో ఉమ్మడి అభ్యర్థులకు మద్దతు తెలిపి టీడీపీలో చేరారు.



సంకుల నాని బృందంతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కొనకళ్ల, రవీంద్ర, రామకృష్ణ



అవనిగడ్డలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు

రాజీనామా రాజకీయం!

- వలంటీర్లపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న ఐప్యాక్, అధికారపార్టీ నేతలు?
- వైసీపీ సేవలో తరించే కొందరి సంతకాలతో మూకుమ్మడి డ్రామా
- సామాజిక మాధ్యమాల్లో ముమ్మరంగా ప్రచారం
- సేవ చేసేందుకు వస్తే రాజకీయం చేస్తున్నారని వలంటీర్ల ఆవేదన

అవనిగడ్డ, ఏప్రిల్ 29 : నియోజకవర్గంలో గడిచిన మూడు రోజులుగా వలంటీర్ల రాజీనామా డ్రామాలు కొనసాగుతున్నాయి. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఈసీ ఆదేశాలతో.. వారిని ఎలాగైనా ఉపయోగించుకోవాలన్న ఆలోచనతో అధికార వైసీపీ నేతలు గ్రామాలవారీగా వలంటీర్లపై రాజీనామా ఒత్తిడి తెస్తున్నారు. పార్టీకి అనుకూలంగా ఉండే నలుగురైదురు వలంటీర్ల ద్వారా దొంగ సంతకాలు పెట్టి మూకుమ్మడి రాజీనామాలు అంటూ సామాజిక మాధ్యమాల్లో, వాట్సాప్ గ్రూపుల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందని, రాజీనామాలు చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని, చేయని వారిని పక్కన పెడతామని ద్వితీయ స్థాయి శ్రేణులు బెదిరించటంతో పలువురు వలంటీర్లు రాజీనామా డ్రామాలో పాత్రధారులవుతున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని వైసీపీ ఐ ప్యాక్ టీమ్ పర్యవేక్షిస్తున్నదని, వారి ఒత్తిడితోనే గ్రామస్థాయి నేతలు తమను రాజీనామా చేయాలని బలవంత పెడుతున్నారని పలువురు వలంటీర్లు వాపోతున్నారు. 1వ తేదీలోపు రాజీనామా చేస్తే నెల గౌరవవేతనం పోతుందని వలంటీర్లు చెబుతున్నా జీతం పోతే పార్టీ మీకు ఆ జీతం చెల్లిస్తుందని ఐ ప్యాక్ సభ్యులు గ్రామస్థాయి నేతల ఒత్తిడి తెస్తున్నారని, ప్రజలకు సేవ చేయాలని వలంటీర్లుగా చేరితే ఇలా రాజకీయాల కోసం వాడుకోవటం సబబు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సోమవారం సుమారు 60 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టుగా ప్రచారం జరగ్గా, మండలంలో కేవలం 11మంది రాజీనామాలు మాత్రమే తమకు అందాయని ఎంపీడీవో మరియదేవి తెలిపారు. పంచాయతీ పరిధిలో మరో 20మంది రాజీనామాలు చేసినట్టు వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరగ్గా, కేవలం ఏడు రాజీనామా పత్రాలు అందాయని అధికారులు చెబుతున్నారు. అధికారులకు అందిన రాజీనామా పత్రాల్లోని సంతకాలు వైసీపీకి అనుకూలంగా ఉన్న వలంటీర్లు వినగిలిన వారి సంతకాలు పెట్టి మూకుమ్మడి రాజీనామాలు అంటూ హడావిడి సృష్టిస్తున్నారన్న అనుమానాలను అధికారులు వ్యక్తం చేస్తూ.. తమ వద్దకు వచ్చి రాజీనామా పత్రాలు సమర్పిస్తేనే లెక్కలోకి తీసుకోవాలని అధికారులు కిందిస్థాయి సిబ్బందికి సూచించినట్టు తెలుస్తోంది. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న తలంపుతో వలంటీర్లను ఎన్నికల సమయంలో ఓటర్లను కలిసేలా చేసేందుకు వైసీపీ నేతలు రాజీనామా డ్రామాలు ఆడుతున్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు.



ర్యాండమైజేషన్‌లో కలెక్టర్ దిల్లీరావు, ఎన్నికల పరిశీలకులు

విజయవంతంగా మలి దశ ర్యాండమైజేషన్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.దిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 29 : సాధారణ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. విజయవాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండోదశ ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. తిరువూరు, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు మంజూరాజ్ పాల్, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నరేంద్ర సింగ్ బాలి సమక్షంలో సంబంధిత అధికారులతో కలిసి పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. 1874 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,249 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2,249 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 7413 మంది ఓపీఓలను పారదర్శకంగా ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్టు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ ఆర్వో స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ పశ్చిమ ఆర్వో ఇ.కిరణ్మయి, నందిగామ ఆర్వో ఎ.రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి సోమవారం మైలవరం నియోజకవర్గం జి.కొండూరు, కట్టుబడిపాలెం, కవులూరు, వెలగలేరు, ముత్యాలంపాడు, ఆత్కూరు, చెవుటూరు, వెంకటాపురం, కుంటముక్కల, గుర్రాజుపాలెం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కవులూరు గ్రామస్తులను ప్రోత్సహించారు. ఓటు ప్రాముఖ్యత, ఓటర్ బాధ్యత, ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి అవగాహన కల్పించారు.

అభివృద్ధిని నాశనం చేసిన వ్యక్తి జగన్

- ఓటు ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలి : వసంత కృష్ణ ప్రసాద్



ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఏప్రిల్ 29 : ఏపీ సీఎం జగన్‌కు ఓట్ల యావ తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దామనే ఆలోచనే లేదని, ఆయన రివర్స్ పాలనతో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం, గుంటుపల్లి, ఈలప్రోలు, కేతనకొండ, మూలపాడు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ, ఇక్కడ అన్యాయం చేసింది చాలక గెలిస్తే వైజాగ్‌లో ప్రమాణ స్వీకారం చేస్తానంటున్న జగన్ను ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ ఉచిత ఇసుక పథకాన్ని రద్దు చేసి ఇసుకను పెచ్చు ధరలకు అమ్ముకుందన్నారు. రూ.80ల మద్యం బాటిల్ రూ.300లు పెంచడంతో పాటు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్ చేశాడన్నారు. 15 ఏళ్ల పాటు మద్యం బాండ్ల ద్వారా వచ్చే ఆదాయం బ్యాంకుల్లో తనఖా పెట్టారన్నారు. 2019-24లో జగన్ తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల పరిశ్రమలు మూతపడే పరిస్థితి తీసుకొచ్చాడన్నారు. అమర్‌రాజా లాంటి పెద్ద పెద్ద పరిశ్రమలు రాష్ట్రం విడిచి పోవాల్సి వచ్చిందన్నారు. కొత్తగా ఒక్క పరిశ్రమ రాకపోవడంతో చదువుకున్న పిల్లలకు ఉద్యోగ, ఉపాధి కల్పన లేక రాష్ట్రం నుంచి నిరుద్యోగులు వలస పోయారన్నారు. చింతలపూడికి టీడీపీ ప్రభుత్వం రూ.4,100 కోట్లు ఖర్చుచేస్తే ఐదేళ్లలో వైసీపీ పైసా ఖర్చు చేయకుండా ప్రాజెక్టును తుప్పు పట్టించిందన్నారు. ఓట్ల కోసం అప్పులు చేసి మీట నొక్కితే ప్రగతి ఆగిపోతుందన్నారు. జగన్‌కు ఓటు అనే ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ నేత నూతలపాటి బాలకోటేశ్వరరావు, జనసేన నేత అక్కల రామ్మోహన్‌రావు, జంపాల సీతారామయ్య, కూటమి నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.



వెల్లటూరులో వైసీపీ ఖాళీ

జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామంలో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ సమక్షంలో సర్పంచ్ వేల్పూరి సుజానమ్మ, ఆమె భర్త వేల్పూరి మరియన్నలతో పాటు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు 20 మందికి పైగా టీడీపీలో చేరారు. వైసీపీ నాయకుడు మలరాజు నారాయణ సైతం టీడీపీలో చేశారు. సోమవారం మైలవరం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, ప్రముఖ న్యాయవాది, మాదు అంజనేయులుతో పాటు మరో పది మంది వైసీపీని వీడి వసంత సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు.

స్వర్ణాంధ్ర కావాలంటే చంద్రబాబు రావాలి

- జిల్లా ప్రజలకు నెట్టెం రఘురాం పిలుపు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 29 : నవ్యాంధ్ర అభివృద్ధి.. సర్వజనుల సంక్షేమం.. స్వర్ణాంధ్ర సాకారం చేసుకునేందుకు చంద్రబాబునాయుడుకు ఈ ఎన్నికల్లో అద్భుత విజయం అందించి ముఖ్యమంత్రిగా మళ్లీ రప్పిద్దామని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ప్రజలు, ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం తన నివాసంలో పార్టీ ఎన్నికల కో-ఆర్డినేటర్ ఎంవీఆర్ చౌదరి, రాష్ట్ర టీడీపీ గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి తదితరులతో కలిసి మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో 16లక్షల మందికి గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే, జగన్ ప్రభుత్వం కేవలం ఎనిమిది లక్షలమందికి ఇచ్చారని, బాబుహయాంలో 4వేల మందికి అంబేడ్కర్ విద్యాదీవెన అందిస్తే, జగన్‌రెడ్డి ఒక్కరికి కూడా అందించలేదని, చంద్రబాబు మూడు బిజినెస్ సమ్మిట్‌లు పెట్టి 5.13లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తే, జగన్‌రెడ్డి కేవలం ఒక్క సమ్మిట్ నిర్వహించి 9150 మందికి ఉద్యోగాలు ఇచ్చాడని, చంద్రబాబు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు డ్వాక్రా మహిళలకు ఇస్తే, జగన్ రూ.3లక్షలకు కుదించారని, అంగన్వాడీలకు చంద్రబాబు రూ.6300ల జీతాలు పెంచితే, జగన్ వెయ్యి పెంచారని చెప్పారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల రుణాలను రూ.4 లక్షల వరకు ఇస్తే.. జగన్ పూర్తిగా ఎత్తేశాడని ఆరోపించారు. మద్యం ధరలు విపరీతంగా పెంచి జె-బ్రాండ్లతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీశాడని, రూ.7.25 కోట్ల మంది ఆకలి తీర్చిన అన్నా క్యాంటీన్‌లు ఎత్తేశాడని, ఆదరణ పథకం కింద రూ.4.26 లక్షలమంది చేతి వృత్తుల వారికి అధునాతన పరికరాలు అందిస్తే ఆజాడ లేదన్నారు. టీడీపీ రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమానికి 19.8శాతం కేటాయిస్తే, జగన్‌రెడ్డి కేవలం 15.80శాతం మాత్రమే కేటాయించారని చెప్పారు. నాటి చంద్రబాబు పాలనకు, నేటి జగన్‌రెడ్డి పాలనకు బేరీజు వేసుకుని చంద్రబాబును మళ్లీ సీఎంగా రప్పిద్దామని ప్రజలను కోరారు. సమావేశంలో గింజుపల్లి రమేష్, కన్నెబోయిన రామలక్ష్మి, షేక్ అన్వర్, టి.వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెట్టెం తదితరులు

భూములు కైంకర్యం చేసేందుకే.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

రైతుల, ప్రజల భూములను కైంకర్యం చేసేందుకే జగన్ దుర్మార్గమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చాడని నెట్టెం రఘురాం విమర్శించారు. అధికార యంత్రాంగం దయా దాక్షిణ్యాలపై భూ హక్కులు నిర్ణయించే విధానమని, ఇప్పటికే రెవెన్యూ అధికారులు పెట్టే ఇబ్బందులకు రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది కార్యాలయాల వద్ద బలవన్మరణాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. కోర్టుల ద్వారా నిర్ణయాలను సవాల్ చేసే హక్కులను తొలగించారని, రెవెన్యూలో లోపాలను అడ్డం పెట్టుకుని భూములను స్వాహా చేసే స్పష్టమైన అజెండాతో ఈ యాక్టు తెచ్చారని ఆరోపించారు. వైసీపీ ఆరాచకాలను ప్రజలు అంతా గమనించి ఓడించక పోతే పెను ఉపద్రవాన్ని మీదకు తెచ్చుకున్నట్టేనని నెట్టెం హెచ్చరించారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో వెనిగండ్ల, రావి

లాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రజలకు శాపం: వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు : మన స్థలాన్ని జగన్మోహన రెడ్డి, వారి మనుషులు కొట్టేయటానికి చేసిన యాక్టు.. ప్రజలు జాగర్తపడాలి.. జగన్‌కు ఓటేస్తే మీ ఆస్తిని జగన్ కిరాయి మూకలకు అప్పగించినట్టే.. కూటమి ప్రభుత్వం రాగానే భూ చట్టం రద్దు చేస్తాం.. ఆంధ్రా ప్రజల ఆస్తులు కాపాడుతాం.. అని గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం వెనిగండ్ల రాము గుడ్లవల్లేరు మండలంలో రోడ్ షో నిర్వహించారు. అంగలూరు, చంద్రాల, విన్నకోట, శేరిదగ్గుమిల్లి, కూరాడ, సేరీ కల్వపూడి గ్రామాల్లో నిర్వహించారు. రాముకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, జగన్ కానీ, స్థానిక ఎమ్మెల్యేగానీ ఐదేళ్లలో ఎపుడూ ప్రజలతో మమేకం కాలేదని, ఇప్పుడు కపట ప్రేమ కురిపిస్తూ మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వారిని తరిమికొట్టాలన్నారు. లేకుంటే రాష్ట్రంలో ఎవరి ఆస్తినీ మిగలనివ్వరని రాము అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కొసరాజు బాపయ్య చౌదరి, శాయిన పుష్పావతి, కొడాలి రామరాజు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బూరగడ్డ శ్రీకాంత్, పేర్ని జగన్, ఎ.రామ్మోహనరావు, ఈడే మోహన్, మల్లి, దీపక్, నాని, ప్రసాద్, ఆంజనేయులు, కిషోర్ పాల్గొన్నారు.

వెనిగండ్ల సమక్షంలో టీడీపీలో చేరికలు

స్థానిక ప్రజావేదికలో సోమవారం పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. 6వ వార్డుకు చెందిన విష్ణుమూర్తుల శేఖర్ ఆధ్వర్యంలో 50మంది వైసీపీ కార్యకర్తలు, 19వ వార్డుకు చెందిన జాజుల మురళీకృష్ణ, పామర్తి రాంబాబు, కుప్పిలి దుర్గాప్రసాద్, మామిడి సింహాచలం తదితరులు ఉన్నారు.

భార్యను బెదిరిద్దామని ఉరి..ఉచ్చు బిగిసి అర్చకుడు దుర్మరణం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 29: దుర్వ్యసనాలకు లోనైన ఓ అర్చకుడు భార్యను బెదిరిద్దామని ఉరి వేసుకోబోయాడు. కానీ, ఆ ఉచ్చు బిగిసి దుర్మరణం చెందాడు. ఈ ఘటన పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. జగ్గయ్యపేట ఎస్సై-2 పద్మారావు తెలిపిన వివరాల ప్రకారం..వత్సవాయికి చెందిన మహంకాళి వంశీకృష్ణ(36) అయ్యప్పనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ జగ్గయ్యపేట మండలంలోని మల్కాపురం శివాలయంలో అర్చకుడిగా, పురోహితుడిగా పనిచేస్తున్నాడు. దుర్వ్యసనాలకు లోను కావడంతో భార్యతో గొడవపడుతున్నాడు. దీంతో భార్య గాయత్రి(32) మనస్తాపంతో ఆదివారం వత్సవాయిలోని తన అత్తగారింటికి వెళ్లింది. రాత్రి పది గంటల సమయంలో తల్లికి ఫోన్ చేసిన వంశీకృష్ణ తాను ఉరేసుకుంటున్నానని, భార్యను పంపించాలని బెదిరించాడు. తల్లి వారిస్తుండగానే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంటున్నానని, వీడియోకాల్ చేశాడు. తల్లి సమీపంలో ఉన్న బంధువులకు ఫోన్ చేసి ఆపాలని కోరింది. వారు వెళ్లేసరికి ఇంటి తలుపులు వేసి ఉన్నాయి. తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లేసరికి బెదిరిద్దామని వేసిన ఉచ్చు వంశీకృష్ణకు పడి చనిపోయాడు. అర్చకుడు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. సోమవారం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం భౌతికకాయాన్ని బంధువులకు అప్పగించారు.



మహంకాళి వంశీకృష్ణ(ఫైల్)

వైసీపీ చీప్ పాలిట్రిక్స్

గాజుగ్లాసు గుర్తుతో మైండ్‌గేమ్ ● ఎన్టీఆర్ జిల్లాలో స్వతంత్ర, అన్‌రిజిస్టర్డ్ పార్టీ అభ్యర్థులతో నామినేషన్లు

- ఉపసంహరణ రోజున గాజుగ్లాసు గుర్తులు కోరుకునేలా డైరెక్షన్
- విజయవాడ పార్లమెంట్, విజయవాడ సెంట్రల్, మైలవరం నియోజకవర్గాల్లో గాజుగ్లాసు కేటాయింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నామినేషన్ల ముసుగులో జనసేన పార్టీకి చెందిన గాజుగ్లాసు గుర్తుతో అభ్యర్థులను నిలబెట్టేందుకు అధికార వైసీపీ ఎన్టీఆర్ జిల్లాలో మరో కుట్రకు తెరలేపింది. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రయోజనకరంగా మార్చుకునేందుకు టీడీపీ అభ్యర్థులు పోటీ చేసే చోట ఓటర్లను గందరగోళపరిచేందుకు స్వతంత్ర అభ్యర్థులు, అన్ రిజిస్టర్డ్ పార్టీల తరఫున పలువురితో నామినేషన్లు వేయించి గాజుగ్లాసు గుర్తును వారితో డిమాండ్ చేయించింది. దీంతో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా బరిలో నిలిచిన పలువురికి గాజుగ్లాసు గుర్తులు వచ్చాయి. గుర్తింపు పొందిన పార్టీలకు వారి గుర్తులు యథావిధంగా ఉంటాయి. గుర్తింపు లేని పార్టీలకు పోటీ చేసే చోట గుర్తులు అలాగే ఉన్నా, పోటీచేయని నియోజకవర్గాల్లో ఆ పార్టీ గుర్తులను ఎవరైనా కోరితే వారికి కేటాయించవచ్చు. టీడీపీ, బీజేపీలతో జనసేన పొత్తులో ఉండటం వల్ల ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కడా జనసేన అభ్యర్థులు పోటీ చేయలేదు. దీంతో గాజుగ్లాసును కోరిన వారికి ఇవ్వాల్సి వచ్చింది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పార్లమెంట్, విజయవాడ సెంట్రల్, మైలవరం నియోజకవర్గాలలో స్వతంత్రులు, అన్ రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులకు గాజుగ్లాసు గుర్తులను కేటాయించారు. నందిగామ నియోజకవర్గంలో ఎవరికీ గాజుగ్లాసును కేటాయించలేదు. తిరువూరు, జగ్గయ్యపేట, విజయవాడ వెస్ట్‌లో గాజు గ్లాసును కేటాయించే అవకాశముంది. ఇంకా వివరాలు రాలేదు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో కృష్ణ కిషోర్ యనమండ్ర (నవతరం పార్టీ)కి, సెంట్రల్ నియోజకవర్గంలో గొల్లపల్లి ఫణిరాజ్(ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి)కి, మైలవరం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి వల్లభనేని నాగపవన్‌కుమార్‌కు గాజుగ్లాసును కేటాయించారు.

విజయవాడ పార్లమెంట్ బరిలో 17 మంది

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో 19 మందికిగాను స్వతంత్ర అభ్యర్థులు అర్జున్ చెవిటి, చరణ్ సుజిత్ నంబూరు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అంతిమంగా 17 మంది బరిలో నిలిచారు. వారికి వరుస క్రమంలో జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు ఎన్నికల గుర్తులను కేటాయించారు. కేశినేని శివనాథ్(టీడీపీ)కి సైకిల్, కేశినేని శ్రీనివాస్ (వైసీపీ) సీలింగ్ ఫ్యాన్, భార్గవ్ వల్లూరు(కాంగ్రెస్)కు హస్తం, మేకా వెంకటేశ్వరరావు (బీఎస్పీ)కు ఏనుగు గుర్తులను కేటాయించారు. అన్ రిజిస్టర్డ్ పార్టీలకు కృష్ణ కిషోర్ యనమండ్ర (నవతరం పార్టీ)కి గాజుగ్లాసు, గుజ్జుల లలిత(ఎస్‌యూసీఐ-కమ్యూనిస్ట్)కు బ్యాట్, చాగంటిపాటి గంగాధర్ గాంధీ (పిరమిడ్ పార్టీ)కి టెలివిజన్, చింతలచెరువు హేమలత(జై మహాభారత్)కు వేణువు, ఎన్.దశరథరామిరెడ్డి(జైహింద్ పార్టీ)కు గ్యాస్ సిలిండర్, దాట్ల లూర్దు మేరీ(జై భీమ్‌రావు భారత్ పార్టీ)కు కోటు, దేవరశెట్టి రవీంద్రబాబు (ఏఆర్‌పీఎస్)కు మిక్సీ, పేరం శివనాగేశ్వరరావు(రిపబ్లికన్ పార్టీ)కి పండ్లబుట్ట, బర్రె శ్రీనివాసరావు(తెలుగు రాజాధికార పార్టీ)కు రబ్బరు స్టాంప్, సయ్యద్ ఖమరున్నీసా (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ) బక్కెట్, అనిల్‌కుమార్ మద్దినేని(స్వతంత్ర)కు చెప్పులు, దేవరపల్లి మల్లికార్జునరావు(స్వతంత్ర)కు వజ్రం, పప్పూరి వెంకట అశోక్(స్వతంత్ర)కు ఏసీగుర్తులను కేటాయించారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా..

- నందిగామ నియోజకవర్గంలో 11 మందికి ఇద్దరు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 9 మంది బరిలో ఉన్నారు. తంగిరాల సౌమ్య (టీడీపీ)కి సైకిల్, బర్రె ఉదయకిరణ్(బీఎస్పీ)కి ఏనుగు, మొండితోక జగన్మోహనరావు(వైసీపీ)కి సీలింగ్ ఫ్యాన్, వజ్రయ్య మందా (కాంగ్రెస్)కు హస్తం, మిగిలిన అభ్యర్థులకు సైకిల్ పంపు, వేణువు, కోటు, రైతు, ఆపిల్ గుర్తులను కేటాయించారు.
- విజయవాడ సెంట్రల్‌లో 22 మందికి ఇద్దరు ఉపసంహరించుకున్నారు. ఐ.రాజేంద్ర ప్రసాద్(బీఎస్పీ)కి ఏనుగు, చిగురుపాటి బాబూరావు(సీపీఎం)కు సుత్తి-కొడవలి-నక్షత్రం, బొండా ఉమామహేశ్వరరావు(టీడీపీ)కు సైకిల్, వెలంపల్లి శ్రీనివాసరావు(వైసీపీ)కు సీలింగ్ ఫ్యాన్, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి తరఫున పోటీ చేస్తున్న గొల్లపల్లి ఫణిరాజ్‌కు గాజుగ్లాసు గుర్తును కేటాయించారు.
- విజయవాడ పశ్చిమలో 17మందికి ఇద్దరు ఉపసంహరించుకున్నారు. 15 మంది రంగంలో ఉన్నారు.
- విజయవాడ తూర్పులో 17మందికి ఇద్దరు ఉపసంహరించుకున్నారు. 15 మంది బరిలో ఉన్నారు.
- మైలవరంలో 12 కు 12 మంది బరిలో ఉన్నారు.
- తిరువూరులో 13 మందికి ఒక్కరు ఉపసంహరించుకున్నారు. 12 మంది బరిలో నిలిచారు.
- జగ్గయ్యపేటలో 14 మందికి ఒక్కరు ఉపసంహరించుకున్నారు. 13 మంది బరిలో నిలిచారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.55

కూటమి విజయంలో రెల్లి కులస్తులు భాగస్వామ్యం వహించాలి

రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తుపాకుల రమణమ్మ

భవానీపురం, ఏప్రిల్ 29 : రానున్న ఎన్నికల్లో కూటమి విజయంలో రెల్లి కులస్తులు కూడా కీలక భాగస్వామ్యం వహించాలని లేబర్‌కాలనీకి చెందిన రెల్లి కులస్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తుపాకుల రమణమ్మ పిలుపునిచ్చారు. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు తుపాకుల రమణమ్మ ఇటీవల మచిలీపట్నంలో కొల్లు రవీంద్రకు, విజయనగరంలో అచ్చెన్నాయుడుకు ఆమె ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రెల్లి సామాజికవర్గానికి న్యాయం జరుగుతుందని తెలిపారు. కూటమికి మద్దతు తెలుపుతూ బ్యానర్‌ను ఆవిష్కరించారు.

రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిన జగన్

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రాణిగారితోట, ఏప్రిల్ 29: జగన్‌కు పరిపాలనా విధానం తెలియక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం సాయంత్రం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అసమర్థ, అరాచక పాలన వలన నగరంలో 2019 నుంచి 2024 మధ్య ఎంతో మంది ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారని అన్నారు. వారంలో ఒక్క రోజు పనుల కోసం రోడ్ల మీద నిలబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. మే 13న జరిగే ఎన్నికలు రాష్ట్రంలోని అన్ని వర్గాల భవిష్యత్తుపై ఆధారపడి ఉందని, అమరావతిని నిలుపుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి రెండు ఓట్లు కూడా సైకిల్ గుర్తుపై వేసి తనను ఎమ్మెల్యేగా, కేశినేని చిన్నిని ఎంపీ గా గెలిపించాలని కోరారు. బొప్పన భవకుమార్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో గద్దెకు తిలకం దిద్దుతున్న మహిళ

ఒక్క అవకాశం ఇవ్వండి : సుజనా

చిట్టినగర్, ఏప్రిల్ 29: నియోజకవర్గాన్ని అన్ని హంగులతో మోడల్‌గా తీర్చిదిద్దుతానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. సోమవారం రాత్రి 46వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకొని, తమ పార్టీ అమలు చేయనున్న సంక్షేమ పథకాల కరపత్రాన్ని ప్రజలకు పంపిణీ చేశారు. సుజనా చౌదరితోపాటు టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లా ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుల్‌మీరా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ప్రజలు తనను గెలిపించాలని కోరారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉండేలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, ఒక్క అవకాశం ఇచ్చి తనను గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు గుర్రం కొండ, డివిజన్ అధ్యక్షులు డీ. ప్రభుదాస్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



ఎన్నికల ప్రచారంలో సుజనా చౌదరి

బీజేపీలో పలువురు చేరిక

విద్యాధరపురం: భవానీపురంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి సమక్షంలో పలువురు కాంగ్రెస్, వైసీపీ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు బీజేపీలో చేరడం హర్షణీయమన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, పైలా సోమినాయుడు ఉన్నారు.

ఓటుతో వైసీపీని తరిమికొట్టాలి
కేశినేని శ్రీదేవి

చిట్టినగర్: రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలనను సాగిస్తున్న వైసీపీని ప్రజలు ఓటుతో తరిమికొట్టాలని కేశినేని శ్రీదేవి పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి తరఫున ఆమె సోమవారం 50వ డివిజన్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడారు. కూటమి అభ్యర్థి సుజనాచౌదరి, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిలను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలన్నారు. టీడీపీ నేతలు షేక్ ఆషా, కుప్పల గంగాధర్‌రెడ్డి, కాళ్ల ఈశ్వరరావు, జనసేన నేతలు గంగాధరరావు, యాట్ల ప్రసాద్ పాల్గొన్నారు.

మోదీ, జగన్ విధానాలతో కుదేలైన ఆర్థిక వ్యవస్థ

● సీపీఎం నేత బాబూరావు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 29: నరేంద్ర మోదీ, వైఎస్ జగన్మోహనరెడ్డి అవలంబించిన విధానాల ఫలితంగా ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సెంట్రల్ నియోజవర్గం నుంచి పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి సిహెచ్ బాబూరావు అన్నారు. సోమవారం 24వ డివిజన్‌లోని కస్తూరిబాయిపేట, గిరిపురం, సీతారామపురం ప్రాంతాల్లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఓట్లను అభ్యర్థించారు. అన్ని తరగతుల ప్రజలకు అండగా నిలిచేది సీపీఎం మాత్రమేనని అన్నారు. ప్రశాంత వాతావరణంలో జీవించాలంటే సీపీఎంకు మద్దతుగా నిలవాలని కోరారు. ప్రచార కార్యక్రమంలోసీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నేతలు వీవీ ఆంజనేయులు, కె. సరోజ, వై. సుబ్బారావు, పి. మురహరి, చిన్నా రావు, క్రాంతి, రమణ, గురుమూర్తి, గౌరి, వినోద్‌కుమార్, బెనర్జీ పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ విస్తృత ప్రచారం

భవానీపురం, ఏప్రిల్ 29 : పశ్చిమను మోడల్‌గా తీర్చిదిద్దాలంటే కూటమి అభ్యర్థులు ఎమ్మెల్యేగా వై. సుజనా చౌదరి, ఎంపీగా కేశినేని శివనాథ్‌లను భారీ మెజారిటీలతో గెలిపించాలని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్(టీఎన్ఎస్ఎఫ్) విజయవాడ పార్లమెంట్ కార్యదర్శి సయ్యద్ ఖాజా పిలుపునిచ్చారు. 41వ డివిజన్ మసీదురోడ్డు, దళితవాడ, అవుట్ ఏజెన్సీ ప్రాంతాల్లో సీనియర్ నాయకులు సయ్యద్ కరీముల్లా ఆధ్వర్యంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ వారిద్దర్ని గెలిపించాలని కోరారు. ● పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వై. సుజనా చౌదరి, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో టీడీపీ, జనసేన నాయకులు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మాగం ఆత్మారామ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు.



విజయవాడ హోల్‌సేల్ ,రిటైల్ పూజా మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధుల ర్యాలీ

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం

వన్‌టౌన్, ఏప్రిల్ 29: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధమని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరుతూ సోమవారం విజయవాడ హోల్‌సేల్, రిటైల్ పూజా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సామారంగం చౌక్, మెయిన్ బజార్, శివాలయం వీధి, కెనాల్ రోడ్డులలో ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, ఎం.కృష్ణారావులు మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ లింగ, వర్ణ కులమతాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ తేదీనాడు సెలవు దినంగా కాకుండా కీలకమైన రోజుగా పరిగణించి ప్రజా స్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధంగా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొత్తమాసు సుబ్రహ్మణ్యం, సభ్యులు గొల్లపూడి శ్రీనివాసరావు, శివరామ్, శేఖర్, పవన్, కారంశెట్టి విజయ్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై సదస్సు

మొగల్రాజపురం: ఓటు రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన వజ్రాయుధం అని దానిని వదలకుండా ఎన్నికల రోజు ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా పిలుపు ఇచ్చారు. మొగల్రాజపురం కార్యాలయంలో సోమవారం ఓటు హక్కు వినియోగంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఓటు అంటే చాలా మందికి నిర్లక్ష్యం, మనం ఒకరు వేయకపోతే పోయేదేముంది అనే భావనలో ఉంటారని ఇది తప్పని చెప్పారు. ప్రజాస్వామ్యదేశంలో ఓటుతో మంచి పాలకులను ఎన్నుకునే హక్కు, బాధ్యత ఓటరుకు రాజ్యాంగం కల్పించిందన్నారు. సంస్థ డైరెక్టర్ పూర్ణిమ మాట్లాడుతూ ఓటును నోటుకు అమ్ముకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, శిక్షకులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు

● కేశినేని జానకీ లక్ష్మి

సత్యనారాయణపురం, ఏప్రిల్ 29: పేదల ఆర్థికాభివృద్ధికి సూపర్‌సిక్స్ పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. 30వ డివిజన్ రామకృష్ణాపురం బుడమేరు మధ్యకట్ట, కేఎల్‌రావు నగర్, విజయదుర్గానగర్‌లో ఆమె సోమవారం పర్యటించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులైన విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమాను సైకిల్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, డివిజన్ అధ్యక్షుడు సూర్యనారాయణ, గొట్టుముక్కల శేషంరాజు, లక్కంరాజు శ్రీనివాసరాజు, నాగమణి, వీరబాబు, శ్రీను బీజేపీ, జనసేన, టీడీపీ నేతలుపాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి

వంద రోజుల్లో పశ్చిమ సమస్యల పరిష్కారం

● కేశినేని వెంకట్

విద్యాధరపురం, ఏప్రిల్ 29: ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో పశ్చిమ సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని శివనాథ్(చిన్ని) తనయుడు కేశినేని వెంకట్ హామీ ఇచ్చారు. సోమవారం 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు శివాజీ ముదిరాజ్‌లతో కలిసి ఆయన డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను మోసం చేసిన విషయాలను ప్రజలకు వివరించారు. మరోసారి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జనం ఆస్తులు కూడా తాకట్టు పెట్టుకోవల్సి వస్తుందన్నారు. ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు టి.సతీష్, అశోక్, స్రవంతి, సుభాని, షాహీద్, పాల్గొన్నారు.



వృద్ధురాలికి కరపత్రాన్ని ఇస్తున్న వెంకట్

టీడీపీ అధికారంలోకి రాగానే రూ. 4 వేల పింఛన్

● బొండా ఉమా

పాయకాపురం, ఏప్రిల్ 29 : టీడీపీ అధికారంలోకి రాగానే లబ్ధిదారులకు నెలకు రూ. 4 వేలు పింఛన్లు అందజేస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. 61వ డివిజన్ వాంబే కాలనీలోని హెచ్ బ్లాక్ వద్ద ఆ పార్టీ నేతలు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని ప్రతి వర్గం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీలు, మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. నేతలు దాసరి కనకారావు పాల్గొన్నారు.

● 62వ డివిజన్‌లోని జూనియర్ కాలేజీ ఎదురుగా గల జీప్లస్ త్రీ అపార్ట్‌మెంట్ వాసులతో సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు సోమవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలను స్థానికులకు వివరించారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ అప్పులతో ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టాలంటే విజన్ ఉన్న నేత చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నేతలు పైడి శ్రీను, ఉదయ్‌శంకర్, రవిచంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో బొండా ఉమా

మైనార్టీల సంక్షేమం కోరే పార్టీకి ఓటేయండి

● ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముక్తార్ అలీ

లబ్బీపేట, ఏప్రిల్ 29: మైనార్టీల సంక్షేమం కోరే పార్టీకే ముస్లింలు ఓటేయాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చెసుకోవాలని ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముక్తార్ అలీ పిలుపునిచ్చారు. లబ్బీపేటలోని ఆయన కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్నికల ముందు పార్టీలు ముస్లిం ఓట్ల కోసం అనాధలను దత్తత తీసుకున్నట్లు కాసేపు దత్తత తీసుకుని ఎక్కడలేని ప్రేమ చూపించి ఎన్నికలు అవగానే అనాథలుగా వదిలి వేస్తున్నారని అన్నారు. మైనార్టీ ఓటర్లు భవిష్యత్తు గురించి ఆలోచించి ఏ పార్టీ అధికారంలోకి వస్తే ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తారో వారికి మాత్రమే ఓటు వేయాలని అన్నారు. 100శాతం ఓటింగ్ జరిగేవిధంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.

మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే బాజీ నియామకం

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 29 : టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఎస్‌కె బాజీ నియమితుడయ్యాడు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో సోమవారం బొండా ఉమా, ఎస్‌కె. బాజికి నియామకపత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. దాసరి కనకారావు, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

బొండా ఉమా ఆర్థిక సహాయం

పాయకాపురం, ఏప్రిల్ 29 : అనారోగ్యంతో మృతి చెందిన రమ్య(హిజ్రా) కుటుంబానికి బొండా ఉమా సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. 61వ డివిజన్‌కు చెందిన రమ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బొండా ఉమా ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దాసరి కనకారావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



కాళీమాత ఆలయం ఆదాయం రూ.9.31 లక్షలు

కృష్ణలంక, ఏప్రిల్ 29 : త్రిశక్తి పీఠంలోని (కాళీమాత ఆలయం) అమ్మవార్ల హుండీలలో వున్న నగదును సోమవారం లెక్కించగా రూ.9,31,565 వచ్చినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్ తెలిపారు. 150 రోజులకు అమ్మవారి హుండీలను ఈవో ఎం.సత్యప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది లెక్కించినట్లు ఆయన తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.పుల్లయ్య, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, సభ్యులు జి.సత్యనారాయణ, పి.విజయ్, విశ్వేశ్వరయ్య, సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కుట్రలు టీడీపీ విజయాన్ని అడ్డుకోలేవు

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

గుణదల, ఏప్రిల్ 29: రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందని, అడ్డుకోవడానికి వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా ఫలితం ఉండదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఆమె రెండో డివిజన్ కుమ్మరిబజారు, పాండురంగస్వామి గుడి ఏరియాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు, కృష్ణప్రసాద్, శ్రీమన్నారాయణ, నాగుల్‌మీరా, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో అనురాధ

గద్దె తనయుల ప్రచారం

మొగల్రాజపురం, ఏప్రిల్ 29: బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ల విజయాన్ని కాంక్షిస్తూ గద్దె రామ్మోహన్ కుమారులు క్రాంతి, రాజేష్‌లు 8వ డివిజన్‌లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అమలు చేయబోతున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేసి సైకిల్ గుర్తుకు ఓటు వేయమని అభ్యర్థించారు. గద్దె హిమాన్స్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, జాస్తి లక్ష్మీపతి, మల్లెల రామకృష్ణ, తంగిరాల పౌలు, ధూళిపాళ్ల రమేష్, మెరకనపల్లి నాగేశ్వరరావు, గద్దె రంగారావు, నారు రామారావు, నాగేంద్రమ్మ, మల్లవరపు జ్యోతి, మల్లెల రమేష్ పాల్గొన్నారు.

పటమట: 11వ డివిజన్ పటమట రైతుబజార్ ఏరియాలో గద్దె రాజేష్, గద్దె హిమాన్షులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరూ రెండు ఓట్లను టీడీపీకి వేసి గద్దెను, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు కోనేరురాజేష్, పాశంసుజాత, పామర్తి కిషోర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రౌడీయిజంతో ఓట్లు కొనాలనుకుంటున్నారు

● జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు

గుణదల/మొగల్రాపురం, ఏప్రిల్ 29: దేవినేని అవినాష్ డబ్బుల అహంకారంతో ఓట్లు కొనాలని చూస్తున్నారని, డబ్బులకు లొంగకపోతే రౌడీయిజం చేయాలని చూస్తూన్నారని, అతని ఆటలు ప్రస్తుత కాలంలో చెల్లవని జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు అన్నారు. జనసేన బీజేపీ బలపరచిన పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ విజయాన్ని కోరుతూ సోమవారం 3వ డివిజన్ కరెన్సీ నగర్‌లో అమ్మిశెట్టి వాసు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు డివిజన్ల నుంచి కొంతమందిని గుణదల దొడ్లోకి రమ్మని బెదిరిస్తున్నారని ఇది 1988 కాదని 2024 అని గుర్తుంచుకోవాలని చెప్పారు. పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి గద్దె రామ్మోహన్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గుత్తికొండ కృష్ణమెహన్, తాడి బాబూరావు, ఈశ్వర్ పేరేపి, పూలదాసు మారుతీ మెహన్, గద్దె రమేష్, రాజనాల పవన్, బండి కోమలి, శ్రీను నాయుడు, అన్నపూర్ణమ్మ ఉన్నారు.

23వ డివిజన్‌లో టీడీపీ విస్తృత ప్రచారం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 29: జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు, పార్లమెంటు అభ్యర్థి కేశినేని చిన్నిలకు మద్దతుగా 23వ డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి సోమవారం గవర్నర్‌పేట, సూర్యారావుపేట ప్రాంతాల్లోని పలు వీధుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలో ప్రజలు, వ్యాపార వర్గాలు పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించారు. చింతా దుర్గారావు, వసంత, ఆలపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

మేధోసంపత్తి హక్కులపై అవగాహన అవసరం

చెన్నైలోని కేంద్ర పేటెంట్, డిజైన్స్ జాయింట్ కంట్రోలర్ అజిత్

వన్‌టౌన్, ఏప్రిల్ 29: మేధోసంపత్తి హక్కులపై విద్యార్థులు అవగాహన కల్పించుకుని దాని ద్వారా ఆదాయం పొందాలని చెన్నైలోని కేంద్ర పేటెంట్, డిజైన్స్ జాయింట్ కంట్రోలర్ ఎం.అజిత్ అన్నారు. కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, ఐక్యూ ఏసీ విభాగాల ఆధ్వర్యంలో మేధోసంపత్తి హక్కుల అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ మేధోసంపత్తి హక్కుల విషయంలో భారతదేశం చాలా వెనుకంజలో ఉందన్నారు. వివిధ సంస్థలు, వ్యక్తులు రూపొందించిన ఆవిష్కరణలు, ఉత్పత్తులపై హక్కులు ఉంటాయన్నారు. వీటిని అధికారికంగా నమోదు చేసుకోవడం ద్వారా ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మేధోసంపత్తి హక్కులపై మరింత లోతైన అధ్యయనం జరగాలన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, విభాగాధిపతి ఆర్.ఉదయకుమార్, అధ్యాపకురాలు బి.కృతి తదితరులు పాల్గొన్నారు.



పెనమలూరు పీఠం ఎవరిదో..

- పెడనలో చెల్లని కాసు పెనమలూరులో పోటీ
- స్థానికేతరుడైన జోగి రమేశ్‌ను ఓటర్లు ఆదరిస్తారా?
- ఓడిన మరుసటి రోజు నుంచే జనంలో బోడె
- అవినీతి లేకపోవడం.. నిత్యం జనంతో ఉండటం బోడెకు కలిసి వచ్చే అంశాలు



ఉమ్మడి కృష్ణా జిల్లాలో తెలుగుదేశం పార్టీకి బలమైన నియోజకవర్గాల్లో పెనమలూరు ఒకటి. 2004 ఎన్నికల వరకు కంకిపాడు నియోజకవర్గంలో భాగంగా ఉండేది 2009 నుంచి పెనమలూరు నియోజకవర్గంగా ఏర్పడింది. టీడీపీ ఆవిర్భావం తర్వాత తొమ్మిదిసార్లు ఎన్నికలు జరగ్గా ఆరుసార్లు టీడీపీ గెలుపొందిన స్థానం ఇది. గతంలో కంకిపాడు నియోజకవర్గంగా ఉన్న సమయంలో టీడీపీ తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించేది. టీడీపీ ఆవిర్భావం తర్వాత కంకిపాడులో ఒకే ఒక్కసారి కాంగ్రెస్ గెలిచింది. పెనమలూరు నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, వైసీపీకి ఒక్కొక్కసారి గెలిచాయి. ప్రస్తుతం పెనమలూరు నియోజకవర్గంలో కంకిపాడు, ఉయ్యూరు, పెనమలూరు మండలాలు, ఉయ్యూరు, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ ఉన్నాయి. సుమారు 2.90 లక్షల ఓటర్లతో కృష్ణా జిల్లాలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉంది.

- విజయవాడ - ఆంధ్రజ్యోతి

వైసీపీలో గ్రూపుల గోల

పెనమలూరు నియోకవర్గం నుంచి గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా కొలుసు పార్థసారథి గెలుపొందారు. ఆయన ప్రస్తుతం టీడీపీలో ఉన్నారు. నూజివీడు నుంచి పోటీ చేస్తున్నారు. పెనమలూరులో పార్థసారథి వర్గం జోగి రమేశ్‌తో కలిసి అడుగులు వేయలేకపోతోంది. జోగి రమేశ్ ఎక్కువగా తన బంధుమిత్రులను నియోజకవర్గంలో దింపి వారికి ప్రాధాన్యం ఇస్తుండటం స్థానిక నాయకులకు ఇబ్బందికరంగా ఉంది. స్థానికేతరులు తమపై పెత్తనం చేస్తున్నారన్న అభిప్రాయంలో వారు ఉన్నారు. దీంతో గతంలో వైసీపీలో ఉండి సారథి అనుచరులుగా ఉన్న వారిలో అధికశాతం మనస్ఫూర్తిగా జోగికి పనిచేయడం లేదు. ఫలితంగా వైసీపీలో గ్రూపులు ఎక్కువయ్యాయి.

ఓటర్లు ఇలా..



పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,94,928. వారిలో పురుషులు 1,42,349. మహిళలు 1,52,577. మొత్తం ఓటర్లలో బీసీ ఓటర్లు ఎక్కువ శాతం ఉంటారు. ఆ తర్వాత స్థానంలో ఎస్సీలు ఉంటారు. కమ్మ సామాజికవర్గం ఓటర్లు కూడా గణనీయ సంఖ్యలో ఉన్నారు. ముస్లిం ఓటర్లు కూడా ఎక్కువగా ఉన్న నియోజకవర్గం ఇది. పెనమలూరు నియోజకవర్గం 2009వ సంవత్సరంలో ఏర్పడింది. అప్పటి వరకు ఇది కంకిపాడు నియోజవకర్గంగా ఉండేది.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
కంకిపాడు నియోజకవర్గం				
1952	ఎం.లక్ష్మణస్వామి	సీపీఐ	ఇ.రత్నాంబ	కాంగ్రెస్
1955	సి.రామకోటయ్య	కేఎల్‌పీ	ఎం.లక్ష్మణస్వామి	సీపీఐ
1962	సి.రామకోటయ్య	కాంగ్రెస్	ఎం.లక్ష్మణస్వామి	సీపీఐ
1964(ఉ.ఎ)	ఎం.లక్ష్మణస్వామి	సీపీఐ	సీఎస్ రావు	కాంగ్రెస్
1967	అక్కినేని భాస్కరరావు	కాంగ్రెస్	కేవీఎస్ వరప్రసాదరావు	సీపీఎం
1972	అక్కినేని భాస్కరరావు	కాంగ్రెస్	ఎం.లక్ష్మణస్వామి	సీపీఐ
1978	కోనేరు రంగారావు	కాంగ్రెస్	తుమ్మల చౌదరి	జనతా
1983	దేవినేని రాజశేఖర్ నెహ్రూ	టీడీపీ	అక్కినేని భాస్కరరావు	కాంగ్రెస్
1985	దేవినేని రాజశేఖర్ నెహ్రూ	టీడీపీ	పి.వెంకటేశ్వరరావు	కాంగ్రెస్
1989	దేవినేని రాజశేఖర్ నెహ్రూ	టీడీపీ	వై.నాగేశ్వరరావు	కాంగ్రెస్
1994	దేవినేని రాజశేఖర్ నెహ్రూ	టీడీపీ	వై.నాగేశ్వరరావు	కాంగ్రెస్
1999	యలమంచిలి నాగేశ్వరరావు	టీడీపీ	దేవినేని నెహ్రూ	కాంగ్రెస్
2004	దేవినేని రాజశేఖర్ నెహ్రూ	కాంగ్రెస్	గద్దె రామ్మోహనరావు	టీడీపీ
పెనమలూరు నియోజకవర్గం				
2009	కొలుసు పార్థసారథి	కాంగ్రెస్	చలసాని వెంకటేశ్వరరావు	టీడీపీ
2014	బోడె ప్రసాద్	టీడీపీ	కుక్కల విద్యాసాగర్	వైసీపీ
2019	కొలుసు పార్థసారథి	వైసీపీ	బోడె ప్రసాద్	టీడీపీ

అక్కడ చెల్లని కాసు.. ఇక్కడ పోటీ..



ప్రస్తుతం టీడీపీ తరఫున బోడె ప్రసాద్ పోటీ చేస్తుండగా వైసీపీ తరఫున జోగి రమేశ్ పోటీలో ఉన్నారు. ఈయన 2014లో మైలవరం నుంచి, 2019లో పెడన నుంచి పోటీ చేశారు. మైలవరంలో ఓటమిపాలు కాగా పెడన నుంచి పోటీ చేసిన సమయంలో వైసీపీ గాలిలో గెలుపు సాధించారు. అయితే పెడన, మైలవరం నియోజకవర్గాల్లో 2019 నుంచి 2024 వరకు జోగి ఆయన అనుచరులు చేసిన అక్రమాలతో ఆ రెండు స్థానాల్లో పోటీ చేసేందుకు ముఖం చెల్లక ముచ్చటగా మూడో నియోజకవర్గాన్ని ఎంచుకుని పెనమలూరు నుంచి బరిలో దిగారు. స్థానికేతరుడైన.. అవినీతి అక్రమాల మరకలతో నిండిపోయిన జోగి రమేశ్‌ను పెనమలూరు నియోజకవర్గ ప్రజలు ఎంత వరకు ఆదరిస్తారో వేచి చూడాలి.

అవినీతి మచ్చలేని నేతగా బోడె



టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్‌పై అవినీతి ఆరోపణలు లేకపోవడం.. స్థానికుడు కావడం కలిసి వచ్చే అంశాలు. 2019 ఎన్నికల్లో ఓడిపోయినా ఆ మరుసటి రోజు నుంచే జనాల్లో ఉంటూ వారి సమస్యలపై తన గళం వినిపిస్తూ వచ్చారు. ఆ సానుభూతితోనే ఆయనకు టీడీపీ అధిష్ఠానం టికెట్ ఇవ్వదని చెప్పిన మరుక్షణమే నియోజకవర్గ ప్రజలు ఎవరి స్థాయిలో వారు తమ నిరసన తెలిపారు. దీంతో ఓ అడుగు వెనక్కి తగ్గిన టీడీపీ అధిష్ఠానం ఆయనకు పెనమలూరు టికెట్ ఇచ్చింది. బోడె ప్రసాద్‌పై అవినీతి ఆరోపణలు లేవు. మరోవైపు గత ఐదేళ్లలో నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి వైసీపీ నాయకులు చేసిన దోపిడీ అంతా ఇంతా కాదు. ప్రస్తుతం వారంతా జోగి వెంట ఉండటం జోగికి ప్రతికూల అంశం కాగా బోడె ప్రసాద్‌కు కలిసి వచ్చే అంశాలు.



మాటల్లో మహా గౌరవం.. ఆచరణలో అంతులేని వివక్ష!

ఏ సమావేశంలో చూసినా.. ఏ సభలో విన్నా సీఎం వైఎస్ జగన్ మొదలు ఆ పార్టీ నేతలంతా మాటల్లో నా ఎస్సీ, నా బీసీ, నా ఎస్టీ అంటూ తెగ ప్రేమ కురిపిస్తుంటారు. ఆచరణలో మాత్రం అంతులేని వివక్ష చూపుతారు. అందుకు ఈ చిత్రాలే నిదర్శనం. పై చిత్రంలో... ఎన్నికల ముందు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ఉదయభాను ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పట్టణ ప్రథమ పౌరుడు మున్సిపల్ చైర్మన్ బీసీకు చెందిన రంగాపురం రాఘవేంద్ర, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మైనార్టీ నేత మొహిద్దీన్, వేదాద్రి గ్రామ సర్పంచ్ గుడారు పేరయ్యలకు కుర్చీలు ఇవ్వకుండా నిలబెట్టి అవమానించారు. దిగువ చిత్రంలో.. ఇటీవల జగ్గయ్యపేటకు వచ్చిన బీసీ నేత ఆర్.కృష్ణయ్య ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కుర్చీ లేక వెనుక నిలబడి ఉన్న మహిళ పూసల కార్పొరేషన్ డైరెకర్ కుమారి. ఈమె బీసీ. బడుగు వర్గాలకు వైసీపీ నేతలు ఇచ్చే విలువ, గౌరవం ఇదన్నమాట. - జగ్గయ్యపేట రూరల్





డప్పు కొట్టు.. ఓటు పట్టు..!

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సీపీఎం అభ్యర్థి సీహెచ్ బాబూరావు సోమవారం పుష్ప హోటల్ సెంటర్‌లో డప్పు కొడుతూ ఓటర్లను పలకరిస్తూ ఆకట్టుకున్నారు. - విజయవాడ



సకుటుంబ సపరివార సమేతంగా...

ఒకప్పుడు ఎన్నికలంటే పోటీచేసే అభ్యర్థి మాత్రమే ప్రచారంలో ఉండేవారు. రానురానూ పరిస్థితులు మారాయి. అభ్యర్థితోపాటు భార్య లేదా తండ్రి వచ్చేవారు. రోజులు మారే కొద్దీ ఓటరును ఆకట్టుకునే పద్ధతి మారింది. అభ్యర్థితోపాటు కుటుంబంలోని అందరూ ప్రచారంలోకి దూకుతున్నారు. అభ్యర్థి ఒక ప్రాంతంలో ఉదయం ఉంటే వారి భార్య, పిల్లలు, సోదరులు, కుమార్తెలు ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతంలో ఉదయం, సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ తమ వారికి ఓటేయమని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

- అభ్యర్థుల తరఫున కుటుంబ సభ్యులు మొత్తం ప్రచారంలోనే..
- కుటుంబంలో ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రాంతంలో ఓటర్లను ప్రసన్నం


మొగల్రాజపురం : విజయవాడ పార్లమెంట్ పరిధిలో రెండు ప్రధాన పార్టీలు అయిన తెలుగుదేశం, వైసీపీ అభ్యర్థులు కేశినేని శివనాథ్, కేశినేని శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. వీరిలో తెలుగుదేశం అభ్యర్థి కేశినేని శివనాథ్ భార్య జానకీ లక్ష్మి, కుమార్తె స్నిగ్ధ, కుమారుడు వెంకట్, సోదరి కేశినేని శ్రీదేవి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తిరుగుతున్నారు. వైసీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయన కుమార్తెలు శ్వేత, హైమా ప్రచారంలో తిరుగుతూ ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

అసెంబ్లీ పరిధిలో

విజయవాడ తూర్పు అసెంబ్లీ పరిధిలో తెలుగుదేశం అభ్యర్థి గద్దె రామ్మోహన్‌కు మద్దతుగా ఆయన భార్య అనూరాధ, కుమారులు క్రాంతి, రాజేష్ తిరుగుతున్నారు. వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాష్‌కు మద్దతుగా ఆయన భార్య సుధీర ప్రచారం చేస్తున్నారు.

సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం అభ్యర్థి బొండా ఉమాకు మద్దతుగా ఆయన భార్య సుజాత, కుమారులు సిద్ధార్థ, రవితేజ ప్రచారం చేస్తుండగా, వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుకు మద్దతుగా ఆయన భార్య శ్రీవాణి, కుమార్తె సాయి అన్విత, అల్లుడు చక్రవర్తి, సోదరుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

- విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరితో పాటు ఆయన కుమారుడు కార్తీక్, కోడలు స్నేహ, కుమార్తె నాగ చాందిని ప్రచారం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో పాటు ఆయన కుమార్తె రేష్మా, కుమారుడు జావెద్ ప్రచారం చేస్తున్నారు.



కేశినేని శివనాథ్ సోదరి కేశినేని శ్రీదేవి ప్రచారం

ఆశలు నీరుగార్చి..

వైసీపీ పాలనలో పూర్తిగా పడకేసిన పట్టిసీమ పనులు



సైడ్‌వాల్ రివిటింగ్, లైనింగ్ పనులు నిలిచిన హనుమాన్‌జంక్షన్ వద్ద పట్టిసీమ కాలువ

పట్టిసీమ (పోలవరం కుడికాలువ) ఎత్తిపోతల పథకం ద్వారా పూర్తిస్థాయిలో నీరు అందించి కృష్ణా జిల్లా రైతుల కష్టాలు తీరుస్తామన్నారు. తాగునీటి సమస్యలేకుండా చేస్తామన్నారు. ఒక్కసారి అధికారమిస్తే అద్భుతాలు చేస్తామని వైసీపీ నేతలు గతంలో హామీ ఇచ్చి గెలిచారు. అధికారంలోకొచ్చిన ఐదేళ్లలో రైతులకు, జనానికి అరచేతిలో వైకుంఠం చూపారు. పట్టిసీమను వట్టిసీమగా మార్చేశారు. పనులు వేగవంతం చేసి గత ప్రభుత్వం 8 వేల క్యూసెక్కుల నీటిని అందిస్తే వైసీపీ ప్రభుత్వం 6వేల క్యూసెక్కులు కూడా ఇవ్వలేదు. కాలువ పెండింగ్ పనులను గాలికి వదిలేసింది. కాలువ లైనింగ్, స్ట్రక్చర్ల పనులు ఆపేసింది. దీనికి తోడు పోలవరం ఎత్తిపోతల పథకం 24 పంపులను వినియోగించకపోవడంతో కృష్ణాడెల్టాకు ఆశించినంత నీరు ఇవ్వకుండా పంటలను ఎండబెట్టింది. రైతుల ఆశలను నీరుగార్చింది.

- ఎక్కడికక్కడే నిలిచిపోయిన కాలువ పనులు
- అసంపూర్తిగా మిగిలిన లైనింగ్, స్ట్రక్చర్ల నిర్మాణాలు
- టీడీపీ హయాంలో కృష్ణానదికి 8వేల క్యూసెక్కులు సరఫరా
- వైసీపీ ప్రభుత్వంలో ముక్కీమూలిగీ 6వేల క్యూసెక్కులే సరఫరా

హనుమాన్‌జంక్షన్ : గోదావరి మిగులు జలాలను కృష్ణా నదికి తరలించి కృష్ణాడెల్టాతో పాటు రాయలసీమ ప్రాజెక్టులకు సాగునీటిని అందించే లక్ష్యంతో పట్టిసీమ ఎత్తిపోతల పథకం పనులు 2005లో ప్రారంభం అయ్యాయి. పోలవరం ప్రాజెక్టు నుంచి విజయవాడ కృష్ణా నది వరకు 178 కి.మీ పొడవునా పట్టిసీమ (పోలవరం కుడికాలువ) సాగుతుంది. రూ.1660 కోట్లుతో సాగే ఈ కాలువపై అండర్ టన్నెల్స్, ఇతరేతర నిర్మాణాలు 255 వరకు నిర్మించాల్సి ఉంటే 175 పూర్తయ్యాయి. 55 నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కృష్ణా డెల్టా కింద దాదాపు 13 లక్షలు ఎకరాలు ఆయకట్టు ఉంది. దీనికి 10 వేల క్యూసెక్కుల నీరు అవసరం ఏర్పడుతుంది. పట్టిసీమ 24 పంపులు ద్వారా విజయవాడ ప్రకాశం బ్యారేజీకి సాగు, తాగునీటి అవసరాలకు 8 వేల క్యూసెక్కుల నీటిని తరలించే అవకాశం ఉన్నప్పటికీ జగన్ ప్రభుత్వం ఆ పంపులను కూడా సరిగ్గా నిర్వహించలేదు. కేవలం 16 పంపులను మాత్రమే వినియోగించింది. దీంతో బ్యారేజీకి 5 నుంచి 6వేల క్యూసెక్కుల నీరు చేరడమే కష్టమైంది. ఫలితంగా ఈ ఏడాది అవనిగడ్డ ప్రాంతంలో వరికి సాగు నీరు అందక పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొంది.

టీడీపీ పాలనలో ఇలా..

రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టిసీమ కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేశారు. కృష్ణాడెల్టాకు నీటి కొరతను తీర్చడానికి 2015 ఆగస్టులో ప్రయోగాత్మకంగా 2వేల క్యూసెక్కుల నీటిని పట్టి సీమ ఎత్తిపోతల ద్వారా విడుదల చేశారు. లైనింగ్, స్ట్రక్చర్ల పనులు పూర్తి కానప్పటికీ కృష్ణా డెల్టాలోని నీటి సమస్యను పరిష్కరించడానికి పట్టిసీమ నీటిని విడుదల చేశారు. తొలిసారిగా 2016 ఖరీఫ్ సీజన్‌లో 8వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. అప్పటి నుంచి రెగ్యులర్‌గా నీటిని విడుదల చేస్తూ వస్తున్నారు. కాలువలో ఉన్న పెండింగ్ పనులు ఖరీఫ్ సీజన్ పూర్తికాగానే తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతూ వచ్చేది.

వైసీపీ పాలనలో ఇలా..

జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం 2019 నుంచి పట్టిసీమను నిర్లక్ష్యం చేసింది. గడిచిన ఐదేళ్లలో ఏ ఒక్క పని చేపట్టలేదు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదు. కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కాలువకు అడ్డంగా సాగిన వాగులు వద్ద నిర్మించాల్సిన సూపర్ పాస్‌లు, అండర్ టన్నెల్స్ పనులు ఆగిపోయాయి. కృష్ణా జిల్లాలో హనుమాన్‌జంక్షన్ సమీపంలోని మర్రిబంధం నుంచి విజయవాడ వరకు 5,6,7 రీచ్ (దశలు)గా సాగాయి. 5వ రీచ్‌లో 2.5 కి.మీ పొడవున లైనింగ్ చేయాల్సి ఉంది. 6, 7 రీచ్‌ల్లో అక్కడక్కడా లైనింగ్, పలు స్ట్రక్చర్లు నిర్మాణం పనులు మిగిలాయి. ప్రధాన రహదారులపై నిర్మించిన వంతెనల వద్ద లైనింగ్, వంతెన సపోర్టు కాంక్రీట్ పనులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. బహుళ ప్రయోజనాలు అందించే పట్టిసీమ కాలువ పెండింగ్ పనులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న వైసీపీ ప్రభుత్వంపై రైతులు మండిపడుతున్నారు.



వేలేరు వద్ద అసంపూర్తిగా మిగిలిన సూపర్ పాస్

'కారు' గుర్తును పోలినట్లుగా ఉన్న ట్రాక్టర్, రోడ్డు రోలర్ గుర్తులనే ఇతరులకు కేటాయించొద్దని తెలంగాణలో బీఆర్ఎస్ ఎన్నికల కమిషన్‌ను కోరింది. కానీ... ఇక్కడ ఏకంగా జనసేన గుర్తు అయిన గాజు గ్లాసును ఇండిపెండెంట్లు, ఇతరుకు ఇచ్చేశారు. ఇదేం నిబంధన?

తెలంగాణలో ఏ ఒక్కరూ గాజు గ్లాసు గుర్తు కావాలని కోరలేదు. ఈసీ ఇవ్వలేదు. కానీ... ఏపీలో మాత్రం మరే గుర్తులూ అందుబాటులో లేనట్లుగా గాజు గ్లాసు కోరి తీసుకున్నారు. అంటే.. కూటమి ఓట్లు చీల్చాలనే దురుద్దేశం ఉన్నట్లే కదా?

'గ్లాసు'పై కుట్ర



- ఓట్ల చీలికకు వైసీపీ పన్నాగం
- కామన్ సింబల్‌గా మారిన గాజుగ్లాసు
- జనసేన అభ్యర్థులందరికీ అదే గుర్తు
- ఇతర స్థానాల్లో అందరికీ అందుబాటులో
- 16 అసెంబ్లీ, 3 ఎంపీ స్థానాల్లో కేటాయింపు
- జనసేన అభిమానులను గందరగోళపరిచే కుట్ర
- పొద్దుపోయేదాకా రిటర్నింగ్ ఆఫీసుల సహకారం!
- పలుచోట్ల గుర్తు కేటాయింపులో జాప్యం!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'జనసేన' గుర్తు... గాజు గ్లాసు! మరి... ఇతరులకూ అదే గుర్తు కేటాయిస్తే!? ఓట్లాటలో మాయోపాయానికి తెరలేపినట్లే! కూటమి ఓట్లను చీల్చే కుట్ర అమలు చేస్తున్నట్లే! ఓటమి భయం పట్టుకున్న వైసీపీ... ఇప్పుడు ఇదే దొంగాట మొదలుపెట్టింది. జనసేన అభ్యర్థులు లేనిచోట... జనసేన గుర్తయిన గాజు గ్లాస్‌ను స్వతంత్రులకు కోరి సాధించుకునేలా కుట్ర పన్నింది. రాష్ట్రంలో టీడీపీ - జనసేన - బీజేపీ కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో జనసేన 21 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. కూటమిగా పోటీ చేస్తున్నందున... జనసేనకు మాత్రమే గాజు గ్లాసు గుర్తు కేటాయించాలని, ఇతరులకు ఆ గుర్తు ఇవ్వొద్దని ఇప్పటికే ఈసీని కోరారు. అయితే... జనసేన పార్టీకి చెందిన గాజుగ్లాస్‌ను ఈసీ కామన్ సింబల్‌గా ప్రకటించింది. అంటే... జనసేన తరఫున బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ఇదే గుర్తును కేటాయిస్తారు. అదే సమయంలో... ఆ పార్టీ పోటీ చేయని స్థానాల్లో కామన్ సింబల్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థులకు గాజుగ్లాస్ గుర్తును ఇచ్చేశారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన కొద్ది సేపటికే ఇండిపెండెంట్లకు గుర్తుల కేటాయింపు పూర్తిచేయాలి. కానీ... సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తయినా, రాత్రి పొద్దుపోయేదాకా పలుచోట్ల ఈ ప్రక్రియ ముగియలేదు. అంటే... గ్లాసు గుర్తు కోరుకునే వారికోసమే ఈ కాలయాపన చేశారనే అనుమానాలు తలెత్తుతున్నాయి. కడపటి వార్తలు అందేసరికి... రాష్ట్రవ్యాప్తంగా 16 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాల్లో ఇండిపెండెంట్లు, ఇతరులకు గాజుగ్లాసు గుర్తు కేటాయించినట్లు తెలిసింది. ఇందులో... బీజేపీ ఎంపీ అభ్యర్థులున్న అనకాపల్లి, రాజమహేంద్రవరం కూడా ఉన్నాయి. నారా లోకేశ్ పోటీ చేస్తున్న మంగళగిరిలోనూ ఒక అభ్యర్థికి గ్లాసు గుర్తు కేటాయించారు.

అసలు ఉద్దేశం అదేనా...

గత ఏడాది చివర్లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గాజు గ్లాసు కామన్ సింబల్‌గా అందుబాటులో ఉంది. కానీ... దానిని ఎవరూ కోరలేదు. ఈసీ కూడా ఎవరికీ ఇవ్వలేదు. ఇప్పుడు, ఆంధ్రప్రదేశ్‌లో కొందరు ఏరికోరి గాజు గ్లాసునే కోరుకోవడం, వారికి ఈసీ అదే గుర్తు కేటాయించడం గమనార్హం! గత ఎన్నికల్లో జనసేన గాజు గ్లాసు గుర్తుతోనే పోటీ చేసింది. ఈసారీ కూటమిలో భాగస్వామిగా ఉన్న పవన్... గాజు గ్లాసునే తమ గుర్తుగా బలంగా ప్రచారం చేస్తున్నారు. అలాంటిది... జనసేన అభ్యర్థులు లేని చోట ఇతరులకు ఆ గుర్తు కేటాయించడం గమనార్హం. అందులోనూ... జనసేన రెబల్స్ కోరిమరీ ఈ గుర్తును పొందారు. ఆయా నియోజకవర్గాల్లో జనసేన అభిమానులు కొందరైనా ఈ గుర్తును చూసి గందరగోళానికి గురవుతారన్నదే వీరి ఉద్దేశం. ఉదాహరణకు...


- జగ్గంపేట నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్రకు గాజుగ్లాసు గుర్తు కేటాయించారు. ఆయన మొన్నటి వరకూ జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఆ నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగారు. పొత్తుల్లో భాగంగా తనకు పార్టీ నుంచి సీటు రాలేదన్న ఉద్దేశంతో బయటకు వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పుడు ఆయనకు ఏకంగా గాజుగ్లాసు గుర్తు లభించింది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో పెద్దాపురం, కాకినాడ సిటీ, రామచంద్రాపురం, అమలాపురం, ముమ్మడివరం, కొత్తపేట, మండపేట, కొవ్వూరు స్థానాల్లో వివిధ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులకు 'గాజుగ్లాసు' కేటాయించారు.
- అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపీగా పోటీ చేస్తున్న వడ్లమూరి కృష్ణస్వరూప్‌కు గాజుగ్లాస్ గుర్తు కేటాయించారు. ఆ పార్లమెంట్ పరిధిలో అనకాపల్లి, యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల నుంచి జనసేన పార్టీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బీజేపీ తరఫున సీఎం రమేశ్ పోటీ చేస్తున్నారు.
- విజయవాడ పార్లమెంటు స్థానంలో నవతరం పార్టీ అభ్యర్థి కృష్ణ కిశోర్‌కు కూడా గాజు గ్లాసు కేటాయించారు.
- రాజమండ్రి లోక్‌సభ బరిలో కూటమి అభ్యర్థిగా పురందేశ్వరి పోటీలో నిలిచిన సంగతి తెలిసిందే. ఇక్కడా ఒక ఇండిపెండెంట్‌కు గాజుగ్లాసు కేటాయించారు.
- టీడీపీ జాతీయ కార్యదర్శి బరిలో మంగళగిరిలోనూ ఒకరికి గాజు గ్లాసు ఇచ్చేశారు.
- విజయవాడ సెంట్రల్‌లో ఆంధ్ర రాష్ట్ర ప్రజాసమితి అభ్యర్థి గొల్లపల్లి ఫణిరాజ్, మైలవరంలో ఇండిపెండెంట్ అభ్యర్థి వల్లభనేని నాగపవన్ కుమార్‌కూ ఇదే గుర్తు ఇచ్చారు.
- విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత అదే నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. ఆమెకు ఈసీ గాజుగ్లాసు గుర్తు కేటాయించింది.
- ఎన్టీఆర్ జిల్లా గన్నవరం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి వల్లభనేని మోహన వంశీకి గాజుగ్లాసు గుర్తు కేటాయింపు.
- టెక్కలిలో స్వతంత్ర అభ్యర్థి అట్టాడ రాజేశ్‌కు గ్లాస్ గుర్తు కేటాయించారు.
- బాపట్ల నియోజకవర్గంలో వైసీపీ ఎంపీపీగా ఉన్న డి.సీతారామరాజు ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచారు. ఆయనకు గ్లాసు గుర్తు కేటాయించారు.
- శ్రీకాళహస్తిలోనూ ఒక ఇండిపెండెంట్‌కు గ్లాసుగుర్తు ఇచ్చారు.

రాష్ట్రంలో నామినేషన్ల ఉపసంహరణ పూర్తి

- తుది సంఖ్యను ప్రకటించని ఈసీ

అమరావతి, ఏప్రిల్ 29: రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగిసింది. దీంతో 25 లోక్‌సభ, 175 శాసనసభ నియోజకవర్గాల్లో ఎవరెవరు పోటీచేస్తున్నారో స్పష్టత వచ్చింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా బరిలో నిలిచినవారు ఎంతమంది... ఏయే పార్టీల తరఫున ఎవరెవరు పోటీచేస్తున్నారో తుది జాబితాను అర్ధరాత్రి దాటినా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కార్యాలయం ప్రకటించలేదు.

న్యాయానికి జగన్ సంకెళ్లు..!



Bar of jurisdiction of Civil Courts. 38. No civil court shall have jurisdiction to entertain any proceedings in respect of any matter, in which any Title Registration Officer and Land Titling Appellate Officer appointed under this Act, are empowered by or under this Act to determine.

- సివిల్ కోర్టుల ప్రమేయాన్ని నిషేధించిన టైటిల్ చట్టం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వెబ్‌ల్యాండ్ ఆర్ఓఆర్‌లో రాత్రికి రాత్రే ఓ రెవెన్యూ అధికారి తన లాగిన్ ద్వారా ఓ పేద రైతు సాగు భూమిని మరో రైతు పేరిట మార్చేస్తాడు. అదేమంటే ఆర్డీవో దగ్గర అప్పీల్ చేసుకోమంటాడు. ఆ అధికారి అక్రమంగా రికార్డులు మార్చేశాడని ఆధారం ఉంటే బాధిత రైతు సివిల్ కోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేయవచ్చు. తన భూమిని వెనక్కి తెచ్చుకోవడంతోపాటు తప్పుచేసిన అధికారిపై చట్టపరమైన చర్యలు కోరవచ్చు. సివిల్ కోర్టులు ఆ కేసును విచారించి న్యాయం చేస్తాయి. ఇదీ ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాస్‌పుస్తకం చట్టం-1971 (ఆర్ఓఆర్-రికార్డ్ ఆఫ్ రైట్స్) రైతుకు కల్పిస్తోన్న చట్టబద్ధమైన హక్కు. కానీ, సీఎం జగన్ తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు (ల్యాండ్ టైటిల్) చట్టం-2022 ఈ హక్కును నిరాకరిస్తోంది. చట్టం అమలుకు ముందు, తర్వాత భూమిపై వివాదం వస్తే తక్షణ న్యాయం కోరుతూ సివిల్ కోర్టుకెళ్లడానికి లేదు. అలాగని సివిల్ కోర్టులు జోక్యం చేసుకోవాడానికి కూడా వీల్లేదు. ఈ మేరకు టైటిల్ చట్టంలోని చాప్టర్-6 లోని 38వ క్లాజు కింద సివిల్ కోర్టుల ప్రమేయాన్ని నిషేధించారు. అంటే రైతులు న్యాయంపొందే హక్కును నిలువరించినట్టే..! న్యాయం కోరుతూ రైతు సివిల్ కోర్టు మెట్లు ఎక్కకుండా ప్రభుత్వం అడ్డుగోడ కట్టిందని స్పష్టమవుతోంది. గత అక్టోబరు 17న ఈచట్టాన్ని గజిట్ పబ్లికేషన్ చేసింది. అక్టోబరు 31నుంచే అమల్లోకి వచ్చినట్టుగా నవంబరు 1న జగన్ సర్కారు జీవో 512ను జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వును రహస్యంగా ఉంచింది.

అంతా జగనేచ్ఛ...

సర్కారు చర్యను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నవంబరు నుంచే ఆందోళనలు మొదలయ్యాయి. టైటిల్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని రాజకీయ పార్టీలూ డిమాండ్ చేస్తున్నాయి. న్యాయవాదులు, బార్ అసోసియేషన్‌లు చేస్తోన్న ఆందోళనలకు ప్రజామద్దతు పెరిగింది. టైటిల్ చట్టంపై హైకోర్టులో కేసు దాఖలు కాగా తాము ఆ చట్టాన్ని అమలు చేయడం లేదని సర్కారు అబద్ధాలు చెప్పింది. అయితే, అదే అంశంపై అఫిడవిట్ వేయాలని కోరింది. ఒక వైపు హైకోర్టును తప్పుదోవ పట్టించేలా, టైటిల్ చట్టం అమలులో కీలకమైన ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేస్తూ గత డిసెంబరు 29న సర్కారు జీవో 630ని జారీచేసింది. ఆ ఉత్తర్వును కూడా సీక్రెట్‌గానే ఉంచింది. టైటిల్ చట్టం అమల్లోకి రాలేదని రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు, చట్టాన్ని అమలు చేయడం లేదని ప్రభుత్వం పదేపదే ప్రకటనలిస్తూ రహస్యంగా చట్టం అమలులో కీలకమైన అథారిటీని ఏర్పాటు చేస్తూ జీవో ఇవ్వడం జగన్‌కే చెల్లింది. అంటే.. దేశంలోనే తొలిసారిగా అంటూ తాను తీసుకొచ్చిన చట్టాన్ని సకల వర్గాలు వ్యతిరేకించడం జగన్‌కు ఇష్టంలేదు. తాను ఏ చట్టం తీసుకొచ్చినా కోర్టులతోపాటు అంతా ఆమోదించాలని ఆయన కోరుకుంటారు. అలాంటిది ఆ చట్టం అమలుపై ప్రజలు మూకుమ్మడి పోరాటాలు చేయడం ఆయనకు నచ్చలేదు. అందుకే సీక్రెట్‌గా టైటిల్ చట్టం అమలుకు ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేసేశారు. చట్టం అమలుకు ఇంకా రూల్స్ ఇవ్వలేదు కాబట్టి అది అమల్లో లేదనే వితండవాదాన్ని ప్రభుత్వం వినిపిస్తోంది. ఇది కూడా తప్పే. చట్టం 2023, అక్టోబరు 31 నుంచే అమల్లోకి వచ్చినట్టుగా ఇచ్చిన జీవో 512 ఇంకా అమల్లోనే ఉంది. దాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోలేదు. వీటిన్నింటినీ పరిశీలిస్తే సర్కారు బయటకు చెప్పేది ఒకటి, చేసేది మాత్రం తను అనుకున్నదే అని స్పష్టమైంది. టైటిల్ చట్టం గత అక్టోబరులో వచ్చింది. కానీ అంతకు ముందే, 2022 నుంచే శాశ్వత భూ హక్కు పేరిట పాసుపుస్తకాలు ఇచ్చారు. ఆర్ఓఆర్ చట్టం-1971 అమల్లో ఉండగా, టైటిల్ చట్టం పేరిట భూ హక్కు పత్రాలు ఎలా ఇస్తారు..? జగన్ కంటే లాజిక్ తెలియక పోవచ్చు. సీనియర్ ఐఏఎస్‌లకు ఈ మాత్రం తెలియదా..? పైగా టైటిల్ చట్టం కింద ఇస్తున్న పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మలు నింపేశారు. ఇది కూడా ఇప్పుడున్న ఆర్ఓఆర్ చట్టానికి విరుద్ధమే. అంటే అధికారులు తెలిసితెలిసీ జగన్ మెప్పుకోసం, ఆయన సేవలో తరించేందుకు ఈ పనులు చేస్తున్నట్టు కనిపిస్తోంది.

టైటిల్ చట్టంలో అధికారులే సుప్రీమ్

అధికారులు తప్పుచేస్తే రైతులు న్యాయపోరాటం చేసే అవకాశం ఆర్ఓఆర్ చట్టం కల్పిస్తోంది. కానీ టైటిల్ చట్టం ఆ అవకాశాన్ని అడ్డుకుంది. రైతుకు శాశ్వత హక్కు ఇచ్చే అధికారం టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారిదే. ఒకవేళ ఎవరైనా ఆ భూమి తనదేనని ముందుకొస్తే భూమిని వివాద రిజిస్టర్‌లో ఉంచుతారు. రైతు ఆ భూమి తనదే అని నిరూపించుకోవాలి. లేదంటే చేజారిపోతుంది. ఆ భూమిపై టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి నిర్ణయమే ఫైనల్. సివిల్ కోర్టు న్యాయమూర్తికి ఉండే అధికారాలను ఆ పోస్టుకు చట్టబద్ధంగా కట్టబెట్టారు. ఆ అధికారి తీసుకునే నిర్ణయం రైతుకు నచ్చకపోతే ల్యాండ్ అప్పీలేట్ అధికారి వద్ద అప్పీల్ చేసుకోవాలి. అక్కడా న్యాయం దొరక్కపోతే రాష్ట్రస్థాయి అప్పీలేట్ వద్ద అప్పీల్ చేసుకోవాలి. అక్కడ కూడా న్యాయం లభించకపోతే ఇక ల్యాండ్ అథారిటీని ఆశ్రయించాలి. అంతే, తప్ప సివిల్ కోర్టులకు వెళ్లడానికి ఈ చట్టం అనుమతించదు. రైతుకు ల్యాండ్ అథారిటీ కూడా న్యాయం చేయకపోతే చివరి ప్రయత్నంగా హైకోర్టును ఆశ్రయించాలి. ఒక సాధారణ పేద రైతు భూమి కోసం ఏళ్ల తరబడి టైటిల్ అధికారుల చుట్టూ ఈ చట్టం తిప్పుతుంది. అక్కడా న్యాయం దొరక్కపోతే హైకోర్టుకే వెళ్లమంటోంది. ఓ పేదరైతు హైకోర్టుకు వెళ్లడం అయ్యే పనేనా..? అంటే.. పేద రైతులకు సాధ్యం కాని క్లాజులు, నిబంధనలు చేర్చడం ద్వారా సర్కారు టైటిల్ అధికారులను సూపర్ పవర్ చేయాలనుకుంటోంది.

ప్రభుత్వ పెద్దల మనుషులే అధికారులు

ఆర్ఓఆర్ చట్టం అమలులో భాగంగా తహసీల్దార్, ఆర్డీవో, డీఆర్వోలు ఉన్నారు. ఆర్డీవో, డీఆర్వోలుగా డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తారు. ఈ పోస్టింగ్‌లు ప్రభుత్వ పెద్దల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉన్నాయి. సొంత మనుషులు అనుకున్న వారినే కీలక ప్రాంతాలకు ఆర్డీవోలుగా నియమిస్తున్నారు. ఇక నమ్మకస్తులనుకున్న వారిని కీలకమైన మండలాలకు తహసీల్దార్లుగా పంపిస్తున్నారు. పోస్టింగ్‌లు తీసుకున్న తర్వాత ఎవరెవరు ఏం చేస్తున్నారో ప్రజలకు సుపరిచితమే. చివరకు పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఎన్‌వోసీలు ఇవ్వడానికి కూడా లక్షల రూపాయల లంచం తీసుకుంటున్న ఆర్డీవో, తహసీల్దార్లు ఉన్నారు. తిరుపతి ఉదంతమే ఇందుకు నిదర్శనం. ప్రకాశం జిల్లాలోనూ ఓ తహసీల్దార్ రాత్రికి రాత్రే భూమి రికార్డులు మార్చేసిన ఉదంతంలో రైతు కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. అలాగని, అందరూ అక్రమాలకు పాల్పడటం లేదు. కీలకమైన డివిజన్లు, మండలాల్లో అడ్డగోలు పద్ధతుల్లో పోస్టింగ్‌లు తెచ్చుకున్నవారే రైతులను రాచిరంపాన పెడుతున్నారు. ఇక టైటిల్ చట్టం వస్తే ప్రభుత్వ పెద్దల జోక్యం మరింత పెరిగిపోతుంది. డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులుగా నియమిస్తారు. కీలకమైన ఈ పోస్టుల్లో తమ సొంత మనుషులే ఉండాలని నేతలు, ప్రభుత్వ పెద్దలు ఆరాటపడుతుంటారు. వారి ఆశీస్సులతో పోస్టులు పొందేవారు రైతులకు ఏం మేలు చేస్తారు..? పైగా, వారికి సివిల్ కోర్టు అధికారాలు ఇచ్చి మరింత సూపర్ పవర్‌గా చేయాలని చట్టం చెబుతోంది.

'ల్యాండ్ టైటిల్' రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాదు

- ఈ చట్టాన్ని మేం అమలు చేయడం లేదు: మంత్రి ధర్మాన

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్ 29: భూయాజమాన్య హక్కు (ల్యాండ్ టైటిల్ యాక్ట్) రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాదని, కేంద్రంలోని బీజేపీ సర్కారు నిర్ణయమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం వైసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నీతి ఆయోగ్ సూచనల మేరకు అన్ని రాష్ట్రాలూ ఈ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందన్నారు. అయితే దీనిపై వైసీపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలూ ఈ చట్టంపై ఏకాభిప్రాయానికి వచ్చినప్పుడు దాని అమలుపై వైసీపీ ఆలోచిస్తుందని తెలిపారు. ఇప్పుడు ఈ చట్టాన్ని వైసీపీ అమలు చేయదని, దీనిపై చర్చకు తాను సిద్ధమని అన్నారు.

అక్రమ ఇసుక తవ్వకాలు ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

జలాలతో పాటు ఇతర ప్రదేశాల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఎన్జీటీలో గతంలో నరేంద్ర కుమార్‌తో పాటు పలు సంస్థలు పిటిషన్ దాఖలు చేశాయి. ఇసుక అక్రమతవ్వకాలను తక్షణమే నిలిపి వేయాలని ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ జేపీ వెంచర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. నరేంద్ర కుమార్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఏపీలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. న్యాయస్థానాలు, ట్రిబ్యునల్స్ ఆదేశాలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఇదంతా జరుగుతోందని, దీనికి అధికారులు, సిబ్బంది సహకరిస్తున్నారని తెలిపారు. దీనితో ఏపీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. పర్యావరణ అనుమతులు లేకుండా జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. అనుమతులు ఉన్న చోట తవ్వకాలు జరిపే సమయంలో అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. పిటిషనర్ నరేంద్రకుమార్ ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడినవారిపై ఎఫ్ఆర్ఐ దాఖలు చేయాలని, అలసత్వం తగదని హెచ్చరించింది. అక్రమ తవ్వకాలపై అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, ఏపీ ప్రభుత్వ సహకారంతోనే అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, కావున ప్రభుత్వంతో పాటు కేంద్ర పర్యావరణ, అటవీశాఖను సైతం అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించాలని సిద్ధార్థ లూథ్రా కోరారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం మే 9లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వంతో పాటు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. అక్రమ ఇసుక తవ్వకాలు జరపడం లేదని అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని జేపీ వెంచర్స్‌ను ఆదేశించింది. ఏపీలో ఎన్నికలు జరుగుతున్నందున తమకు సమయం కావాలని ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కోరారు. దీనిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల కంటే పర్యావరణ అంశాలే ముఖ్యమని స్పష్టం చేసింది. ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ మే 9వ తేదీలోపే అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను మే 10వ తేదీకి వాయిదా వేసింది.

ఏపీలో యథేచ్ఛగా తవ్వకాలు..

ఆంధ్రప్రదేశ్‌లో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని పిటిషనర్ నరేంద్ర కుమార్ ఆరోపించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై పోరాడుతున్న ఆయన సోమవారం సుప్రీంకోర్టులో విచారణ తర్వాత మీడియాతో మాట్లాడారు. ఏపీలో అక్రమ ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడం ఏపీ ప్రజల విజయమని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇష్టానుసారంగా ఇసుక మాఫియా సాగిస్తున్నారని, దీనికి అధికారులు అన్నివిధాలా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇసుక తవ్వకాలు జరగడం లేదని ఇటీవలే కలెక్టర్లు నివేదిక ఇచ్చారని, అన్ని జిల్లాల కలెక్టర్లు ఇచ్చిన నివేదికలో అక్షరం పొల్లుపోకుండా కాపీ పేస్ట్ చేశారని విమర్శించారు. సంతకాలు మాత్రమే కలెక్టర్లవని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా.. ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలు మాత్రం ఆగలేదని తెలిపారు. సోమవారం రాత్రి వరకు గుంటూరు జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతూనే ఉందని ఆరోపించారు. దీనిపై మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు.

ఇంటికొచ్చి ఇచ్చేందుకు ఇంకేం బాధ?

ఏప్రిల్‌లో ఇలా...

ఏప్రిల్ 3వ తేదీ వరకు ఖజానాలో చిల్లిగవ్వ లేదు. అవ్వాతాతలకు పింఛనుగా అందించాల్సిన సొమ్మును అస్మదీయ కాంట్రాక్టర్లకు ఇచ్చేశారు. ఏప్రిల్ 2వ తేదీన ఆర్బీఐ నుంచి రూ.4000 కోట్ల అప్పు తెచ్చారు. ఆ డబ్బు 3వ తేదీన రాష్ట్ర ఖజానాలోకి వచ్చాయి. అక్కడి నుంచి సెర్ప్ ఖాతాకు, అక్కడి నుంచి పంచాయతీలకు పంపారు. అందుకే ఏప్రిల్ 3వ తేదీ మధ్యాహ్నం అక్కడక్కడా పెన్షన్లు పంపిణీ చేశారు. ఏప్రిల్ 4 నుంచి అన్ని ప్రాంతాల్లో పెన్షన్లు ఇవ్వడం మొదలుపెట్టారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు! మే 1వ తేదీనాటికి అవసరమైన నిధులన్నీ సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

వేసవిలో, మండుటెండల్లో అవ్వా తాతలను ఇబ్బంది పెట్టడం అవసరమా? ఏప్రిల్ 3దాకా ఖజానాలో డబ్బులూ లేవు. నిధులు వచ్చిన తర్వాత కూడా అవ్వాతాతలతో ఆడుకున్నారు. సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పింఛను పంపిణీకి అవకాశమున్నా ఆ పని చేయలేదు. వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బంది పెట్టేందుకు, వలంటీర్లులేకుంటే వ్యవస్థ ఆగిపోతుందని చెప్పేందుకే గత నెలలో ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేపట్టలేదు. ఈ నెలలో నిధులకు సమస్య లేదు. మంగళవారం ఆర్బీఐ నుంచి రూ.3,000 కోట్లు అప్పు తెస్తున్నారు. ఖజానాలో ఉన్న డబ్బు, ఈ అప్పు కలిపితే సామాజిక పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లను ఒక్క రోజులోనే ఇచ్చేయొచ్చు. పింఛన్ల పంపిణీకి సచివాలయ సిబ్బంది 'మేము సిద్ధం' అంటున్నారు. "ప్రభుత్వం ఒక మెసేజ్ పెడితేచాలు పెన్షన్ల పంపిణీ రెండు రోజుల్లో పూర్తిచేస్తాం. పనికిరాని పనులన్నీ చెప్పి విసిగిస్తున్నారు. పెన్షన్లు పంపిణీలాంటి మంచి కార్యక్రమాలకు పనికిరామా?" అని ప్రశ్నిస్తున్నారు. ఇంటింటికీ పింఛను పంపిణీపై సచివాలయ సిబ్బంది మనసులో మాటేమిటి? ఈ పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారా అని 'ఆంధ్రజ్యోతి' ఆరా తీసింది. పేర్లు బయటపెట్టడానికి ఇష్టపడని ఉద్యోగుల నేతలు, సిబ్బంది మొత్తం 'పెన్షన్ల పంపిణీకి మేం సై' అనే చెప్పారు. "ఈ విషయంలో ప్రభుత్వ వైఖరి అంతుపట్టడంలేదు.ఇతర కార్యక్రమాలకు మమ్మల్ని బాగా వాడుకుంటున్నారు. రేషన్ పంపిణీ పర్యవేక్షణ విధులు అప్పగించారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రత పర్యవేక్షణకు, మద్యం షాపుల వద్ద క్యూ నిర్వహణకూ పంపించారు. అలాంటిది పెన్షన్ల పంపిణీకి ఎందుకు దూరం పెడుతున్నారో అర్థం కావట్లేదు. కొవిడ్ సమయంలో ఎక్కువమంది వలంటీర్లు జనాల్లోకి రాలేదు. ఆ సమయంలో మేం సేవలందించాం. అయితే... మేం చేసిన సేవను జగన్ వలంటీర్ల ఖాతాలో వేశారు" అని పేర్కొన్నారు.

రెండే రోజుల్లో పూర్తిచేయగలం...

ప్రభుత్వం ఆదేశిస్తే ఒకటి రెండు రోజుల్లోనే పెన్షన్లు పంపిణీ చేసి సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నామని సచివాలయ ఉద్యోగులు తెలిపారు. "రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సచివాలయంలో 8మంది నుంచి 14మంది చొప్పున 1.26 లక్షల మంది ఉద్యోగులం ఉన్నాం. సరాసరిన ఒక్కొక్కరు 50మందికి ఇచ్చినా ఒక్కరోజుల్లో పంపిణీ పూర్తి చేయవచ్చు. రోజుకు 25 మందికి ఇచ్చినా... రెండు రోజులు చాలు" అని పేర్కొన్నారు. వైసీపీ పెద్దల అడుగులకు మడుగులొత్తుతున్న ఉన్నతాధికారులు కావాలనే పెన్షన్ల పంపిణీని క్లిష్టతరం చేస్తున్నట్టు కనిపిస్తోందని సందేహం వ్యక్తం చేశారు. "గత నెలలో పెన్షన్లను డీబీటీ ద్వారా జమ చేయలేం అన్నారు. అందరికీ ఖాతాల్లేవని సెలవిచ్చారు. వారందరికీ ఇప్పుడు ఖాతాలెలా వచ్చాయి?" అని ప్రశ్నిస్తున్నారు. మరోసారి అవ్వాతాతలను ఇబ్బంది పెట్టేందుకే ఇలా చేస్తున్నట్టు అనుమానాలున్నాయని చెప్పారు. "పెన్షన్ అందకపోవడానికి ప్రతిపక్షాలే కారణమని బురదజల్లి రాజకీయ లబ్ధి పొందాలన్నదే వైసీపీ ఉద్దేశం. దీనికి కొందరు ఉన్నతాధికారులు సహకరిస్తున్నారు. ఇందులో భాగంగానే నగదు బదిలీని తెరపైకి తెచ్చారు" అని పలువురు సచివాలయ ఉద్యోగులు అభిప్రాయపడ్డారు.

వీరి సేవలు వాడుకోలేరా?

గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులు 1,27,498 మంది.. అంగన్వాడీ ఉద్యోగులు 99,117 మంది.. ఆశావర్కర్లు 41,416 మంది, పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి పరిధిలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, సంఘమిత్రలు 28,152 మంది, రెవెన్యూ శాఖ పరిధిలోని వీఆర్ఏలు, వీఆర్వోలు 30,000 మంది, మునిసిపల్ శాఖ శానిటరీ వర్కర్లు, సూపర్‌వైజర్లు 29,800 మంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఉద్యోగులు దాదాపు 20,000 మంది, పంచాయతీ కార్యాలయాల్లో ఉద్యోగులు దాదాపు లక్ష మంది, నాల్గవ తరగతి ఉద్యోగులు 60 వేల మంది ఉన్నారు. వీరి సేవలను రోజుకు రెండు గంటలు... రెండు రోజులు.. ఉపయోగించుకుంటే ఇంటింటికే ఈజీగా పింఛను పంపిణీ చేసేయొచ్చు. కానీ... అలా జరగడం వైసీపీ సర్కారుకు ఇష్టంలేదు.

ఇండిపెండెంట్‌ను నిర్బంధించిన సీఐ

- నామినేషన్ వెనక్కితీసుకోవాలని ఒత్తిడి
- ఆర్వోకు ఫిర్యాదు.. సీఐపై సస్పెన్షన్ వేటు

విశాఖపట్నం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నామినేషన్ వెనక్కి తీసుకోవాలంటూ స్వతంత్ర అభ్యర్థిని నిర్బంధించిన మల్కాపురం సీఐ ఎన్.సన్యాసినాయుడును పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ సోమవారం సస్పెండ్ చేశారు. పశ్చిమ నియోజక వర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా కొయిలాడ వెంకట జగదీశ్వరరావు అనే రౌడీషీటర్ నామినేషన్ వేశారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుంటారు. 28న మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు జగదీశ్వరరావు హాజరయ్యాడు. కౌన్సెలింగ్ తర్వాత రౌడీషీటర్లు పంపించేసిన సీఐ సన్యాసినాయుడు.. జగదీశ్వరరావును స్టేషన్‌లోని మొదటి అంతస్థుకు తీసుకువెళ్లి రెండున్నర గంటలపాటు నిర్బంధించారు. నామినేషన్‌ను వెనక్కి తీసుకోవాలంటూ అసభ్య పదజాలంతో దూషించి ఇబ్బందులకు గురిచేశారు. దీంతో జగదీశ్ స్టేషన్ మొదటి అంతస్థు నుంచి కిందికి దూకి పారిపోయేందుకు యత్నించగా సిబ్బంది పట్టుకున్నారు. ఇంటికి తీసుకువెళ్లి అప్పగించారు. సీఐ తీరుపై బాధితుడు రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తిని ఆర్వో ఆదేశించారు. విషయం సీపీ రవిశంకర్ అయ్యన్నార్ దృష్టికి చేరడంతో సీఐ సన్యాసినాయుడును ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు

- హైకోర్టుకు తెలిపిన స్వతంత్ర అభ్యర్థి విడదల రజనీ

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయకుండా విడదల రజనీ అనే ఎస్సీ మహిళను అధికార పార్టీ నేతల ఒత్తిడితో పోలీసులు అపహరించారని దాఖలైన పిటిషన్ సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టుకు హాజరైన రజని, ఆమె భర్త అనురాగారావు తమను ఎవరూ అపహరించలేదని తెలిపారు. ఈ వివరాలు నమోదు చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం వ్యాజ్యంపై విచారణను మూసివేసింది. విడదల రజని నామినేషన్ వేయకుండా అధికార పార్టీ నేతల ఒత్తిడితో నగరంపాలెం పోలీసులు అపహరించారంటూ రజనీ అభ్యర్థిత్వాన్ని బలపరిచిన పఠాన్ అస్మతుల్లా శుక్రవారం హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం రజనీ, ఆమె కుటుంబసభ్యులను పోలీసులు కోర్టు ముందు హాజరుపర్చారు. పోలీసుల తరఫు న్యాయవాది వివేకానంద వాదనలు వినిపించారు.

రూ.6కోట్ల బంగారం, వెండి సీజ్

రావులపాలెం, ఏప్రిల్ 29: సరైన బిల్లులు లేకుండా వాహనాల్లో తరలిస్తున్న బంగారం, వెండి వస్తువులను సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించినట్లు రావులపాలెం సీఐ ఆంజనేయులు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ ఇన్‌చార్జ్, రావులపాడు కార్యదర్శి పట్టాభిరామయ్య, సీఐ ఆంజనేయులు సిబ్బందితో సోమవారం వాహనాలు తనిఖీచేస్తున్నారు. విజయవాడ నుంచి అమలాపురం వెళ్తున్న బీవీసీ లాజిస్టిక్ వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో రూ.6,70,16,362 విలువైన 9.530కిలోల బంగారు ఆభరణాలు, 18.71గ్రాముల వెండి వస్తువులను గుర్తించారు. సరైన బిల్లులు చూపకపోవడంతో వాటిని సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సులో రూ.29లక్షలు పట్టివేత

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 29: శ్రీకాకుళంలోని ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడి వద్ద రూ.29.50లక్షల నగదును సర్వైలెన్స్ బృందం పట్టుకుంది. విశాఖపట్నానికి చెందిన కాంట్రాక్టర్ కలిదిండి వెంకటేశ్వరరాజు సోమవారం విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం ఏసీ బస్సులో ప్రయాణిస్తున్నారు. శ్రీకాకుళం సింహద్వారం వద్ద అధికారులు బస్సును ఆపి తనిఖీ చేయగా.. ఆయన బ్యాగులో 29.50 లక్షల నగదు కనిపించింది. మెళియాపుట్టిలో ఏకలవ్య స్కూల్ నిర్మాణానికి నగదు తీసుకెళ్తున్నట్లు వెంకటేశ్వరరాజు చెప్పారు. సరైన ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును శ్రీకాకుళం తహసీల్దార్ రాణి, డిప్యూటీ తహసీల్దార్ నానిబాబు ట్రెజరీకి అప్పగించారు.

ఆరుగురు నేతలపై టీడీపీ సస్పెన్షన్ వేటు

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన ఆరుగురు నేతలపై సస్పెన్షన్ వేటు పడింది. సివేరి అబ్రహం(అరకు), మీసాల గీత(విజయనగరం), పరమట శ్యాంసుందర్(అమలాపురం), ముడియం సూర్యచంద్రరావు(పోలవరం), వేటుకూరి వెంకట శివరామరాజు(ఉండి), జడ్డా రాజశేఖర్(సత్యవేడు)ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేనొస్తేనే పింఛన్లు, పథకాలు

- అంతా ఏకమై నన్ను ఓడించాలని చూస్తున్నారు
- జగన్ మాటల్లో బేలతనం...
- పి.గన్నవరం, చోడవరం, పొన్నూరులో ప్రచార సభలు

అనకాపల్లి/చోడవరం, కాకినాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)/పొన్నూరుటౌన్: మళ్లీ తాను ముఖ్యమంత్రి అయితేనే ఇంటింటికీ రేషన్, పింఛన్ వస్తాయని, సంక్షేమ పథకాలు కొనసాగుతాయంటూ... ఓటమి భయాన్ని కప్పిపెట్టుకునేందు సీఎం జగన్ ప్రయత్నించారు. ఎన్నికల్లో అంతా కలిపి తనను ఓడించాలని చూస్తున్నారని, తానేమో పేదలను గెలిపించాలని చూస్తున్నానని గొప్పలు పోయారు. కూటమి నేతలు తమ ఫొటోలతో 2014 ఎన్నికల్లో మేనిఫెస్టో విడుదల చేశారని, కానీ...ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా చోడవరం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం, గుంటూరు జిల్లా పొన్నూరులో జరిగిన ప్రచార సభల్లో ఆయన పాల్గొన్నారు. సంక్షేమాన్ని అందించే ఫ్యాన్ ఎక్కడ ఉండాలి అని జగన్ పదేపదే అడిగినా పెద్దగా జనంలో స్పందన లేదు. ఎన్నికల్లో తానొక్కడినే ఒకవైపు ఉన్నానని, మరోవైపు కూటమిగా చంద్రబాబు, పవన్, బీజేపీ, నోటా ఓట్లు కూడా రాని కాంగ్రెస్ ఉండి.. తనను ఓడించాలని చూస్తున్నారంటూ మొసలి కన్నీరు కార్చారు. సామాజిక పెన్షన్లు ఇంటికే రావాలన్నా, పథకాలు కొనసాగాలన్నా తాను మళ్లీ సీఎం అవాలని వేడుకున్నారు. ఇక పొన్నూరు సభలోనూ పాత పాటే పాడారు.



అంబాజీపేటలో జరిగిన ప్రచార సభలో మాట్లాడుతున్న జగన్

గుంటూరు ఎంపీ, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థులను మంచి వాడు, సౌమ్యుడు....మీ అందరికీ మంచి చేస్తాడు అంటూ జగన్ పరిచయం చేసిన తీరు వైసీపీ శ్రేణులనే ఒకింత ఆశ్చర్యపరిచింది. ఇక.. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ ఇద్దరూ మంచివాళ్లు, సౌమ్యులని వారిని గెలిపించాలని జగన్ కోరారు. అమలాపురం ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న రాపాక వరప్రసాద్ సౌమ్యుడు, మంచివాడంటూ జగన్ మెచ్చుకోవడంపై జనం నవ్వుకున్నారు. జగన్ ఎన్నికల బహిరంగ సభలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మన ప్రియతమ నేత జగన్మోహన్‌రెడ్డి అని కాకుండా, ప్రియతమ నేత కాబోయే సీఎం శ్రీ నారా చంద్రబాబు అని అనడంతో వైసీపీ నేతలను దిమ్మెరపోయారు. ఆ వెంటనే సవరించుకుని.. జగన్మోహన్‌రెడ్డి అంటూ సరిగ్గా పలికారు.



గుంటూరు జిల్లా పొన్నూరులో జగన్ ప్రసంగిస్తుండగానే జనం లేక వెలవెల పోతున్న సభ

అరగంట సభ.. ఐదుగంటలు నరకం

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సీఎం ఎన్నికల ప్రచార సభలో పోలీసుల అతి ప్రజలను నరకయాతనకు గురిచేసింది. అంబాజీపేటకు వచ్చేదారిలో రహదారికి ఇరువైపులా దుకాణాలను మూసివేయించారు. సీఎం వచ్చే దారిలో ఎవరినీ అనుమతించలేదు. సభకు వచ్చిన వారికి భోజనాలు అరకొరగా ఉండడంతో ఆహార ప్యాకెట్ల కోసం జనం పోటీపడ్డారు. ఆటోలు మోటార్‌సైకిళ్లను కిలోమీటర్ల దూరంలో పోలీసులు నిలిపివేయడంతో మహిళలు కాలినడకతో సభా స్థలానికి చేరుకోవడానికి అగచాట్లు పడ్డారు. పొన్నూరులో అరగంట సభకు ఐదుగంటలపాటు జనం, ప్రయాణికులకు నరకం చూపించారు. 4.30 గంటలకు సభ వద్దకు చేరుకున్న జగన్మోహన్ రెడ్డి అరగంట మాత్రమే ప్రసంగించి వెళ్లిపోయారు. ఈ మాత్రం దానికి సోమవారం ఉదయం నుంచే సీఎం దిగే హెలిప్యాడ్ వద్ద నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో దుకాణాలను తెరవనీయకుండా పోలీసులు మూయించి వేశారు. అడుగడుగునా బారికేడ్లు ఏర్పాటు చేసి వాహన రాకపోకలను ఐదు గంటల ముందుగా అడ్డుకున్నారు. 108 వాహనాన్ని సైతం వెళ్లకుండా వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. అనకాపల్లి జిల్లాలో సీఎం వస్తున్నారని అన్ని దుకాణాలు మూసేయించిన పోలీసులు.. మద్యం దుకాణాల జోలికి మాత్రం పోకపోవడం గమనార్హం. ఉదయం 10.30 గంటలకు హెలీకాప్టర్‌లో జగన్ అనకాపల్లి జిల్లా చోడవరం శివారునున్న కొత్తూరులో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు జగన్ సభ జరగడంతో సుమారు 4గంటల పాటు రెండు వైపుల నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతరత్రా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

ఆంధ్రజ్యోతి

అసెంబ్లీ అభ్యర్థులు వీరే..

నియోజకవర్గం	టీడీపీ+	వైసీపీ	కాంగ్రెస్+
శ్రీకాకుళం జిల్లా (10)			
1. ఇచ్ఛాపురం	బెందాళం అశోక్	పిరియా విజయ	ఎం. చక్రవర్తి రెడ్డి
2. పలాస	గౌతు శిరీష	సీదిరి అప్పలరాజు	మజ్జి త్రినాథ్ బాబు
3. టెక్కలి	కింజరాపు అచ్చెన్నాయుడు	దువ్వాడ శ్రీనివాస్	కిల్లి కృపారాణి
4. పాతపట్నం	మామిడి గోవిందరావు	రెడ్డి శాంతి	కొప్పురోతు వెంకటరావు
5. శ్రీకాకుళం	గొండు శంకర్	ధర్మాన ప్రసాదరావు	అంబటి కృష్ణారావు
6. ఆమదాలవలస	కూన రవికుమార్	తమ్మినేని సీతారాం	సనపల అన్నాజీరావు
7. ఎచ్చెర్ల	ఎన్.ఈశ్వర రావు (బీ)	గొర్లె కిరణ్‌కుమార్	కరిమజ్జి మల్లేశ్వర్‌రావు
8. నర్సన్నపేట	బగ్గు రమణమూర్తి	ధర్మాన కృష్ణదాస్	మంత్రి నరసింహ మూర్తి
9. రాజాం (ఎస్సీ)	కోండ్రు మురళీమోహన్	డాక్టర్‌తలే రాజేశ్	కంబాల రాజవర్ధన్
10. పాలకొండ (ఎస్టీ)	నిమ్మక జయకృష్ణ (జ)	విశ్వాసరాయి కళావతి	సరవ చంటిబాబు
విజయనగరం జిల్లా (09)			
11. కురుపాం (ఎస్టీ)	తోయక జగదీశ్వరి	పుష్పశ్రీవాణి పాముల	మండంగి రమణ (ఎం)
12. పార్వతీపురం (ఎస్సీ)	విజయ్‌చంద్ర బోనెల	అలజంగి జోగారావు	బత్తిన మోహన్‌రావు
13. సాలూరు (ఎస్టీ)	గుమ్మిడి సంధ్యారాణి	పీడిక రాజన్నదొర	మువ్వల పుష్పారావు
14. బొబ్బిలి	ఆర్‌వీఎస్‌కేకే రంగారావు	చినఅప్పలనాయుడు	మరిపి విద్యాసాగర్
15. చీపురుపల్లి	కిమిడి కళావెంకట్రావు	బొత్స సత్యనారాయణ	జమ్ము ఆదినారాయణ
16. గజపతినగరం	కొండపల్లి శ్రీనివాస్	బొత్స అప్పలనరసయ్య	డోలా శ్రీనివాస్
17. నెల్లిమర్ల	లోకం నాగ మాధవి (జ)	బి.అప్పలనాయుడు	సరగడ రమేశ్‌కుమార్
18. విజయనగరం	అదితి విజయలక్ష్మి గజపతిరాజు	కోలగట్ల వీరభద్రస్వామి	సుంకరి సతీశ్‌కుమార్
19. శృంగవరపుకోట	కోళ్ల లలితకుమారి	కె.శ్రీనివాసరావు	గేదెల తిరుపతి
విశాఖపట్నం జిల్లా (15)			
20. భీమిలి	గంటా శ్రీనివాసరావు	ముత్తంశెట్టి శ్రీనివాసరావు	ఎ. వెంకట వర్మ రాజు
21. విశాఖపట్నం (ఈస్ట్)	వెలగపూడి రామకృష్ణబాబు	ఎంవీవీ సత్యనారాయణ	గుత్తుల శ్రీనివాసరావు
22. విశాఖపట్నం (సౌత్)	వంశీకృష్ణయాదవ్ (జ)	వి.గణేశ్‌కుమార్	వాసుపల్లి సంతోష్
23. విశాఖపట్నం (నార్త్)	విష్ణుకుమార్ రాజు (బీ)	కేకే రాజు	లక్కవరపు రామారావు
24. విశాఖపట్నం (వెస్ట్)	పీజీవీఆర్ నాయుడు	ఆడారి ఆనంద్	అత్తిలి విమల (ఐ)
25. గాజువాక	పల్లా శ్రీనివాసరావు	గుడివాడ అమర్నాథ్	ఎం.జగ్గునాయుడు (ఎం)
26. చోడవరం	కేఎస్‌ఎన్‌ఎస్ రాజు	కరణం ధర్మశ్రీ	జగత్ శ్రీనివాస్
27. మాడుగుల	బండారు సత్యనారాయణమూర్తి	ఈర్లె అనురాధ	బి.బి.ఎస్. శ్రీనివాసరావు
28. అరకు (ఎస్టీ)	పాంగి రాజారావు (బీ)	మత్స్యలింగం	శెట్టి గంగాధరస్వామి
29. పాడేరు (ఎస్టీ)	గిడ్డి ఈశ్వరి	ఎం.విశ్వేశ్వరరాజు	సతకం బుల్లిబాబు
30. అనకాపల్లి	కొణతాల రామకృష్ణ (జ)	ఎం.భరత్‌కుమార్	ఇల్లా రామగంగాధరరావు
31. పెందుర్తి	పంచకర్ల రమేశ్ (జ)	అన్నంరెడ్డి అదీప్‌రాజు	పిరిడి భగత్
32. యలమంచిలి	ఎస్ విజయ్‌కుమార్ (జ)	యూ.రమణమూర్తి రాజు	తార్ నరసింగరావు
33. పాయకరావుపేట (ఎస్సీ)	వంగలపూడి అనిత	కంభాల జోగులు	బోని తాతారావు
34. నర్సీపట్నం	సీహెచ్ అయ్యన్న పాత్రుడు	పెట్ల ఉమాశంకరగణేశ్	ఆర్. శ్రీరామమూర్తి
తూర్పు గోదావరి జిల్లా (19)			
35. తుని	యనమల దివ్య	దాడిశెట్టి రాజా	గేలం శ్రీనివాసరావు
36. ప్రత్తిపాడు	వరుపుల సత్యప్రభ	వరుపుల సుబ్బారావు	ఎన్‌వీవీ సత్యనారాయణ
37. పిఠాపురం	పవన్ కల్యాణ్ (జ)	వంగా గీత	ఎం.సత్యానందరావు
38. కాకినాడ (రూరల్)	పంతం నానాజీ (జ)	కురసాల కన్నబాబు	పిల్లి సత్యలక్ష్మి
39. పెద్దాపురం	నిమ్మకాయల చినరాజప్ప	దవులూరి దొరబాబు	తుమ్మల దొరబాబు
40. అనపర్తి	నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (బీ)	సత్తి సూర్యనారాయణరెడ్డి	ఎల్లా శ్రీనివాసరావు
41. కాకినాడ (సిటీ)	వి.వెంకటేశ్వరరావు	ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి	చెక్కా నూకరాజు
42. రామచంద్రపురం	వాసంశెట్టి సుభాష్	పిల్లి సూర్యప్రకాశ్	కోట శ్రీనివాసరావు
43. ముమ్మిడివరం	దాట్ల సుబ్బరాజు	పి.వెంకట సతీష్‌కుమార్	పాలెపు ధర్మారావు
44. అమలాపురం (ఎస్సీ)	అయితాబత్తుల ఆనందరావు	పినిపే విశ్వరూప్	అయితాబత్తుల సుభాషిణి
45. రాజోలు (ఎస్సీ)	దేవ వరప్రసాద్ (జ)	గొల్లపల్లి సూర్యారావు	సరెళ్ల ప్రసన్న కుమార్
46. పి.గన్నవరం (ఎస్సీ)	గిడ్డి సత్యనారాయణ (జ)	విప్పర్తి వేణుగోపాల్	కొండేటి చిట్టిబాబు
47. కొత్తపేట	బండారు సత్యానందరావు	చిర్ల జగ్గిరెడ్డి	రౌతు ఈశ్వరరావు
48. మండపేట	వేగుళ్ల జోగేశ్వరరావు	తోట త్రిమూర్తులు	కామన ప్రభాకరరావు
49. రాజానగరం	బత్తుల బలరామకృష్ణ (జ)	జక్కంపూడి రాజా	ముంద్రు వెంకట శ్రీనివాస్
50. రాజమండ్రి (సిటీ)	ఆదిరెడ్డి వాసు	మార్గాని భరత్‌రామ్	బోడా వెంకట్
51. రాజమండ్రి (రూరల్)	గోరంట్ల బుచ్చయ్యచౌదరి	చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ	బాలేపల్లి మురళీధర్
52. జగ్గంపేట	జ్యోతుల నెహ్రూ	తోట నరసింహం	ఎంవీవీ గణేశ్వరరావు
53. రంపచోడవరం (ఎస్టీ)	మిరియాల శిరీషాదేవి	నాగులాపల్లి ధనలక్ష్మి	లోతా రామారావు (ఎం)
పశ్చిమ గోదావరి జిల్లా (15)			
54. కొవ్వూరు (ఎస్సీ)	ముప్పిడి వెంకటేశ్వరరావు	తలారి వెంకట్రావు	అరిగెల అరుణకుమారి
55. నిడదవోలు	కందుల దుర్గేష్ (జ)	జి.శ్రీనివాసనాయుడు	పెద్దిరెడ్డి సుబ్బారావు
56. ఆచంట	పితాని సత్యనారాయణ	చెరుకువాడ శ్రీరంగనాథరాజు	ఎన్.వి. సత్యనారాయణ
57. పాలకొల్లు	నిమ్మల రామానాయుడు	జి. శ్రీహరి గోపాలరావు	కొలకలూరి అర్జునరావు
58. నరసాపురం	బొమ్మిడి నాయకర్ (జ)	ఎం. ప్రసాదరాజు	కె. ఉదయభాస్కర కృష్ణ ప్రసాద్
59. భీమవరం	రామాంజనేయులు (జ)	గ్రంధి శ్రీనివాస్	అంకెం సీతారాం
60. ఉండి	కె.రఘురామకృష్ణరాజు	పీవీఎల్ నరసింహరాజు	వి.వి. గోపాల కృష్ణమ్
61. తణుకు	అరిమిల్లి రాధాకృష్ణ	కారుమూరి నాగేశ్వరరావు	కడలి రామారావు
62. తాడేపల్లిగూడెం	బొలిశెట్టి శ్రీనివాస్ (జ)	కొట్టు సత్యనారాయణ	మార్నిడి శేఖర్
63. ఉంగుటూరు	పత్సమట్ల ధర్మరాజు (జ)	పుప్పాల శ్రీనివాసరావు	పి. హరికుమార రాజు
64. దెందులూరు	చింతమనేని ప్రభాకర్	అబ్బయ్య చౌదరి	ఆలపాటి నరసింహమూర్తి
65. ఏలూరు	బడేటి రాధాకృష్ణ	ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్	బి.వెంకటేశ్వరరావు (ఐ)
66. గోపాలపురం (ఎస్సీ)	మద్దిపాటి వెంకటరాజు	తానేటి వనిత	ఎస్. మార్టిన్ లూథర్
67. పోలవరం (ఎస్టీ)	చిర్రి బాలరాజు (జ)	తెల్లం రాజ్యలక్ష్మి	దువ్వెల సృజన
68. చింతలపూడి (ఎస్సీ)	సొంగా రోషన్ కుమార్	కంభం విజయరాజు	వి. ఆర్. ఎలీజా
కృష్ణా జిల్లా (16)			
69. తిరువూరు (ఎస్సీ)	కొలికపూడి శ్రీనివాసరావు	నల్లగట్ల స్వామిదాస్	లాం తాంతియా కుమారి
70. నూజివీడు	కొలుసు పార్థసారథి	మేకా వెంకట ప్రతాప అప్పారావు	మరీదు కృష్ణ
71. గన్నవరం	యార్లగడ్డ వెంట్రావు	వల్లభనేని వంశీమోహన్	కె.వెంకటేశ్వరరావు (ఎం)
72. గుడివాడ	వెనిగండ్ల రాము	కొడాలి వెంకటేశ్వరరావు	వడ్డాది గోవిందరావు
73. కైకలూరు	కామినేని శ్రీనివాస్ (బీ)	దూలం నాగేశ్వరరావు	బొడ్డు నోబెల్
74. పెడన	కాగిత కృష్ణ ప్రసాద్	ఉప్పాల రాము	శొంఠి నాగరాజు
75. మచిలీపట్నం	కొల్లు రవీంద్ర	పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)	అబ్దుల్ మతీన్
76. అవనిగడ్డ	మండలి బుద్ధ ప్రసాద్ (జ)	సింహాద్రి రమేశ్‌బాబు	అందె శ్రీరామమూర్తి
77. పామర్రు (ఎస్సీ)	వర్ల కుమార్‌రాజా	కైలే అనిల్‌కుమార్	డీ. వై. దాస్
78. పెనమలూరు	బోడె ప్రసాద్	జోగి రమేశ్	ఎలిసాల సుబ్రహ్మణ్యం
79. విజయవాడ (వెస్ట్)	సుజనా చౌదరి (బీ)	షేక్ ఆసిఫ్	జి.కోటేశ్వరరావు (ఐ)
80. విజయవాడ (సెంట్రల్)	బొండా ఉమామహేశ్వరరావు	వెలంపల్లి శ్రీనివాస్	సీహెచ్.బాబూరావు (ఎం)
81. విజయవాడ (ఈస్ట్)	గద్దె రామ్మోహన్‌రావు	దేవినేని అవినాశ్	పి. నాంచారయ్య
82. మైలవరం	వసంత కృష్ణప్రసాద్	సర్నాల తిరుపతిరావు	బొర్రా కిరణ్
83. నందిగామ (ఎస్సీ)	తంగిరాల సౌమ్య	ఎం.జగన్మోహనరావు	మందా వజ్రయ్య
84. జగ్గయ్యపేట	శ్రీరామ్ రాజగోపాల్	సామినేని ఉదయభాను	కర్నాటి అప్పారావు
గుంటూరు జిల్లా (17)			
85. పెదకూరపాడు	భాష్యం ప్రవీణ్	నంబూరు శంకరరావు	పామిడి నాగేశ్వరరావు
86. తాడికొండ (ఎస్సీ)	తెనాలి శ్రావణ్ కుమార్	మేకతోటి సుచరిత	ఎం. సుశీల్ రాజా
87. మంగళగిరి	నారా లోకేశ్	మురుగుడు లావణ్య	జొన్నా శివశంకర్ (ఎం)
88. పొన్నూరు	ధూళిపాళ్ల నరేంద్ర	అంబటి మురళీకృష్ణ	జక్కా రవీంద్రనాథ్
89. వేమూరు (ఎస్సీ)	నక్కా ఆనంద్ బాబు	వరికూటి అశోక్‌బాబు	బూరగ సుబ్బారావు
90. రేపల్లె	అనగాని సత్యప్రసాద్	ఈవూరు గణేశ్	మోపిదేవి శ్రీనివాసరావు
91. తెనాలి	నాదెండ్ల మనోహర్ (జ)	అన్నాబత్తుని శివకుమార్	---
92. బాపట్ల	వేగేశ్న నరేంద్ర వర్మ	కోన రఘుపతి	గంటా అంజిబాబు
93. ప్రత్తిపాడు (ఎస్సీ)	బూర్ల రామాంజనేయులు	బాలసాని కిరణ్‌కుమార్	కొరివి వినయకుమార్
94. గుంటూరు (వెస్ట్)	పిడుగురాళ్ల మాధవి	విడదల రజని	ఆర్. జాన్‌బాబు
95. గుంటూరు (ఈస్ట్)	మహమ్మద్ నజీర్	నూర్ ఫాతిమా	షేక్ మస్తాన్ వలీ
96. చిలకలూరిపేట	ప్రత్తిపాటి పుల్లారావు	మనోహర్‌నాయుడు	మద్దుల రాధాకృష్ణ
97. నరసరావుపేట	సి.అరవిందబాబు	గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి	షేక్ మహబూబ్ బాషా
98. సత్తెనపల్లి	కన్నా లక్ష్మీనారాయణ	అంబటి రాంబాబు	చుక్కా చంద్ర పాల్
99. వినుకొండ	జీవీ ఆంజనేయులు	బొల్లా బ్రహ్మనాయుడు	చెన్నా శ్రీనివాసరావు
100. గురజాల	యరపతినేని శ్రీనివాసరావు	కాసు మహేశ్‌రెడ్డి	టి. యలమందారెడ్డి
101. మాచర్ల	జూలకంటి బ్రహ్మానందరెడ్డి	పిన్నెల్లి రామకృష్ణారెడ్డి	వై. రామచంద్రారెడ్డి
ప్రకాశం జిల్లా (12)			
102. యర్రగొండపాలెం (ఎస్సీ)	గూడూరి ఎరిక్షన్ బాబు	తాటిపర్తి చంద్రశేఖర్	బూదాల అజితారావు
103. దర్శి	డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి	బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి	పుట్లూరి కొండారెడ్డి
104. పర్చూరు	ఏలూరి సాంబశివరావు	యడం బాలాజీ	ఎన్. శివశ్రీ లక్ష్మీజ్యోతి
105. అద్దంకి	గొట్టిపాటి రవికుమార్	పాణెం చిన్నహనిమిరెడ్డి	అడుసుమల్లి కిశోర్‌బాబు
106. చీరాల	ఎంఎం.కొండయ్య	కరణం వెంకటేశ్	ఆమంచి కృష్ణమోహన్
107. సంతనూతలపాడు (ఎస్సీ)	బీఎన్ విజయ్‌కుమార్	మేరుగ నాగార్జున	పాలపర్తి విజేశ్ రాజ్
108. ఒంగోలు	దామచర్ల జనార్దన్	బాలినేని శ్రీనివాసరెడ్డి	తురకపల్లి నాగలక్ష్మి
109. కందుకూరు	ఇంటూరి నాగేశ్వరరావు	బుర్రా మధుసూదన్ యాదవ్	సయ్యద్ గౌస్ మొహిద్దీన్
110. కొండపి (ఎస్సీ)	డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి	ఆదిమూలపు సురేశ్	పసుమర్తి సుధాకర్
111. మార్కాపురం	కందుల నారాయణరెడ్డి	అన్నా రాంబాబు	సయ్యద్ జావేద్ అన్వర్
112. గిద్దలూరు	ముత్తుముల అశోక్‌రెడ్డి	కుందురు నాగార్జునరెడ్డి	పి. పెద్ద రంగస్వామి
113. కనిగిరి	ముక్కు ఉగ్రనరసింహారెడ్డి	దద్దాల నారాయణ యాదవ్	దేవరపల్లి సుబ్బారెడ్డి
నెల్లూరు జిల్లా (10)			
114. కావలి	కావ్య కృష్ణారెడ్డి	రామిరెడ్డి ప్రతాపరెడ్డి	పొదలకూరి కల్యాణ్
115. ఆత్మకూరు	ఆనం రామనారాయణరెడ్డి	మేకపాటి విక్రమ్‌రెడ్డి	చెరువు శ్రీధరరెడ్డి
116. కోవూరు	వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి	నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి
117. నెల్లూరు (సిటీ)	పొంగూరు నారాయణ	మహమ్మద్ ఖలీల్ అహ్మద్	మూలం రమేశ్ (ఎం)
118. నెల్లూరు (రూరల్)	కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి	ఆదాల ప్రభాకరరెడ్డి	షేక్ ఫయాజ్
119. సర్వేపల్లి	సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి	కాకాణి గోవర్ధనరెడ్డి	పి.వి. శ్రీకాంత్ రెడ్డి
120. గూడూరు (ఎస్సీ)	పాశం సునీల్‌కుమార్	మేరుగ మురళీధర్	యు. రామకృష్ణారావు
121. సూళ్లూరుపేట (ఎస్సీ)	నెలవల విజయశ్రీ	కిలివేటి సంజీవయ్య	చందనమూడి శివ
122. వెంకటగిరి	కురుగొండ్ల రామకృష్ణ	నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి	పంట శ్రీనివాసులు
123. ఉదయగిరి	కాకర్ల సురేశ్	మేకపాటి రాజగోపాల్‌రెడ్డి	సోము అనిల్‌కుమార్‌రెడ్డి
కడప జిల్లా (10)			
124. బద్వేలు (ఎస్సీ)	బొజ్జ రోశన్న (బీ)	దాసరి సుధ	ఎన్. దొరవిజయ జ్యోతి
125. రాజంపేట	సుగవాసి బాల సుబ్రమణ్యం	ఆకేపాటి అమర్నాథరెడ్డి	బి.విశ్వనాథనాయక్ (ఐ)
126. కడప	రెడ్డప్పగారి మాధవీరెడ్డి	అంజాద్ బాషా	టి.కె. అఫ్జల్ అలీఖాన్
127. కోడూరు (ఎస్సీ)	అరవ శ్రీధర్ (జ)	కొరముట్ల శ్రీనివాసులు	గోశాల దేవి
128. రాయచోటి	మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి	గడికోట శ్రీకాంత్‌రెడ్డి	షేక్ అల్లా భక్ష్
129. పులివెందుల	బీటెక్ రవి	వైఎస్ జగన్మోహన్‌రెడ్డి	ఎం. ధ్రువకుమార్‌రెడ్డి
130. కమలాపురం	పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి	పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి	గాలి చంద్ర (ఐ)
131. జమ్మలమడుగు	ఆదినారాయణ రెడ్డి (బీ)	మూలె సుధీర్‌రెడ్డి	పి. బ్రహ్మానందరెడ్డి
132. ప్రొద్దుటూరు	ఎన్.వరదరాజులురెడ్డి	రాచమల్లు శివప్రసాదరెడ్డి	షేక్ మహమ్మద్ నజీర్
133. మైదుకూరు	పుట్టా సుధాకర్‌యాదవ్	శెట్టిపల్లి రఘురామిరెడ్డి	జి. శ్రీరాములు
కర్నూలు జిల్లా (14)			
134. ఆళ్లగడ్డ	భూమా అఖిలప్రియ	గంగుల బిజేంద్ర రెడ్డి	బి. హుస్సేన్
135. శ్రీశైలం	బుడ్డా రాజశేఖర్‌రెడ్డి	శిల్పా చక్రపాణిరెడ్డి	ఎ.సయ్యద్ ఇస్మాయిల్
136. నందికొట్కూరు (ఎస్సీ)	గిత్తా జయసూర్య	దారా సుధీర్	టి. ఆర్థర్
137. కర్నూలు	టీజీ భరత్	ఎ.మహ్మద్ ఇంతియాజ్	షేక్ జిలానీ బాషా
138. పాణ్యం	గౌరు చరితారెడ్డి	కాటసాని రాంభూపాల్‌రెడ్డి	గౌస్ దేశాయ్ (ఎం)
139. నంద్యాల	ఎన్‌ఎండీ ఫరూఖ్	శిల్పా రవిచంద్రారెడ్డి	గోకుల కృష్ణారెడ్డి
140. బనగానపల్లె	బీసీ జనార్దన్‌రెడ్డి	కాటసాని రామిరెడ్డి	గూటం పుల్లయ్య
141. డోన్	కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి	బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి	గార్లపాటి మద్దిలేటి
142. పత్తికొండ	కేఈ శ్యాంబాబు	కంగాటి శ్రీదేవి	పి.రామచంద్రయ్య (ఐ)
143. కోడుమూరు (ఎస్సీ)	బొగ్గుల దస్తగిరి	ఆదిమూలపు సతీశ్	పి. మురళీకృష్ణ
144. ఎమ్మిగనూరు	బీవీ జయనాగేశ్వరరెడ్డి	బుట్టా రేణుక	ఎం. ఖాశీం వలీ
145. మంత్రాలయం	రాఘవేంద్ర	ఎల్లారెడ్డిగారి బాలనాగిరెడ్డి	పి.ఎస్.మురళీకృష్ణరాజు
146. ఆదోని	డాక్టర్ పార్థసారథి (బీ)	వై.సాయిప్రసాద్‌రెడ్డి	గొల్ల రమేశ్
147. ఆలూరు	వీరభద్రగౌడ్	బి.విరూపాక్షి	ఎ. నవీన్ కిశోర్
అనంతపురం జిల్లా (14)			
148. రాయదుర్గం	కాలవ శ్రీనివాసులు	మెట్టు గోవింద రెడ్డి	ఎం.బి. చిన్న అప్పయ్య
149. ఉరవకొండ	పయ్యావుల కేశవ్	ఎల్లారెడ్డిగారి విశ్వేశ్వర రెడ్డి	వై. మధుసూదన్ రెడ్డి
150. గుంతకల్లు	గుమ్మనూరు జయరాం	వై.వెంకట్రామి రెడ్డి	కావలి ప్రభాకర్
151. తాడిపత్రి	జేసీ అశ్మిత్‌రెడ్డి	కేతిరెడ్డి పెద్దారెడ్డి	గుజ్జల నాగిరెడ్డి
152. శింగనమల (ఎస్సీ)	బండారు శ్రావణిశ్రీ	మన్నెపాకుల వీరాంజనేయులు	సాకే శైలజానాథ్
153. అనంతపురం అర్బన్	దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్	అనంత వెంకట్రామిరెడ్డి	సి.జాఫర్ (ఐ)
154. కళ్యాణదుర్గం	అమిలినేని సురేంద్రబాబు	తలారి రంగయ్య	పి. రామ్‌భూపాల్ రెడ్డి
155. రాప్తాడు	పరిటాల సునీత	తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి	ఎ. ఆంధ్రా శంకరయ్య
156. మడకశిర (ఎస్సీ)	ఎంఎస్ రాజు	ఈర లక్కప్ప	కరికెర సుధాకర్
157. హిందూపురం	నందమూరి బాలకృష్ణ	తిప్పేగౌడ నారాయణ దీపిక	ఎంహెచ్. ఇనాయతుల్లా
158. పెనుకొండ	సంజీవరెడ్డిగారి సవిత	కేవీ ఉషశ్రీ చరణ్	పి. నరసింహప్ప
159. పుట్టపర్తి	పల్లె సింధూరారెడ్డి	దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి	డి.మధుసూదన్ రెడ్డి
160. ధర్మవరం	కె.సత్యకుమార్ (బీ)	కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి	ఆర్. అశ్వత్థనారాయణ
161. కదిరి	కందికుంట వెంకటప్రసాద్	బీఎస్ మఖ్బూల్ అహ్మద్	కె.ఎస్. షానవాజ్
చిత్తూరు జిల్లా (14)			
162. తంబళ్లపల్లె	డి. జయచంద్రారెడ్డి	పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి	ఎంఎన్ చంద్రశేఖరరెడ్డి
163. పీలేరు	నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి	చింతల రామచంద్రారెడ్డి	బి. సోమశేఖర రెడ్డి
164. మదనపల్లె	షాజహాన్ బాషా	నిసార్ అహ్మద్	పవన్ కుమార్ రెడ్డి
165. పుంగనూరు	చల్లా రామచంద్రారెడ్డి	పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి	జి. మురళీమోహన్ యాదవ్
166. చంద్రగిరి	పులివర్తి నాని	చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి	కనుపర్తి శ్రీనివాసులు
167. తిరుపతి	ఆరణి శ్రీనివాసులు (జ)	భూమన అభినయ్‌రెడ్డి	పి.మురళి (ఐ)
168. శ్రీకాళహస్తి	బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి	బియ్యపు మధుసూదనరెడ్డి	పి. రాజేశ్ నాయుడు
169. సత్యవేడు (ఎస్సీ)	కోనేటి ఆదిమూలం	నూకతోటి రాజేశ్	బాలగురువం బాబు
170. నగరి	గాలి భానుప్రకాశ్	ఆర్కే. రోజా	పోచారెడ్డి రాకేశ్‌రెడ్డి
171. జి.డి. నెల్లూరు (ఎస్సీ)	డాక్టర్ వీఎం థామస్	కళత్తూరు కృపాలక్ష్మి	దేయల రమేశ్ బాబు
172. చిత్తూరు	గురజాల జగన్‌మోహన్	ఎం.సి.విజయానందరెడ్డి	జి. తికారాం
173. పూతలపట్టు (ఎస్సీ)	డాక్టర్ కె.మురళీమోహన్	ముదిరేవుల సునీల్‌కుమార్	ఎం.ఎస్. బాబు
174. పలమనేరు	ఎన్ అమరనాథరెడ్డి	వెంకటే గౌడ	బి. శివశంకర్
175. కుప్పం	నారా చంద్రబాబునాయుడు	కృష్ణ రాఘవ జయేంద్ర భరత్	ఆవుల గోవిందరాజులు

జన కేతనం
ఏపీ ఎన్నికల ప్రత్యేకం-2024

లోక్‌సభ అభ్యర్థులు వీరే..

నియోజకవర్గం	టీడీపీ+	వైసీపీ	కాంగ్రెస్+
1. శ్రీకాకుళం	రామ్మోహన్‌నాయుడు	పేరాడ తిలక్	పేడాడ పరమేశ్వరరావు
2. అరకు (ఎస్టీ)	కొత్తపల్లి గీత (బీ)	చెట్టి తనూజారాణి	పి.అప్పలనర్స (ఎం)
3. విజయనగరం	కలిశెట్టి అప్పలనాయుడు	బెల్లాన చంద్రశేఖర్	బొబ్బిలి శ్రీను
4. విశాఖపట్నం	మతుకుమల్లి శ్రీభరత్	బొత్స ఝాన్సీలక్ష్మి	పి. సత్యనారాయణరెడ్డి
5. అనకాపల్లి	సీఎం రమేశ్ (బీ)	బీ.ముత్యాలనాయుడు	వేగి వెంకటేశ్
6. కాకినాడ	టి.ఉదయ్‌శ్రీనివాస్ (జ)	చలమలశెట్టి సునీల్	ఎం.ఎం. పళ్లంరాజు
7. అమలాపురం (ఎస్సీ)	గంటి హరీశ్ మాధుర్	రాపాక వరప్రసాద్	జంగా గౌతమ్
8. రాజమండ్రి	దగ్గుబాటి పురందేశ్వరి (బీ)	గూడూరు శ్రీనివాసులు	గిడుగు రుద్రరాజు
9. నరసాపురం	బీహెచ్.శ్రీనివాస్ వర్మ (బీ)	గూడూరి ఉమాబాల	కె.బ్రహ్మానందరావు
10. ఏలూరు	పుట్టా మహేశ్ యాదవ్	కె. సునీల్‌కుమార్	కావూరి లావణ్య
11. మచిలీపట్నం	వల్లభనేని బాలశౌరి (జ)	సింహాద్రి చంద్రశేఖరరావు	గొల్లు కృష్ణ
12. విజయవాడ	కేశినేని శివనాథ్	కేశినేని శ్రీనివాస్(నాని)	వల్లూరి భార్గవ
13. గుంటూరు	పెమ్మసాని చంద్రశేఖర్	కిలారి వెంకట రోశయ్య	జంగాల అజయ్‌కుమార్ (ఐ)
14. నరసరావుపేట	లావు శ్రీకృష్ణదేవరాయులు	పి.అనిల్‌కుమార్	జి. అలెగ్జాండర్ సుధాకర్
15. బాపట్ల (ఎస్సీ)	టి.కృష్ణప్రసాద్	నందిగం సురేశ్	జేడీ శీలం
16. ఒంగోలు	మాగుంట శ్రీనివాసులరెడ్డి	చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి	ఈదా సుధాకర్‌రెడ్డి
17. నంద్యాల	బైరెడ్డి శబరి	పోచా బ్రహ్మానందరెడ్డి	లక్ష్మీనరసింహ యాదవ్
18. కర్నూలు	బి.నాగరాజు	బీవై రామయ్య	రాంపుల్లయ్య యాదవ్
19. అనంతపురం	అంబికా లక్ష్మీనారాయణ	ఎం. శంకరనారాయణ	వజ్జల మల్లికార్జున
20. హిందూపురం	బీకే పార్థసారథి	జోళదరాశి శాంత	సమద్ షాహీన్
21. కడప	చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి	వైఎస్ అవినాశ్‌రెడ్డి	వై.ఎస్. షర్మిలా రెడ్డి
22. నెల్లూరు	వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి	విజయసాయిరెడ్డి	కొప్పుల రాజు
23. తిరుపతి (ఎస్సీ)	వి.వరప్రసాదరావు (బీ)	మద్దిల గురుమూర్తి	చింతా మోహన్
24. రాజంపేట	నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి (బీ)	పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి	షేక్ బషీద్
25. చిత్తూరు (ఎస్సీ)	దగ్గుమళ్ల ప్రసాదరావు	ఎన్.రెడ్డెప్ప	ఎం. జగపతి

బీ బీజేపీ జ జనసేన (ఎం) సీపీఎం ఐ సీపీఐ



ఇటీవల హైదరాబాద్‌లో టీడీపీ మద్దతు దారులు నిర్వహించిన సమావేశం

ఇక్కడ ఎన్నికలు అక్కడ సందడి

గ్రేటర్‌లో ఏపీ ఎన్నికల విందులు, భేటీలు

- నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు
- ఫంక్షన్ హాల్స్, కన్వెన్షన్ సెంటర్లలో నిర్వహణ
- అభ్యర్థుల తరఫున రంగంలోకి ప్రత్యేక టీమ్‌లు
- ఉపాధి పొందుతున్న ఓటర్లకు సమాచారం
- చార్జీలు చెల్లిస్తాం ఓటేసేందుకు రావాలని వేడుకోలు
- తమను గెలిపించాలని అభ్యర్థుల విజ్ఞప్తులు
- ఆ తర్వాత పసందైన విందు భోజనాలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ ఎంపీ ఎన్నికల కంటే ఆంధ్రప్రదేశ్ ఎన్నికల హీటు అధికంగా ఉంది. ఎవరి నోట విన్నా ఏపీ ఎన్నికల గురించే చర్చ..! ఏపీలో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు సైతం హైదరాబాద్‌లో ఉపాధి పొందుతున్న వారి ఓట్లపై గురిపెట్టారు. ఏపీలోని పలు నియోజకవర్గాల్లో గెలుపోటములను నిర్ణయించే ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అభ్యర్థులు తమ తమ నియోజకవర్గ ఓటర్లతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. వారిని కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటు అక్కడే పసందైన విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. తమకు ఓటు వేయాలని వేడుకుంటున్నారు. దీని కోసం గ్రేటర్‌లో ప్రత్యేకంగా ఏపీకి చెందిన అభ్యర్థుల టీమ్‌లు రంగంలోకి దిగాయి.


గెలుపోటములు నిర్ణయించే ఓట్లు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చెందిన వారు పెద్దఎత్తున ఉపాధి పొందుతున్నారు. వారిలో చాలా వరకు తమ సొంత గ్రామాల్లోనే ఓట్లున్నాయి. ఇలాంటి ఓటర్లు ఏపీలోని వివిధ నియోజకవర్గాల వారీగా సుమారు 10వేల నుంచి 60వేల ఓట్ల వరకు ఉన్నట్టు తెలిసింది. ఆ ఓట్లు కొన్ని నియోజకవర్గాల్లో గెలుపోటములను కూడా నిర్ణయిస్తాయి. అందుకే ఇక్కడ ఉపాధి పొందుతున్న ఏపీ ఓటర్లను గుర్తించి వారిని ఓటేసేందుకు తీసుకొచ్చే విధంగా అభ్యర్థులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా టీమ్‌లు నగరంలో ఉంటున్న ఓటర్లను గుర్తించి వారి మొబైల్ నంబర్లు సేకరిస్తున్నారు. ఆ తర్వాత ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాల ద్వారా నగరంలోని కన్వెన్షన్ సెంటర్లు, ఫంక్షన్స్ హాల్స్, వివిధ హోటళ్లలో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు సమాచారమిస్తున్నారు. లోకేషన్ షేర్ చేయడంతోపాటు, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుని ఫలానా చోటుకి రావాలంటూ సూచిస్తున్నారు. వివిధ నియోజకవర్గాల వారీగా ఓటర్లతో వచ్చే ఆదివారం సమావేశాలు నిర్వహించడానికి ఇప్పటికే పలు ఫంక్షన్ హాల్స్, హోటల్స్‌ను బుకింగ్ చేసుకున్నట్టు తెలిసింది.

పసందుగా ఆత్మీయ సమావేశాలు

ఏపీలోని రాజానగరం నియోజకవర్గానికి చెందిన ఓటర్లకు గత ఆదివారం రాత్రి మియాపూర్‌లోని సత్యసాయి కన్వెన్షన్ సెంటర్‌లో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి టీడీపీ, జనసేన పార్టీల నేతలు హాజరై కూటమికి ఓటు వేసి గెలిపించాలంటూ ఓటర్లను కోరారు. ఈ సమావేశంలో పెద్దఎత్తున యువత పాల్గొనడం జనసేన అభ్యర్థికి ఎనలేని ఉత్సాహాన్నిచ్చిన్నట్టు తెలిసింది. సమావేశం అనంతరం ఆయన అందరికీ విందు ఏర్పాటు చేసిన్నట్టు సమాచారం. అనంతపురం జిల్లాకు చెందిన వైసీపీ అభ్యర్థి కూడా నగరంలో నివాసముండే తన నియోజకవర్గ ఓటర్లకు ప్రముఖ హోటల్‌లో ఆదివారం రాత్రి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. రూ.4వేల విలువైన ఫుల్ బాటిల్ మద్యాన్ని కూడా అందించినట్టు తెలిసింది. శని, ఆదివారాలు నగరంలోని పలు హోటల్స్, కన్వెన్షన్ సెంటర్లు మొత్తం ఏపీ ఓటర్లతో కిటకిటలాడనున్నాయి. ఈ సందర్భంగా ఓటేసేందుకు వచ్చే ఓటర్లకు రాను, పోను బస్ చార్జీలు అందిస్తామని, అవసరమైతే వాహనాలు కూడా ఏర్పాటు చేస్తామని అభ్యర్థులు చెబుతున్నారు. తమను ఓటేసి గెలిపించాలని ప్రాధేయపడుతున్నారు.

జన చైతన్యం



ప్రజా అజెండా

అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..

మీ ఓటు భవిష్యత్తు

ఆంధ్రజ్యోతి

మంగళవారం ◇ 30-4-2024

కౌంట్ డౌన్ 13 రోజులు



బాదుడే బాదుడు

గత ఎన్నికల ముందు జగన్ ఎన్నో హామీలిచ్చారు. ప్రజల్ని మభ్యపెట్టి, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు. ముఖ్యమంత్రి అయ్యాక తన అసలు రూపం చూపించారు. ఎన్నో హామీలపై మాట తప్పిన జగన్.. కరెంట్ చార్జీలు తగ్గిస్తానని విద్యుత్ వినియోగదారులకు ఇచ్చిన మాటపైనా మడమ తిప్పారు. ముఖ్యమంత్రి హోదాలో కూడా కరెంట్ చార్జీలు పెంచనని చెప్పి మరీ సామాన్యుల నడ్డి విరిచారు. ఐదేళ్లలో ఇష్టానుసారంగా విద్యుత్ చార్జీల మోత మోగించారు. ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణం చేశాక ఏడాదిలోపే బాదుడు మొదలెట్టారు. మరో విచిత్రమేంటంటే.. చంద్రబాబు ప్రభుత్వ హయాం నాటి 2014-19 మధ్యకాలానికి సంబంధించి ట్రూఅప్ చార్జీల పేరిట జగన్ ప్రభుత్వం రూ.3,669 కోట్లను వసూలు చేసింది. విద్యుత్ చార్జీల పెంపు, ట్రూఅప్ చార్జీలు, విద్యుత్ కొనుగోళ్ల సర్దుబాటు పేరిట ఐదేళ్లలో ప్రజలపై మొత్తం రూ.25 వేల కోట్ల భారం వేసింది. గతంలో కరెంటు బిల్లులు ముట్టుకొంటే షాక్ కొడతాయని చంద్రబాబు ప్రభుత్వాన్ని విమర్శించిన జగన్.. తన పాలనలో ప్రజలు చార్జీల భారం మోయలేనంతగా 'షాక్' ఇచ్చారు.

- ఏకంగా తొమ్మిదిసార్లు మోత
- ఒక్కో కుటుంబంపై ఏటా 4 వేలు
- పెంచనని చెప్పి మరీ నాలుక మడత
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీకి తూట్లు
- సీఎం అనాలోచిత నిర్ణయాలతో సంక్షోభం
- రుణాల ఊబిలో కూరుకున్న డిస్కమ్‌లు
- అప్పులు 87,524 కోట్లు..
- నష్టాలు 29,546 కోట్లు
- గతేడాది పరిశ్రమలకు పవర్ హాలిడే
- రైతులు వద్దన్నా బలవంతంగా మీటర్లు

• తొమ్మిదిసార్లు పెంపు

చంద్రబాబు ప్రభుత్వంలో కరెంటు బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయంటూ నాడు అసెంబ్లీలో ప్రతిపక్షనేత జగన్ ఆవేశంతో ఊగిపోయారు. విద్యుత్ చార్జీలపై బాదుడే బాదుడంటూ దీర్ఘాలు తీసి మరీ విమర్శించారు. తామొస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన జగన్.. తన ఐదేళ్ల పాలనలో ఏకంగా తొమ్మిది సార్లు జనం నెత్తిన చార్జీల భారం మోపారు.

• ఏటా రూ.4 వేల భారం

జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రజలపై చార్జీల రూపంలో మొత్తం రూ.25,011 కోట్లు బాదారు. రాష్ట్రంలో కోటీ ఇరవై ఐదు లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఈ లెక్కన ఒక్కో కుటుంబంపై సగటున రూ.20,008 భారం పడింది. అంటే ఏటా ప్రతి కుటుంబంపై అదనంగా 4,001 భారం వేశారు.

• ఎస్సీ, ఎస్టీలకు దగా

ఎస్సీ, ఎస్టీలందరికీ 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ ఇస్తామని జగన్ హామీ ఇచ్చి మోసం చేశారు. అధికారంలోకి వచ్చాక తండాలు, కాలనీల్లో ఉండేవాళ్లకే అని షరతు పెట్టి విగతా వారికి ఎగ్గొట్టేశారు.

జగన్ ఐదేళ్ల పాలనలో జనం నెత్తిన 25 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం

గతంలో జగన్ ఏమన్నారంటే..

- 'ప్రజలతో పని అయిపోయింది కాబట్టి చెప్పిన మాటను మరచిపోయి విద్యుత్ చార్జీలు పెంచారు. పేదవాడి ఇంటిలో కూడా నెలకు 200 యూనిట్లు విద్యుత్ కాలుస్తారు. మూడు ట్యూబ్ లైట్లు, రెండు ఫ్యాన్లు, ఒక టీవీ, సెల్ ఫోన్ చార్జర్ వంటి కనీస అవసరాలకు కరెంటు వాడినా ఇంకా ఎక్కువే అవుతుంది. 200 యూనిట్లు దాటితే షాక్ కొట్టేలా రూ.6.70 చొప్పున వసూలు చేస్తున్నారు. పక్కనున్న కర్ణాటక, ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేదు. ఈ రేట్లు మన రాష్ట్రంలోనే ఉన్నాయి. కరెంటు చార్జీలు ఎందుకు పెరగాలి అని అడుగుతున్నా? కరెంటు బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి అధ్యక్షా!'.. గతంలో ప్రతిపక్ష నేతగా జగన్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలివి.
- 'చంద్రబాబు పాలనలో ప్రతి నెలా కరెంటు బిల్లులు ఐదారు వందలు, ఏడు వందలు, వెయ్యి వస్తున్నాయని ప్రజలంటున్నారు. మన పరిస్థితి ఎలా ఉందంటే కరెంటోళ్లు మనల్ని అడక్కుండానే మన ఇంట్లోకి వచ్చేస్తున్నారు. మేం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ ఇస్తాం'.. 2017 డిసెంబరులో పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ ఇది.
- 2019 మే 30వ తేదీన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలోనూ కరెంటు చార్జీలను తగ్గిస్తామని జగన్ ప్రకటించారు.

తొలిసారి పవర్ హాలిడే

గతంలో మిగులు విద్యుత్ కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా జగన్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొరత తీవ్రస్థాయికి చేరుకుంది. దీంతో రాష్ట్రంలో తొలిసారి గత ఏడాది పరిశ్రమలకు పవర్ హాలిడేను ప్రకటించారు. మొదట 15 రోజుల పాటు పవర్ హాలిడే ప్రకటించి, ఆ తర్వాత మరో 15 రోజుల పాటు పొడిగించారు. పరిశ్రమలు దరఖాస్తు చేసుకున్న లోడ్‌లో 50 శాతం మాత్రమే వాడుకోవాలన్న నిబంధన పెట్టారు. గ్రామాల్లో అనధికార విద్యుత్ కోతలు అమలు చేశారు.

సంక్షోభంలో విద్యుత్ రంగం

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక తొమ్మిదిసార్లు కరెంట్ చార్జీలు పెంచారు. లాభనష్టాలు లేకుండా ఉత్పత్తి వ్యయమంతా వినియోగదారుల నుంచి పిండే విధానాన్ని అమలు చేస్తున్నా.. రాష్ట్రంలోని మూడు డిస్కమ్‌లనూ అప్పుల ఊబిలోకి నెట్టారు. మూడు డిస్కమ్‌లకు అప్పులు రూ.87,524 కోట్లు ఉండగా, నష్టాలు రూ.29,546 కోట్లు ఉన్నట్టు ఇటీవల ఏపీఈఆర్సీ విడుదల చేసిన 2024-25 వార్షిక ఆదాయ వ్యయ నివేదిక వెల్లడించింది. ఈ భారమంతా చివరకు ప్రజలపైనే పడనుంది. జగన్ అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై నిరంతరం విమర్శలు చేసిన జగన్.. తాను అధికారంలోనికి వచ్చిన వెంటనే ఆ ఒప్పందాలన్నింటినీ ఉన్నపళంగా రద్దు చేశారు. అప్పట్లో ఈ నిర్ణయాన్ని కేంద్రం తప్పుబట్టింది. న్యాయస్థానాలూ తప్పుబట్టాయి. జగన్ నిర్ణయం వల్ల ఒప్పందం చేసుకున్న సంస్థల నుంచి కరెంటు తీసుకోకుండానే రూ.4,800 కోట్లను చెల్లించాల్సి వచ్చింది. ఇదే సమయంలో ఒప్పందం చేసుకున్న విద్యుత్ సంస్థల నుంచి కరెంటు తీసుకోకుండా బయట కొనుగోలు చేయడం వల్ల మరో రూ 6,200 కోట్ల అదనపు భారం పడింది. గతంలో దీర్ఘకాలిక ఒప్పందాలను తప్పుబట్టిన జగన్.. తాను అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. సెకీ ద్వారా అదానీ నుంచి 7,000 మెగావాట్ల విద్యుత్‌ను 25 ఏళ్లపాటు కొనుగోలు చేస్తూ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. దీని విలువ రూ.94,500 కోట్లు. ఇలా అన్ని విధాలా ప్రజలపై భారం వేయడంతో పాటు విద్యుత్ రంగాన్ని జగన్ సంక్షోభంలోకి నెట్టారు.

మీటర్ల రుద్దుడు

రైతులు వ్యతిరేకిస్తున్నా వినకుండా వ్యవసాయ మోటార్లకు జగన్ సర్కారు మీటర్లు బిగించింది. ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ధరలకు మీటర్లు కొనుగోలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అలాగే ఇళ్లకు ప్రీపెయిడ్ మీటర్లు బిగించేందుకు సర్కారు సమాయత్తమైంది. ఇందుకోసం 14 వేల కోట్లు అప్పు చేసింది.

అస్మదీయులతో అస్తవ్యస్తం

గతంలో విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కమ్) సారథులుగా ఐఏఎస్ అధికారులను నియమించేవారు. కానీ జగన్ అధికార పగ్గాలు చేపట్టాక ఐఏఎస్ అధికారులను పక్కన పెట్టి డిస్కమ్‌ల మేనేజింగ్ డైరెక్టర్లుగా అస్మదీయులను నియమించుకున్నారు. ఈపీడీసీఎల్ ఎండీగా సంతోష్‌రావును, సీపీడీసీఎల్ ఎండీగా పద్మా జనార్దనరెడ్డిని నియమించారు. ఎస్పీడీసీఎల్ ఎండీ బాధ్యతలను సంతోష్‌రావుకు అదనంగా అప్పగించారు. ట్రాక్ రికార్డు సరిగా లేకపోవడంతో పరిపాలన అస్తవ్యస్తమైంది. డిస్కమ్‌లలో పారదర్శకత అనే పదానికి తావులేకుండా పోయింది. విద్యుత్ పరికరాల కొనుగోళ్లు, ఇతర వ్యయాలు ఇష్టారీతిన సాగాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యమంత్రి జగన్ సన్నిహితుడు, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ అధినేత విశ్వేశ్వరరెడ్డికి ప్రయోజనం కలిగేలా ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లు చేశారు.

ఎడాపెడా చార్జీల మోత

- జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 2020 ఫిబ్రవరిలో 500 యూనిట్లు దాటిన వినియోగదారులపై యూనిట్‌కు 90 పైసల చొప్పున రూ.1,300 కోట్ల భారం వేశారు.
- చార్జీలు పెంచిన మూడు నెలలు కూడా తిరగకుండానే 2020 మే నెలలో కరోనా శ్లాబుల మార్పు పేరిట రూ.1,500 కోట్లు వసూలు చేశారు.
- 2021 ఏప్రిల్‌లో యూనిట్‌కు రూ.10 పెంచడంతో వినియోగదారులపై రూ.3,542 కోట్ల భారం పడింది.
- 2014-19 మధ్యకాలానికి సంబంధించి ట్రూఅప్ చార్జీల పేరిట రూ.3669 కోట్లు వసూలు చేశారు.
- 2021-22 విద్యుత్ కొనుగోళ్ల సర్దుబాటు పేరిట రూ.3,082 కోట్లు వసూలు చేశారు.
- 2022 ఏప్రిల్‌లో శ్లాబుల సవరణ పేరిట రూ.3,900 కోట్లు బాదారు.
- ఫ్యూయల్ అండ్ పవర్ చార్జీల సర్దుబాటు పేరిట రూ.700 కోట్లు వసూలు చేశారు.
- 2023 విద్యుత్ కొనుగోలు సర్దుబాటు కింద రూ.400 కోట్లు వసూలు చేశారు.
- 2022-23 సంవత్సరానికి సంబంధించి ట్రూ అప్ చార్జీలు రూ.7,200 కోట్లు భారం వేయడంపై ఏపీఈఆర్సీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- ఏపీ ట్రాన్స్‌కో ప్రతిపాదించిన ట్రూఅప్ చార్జీలు రూ.1200 కోట్లు జనం నెత్తిన వేయడానికి ఈఆర్సీ ఆమోదించింది.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

చిత్రభళా!



చింటూ: అబ్బా... దెబ్బ!
చిన్నూ: ఎలక్షన్ల ముందు భలే తగులుతాయ్ రా!
చింటూ: స్టిక్కర్ వేసుకుంటే నవ్వుతున్నారేంట్రా!
చిన్నూ: ప్యాచ్‌కే పీచే క్యాహై... అని పాడుతారు కూడా!
చింటూ: మనిషన్నాక దెబ్బలు తగలవా ఏం!
చిన్నూ: ఈ సీజన్‌లో తగిలే దెబ్బలను నమ్మరులే!
చింటూ: మానవత్వం లేదేంట్రా అస్సలు...
చిన్నూ: గొడ్డలి వేటుతో నరికేశారు కదరా!



ది లీడర్

ఆర్థిక, రాజకీయ దురంధరుడు రోశయ్య



కంచుకంఠం.. మాటల తూటాలు.. ఇంతలోనే చమక్కులు.. ఆ వెంటనే చురుక్కులు.. విపక్షాలు సైతం వ్యక్తిగతంగా విమర్శలు చేయలేనంత గంభీరమైన వ్యక్తిత్వం.. ఇవీ నాలుగు దశాబ్దాలకు పైగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న ఆర్థిక, రాజకీయ దురంధరుడు కొణిజేటి రోశయ్యకు మాత్రమే సొంతమైన లక్షణాలు! "రాజకీయాల్లో ఆస్తులుకాదు.. అప్పులను మాత్రమే సంపాదించుకున్నాను. నాకందరూ మిత్రులే తప్ప శత్రువులు లేరు" అని సగర్వంగా చెప్పుకొన్న రోశయ్య.. ఓ సామాన్య కుటుంబంలో జన్మించి స్వయం కృషితో ఉన్నత శిఖరాలు అధిరోహించారు. 1968లో ఎమ్మెల్సీ పదవి ద్వారా చట్టసభలో అడుగుపెట్టిన రోశయ్య.. అనంతర కాలంలో ఎమ్మెల్యే, ఎంపీగా కూడా గెలుపొందారు. ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని స్వీకరించారు. తర్వాత మంత్రిగా, ముఖ్యమంత్రిగా గవర్నర్‌గా వివిధ పదవులు అలంకరించారు. ఆచార్య ఎన్‌జీ రంగా శిష్యునిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన రోశయ్య.. స్వాతంత్ర్య సమర యోధుడిగా, ఆర్థిక నిపుణుడిగా పేరొందారు. 1979లో టంగుటూరి అంజయ్య కేబినెట్‌లో తొలిసారి మంత్రి అయ్యే అవకాశం దక్కింది. 1982లో కోట్ల కేబినెట్‌లో హోం మంత్రిగా వ్యవహరించారు. 1989, 2004లో చీరాల నుంచి ఆయన రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1989లో మర్రి చెన్నారెడ్డి కేబినెట్‌లో ఆర్థిక, రవాణా, విద్యుత్ శాఖల మంత్రిగా పనిచేశారు. 1991లో నేదురుమల్లి కేబినెట్‌లో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్ శాఖల మంత్రిగా ఆయా శాఖలకు వన్నె తెచ్చారు. 1995-97 మధ్య కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1998లో నరసరావుపేట నుంచి ఎన్నికై పార్లమెంటులో అడుగు పెట్టారు. ఇక, వైఎస్ హయాంలో 2004 నుంచి ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఇలా మొత్తం 15 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత రోశయ్య సొంతం. వైఎస్ మరణానంతరం 2009, సెప్టెంబరులో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించి, 14 నెలల పాటు కొనసాగారు. ఆ తర్వాత తమిళనాడు గవర్నర్‌గా పనిచేశారు.

- గుంటూరు

రాష్ట్రాన్ని ఒడ్డెక్కించాలంటే బాబుకే సాధ్యం

- మేం రాగానే అమరావతి నిర్మాణ పనులు
- రూ.2 వేల కోట్లతో ప్రారంభిస్తాం
- ఆంధ్రులు గర్వపడేలా పూర్తిచేస్తాం
- కంపెనీలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, పరిశ్రమలను మళ్లీ రప్పిస్తాం
- గత ఐదేళ్లలో పనులు కొనసాగించి ఉంటే ఏటా 5 వేల కోట్ల ఆదాయం వచ్చేది
- జగన్ ఈ రాబడికి గండికొట్టాడు
- ఎన్నికల తర్వాత ఏపీ వదిలిపోతాడు
- కర్నూలు లోక్‌సభ పరిధిలో ప్రాజెక్టులకు ప్రాధాన్యమివ్వాలి
- ఐదేళ్లలో పోలవరం పూర్తిచేస్తాం
- నా అవసరం పార్టీకే ఎక్కువ
- అయినా అధిష్ఠానం నిర్ణయాన్ని బట్టే నడుచుకుంటా: టీడీపీ యువ నేత

'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ

160 సీట్లు మావే!

23 ఎంపీ స్థానాలు కూడా.. లోకేశ్ ధీమా



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 160 అసెంబ్లీ స్థానాల్లో విజయఢంకా మోగిస్తుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ధీమా వ్యక్తంచేశారు. 23 లోక్‌సభ స్థానాల్లోనూ గెలుస్తామని తెలిపారు. రాష్ట్రం కష్టకాలంలో ఉన్నప్పుడల్లా టీడీపీ అధినేత చంద్రబాబే ప్రజలకు గుర్తుకొస్తారని చెప్పారు. 1995లో, 2014లో, ఇప్పుడు అవే క్లిష్టతరమైన పరిస్థితులు ఉన్నాయని.. ఇటువంటి దయనీయమైన స్థితిలో రాష్ట్రాన్ని ఒడ్డెక్కించాలంటే ఆయనకే సాధ్యమని స్పష్టం చేశారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌ను ఐదేళ్లలో ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారని.. కానీ 2019లో గద్దెనెక్కిన జగన్ రివర్స్‌గేర్‌లో వెనక్కి తీసుకుపోయాడని విమర్శించారు. ఎన్నికల అనంతరం ఆయన రాష్ట్రాన్ని వదిలిపోవడం ఖాయమన్నారు. రాజధాని అమరావతిలో నిలిచిపోయిన పనులను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరంభించి త్వరితగతిన పూర్తిచేసే ప్రయత్నం చేస్తామని చెప్పారు. రూ.1,500 కోట్ల నుంచి రూ 2,000 కోట్లతో పునర్నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభిస్తామన్నారు. తన అవసరం పార్టీకే ఎక్కువని తాను అభిప్రాయపడుతున్నానని.. అధిష్ఠానం తన పాత్రను ఎలా నిర్ణయిస్తే భవిష్యత్తులో అదేరీతిగా నడుచుకుంటానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల విషయంలో కర్నూలు పార్లమెంటు పరిధిలోని వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలివీ..

ప్రశ్న: ఈ ఎన్నికల్లో మీ కూటమికి ఎన్ని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు వస్తాయని అనుకుంటున్నారు?

లోకేశ్: కచ్చితంగా 160 అసెంబ్లీ స్థానాలు, 23 పార్లమెంటు స్థానాలు వస్తాయి.

అంత సానుకూలమైన వాతావరణం మీకు కనిపిస్తోందా?

కచ్చితంగా! రాష్ట్రమంతటా జగన్ విధ్వంసక పాలనపై చాలా కోపం, ఆవేదన ఉన్నాయి. పిల్లల భవిష్యత్‌ను నాశనం చేశాడన్న బాధ ప్రతి ఒక్కరిలోనూ కనిపిస్తోంది. సీఎం అంటే భావితరాల భవిష్యత్‌కు భరోసా ఇచ్చే నాయకుడై ఉండాలి. కానీ జగన్ ఓ ముఖ్యమంత్రిగా ఏ ఒక్కరోజూ బాధ్యతగా నడుచుకోలేదు. రాబోయే తరాలను చాలా నిర్లక్ష్యం చేశాడు. అందుకే రాష్ట్రమంతటా జగన్ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి.

రాజధాని అమరావతిపై మీ యాక్షన్ ప్లాన్ ఎలా ఉండబోతోంది?

ఆగిపోయిన అమరావతి పనులను ప్రారంభించి పూర్తిచేస్తాం. గతంలో ఇక్కడకు రావాలనుకున్న కంపెనీలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, పరిశ్రమలను మళ్లీ రప్పిస్తాం. అమరావతి ఇమేజ్ పెంచుతాం. జగన్ గత ఐదేళ్లలో రాజధాని పనులను యథావిధిగా కొనసాగించి ఉంటే ఏటా రూ.5 వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చి ఉండేది. పిచ్చి పిచ్చి పనులతో ఆ ఆదాయానికి గండికొట్టాడు. మేమైతే 5 కోట్ల ఆంధ్రులు గర్వపడేలా అమరావతి నిర్మాణం పూర్తిచేసి తెలుగుజాతి సగర్వంగా తలెత్తుకునేలా చేస్తాం. అమరావతి బ్రాండ్‌ను పునరుద్ధరిస్తాం. ఆ సత్తా మాకుంది.

ప్రభుత్వ ఖజానా సున్నా కదా! పైగా లక్షల కోట్ల అప్పు ఉందంటున్నారు. మీరు కూడా ఈ ఎన్నికల్లో చాలా హామీలిస్తున్నారు. ఏమిటీ మీ ధైర్యం?

చంద్రబాబే మాధైర్యం.. ప్రజల ధైర్యం కూడా! బాబు తొలిసారి సీఎం అయినప్పుడు 1995లోనూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు చాలా క్లిష్టంగానే ఉన్నాయి. అటువంటి సమయంలో పగ్గాలు చేపట్టి 2004 నాటికి మిగులు బడ్జెట్‌లోకి తీసుకొచ్చారు. రాష్ట్ర విభజన సమయంలోనూ చంద్రబాబు చాలెంజ్‌గా తీసుకుని రాష్ట్రాన్ని గాడినపెట్టారు. కష్టకాలం వచ్చినపుడల్లా రాష్ట్ర ప్రజలకు ఆయనే గుర్తుకొస్తారు. ఇప్పుడు జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడం కూడా చంద్రబాబుకే సాధ్యమని వారు గుర్తించారు. ఎకనమిక్ యాక్టివిటీని సక్రమంగా చేయగలిగితే చిత్తూరు, విశాఖ వంటి కొన్ని జిల్లాల నుంచి రాష్ట్రానికి పెద్దఎత్తున ఆదాయం వస్తుంది.

పోలవరం గురించి ఏం చెబుతారు?

ముందు ఏం లోపాలున్నాయో నిపుణుల కమిటీ అధ్యయనంలో తేలుస్తాం. ఇప్పుడంతా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. గతంలో మాదిరి ఏళ్ల తరబడి నిర్మాణాలు చేయాల్సిన అవసరం లేదు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో చాలా ఆలస్యమవుతూ వచ్చింది. కేంద్రం మాకు సహకరిస్తుందన్న నమ్మకం పూర్తిగా ఉంది. వచ్చే ఐదేళ్లలో పోలవరాన్ని పూర్తిచేసి ప్రారంభోత్సవం కూడా చేస్తాం.

రాజధాని అమరావతిలో వైకుంఠపురం వద్ద కృష్ణానదిపై కొత్త ఆనకట్ట నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు కదా! దానిని వెంటనే చేపడతారా?

రూ.4 వేల కోట్లతో ఆ ప్రాజెక్టు చేపట్టాలని గతంలో అనుకున్నాం. మాస్టర్‌ప్లాన్‌లోనూ చేర్చాం. ఆ బ్యారేజీ అమరావతికి అవసరమే అయినా ఇప్పుడే అంత ఆవశ్యకం కాదు. దీనికన్నా ముందు కర్నూలు పార్లమెంటు పరిధిలో శంకుస్థాపనలు జరుపుకొని ఆగిపోయిన సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి. అక్కడ ఆ ప్రాజెక్టుల అవసరం ఎక్కువగా ఉంది. ఆ ప్రాంత మహిళలు తాగునీటికోసం 3-4 కిలోమీటర్లు నడచివెళ్లడం యువగళం పాదయాత్రలో స్వయంగా గమనించా. అది నాకు చాలా బాధ అనిపించింది. అక్కడ ప్రతి ఎకరాకూ సాగునీరు, ప్రతి గడపకూ తాగునీరందించాలి. వైకుంఠపురం పనులు మూడేళ్ల తర్వాత ప్రారంభించినా సరిపోతుందని నా భావన.

జగన్ ప్రభుత్వం కాపులు, ముస్లింలకు గత పథకాలన్నీ రద్దుచేసి కూడా తాము ఆ వర్గాలకు చాలా చేశామని ప్రచారం చేసుకుంటోంది. పైగా మీ కూటమిపై దుష్ప్రచారం చేస్తోంది. వాస్తవాలు వివరించడంలో మీ నాయకులు విఫలమవుతున్నారా?

2019 ఎన్నికల్లో మాకు దూరమైన వర్గాలన్నీ ఇప్పుడు మళ్లీ దగ్గరయ్యాయి. ఆ వర్గాలకు ఉన్న పథకాలను రద్దుచేసి వారి సంక్షేమంలో జగన్ కోతపెట్టాడు. దాడులు చేయించడంతో పాటు ఎన్నో విధాలుగా వేధింపులకు గురిచేశాడు. ఆయా ఘటనలను జనాలకు మా నాయకులు వివరిస్తూనే ఉన్నారు.

అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వంలో మీ పాత్ర?

నా అవసరం పార్టీకి ఎక్కువగా ఉందని నమ్ముతున్నాను. అయితే అధిష్ఠానం నా పాత్రను ఎలా నిర్ణయిస్తే ఆ ప్రకారమే నడుచుకుంటా!

-మంగళగిరి

తిరగబడ్డ తెనాలి

పొన్నూరులో సభ కోసం తెనాలిలో బారికేడ్లా?

- సీఎం కోసం ట్రాఫిక్ నియంత్రణలో 'అతి'పై తొలి తిరుగుబాటు
- తెనాలిలో పోలీసులపై దండెత్తిన జనం
- అడ్డుపెట్టిన బారికేడ్లు తోసుకుని ముందడుగు

తెనాలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ కోసం ట్రాఫిక్ నియంత్రణలో కొన్నేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న 'అతి'పై తిరుగుబాటు మొదలైంది. ఇన్నాళ్లుగా ఈనరకం భరిస్తూ వచ్చిన జనం తెనాలిలో పోలీసులపై దండెత్తారు. అడ్డుగా పెట్టిన బారికేడ్లు తెంపుకొని ముందడుగు వేశారు. ఆ వివరాల్లోకి వెళితే.. పొన్నూరులో సీఎం జగన్ సభ. రోడ్డు మార్గంలో కాకుండా హెలికాప్టరులోనే నేరుగా చేరుకున్నారు. పైగా తెనాలితో అసలు సంబంధమే లేని రూట్ అది. కానీ, అక్కడకు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న తెనాలిలో బారికేడ్లు అడ్డంపెట్టారు! వాహనాలు కదలకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో జనం ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఎక్కడ సభకు ఎక్కడ హడావుడి చేస్తున్నారంటూ పోలీసులకు ఎదురుతిరిగారు. అడ్డంగా పెట్టిన బారికేడ్లను తోసుకొంటూ ముందుకు వెళ్లిపోయారు. ఈ సమయంలో పోలీసులకు, వాహనదారులకు మధ్యతీవ్రస్థాయిలో వాగ్యుద్ధం సాగింది. ఆకాశంలో పోయేవాడికోసం మమ్మల్ని ఎందుకు ఆపుతున్నారని నిలదీశారు. 'ఎండలు మండిపోతుంటే, ట్రాఫిక్ ఆపేదేంటి?" అంటూ కొందరు ఆగ్రహిస్తే, "ఏం చేస్తున్నారో మీకు తెలుస్తోందా? అసలు ఎన్నికల కోడ్ ఉన్నట్టా లేనట్టా?" అని మరి కొందరు పోలీసులను నిలదీశారు. అంతకు ముందు... తెనాలి నుంచి గుంటూరు వెళ్లే ప్రజలను వెళ్లనివ్వకుండా ఓవర్ బ్రిడ్జి దగ్గర వాహనాలను పోలీసులు ఆపేశారు. కొద్దిసేపు ద్విచక్ర వాహనాలను వదిలినా, తర్వాత వాటినీ నిలిపివేశారు. మండే ఎండలోనే జనం కొద్దిసేపు నిరీక్షించారు. ఎంతసేపటికీ ట్రాఫిక్ వదలక పోవటంతో పోలీసుల వద్ద ఆరా తీశారు. పొన్నూరులో సీఎం సభ ఉందని, అందువల్ల తెనాలి నుంచి వాహనాలను ఆపేశామని వారు చెప్పడంతో జనానికి చిర్రెత్తుకువచ్చింది. పొన్నూరుతో సంబంధంలేని మాకు ఈ అవస్థలేంటని పోలీసులతో గొడవకు దిగారు. చివరకు కొందరు యువకులు ముందుకొచ్చి బారికేడ్‌లను తోసేసిమరీ ముందుకు వెళ్లిపోయారు. అయినా పోలీసులు మధ్యమధ్యలో ఆపటం, జనం తోసేయటం కొనసాగింది.



గుంటూరు వెళ్లే వాహనాలను ఓవర్ బ్రిడ్జిపై బారికేడ్లు అడ్డుపెట్టి ఆపేస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో) బారికేడ్‌లను తోసేసి మరీ వెళ్లిపోతున్న వాహనదారులు

ఉద్యోగులకు అండగా..!

(మొదటి పేజీ తరువాయి)

మార్చేస్తుంటే బాధగా ఉంది. ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో ఒక్క రైతయినా బాగుపడ్డాడా? ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయా? ఏ ఒక్క వర్గమైనా బాగుపడిందా? వ్యవసాయాన్ని నాశనం చేశాడు. అన్నదాతల గొంతు నొక్కేయడంతో వారంతా దీనావస్థలో పడ్డారు. 'హార్టికల్చర్‌ను పూర్తిగా నాశనం చేశాడు' అని దుయ్యబట్టారు. జగన్ దోపిడీ దొంగ అని, సొంత బాబాయిని చంపి చెల్లెలి మీద కేసు పెట్టిన వ్యక్తికి ఓటు వేయకుండా ఇంటికి సాగనంపాలని పిలుపిచ్చారు. మే 13న ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఇంకా ఏమన్నారంటే..

సీపీఎస్‌పై హామీ గాలికి..

జగన్ జమానాలో ఏ ఉద్యోగికీ స్వేచ్ఛలేదు. గద్దెనెక్కాక వారంలో సీపీఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చాడు. అలాంటి వారాలు చాలా పోయాయి. నేటికీ ఆ హామీ నెరవేర్చలేదు. ఫిట్‌మెంట్ ఇవ్వక నానా ఇబ్బందులు పెడుతున్నాడు. డీఏ ఇచ్చిన దాఖలాల్లేవు. రివర్స్ పీఆర్సీ ఇచ్చాడు. ఈ ఐదేళ్లలో పెన్షనర్లకు ఏ ఒక్క నెల కూడా ఒకటో తేదీన పింఛను ఇవ్వలేదు. ఉద్యోగులకు రూ.25 వేల కోట్లకు పైగా బకాయిలు పెట్టాడు. టీచర్లను మద్యం షాపుల వద్ద కాపలా పెట్టాడు.

అప్పులు చేయడమే పాలనా?

ప్రజలు ఆస్తులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం.. వ్యవస్థను, చట్టాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రజలు భూములను కొట్టేయాలని చూస్తోంది. పరిపాలన అంటే అప్పులు చేయడం కాదు. జగన్‌కు పాలన చేతకాక, సచివాలయాన్ని, ఆస్పత్రులను, ఆఖరికి మద్యంపై వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టి లక్షల కోట్లు అప్పులు చేశాడు. 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచాడు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచను. చెత్త పన్ను తొలగిస్తా.

ఉద్యోగాలడిగితే ఫిష్‌మార్టులు

టీడీపీ ఐటీ ఉద్యోగాలు తీసుకొస్తే.. జగన్ రూ.5 వేల వలంటీరు ఉద్యోగాలిచ్చాడు. నిరుద్యోగులు ఉద్యోగాల గురించి అడిగితే ఫిష్‌మార్టులు చూపిస్తున్నాడు. టీడీపీ అధికారంలోకి రాగానే యువత నైపుణ్యాభివృద్ధికి వీలుగా జనగణన నిర్వహించి, వారు ఎంపిక చేసుకున్న రంగంలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా బాధ్యత తీసుకుంటా. మెగా డీఎస్సీపైన సంతకం చేస్తా. ఏటా 4 లక్షల ఉద్యోగాలు ఇస్తా. యువతకు ఉద్యోగాలు రావాలంటే కూటమి ప్రభుత్వం రావాలి.

నాకు విశ్వసనీయత లేదా?

ప్రతి వ్యక్తికి పేరు, అడ్రస్ ఉంటుంది. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన దుష్టుడు జగన్. అలాంటి వ్యక్తి నాకు విశ్వసనీయత లేదంటాడు. నా విశ్వసనీయత తెలియాలంటే ఒక్కసారి హైదరాబాద్‌కు వెళ్తే అర్థమవుతుంది. నా విశ్వసనీయత తెలియాలంటే పోలవరం, అమరావతికి పోయి అడుగు తెలిస్తుంది.

మైనారిటీలకు అండగా ఉంటా..

బీజేపీతో టీడీపీ జతకట్టిందని, మసీదులను చంద్రబాబు కూల్చివేస్తాడని బుగ్గన చెబుతున్నాడు. అసలు ఎన్ఆర్సీ, సీఏఏ బిల్లులకు పార్లమెంటులో మద్దతు ఇచ్చిందే జగన్! మా ప్రభుత్వం ఎల్లప్పుడూ మైనారిటీలకు అండగా నిలిచింది. జగన్ పాలనలో మైనారిటీలపై దాడులు ఎక్కువయ్యాయి. ఆర్థిక మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని పిట్టకథల బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భారీగా దోచేశాడు.అవినీతితో బుగ్గన సంపాదించిన సొమ్మంతా మేం అధికారంలోకి రాగానే కక్కిస్తాం.

సీమలో ఒక్క ప్రాజెక్టు అయినా కట్టాడా?

జగన్ పరిపాలనలో రాయలసీమలో ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదు. ఒక్క పరిశ్రమ తీసుకురాలేదు. సీమకు తాగునీటి కోసం ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు. ఇలాంటి వారికి ఓటు అడిగే హక్కు లేదు.

టీడీపీలోకి భారీగా ముస్లిం నేతలు

ఎన్నికల ముంగిట ముస్లింనేతలు రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో టీడీపీలో చేరుతున్నారు.బీజేపీతో పొత్తు తర్వాత కూడా ఈ చేరికలు కొనసాగడం విశేషం. టీడీపీలో చేరిన ముస్లిం ప్రముఖుల్లో సత్యసాయి జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ ఇక్బాల్, గుంటూరు మాజీ ఎమ్మెల్యే సుభానీ తదితరులున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వక్ఫ్ కమిటీ మాజీ చైర్మన్ ఇస్మాయిల్ నంద్యాలలో తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. ఒక ముస్లిం కో ఆప్షన్ సభ్యుడు టీడీపీలో చేరారు. అనంతపురం మునిసిపాలిటీ మాజీ చైర్మన్ నూర్ మహ్మద్ ఆ పార్టీలో చేరారు. జగన్ పాలనలో ముస్లింలకు ఆదాయ మార్గాలు, ఉపాధి అవకాశాలు బాగా దెబ్బ తిన్నాయని, అందుకే టీడీపీలో చేరడానికి ముందుకు వస్తున్నారని శాసన మండలి మాజీ చైర్మన్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ షరీఫ్ చెప్పారు.


నందికొట్కూరులో సోమవారం నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం

వృద్ధుల ప్రాణాలతో చెలగాటం

- పెన్షన్ డబ్బు బ్యాంకు ఖాతాల్లో వేస్తారా?
- సొమ్ములు పడిందీ లేనిదీ ఎలా తెలుస్తుంది?
- అందరి వద్దా ఫోన్లు ఉంటాయా?
- ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలి: చంద్రబాబు

కర్నూలు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'సీఎం జగన్ బాధ్యతను విస్మరించి శవాలపై రాజకీయాలు చేస్తున్నారు. రాజకీయ స్వార్థం కోసం వృద్ధుల ప్రాణాలను పణంగా పెడతారా..? ఆ అధికారం మీకెవరు ఇచ్చారు..' అని టీడీపీ అధినేత చంద్రబాబు నిలదీశారు. వలంటీర్లతో పంపిణీ చేయించొద్దని ఎన్నికల సంఘం చెప్పడం జీర్ణించుకోలేక ప్రభుత్వం వితండవాదంతో రాజకీయం చేస్తోందన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు అందరికి ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు జిల్లా గూడూరు క్యాంప్ సైట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో 65.49 లక్షలు పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. 45.92 లక్షల మందికి బ్యాంకు ఖాతాలు ఉన్నాయని అంటున్నారు. 25 లక్షల మంది అనారోగ్యంతో ఉన్నారని.. బ్యాంకుల వద్దకు రాలేరని.. వారికి నేరుగా ఇస్తామంటున్నారు. అంత మంది అనారోగ్యంతో ఉన్నారని మీకెలా తెలిసింది? గత నెలలో లేని బ్యాంక్ అకౌంట్లు ఇప్పుడెలా వచ్చాయి..? దొంగ రిపోర్టులతో వృద్ధుల పింఛన్ల పంపిణీపై రాజకీయ కుట్ర చేస్తారా..? రాష్ట్రంలో 1.26 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు, 15 వేల మంది పంచాయతీ కార్యదర్శులు, 5 వేల మంది వెలుగు, మరో ఐదువేల మంది వ్యవసాయ శాఖ, 3 వేల మంది ఉద్యాన శాఖ సిబ్బంది 1.45 లక్షల మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఒక్కొక్కరూ ఒక్క రోజులో 45 పింఛన్లు పంపిణీ చేయవచ్చు. ఎందుకు చేయడం లేదు? స్వార్థ రాజకీయాల కోసం మండుటెండల్లో వృద్ధులను బ్యాంకుల చుట్టు తిప్పుతూ వారి ప్రాణాలతో చెలగాటమాడతారా..' అని విరుచుకుపడ్డారు.

ఖాతాలు ఇప్పుడెలా వచ్చాయి?

గత ఘటనలు పునరావృతం కాకుండా పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ కూడా చెప్పిందని, ఆ మాట లెక్కచేయకుండా.. బ్యాంకుల ద్వారా ఎలా ఇస్తారని చంద్రబాబు ప్రశ్నించారు. 'అధికారులకు ఇళ్లు తెలియవని ఉన్నతాధికారులు చెబుతున్నారు.. మరి గత నెలలోని లేని ఖాతాలు ఇప్పుడెలా వచ్చాయి? వృద్ధుల ఖాతాల్లో పింఛన్ వేస్తామంటున్నారు. ఖాతాల్లో డబ్బులు పడ్డాయని వారికెలా తెలుస్తుంది..? అందరి వద్దా సెల్‌ఫోన్లు ఉంటాయా..? అన్ని గ్రామాల్లో బ్యాంకులు ఉన్నాయా..? డబ్బులు తీసుకోవడానికి 5-10 కిలోమీటర్లు వెళ్లాలి. బ్యాంకు సిబ్బంది లేకుంటే పడిగాపులు కాయాలి. 46 డిగ్రీల ఎండల్లో.. మంచి నీళ్లు కూడా దొరకని పరిస్థితుల్లో పండుటాకులను తిప్పడం సమంజసమా..?' అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆందోళన వద్దు.. పింఛన్ లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని చంద్రబాబు కోరారు. 'జూన్ 4 తర్వాత మన ప్రభుత్వం వస్తుంది.. బకాయితో కలసి ఏప్రిల్ 1 నుంచి పెంచిన రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేల పింఛన్లు పంపిణీ చేస్తాం' అని వెల్లడించారు.

ఒక్కొక్కరి నెత్తిన రూ.10 లక్షల అప్పు

- చిత్తూరు, బంగారుపాళ్యం సభల్లో బాలకృష్ణ


సోమవారం రాత్రి చిత్తూరు సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ

చిత్తూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'జగన్ పుణ్యమా అని రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి నెత్తిమీద రూ.10 లక్షల అప్పు ఉంది. దాన్ని మీరే తీర్చాలి' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కావాలా? విధ్వంసం కావాలా అనేది ప్రజలే నిర్ణయించుకోవాలని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా సోమవారం ఆయన చిత్తూరు, బంగారుపాళ్యంలో పర్యటించారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థులు గురజాల జగన్మోహన్, మురళీమోహన్‌ను గెలిపించాలని కోరారు. 'రాష్ట్రం విడిపోయినప్పుడు కట్టుబట్టలతో వచ్చాం. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకున్నాం. ఈసారి జగన్‌ను గెలిపిస్తే మళ్లీ కట్టుబట్టలతో రాష్ట్రాన్ని వదలాల్సి వస్తుంది. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమిని ఎదుర్కొనే శక్తి ఎవ్వరికీ లేదు. టీడీపీ రాయలసీమ కాలువల్లో కృష్ణమ్మను ప్రవహింపజేసి బీటలు వారిన బీడు భూములను సస్యశ్యామలం చేస్తే, వీళ్లేమో ముఠా కక్షలను పెంచి పోషించి అదే కాలువల్లో రక్తం పారిస్తున్నారు. ఎస్సీల కోసం టీడీపీ 25 పథకాలను అమలు చేస్తే.. వైసీపీ వాటన్నింటినీ రద్దు చేసింది. ముస్లింల కోసం టీడీపీ అమలు చేసిన పథకాలను కూడా రద్దు చేసింది. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ పథకాలన్నింటినీ తిరిగి అమలు చేస్తాం. ముస్లింలను, ఎస్సీలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం' అని బాలకృష్ణ అన్నారు. వైసీపీ మేనిఫెస్టో సంక్షేమ మేనిఫెస్టోలాగా లేదని, రాజీనామా లేఖలా ఉందని బాలకృష్ణ ఎద్దేవా చేశారు. 'మాట తప్పనంటూ మంట పెట్టేశాడు.. మడమ తిప్పనంటూ మెడలు విరిచేశాడు.. జగనన్న అంటూ జలగలా పీడిస్తున్నాడు.. మావయ్యనంటూ మనోభావాలను తగలబెట్టేశాడు. అవ్వా తాతల నోటికాడ బువ్వను లాగేసుకున్నాడు. పేదల అన్నపానీయాలను మద్యం వ్యాపారంలో పోసేశాడు. దళితులకు అండగా ఉంటానంటూ వారి చావులతో తన ఆకలి కేకలు ఆర్చుకుంటున్నాడు.' అని ధ్వజమెత్తారు.


చిత్తూరు జిల్లా సదుం పోలీస్‌స్టేషన్ ముందే బీసీవై పార్టీ ప్రచార వాహనానికి నిప్పుపెట్టిన వైసీపీ శ్రేణులు


అన్నమయ్య జిల్లా వరంపాటివారిపల్లె వద్ద జాతీయ రహదారిపై బీసీవైపీ ప్రచార రథాలకు నిప్పు

పెద్దిరెడ్డి ఇలాకాలో విధ్వంసం

- యథేచ్ఛగా వైసీపీ శ్రేణుల దౌర్జన్యకాండ
- రామచంద్రయాదవ్‌పై హత్యాయత్నం
- 20మంది బీసీవై కార్యకర్తలకు తీవ్రగాయాలు
- కాన్వాయ్‌లో 15 వాహనాలు ధ్వంసం
- పోలీస్ స్టేషన్ ఎదుట పార్టీ వాహనానికి నిప్పు
- సీఆర్పీఎఫ్ వాహనంపైనా దాడి
- బీసీవై నాయకుడి ఇంటికి నిప్పు
- ఇంట్లో భార్యాపిల్లలు ఉండగానే ఘటన
- మంటలు ఆర్పేసి కాపాడిన పోలీసులు

పుంగనూరు/పీలేరు, ఏప్రిల్ 29: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు మరోసారి విధ్వంసం సృష్టించారు. పోలీసుల సాక్షిగా యథేచ్ఛగా దౌర్జన్యకాండ కొనసాగించారు. ఆయన స్వగ్రామానికి ఎన్నికల ప్రచారం కోసం వెళ్లిన భారత చైతన్య యువజన(బీసీవై) పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్‌పై వైసీపీ శ్రేణులు రాళ్లు, కర్రలతో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆ పార్టీ కార్యకర్తలను వెంబడించి కొట్టారు. 15 వాహనాలను ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు. చివరకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా వదలకుండా వెంబడించి.. స్టేషన్ ఎదుటే ఆయన ప్రచార వాహనానికి నిప్పు పెట్టారు. సోమవారం సాయంత్రం చిత్తూరు జిల్లా సదుం మండలంలో మంత్రి పెద్దిరెడ్డి స్వగ్రామం ఎర్రాతివారిపల్లెకు ఎన్నికల ప్రచారంలో భాగంగా రామచంద్రయాదవ్ ప్రచారరథంలో వెళ్లారు. 'పెద్దిరెడ్డి గ్రామానికి రావడానికి ఎంత ధైర్యం నీకు' అంటూ వైసీపీ శ్రేణులు ప్రచారరథంపై రాళ్లురువ్వారు. ఆయన భద్రతా సిబ్బంది వారిని పట్టుకుని కొట్టి పంపారు. దీంతో మరికొందరు కర్రలు, రాళ్లతో వచ్చి గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని.. అనుమతిలేకుండా వచ్చారని అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అయితే, వైసీపీ శ్రేణులు ఆయన వాహనంపై రాళ్లు వేసి అద్దాలు ధ్వంసం చేశారు. బీసీవై శ్రేణులూ ప్రతిదాడికి దిగారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ కార్యకర్తలు భారీసంఖ్యలో అక్కడికి చేరుకుని 15 వాహనాలను ధ్వంసం చేశారు. ఆ తర్వాత రామచంద్రయాదవ్ కాన్వాయ్ కల్లూరు రోడ్డులో వెళుతుండగా, వైసీపీ శ్రేణులు అడ్డుకుని రాళ్లు, కర్రలతో మళ్లీ దాడి చేశారు. 20మంది బీసీవై కార్యకర్తలను తీవ్రంగా కొట్టారు. పోలీసులు సర్దిచెప్పినా వినలేదు. రామచంద్రయాదవ్ వాహనాలను పోలీస్ స్టేషన్ వరకు వెంబడించారు. సదుం చేరుకుని పోలీస్ స్టేషన్ ఎదుట వాహనాలుంచి లోనికి వెళ్లారు. అయినా వైసీపీ శ్రేణులు వదల్లేదు. ఆయనపై దాడి చేయాలని స్టేషన్ ఆవరణలోకి చొరబడ్డారు. పోలీసులు తలుపులు మూసివేయడంతో స్టేషన్ ఎదురుగా ఉన్న బీసీవై ప్రచార వాహనానికి నిప్పు పెట్టారు. సీఆర్పీఎఫ్ భద్రతాదళాలు ఉపయోగించే వాహనంతో పాటు పలు వాహనాలను వైసీపీ శ్రేణులు మరోసారి ధ్వంసం చేశారు. చిత్తూరు ఎస్పీ మణికంఠ సదుం చేరుకుని రామచంద్రయాదవ్‌తో జరిగిన ఘటనపై మాట్లాడారు. ఇక, అన్నమయ్య జిల్లా పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ వరంపాటివారిపల్లె వద్ద బీసీవైపీకి చెందిన నాలుగు ప్రచార రథాలను గుర్తు తెలియని దుండగులు తగులబెట్టి, ధ్వంసం చేశారు. పీలేరు ఎస్ఐ నరసింహుడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ దాడి ఘటనలో పీలేరుకు చెందిన వైసీపీ నేతల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటన స్థలానికి కేవలం 20 అడుగుల దూరంలో పీలేరు పట్టణానికి చెందిన ఓ వైసీపీ మైనారిటీ నేత వాహనం ఉండడంతో అనుమానాలు బలపడుతున్నాయి.

బీసీవై పార్టీ నేత ఇంటికి నిప్పు

సోమవారం రాత్రి సదుం మండలం చిలకపాటివారిపల్లెకు చెందిన బీసీవై పార్టీ నాయకుడు ఆనందరెడ్డి ఇంటిపై వైసీపీ మూకలు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. రామచంద్రయాదవ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆనందరెడ్డి ఇంట్లో బీసీవై పార్టీ శ్రేణులకు మధ్యాహ్నం భోజనం పెట్టారు. ఆనందరెడ్డి ఇంట్లో ఆయన భార్య, పిల్లలు ఉండగా వైసీపీ మూకలు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ఆయన కారును ధ్వంసం చేశారు. విషయం తెలియగానే పోలీసులు హుటాహుటిన అక్కడకు వెళ్లి మంటలు ఆర్పేసి, రక్షణ కల్పించారు. కాగా, బీసీవైపీ ప్రచార రథాలపై దాడి ఘటన ముమ్మాటికీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు, ఎంపీ మిథున్ రెడ్డి పనేనని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగిస్తున్న పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డిలపై నిషేధం విధించాలని ఈసీని కోరారు.

ఇప్పుడున్నదంతా మాఫియానే

పాలనలో వైఎస్‌తో జగన్‌కు పొంతనెక్కడ?

- మద్యనిషేధం, జాబ్ కేలెండర్ అన్నీ మోసం
- అన్నమాట ఒక్కటీ నిలబెట్టుకోని జగన్...
- ఇప్పుడు ఎన్నికల వేళ సిద్ధం అంటూ బయల్దేరాడు: షర్మిల


కాకినాడ సభలో గజమాలలో షర్మిల

ఏలూరు/కొయ్యలగూడెం(ఆంధ్రజ్యోతి), కాకినాడ సిటీ/రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 29: 'దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో రైతులకు మేలు జరిగేది. పేదలకు న్యాయం జరిగేది. ఆ పాలనకు, జగన్ పాలనకు పోలిక ఎక్కడ? ఇప్పుడు రాష్ట్రంలో మోసాలు, మాఫియానే నడుస్తోంది'.. అంటూ పీసీసీ చీఫ్ షర్మిల గళమెత్తారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలలో ఆమె మాట్లాడారు. 'రాష్ట్రంలో వ్యవసాయం దండగ అయింది. రైతులను ఆదుకునే నాథుడే లేడు. పంట నష్టపరిహారం ఇవ్వడం లేదు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేశారు. రైతుకు లాభం కంటే నష్టమే ఎక్కువ. ఎందుకిలా చేస్తున్నారు?' అంటూ షర్మిల విరుచుకుపడ్డారు. 'ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగులను మోసగించారు. మెగా డీఎస్సీ అని దగా డీఎస్సీ పెట్టాడు. మద్యపాన నిషేధం పేరిట మోసం. జాబ్ కేలెండర్ అనే మరో మోసం. గతంలో బాబును తిట్టిన జగన్, అధికారంలోకి వచ్చాక ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదు' అంటూ షర్మిల మండిపడ్డారు. 'ప్రత్యేక హోదా పేరిట రాష్ట్రాన్ని మోసం చేశారు. జగన్ ఇచ్చిన ఒక్క హామీ నెరవేరలేదని తూర్పారబట్టారు. 'జగన్ ఎన్నో హామీలు ఇచ్చారు. పోలవరం ముంపు బాధితులను ఆదుకుంటామన్నారు. ఎకరాకు రూ.10 లక్షలు పరిహారం ఇస్తామని చెప్పారు. ఎకరం ధర ఇప్పుడు రూ.20లక్షలకు పైగానే ఉంది. జగన్ ఇచ్చే పరిహారం సరిపోతుందా? ముంపు బాధితులకు కాలనీలు కట్టిస్తామని మోసం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కాంగ్రెస్ జాతీయ హోదా ఇచ్చింది. ఈ పదేళ్లలో ప్రాజెక్టుకు ఒక్క అడుగు కూడా పడలేదు' అంటూ జగన్ పాలనను షర్మిల తప్పుబట్టారు. 'ఐదేళ్లలో ప్రజలకు ఈ ముఖం చేసిందేమీ లేదు. కానీ ఇప్పుడు సిద్ధం అంటూ బయల్దేరాడు' అంటూ ఎద్దేవ చేశారు. సీఎం జగన్ వైఎస్ఆర్ వారసుడా లేక దేశ ప్రధాని మోదీకి దత్తపుత్రుడా అని షర్మిల ప్రశ్నించారు.

2019 మేనిఫెస్టో వాగ్దానాల అమలుపై సమాధానం చెప్పాలి: పురందేశ్వరి



అనపర్తి, ఏప్రిల్ 29: వైసీపీ నేతలకు ధైర్యం ఉంటే 2019 మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాల అమలుపై సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సవాల్ విసిరారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ఆమె రోడ్‌షో నిర్వహించారు. 'తమకు మేనిఫెస్టో భగవద్గీత, ఖురాన్, బైబిలు అని చెప్పుకొనే జగన్‌రెడ్డి... సంపూర్ణ మద్య నిషేధం అని చెప్పి నేడు చేసిందేమిటి? అమ్మ ఒడి రూ.15 వేలు అని చెప్పి 13 వేలే ఇచ్చారు. అదీ అర్హులందరికీ ఇవ్వలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని పథకాల్లోనూ కోతలు విధించి మాట తప్పారు' అని ఆమె అన్నారు.

ఏపీలో ఎన్డీఏ గాలి బాగా వీస్తోంది: నడ్డా

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): 'అభ్యర్థుల ప్రచారం ఎలా జరుగుతోంది. మిత్రపక్షాలతో సమన్వయం కీలకం. దానిపై ప్రత్యేక దృష్టి పెట్టండి. ఫలితాలు ఎన్డీఏకి బాగా అనుకూలంగా ఉన్నాయి. మరింత కష్టపడి పని చేయండి' అంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం పర్యటనకు వెళ్తూ.. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో నడ్డా పార్టీ నేతలతో ముచ్చటించారు.

వివేకా హత్య బాధాకరం

- దానిని సపోర్టు చేయడం తప్పు.. సత్యాన్ని ఓడించే శక్తి మనిషికి లేదు
- చర్చిల్లో రాజకీయాలు మాట్లాడను
- షర్మిలకు ఓటు వేయమని అడగను: బ్రదర్ అనిల్



బద్వేలు, ఏప్రిల్ 29: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని అత్యంత దారుణంగా హత్య చేయడం, ఆ వయసు వ్యక్తి పట్ల అలా ప్రవర్తించడం బాధాకరమని బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. దానిని సమర్థించడం తప్పు అని చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ఇక్కడి వ్యవహారాలన్నీ వివేకా చక్కదిద్దేవారని చెప్పారు. వైఎస్‌కు కుడిభుజంలా ఉండేవారని తెలిపారు. అలాంటి వ్యక్తిని అత్యంత దారుణంగా హత్య చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు రాజకీయాన్ని కమర్షియల్‌గా మార్చారని అన్నారు. తాను చర్చిలో ప్రార్థన చేస్తాను తప్ప రాజకీయాలు మాట్లాడనని స్పష్టం చేశారు. అలాగే షర్మిలకు ఓటు వేయమని ఎవరినీ అడగబోనని పేర్కొన్నారు. ఎప్పటికీ న్యాయానిదే విజయమని, డబ్బు వ్యామోహంతో ఎవరూ కక్కుర్తి పడొద్దని కోరారు. అన్యాయానికి బలం ఉండదని, న్యాయాన్ని ఓడించే సామర్థ్యం ఏ మనిషికి, డబ్బుకు ఉండదని తెలిపారు.

వివేకా కేసులో.. కడప కోర్టు ఉత్తర్వులపై విచారణకు మరో హైకోర్టు బెంచ్ దూరం

అమరావతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయంలో వైసీపీ అధ్యక్షుడు, ఆ పార్టీ నేతలపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయవద్దని కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాల విచారణ నుంచి మరో హైకోర్టు ధర్మాసనం తప్పుకొంది. వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, పులివెందుల టీడీపీ అభ్యర్థి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి) వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లు (సివిల్ మిసిలేనియస్ అప్లికేషన్) సోమవారం జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. విచారణ నుంచి వైదొలుగుతున్నట్లు ఈ ధర్మాసనం ప్రకటించింది. విచారణ నిమిత్తం ఈ వ్యాజ్యాలను ఇంకో బెంచ్ ముందు ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఉపాధ్యాయ సంఘ నేత
మూకల అప్పారావు మృతి


అప్పారావు (ఫైల్)

మొగల్రాజపురం, ఏప్రిల్ 29: ఉపాధ్యాయ (ఎస్‌టీయూ) ఉద్యమ నేత సామాజిక సేవకుడు మూకల అప్పారావు (62) ఆసుపత్రిలో మరణించారు. ఈ నెల 22న ఎస్‌టీయూ నేత కుమార్తె వివాహానికి వెళ్లిన ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మరణించారు. మొగల్రాజపురం అమ్మ కల్యాణ మండపం సమీపంలోని ఆయన స్వగృహం వద్ద పార్థివ దేహానికి పలు పార్టీలకు చెందిన రాజకీయ నేతలు ఏఎస్ రామకృష్ణ, పరుచూరి అశోక్‌బాబు, బొండా ఉమామహేశ్వరరావు, దేవినేని అవినాష్, చిగురుపాటి బాబూరావు, వెలంపల్లి శ్రీనివాసరావు, తాడి శకుంతల, ఎస్టీయూ, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ, యూటీఎఫ్, నోబుల్ టీచర్స్ తదితర సంఘాల నేతలు నివాళులర్పించారు. కత్తి నరసింహారెడ్డి, జల్లి విల్సన్, అక్కినేని వనజ, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.


నివాళులర్పిస్తున్న జల్లి విల్సన్ తదితరులు

చంద్రబాబు సంతాపం

అమరావతి: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మూకల అప్పారావు మృతి పట్ల టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సంతాపం వెలిబుచ్చారు. 3దశాబ్దాలపైగా ఉపాధ్యాయుడిగా కొనసాగి, ఉపాధ్యాయ సమస్యలపై మూకల అప్పారావు రాజీ లేని పోరాటం చేశారని గుర్తు చేశారు. అలాగే అప్పారావు మృతి పట్ల టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సంతాపాన్ని తెలియజేశారు. ఉపాధ్యాయ ఉద్యమ యోధుడిగా పేరున్న అప్పారావు మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటన్నారు.

వైసీపీకి ఓటు వేస్తే విధ్వంసమే

● పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం, ఏప్రిల్ 29: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేస్తే విధ్వంసమేనని పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సోమవారం ఆయన పశ్చిమలో కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరితో కలిసి 38వ డివిజన్ పరిధిలోని విద్యాధరపురం, నాలుగు స్తంభాల సెంటర్ల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేస్తూ చంద్రబాబు అధికారంలోకి రాగానే అమలుపరిచే పథకాల గురించి వివరించారు. అనంతరం కేశినేని చిన్ని మాట్లాడుతూ అమరావతి నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. జగన్‌కు తెలిసింది జనాలను మోసం చేయడం ఒకటేనని విమర్శించారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసినట్లు జగన్ అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నాడన్నారు. సుజనా చౌదరి మాట్లాడుతూ వైసీపీ నేత పశ్చిమను అభివృద్ధికి దూరంగా ఉంచారన్నారు. ఈ నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. అందరికీ విద్య, వైద్యం అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), టీడీపీ సీనియర్ నేత ఎంఎస్ బేగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, 38వ డివిజన్ కమిటీ ప్రెసిడెంట్ సెక్రటరీలు పితాని పద్మ, ఈశ్వర్, జనసేన పార్టీ డివిజన్ అధ్యక్షుడు తమ్మిన లీలాకృష్ణ పాల్గొన్నారు.


38వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కేశినేని శివనాథ్, సుజనా చౌదరి

దళిత ద్రోహి జగన్: చిన్ని

వన్‌టౌన్: గత ఎన్నికలలో దళిత వర్గాలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన రెడ్డి దళితులను అణగదొక్కుతూ దళిత ద్రోహిగా మిగిలిపోయారని పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సోమవారం వన్‌టౌన్‌లోని టీడీపీ పశ్చిమ కార్యాలయంలో ఎస్సీ సెల్, తెలుగు యువత కమిటీ సభ్యులతో వరుస సమావేశాలు నిర్వహించారు. తొలుత ఎస్సీ సెల్ సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీలకు చెందిన 27 ప్రభుత్వ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారని గుర్తు చేశారు. దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని విమర్శించారు. ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థుల భవిష్యత్తును జగన్‌రెడ్డి అంధకారం చేశారన్నారు.

వాణిజ్య సముదాయంలో ప్రచారం

తెలుగు యువత టీఎన్ఎస్ఎఫ్ సంయుక్తంగా పశ్చిమలోని వాణిజ్య సముదాయాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కేశినేని చిన్ని అన్నారు. ఇక్కడ సుమారు 23 మార్కెట్ కాంప్లెక్స్‌లున్నాయని ప్రతి మార్కెట్‌కు వెళ్లి వ్యాపారస్థులు, కూలీలు, హమాలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకుని, సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించాలన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ, పశ్చిమ అధ్యక్షుడు ఈ.రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామారావు, తెలుగుయువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్.మాధవ్, జిల్లా అధికార ప్రతినిధి ఎం.రాజు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకపాలనతో సర్వనాశనం

● యనమల ఆగ్రహం

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఏప్రిల్ 29: ఐదేళ్ల వైసీపీ అరాచకపాలనతో రాష్ట్ర భవిష్యత్తు సర్వనాశనమైందని, 35శాతం ఉన్న యువత నిర్వీర్యమైందని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరవల్లి కూడలిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా టీడీపీ గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, జనసేన బందరు పార్లమెంటు అభ్యర్థి బాలశౌరితో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుపడాలన్నా, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం చారిత్రాక అవసరమన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రజలపై పన్నులభారం మోపుతూ ప్రజాసంపదైన సహజవనరులను దోపిడీ తప్ప ప్రజా సంక్షేమం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ ఆస్తులతో పాటు సహజవనరులను దోపిడీచేసి రూ.లక్షల కోట్లు సంపాదించిన వ్యక్తుల గుర్తించి వెనక్కు రప్పించి పేదలకు, రైతులకు అందేలా చేయడమే లక్ష్యమని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అనేక సభల్లో చెప్పారని గుర్తు చేశారు. ప్రజల ఆస్తిని దోచుకునే పార్టీని ఎన్నుకోవాలో, ప్రజలకు మంచిచేస్తూ కాపాడే పార్టీని ఎన్నుకోవాలో నిర్ణయించుకోవాలన్నారు. విదేశాల్లో వ్యాపారాలు చేస్తూ సేవాభావంతో పనిచేయాలని రాజకీయాల్లోకి వచ్చిన యార్లగడ్డ వెంకట్రావుకు, ఎంపీగా కేంద్రం ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసే బాలశౌరిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. రాష్ట్రాన్ని మనం రక్షించుకుంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోగలమన్నారు. మన హక్కు అయిన ఓటును సద్వినియోగం చేసుకుంటేనే మన జీవితాలు బాగుపడతాయని అంబేద్కర్ సూచించారన్నారు. రాజకీయపరంగా పెట్టిన తప్పుడు కేసులను అధికారంలోకి రాగానే మాఫీ చేస్తామని యనమల రామకృష్ణుడు హామీ ఇచ్చారు. భయపడితే రాష్ట్రం బాగుపడదని, రాష్ట్రాన్ని రక్షించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు గాడిలో పడాలన్నా, నిర్వీర్యమైపోయిన యువత తిరిగి పుంజుకోవలన్నా ఎన్డీయే కూటమి అభ్యర్థులైన యార్లగడ్డ వెంకట్రావు, బాలశౌరిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. పోలింగ్ బూత్‌లో మొదటి ఈవీఎంలో బందరు పార్లమెంటు జనసేన కూటమి అభ్యర్థి బాలశౌరికి గాజుగ్లాసు గుర్తుపై, రెండవ ఈవీఎంలో గన్నవరం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సూచించారు. టీడీపీ, జనసేన, బీ జేపీ నేతలు, చుట్టుపక్క గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


వీరవల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, చిత్రంలో యార్లగడ్డ వెంకట్రావు, బాలశౌరి



నలుగురు రైల్వే ఉద్యోగులకు అవార్డులు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 29: రైల్వే డివిజన్‌లో విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించిన నలుగురు ఉద్యోగులకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ కుమార్ జైన్ సోమవారం మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులు అందజేశారు. సికింద్రాబాద్ రైలు నిలయం నుంచి డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్, డిపార్ట్‌మెంట్ ముఖ్య అధికారులతో ఆయన వర్చువల్ సేఫ్టీ సమావేశం నిర్వహించారు. గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల మేనేజర్లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ రాత్రివేళల్లో క్రమం తప్పకుండా సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. విజయవాడ డివిజన్‌లో సిబ్బంది అప్రమత్తతను ఆయన అభినందించారు. రాజమండ్రి మెకానికల్ సీనియర్ టెక్నీషియన్ ఎస్.శ్రీనివాసరావు మార్చి 18న ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రోలింగ్ చేస్తుండగా హార్ట్ యాక్సిల్ బాక్స్ వేడెక్కడాన్ని గమనించి వేరు చేసి ప్రమాదం నుంచి తప్పించారు. టెక్నీషియన్ వన్ ఎస్.సతీష్ మార్చి 25న రాజమండ్రిలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌ను పరిశీలిస్తున్న సమయంలో బోగి కింద యాక్సిల్ బాక్స్ నిలువు డంపర్‌లో ఆయిల్ వేడెక్కడాన్ని గుర్తించారు. అరావళి ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్ స్టేషన్ మేనేజర్ ఎన్.సురేష్ మార్చి 6న స్టేషన్ దాటుతున్న గూడ్స్ రైలు వేగం నుంచి యాక్సిల్ వేడెక్కడాన్ని గమనించి చర్యలు తీసుకున్నారు. కాకినాడ టౌన్‌లో పాయింట్స్ మెన్ సత్యనారాయణ కాకినాడ టౌన్ స్టేషన్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదురు రైల్ వెల్డ్ ఫెయిల్యూర్‌ను గమనించి సిగ్నల్‌ను మార్చి ప్రమాదం నుంచి తప్పించారు. దీంతో వీరందరికీ మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డును అందించారు.

గన్నవరం బరిలో ఇండిపెండెంట్‌గా బీజేపీ నేత!

గన్నవరం: గన్నవరం నియోజకవర్గంలో బీజేపీకి చెందిన నేత కొర్రపోలు శ్రీనివాసరావు ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ప్రసాదంపాడుకు చెందిన ఆయన బీజేపీ సభ్యుడిగా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. నామినేషన్ వేసే ముందు పదవికి రాజీనామా చేసి పార్టీ సభ్యుడిగానే ఉన్నారు. కాషాయ కండువాతోనే ఎన్నికల ప్రచారం చేస్తానని ఆయన తెలిపారు.

సరైన పత్రాలు చూపని రూ. 5.25 లక్షలు స్వాధీనం

కంకిపాడు: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు స్వాధీన పరుచుకున్నట్టు కంకిపాడు సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ, విజయవాడకు చెందిన వీరంకి గోపీకృష్ణ సరైన పత్రాలు లేకుం డా తరలిస్తున్న రూ.5,25,461 నగదును స్వాధీ న పరుచుకున్నట్టు తెలియజేశారు. ఎస్సై సందీ ప్, ఫ్లైయింగ్ స్క్వాడ్ జి.లక్ష్మీ పాల్గొన్నారు.

గులకరాయి కేసులో 164 పిటిషన్‌పై
విచారణవచ్చే నెల 29కి వాయిదా

విజయవాడ: గులకరాయి దాడి కేసులో ప్రధాన నిందితుడు వేముల సతీష్‌కుమార్ నుంచి సీఆర్‌పీసీ 164 ప్రకారం వాంగ్మూలం ఇప్పించాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం మే 29వ తేదీకి వాయిదా వేసింది. నిందితుడ్ని అరెస్టు చేసిన తర్వాత విజయవాడలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి న్యాయస్థానంలో పోలీసులు ఈ పిటిషన్‌ను దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణను న్యాయస్థానం మే 29వ తేదీకి వాయిదా వేసింది.

అవినాష్ జీవితమంతా తప్పుడు ప్రచారాలే

● టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి

పటమట, ఏప్రిల్ 29: అవినాష్ జీవితమంతా తప్పుడు ప్రచారాలే తప్ప నిజం మాట్లాడే దమ్ము లేదని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి విమర్శించారు. అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన విలేకరుల సమావేశంలో పట్టాభి మాట్లాడుతూ దేవినేని అవినాష్‌కు నిజం చెబితే తల ముక్కలయ్యే శాపం ఉందని, అందువల్లే అతడు జన్మలో నిజాలు మాట్లాడడని, తప్పుడు వీడియోలతో ఫేక్ ప్రచారాలు చేయడం అవినాష్ నైజమని పట్టాభి దుయ్యబట్టారు. అవినాష్ విడుదల చేసిన ఫేక్ వీడియోను ప్రొజెక్టర్‌లో ప్రదర్శించి అందులో తప్పులను మీడియాకు వివరించారు. అనంతరం గద్దె రామ్మోహన్ చేసిన అభివృద్ధిపై తయారు చేసిన వీడియోలను ప్రదర్శించారు. ఈ సమావేశంలో గద్దె అనురాధ, అమ్మిశెట్టి వాసు, పోతంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు. గతంలో తాను రిటైనింగ్ వాల్ కట్టించానని అవినాష్ తప్పుడు ప్రచారం చేసుకున్నాడని, ఈ విషయాన్ని తాము అప్పట్లోనే నిర్ధ్యంగా ఖండించామన్నారు. అవినాష్ చెబుతున్నట్లుగా తూర్పులో రూ.650 కోట్లు అభివృద్ధి చేయలేదని, ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం రూ.173 కోట్లు మాత్రమే అభివృద్ధికి కేటాయించారన్నారు. అందులోనూ రూ.98.96 కోట్లకు మాత్రమే పనులు జరిగాయని, మిగిలినవి జరుగుతున్నాయని, జగన్ ప్రభుత్వం ఆర్‌టీఐ యాక్టులో చెప్పిందన్నారు. ఇటీవల అవినాష్ తూర్పులో అభివృద్ధి చేసినట్లు వీడియో ప్రదర్శించారని ఆ వీడియోలో షూటింగ్ మొత్తం హైదరాబాద్‌లో చిత్రీకరించారన్నారు. అవినాష్‌కు హైదరాబాద్ అంటే ప్రేమని ఎల్‌వీ.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ పక్కనే అతని తండ్రికి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అక్రమంగా దోచిపెట్టిన కోట్లు విలువైన స్థలమే దానికి కారమణని, అందులో పెద్ద కమర్షియల్ కాంప్లెక్స్‌ను కడుతున్నాడన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి జరగలేదని, అవినాష్ ఆస్తులు మాత్రం అభివృద్ధి చెందాయని, 2019, 2024 ఎన్నికల అఫిడవిట్లు చూపించారు. కొవిడ్ సమయాల్లో గుణదల ముఠా ప్రభుత్వ హాస్పిటల్లో ఆక్సిజన్ సిలెండర్లు రెడిమీస్ కార్ ఇంజెక్షన్లు అమ్ముకున్నారన్నారు. అవినాష్‌కు రెండేళ్లపాటు జీరో రిటర్నులు వేశారని, ఏ వ్యాపారం లేని అవినాష్‌కు ఆస్తులు పెరగడానికి గుణదల దొడ్డిలో సెటిల్‌మెంట్లలో రాయించుకున్న ఆస్తులే కారణమన్నారు. గద్దె రామ్మోహన్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు నిర్మించి కొండ ప్రాంతాల ప్రజల దాహార్తి తీర్చారని, తూర్పులో ఏ వైపు వెళ్లినా గద్దె రామ్మోహన్ అభివృద్ధి కనబడుతుందన్నారు. గద్దె అనురాధ మాట్లాడుతూ రూ.2375 కోట్లతో గద్దె తూర్పులో అభివృద్ధి పనులు చేపడితే, గద్దె రామ్మోహన్ ఏమి చేయలేదని అవినాష్ చెప్పడం సిగ్గు చేటన్నారు.

జనసేన నేత అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ గద్దె రామ్మోహన్‌కు వస్తున్న ప్రజాదరణ తట్టుకోలేక అవినాష్ తప్పుడు ప్రచారాలను పూనుకుంటున్నాడన్నారు. ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి గాంధీ, సిద్దం నాగేంద్రరెడ్డి, హరిప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.


ఎన్డీయే కూటమి రూపొందించిన 'కూటమి పంతం' బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు


కనకదుర్గానగర్‌లోని షాపులు

అభివృద్ధి పనులకు అడ్డంగా ఉన్న
షాపులు తొలగించండి

● లేఖ రాసిన ఈఈ రమాదేవి ● నిర్ణయం తీసుకోని ఈవో రామారావు

వన్‌టౌన్, ఏప్రిల్ 29: మాస్టర్‌ప్లాన్ ప్రకారం కనకదుర్గానగర్‌లో దుర్గగుడి వేద స్థానం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. వీటికి ఇటీవల సీఎం జగన్మోహనరెడ్డి శంకుస్థాపన చేశారు. పనులకు అడ్డంగా ఉందని రూ.5కోట్ల వ్యయంతో నిర్మించిన పెర్గోలాను కూడా తొలగించారు. మహామండపంలో మరిన్ని షాపులకు చోటు కల్పించలేకపోవడంతో కనకదుర్గానగర్‌లో 21 షాపులను దేవస్థానం లీజుకిచ్చింది. లీజుదారులు తమకు కేటాయించిన స్థలాలకంటే ఎక్కువగా ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నా అద్దెలు మాత్రం సక్రమంగా చెల్లించక భారీగా బకాయి పడ్డారు. సుమారుగా రూ.రెండున్నరకోట్లకుపైగా బకాయి ఉన్నా అద్దెల వసూళ్లలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వారికి రాజకీయ నేపథ్యం ఉండడంతో గట్టిగా అడగలేకపోతున్నారు. మరోపక్క మాస్టర్‌ప్లాన్ ప్రకారం కనకదుర్గానగర్ నుంచి ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, ఇతర నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. కొన్ని పనులను ప్రారంభించినా మేజర్ పనులు త్వరగా పూర్తి చేయాల్సి ఉంది. నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ లింగం రమాదేవి తాజాగా షాపులను ఖాళీ చేయించాలని కోరుతూ ఈవో రామారావుకు లేఖ రాశారు. వాస్తవంగా షాపులను ఇప్పుడు ఖాళీ చేయిస్తేనే ఏప్రిల్, మే నెలల్లోనే ఎక్కువ పనులు జరుగుతాయి. జూన్ వస్తే వర్షాలు పడడం, జూలైలో అమ్మవారి శాకంబరీ ఉత్సవాలు, అక్కడ్నుంచి దసరా ఉత్సవాల పనులు వస్తుంటాయి. అందుకే ఆమె లేఖరాశారు. ఈ లేఖ వారం క్రితం రాసినట్టు సమాచారం. ఈవో మాత్రం సోమవారం వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. మరోవైపు ఇక్కడి షాపుల వారికి పొలిటికల్ బ్యాక్‌డ్రాప్ ఉండడంతో వారిని ఖాళీ చేయించే విషయమై కొంత ఆలోచన చేయాల్సి ఉందన్న దానిపై చర్చ జరుగుతోంది.

అసంపూర్తి పనులతో
ఆర్‌యుబీ ప్రారంభం

● హైకోర్టులో కేసు వేయడం వల్లే పనులు జరిగాయంటున్న టీడీపీ నేతలు
● వెలంపల్లి కృషేనంటూ వైసీపీ నేతల వితండవాదం..!


ఆర్‌యుబీలో వాహనాల రాకపోకలు

మధురానగర్, ఏప్రిల్ 29: ఎన్నికలు రావడంతో పనులు పూర్తవకపోయినా మధురానగర్ ఆర్‌యూబీలోకి వాహనాల రాకపోకలను అధికారులు ప్రారంభించారు. దాదాపు ఐదున్నరేళ్ల క్రితం టీడీపీ హయాంలో ప్రారంభం జరుపుకుని సగానికి పైగా పనులు పూర్తి చేసుకున్న ఆర్‌యుబీని వైసీపీ నిధులు కేటాయించకుండా వదిలేయడంతో ఒక అడుగు ముందుకి రెండు అడుగులు వెనక్కి అన్న రీతిలో జరిగాయి. ఎన్నికల వేళ ఈ సమస్య బాగా పెద్దగా ఉండటం, దాదాపు మూడు డివిజన్ల ఓటర్లు దాదాపు 60వేల మందిపై దీని ప్రభావం పడటంతో ఆరేడు నెలలుగా రాకపోకలకు అనువుగా లేని ఆర్‌యూబీ లోపల రోడ్డు పనులు ఇప్పుడు పూర్తి చేయించారు. సోమవారం ట్రాఫిక్‌ను వదిలేశారు. దీంతో వైసీపీ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి వెలంపల్లి చొరవతో ఆర్‌యుబీ పూర్తయిందని సోషల్ మీడియాలో హల్ చేశారు. ఇది గమనించిన టీడీపీ డివిజన్ పార్టీ నేతలు ఆర్‌యుబీ ఆగిపోయినపుడు ప్రజలు పడుతున్న బాధలను గుర్తించి హైకోర్టులో కేసు వేయడంతో కార్పొరేషన్ అధికారులు, వైసీపీ నేతలు తప్పక ఈ కాస్త పనులను చేపట్టారని కౌంటర్ స్టార్ట్ చేశారు. ఈ సందర్భంగా కేసు వేసిన లాయర్లు జువ్వాజి నారాయణ ప్రసాద్, శరత్ చంద్ర, కొండా శ్రీనివాసమూర్తికి సోమవారం శాలువాకప్పి సత్కారం చేశారు. ప్రస్తుతం బాగానే ఉన్నా వర్షాకాలంలోగా ఆర్‌యుబీ బయట పనులు పూర్తికాకపోతే పరిస్థితి ఎప్పటిలాగే ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.


లాయర్ జువ్వాజి నారాయణ ప్రసాద్‌ను అభినందిస్తున్న టీడీపీ డివిజన్ నేతలు

బకాయిలు చెల్లించండి

● ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి ఏపీసీపీఎస్ఈఏ వినతి పత్రం

వన్‌టౌన్: బకాయిలు చెల్లింపు, ఇతర అంశాలపై ఏపీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ప్రతినిధులు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. 2023 జూన్ వరకు కొంతమందికి మాత్రమే కంట్రిబ్యూషన్ జమయిందని ఆ ఏడాది జూలై నుంచి ఇది బకాయి పండిందని, కొంతమందికి మాత్రమే 2023 నవంబరు వరకు మాత్రమే సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ జమయిందని, డిసెంబర్ నుంచి మ్యాచింగ్ గ్రాంట్ నిలిచిపోయిందని వెంటనే వీటిని జమ చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. మూడేళ్ల క్రితం ప్రకటించిన డీఏ బకాయిలు కేవలం సీపీఎస్ ఉద్యోగులకు మాత్రమే జమ కాలేదన్నారు. 2018 జులై, 2019 జనవరి కాలానికి సంబంధించి డీఏ బకాయిలను ఆరు విడతల్లో చెల్లిస్తామని, ఎరియర్ బిల్లులను కూడా సబ్ ట్రెజరీ కార్యాలయాలకు సమర్పింపజేశారన్నారు. 2019 జూలై 1 నుంచి 2022 జూలై 1 వరకు డీఏ బకాయిలు 2023 అక్టోబరు 31 వరకు రావాల్సి ఉందన్నారు. మరోవైపు బకాయిలకు సంబంధించి ముందస్తుగా సీపీఎస్ ఉద్యోగుల నుంచి పన్ను మినహాయించుకున్నారన్నారు. ఓపీఎస్ ఉద్యోగులన్నిటినీ చెల్లించారు కానీ, సీపీఎస్ ఉద్యోగులకు పెండింగులో పెట్టారన్నారు. సరెండర్ లీవుల మొత్తం జమ కాలేదన్నారు. 2021, 2022 సంవత్సరాలకు సరెండర్ లీవు మొత్తాలను జమ చేయనున్నట్టు తెలుస్తోందని, 2024 వరకు దరఖాస్తు చేసుకున్న సరెండర్ లీవుల మొత్తాలను మంజూరు చేయాలని కోరారు. 11వ పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలని కోరారు. ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్షుడు కోరుకొండ సతీష్, జనరల్ సెక్రటరీ చింతగుంట్ల మరియా దాస్ తదితర బాధ్యులు ముఖ్య కార్యదర్శిని కలిసిన వారిలో ఉన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం..

తిరువూరు, ఏప్రిల్ 29: ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో సోమవారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం గంపలగూడెం మండలం ఊటుకూరులో బోతపటి సపోలు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని 50 తెలంగాణ మద్యం సీసాలు, బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎ.కొండూరులో బరోతు హరిబాబును సారా కేసులో అరెస్టుచేసి తహసీల్దార్ వద్ద హాజరు పర్చగా రూ.30 వేలు జరిమానా విధించారు. గంపలగూడెం మండలంలో మద్యం కేసులో షేక్ మస్తాన్ అనే వ్యక్తిని అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు సీఐ తెలిపారు. అధికారులు రఘు, జగ్గరావు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 29: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అటువంటి వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎన్టీఆర్ జిల్లా లీగల్ కం ప్రొఫెషన్ ఆఫీసర్ కట్ట కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం కంచికచర్ల ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని అంగన్వాడీలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలో సోమవారం చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న నారా బ్రాహ్మణి

దేశానికే ఆదర్శంగా 'మంగళగిరి'!

- లోకేశ్ తీర్చిదిద్దుతారన్న నారా బ్రాహ్మణి
- తాడేపల్లిలో మహిళలతో సమావేశం

తాడేపల్లి, ఏప్రిల్ 29: మంగళగిరిని దేశంలోనే నెంబర్ 1 మోడల్ నియోజకవర్గంగా నారా లోకేశ్ తీర్చిదిద్దుతారని ఆయన సతీమణి నారా బ్రాహ్మణి పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని చైతన్య తపోవన్‌లో మండల స్త్రీ శక్తి, మహిళా మిత్ర, డ్వాక్రా మహిళలతో నారా బ్రాహ్మణి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా లోకేశ్ ప్రజలతో మమేకమై, ప్రతిపక్షంలో ఉండికూడా 29 సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల మనసులు గెలుచుకున్నారని తెలిపారు. అధికారంలో లేకుండానే ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారంటే, ఎన్నికల్లో గెలిచి మరింకెంత అభివృద్ధి చేస్తారో ఆలోచించాలని సూచించారు. మహిళలకు పలు గ్యారెంటీ పథకాలను టీడీపీ అమలు చేస్తుందన్నారు. అత్యధిక మెజారిటీతో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

వైసీపీ నేతలకు తెలిసింది రౌడీయిజమే: లోకేశ్

దుగ్గిరాల, ఏప్రిల్ 29: వైసీపీ నాయకులకు తెలిసింది రౌడీయిజం, దుష్ప్రచారమేనని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. సోమవారం గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలోని శృంగారపురం, చుక్కపల్లివారిపాలెం, తాడిబోయినవారిపాలెం, చినపాలెం గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుత రౌడీయిజం చేసేవారి మాటలు నమ్మొద్దన్నారు. 2014లో తండ్రి శవం, 2019లో బాబాయి శవాన్ని అడ్డుపెట్టుకుని జగన్ శవ రాజకీయాలు చేశారని ఆరోపించారు. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, కృష్ణా జలాలను శుద్ధిచేసి పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. 'మంగళగిరిలో గెలిచాకా నా చుట్టూ మీరు తిరగడం కాదు, అభివృద్ధి చేసేందుకు మీ చుట్టూ నేను తిరుగుతాను' అని చెప్పారు.

పింఛన్ల సొమ్ము బ్యాంకుల్లో వేయడం సరికాదు

- సీఈవోకు టీడీపీ నేతల ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మే నెల సామాజిక పింఛన్ల సొమ్మును బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం సరైంది కాదని టీడీపీ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని కోరారు. సోమవారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేశ్ కుమార్ మీనాను టీడీపీ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ చిరంజీవి రావు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మన్నవ సుబ్బారావు తదితరులు కలిసి, పలు అంశాలపై ఫిర్యాదులు చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలపై, ప్రచార వాహనాలపై దాడులు జరుగుతున్నా రిటర్నింగ్ అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారని, శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే అధికార పార్టీ నేతలకు తొత్తుల్లా వ్యవహరిస్తున్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీని వీడి, వైసీపీలో చేరనన్నందుకు ఒక బీసీ, ఇద్దరు దళిత నాయకులపై వైసీపీ నేతలు దాడి చేయడం, ఎన్డీయే ప్రచార వాహనాలను ధ్వంసం చేశారని తెలిపారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసీపీ మేనిఫెస్టో మోసాల పుట్ట: కనకమేడల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మేనిఫెస్టో పేరుతో ప్రజలను సీఎం జగన్ నయవంచనకు గురిచేస్తున్నారని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం ఇక్కడ తన అధికారిక నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'వైసీపీ మేనిఫెస్టో మోసపూరిత హామీల పుట్ట. 25 మంది ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా కోసం కేంద్రం మెడలు వంచుతానని జగన్ చెప్పారు. ఎవరు ఎవరి దగ్గర మెడలు వంచారో అందరికీ తెలుసు' అని విమర్శించారు.

బరి నుంచి తప్పుకొన్న ముద్దరబోయిన

- చంద్రబాబు నచ్చచెప్పడంతో అలకవీడిన వైనం

నూజివీడు, ఏప్రిల్ 29: ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన టీడీపీ రెబల్ అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సోమవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి ఇక్కడ టికెట్ కేటాయించడంతో అలకబూనిన ముద్దరబోయిన స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి ప్రచారం కూడా చేశారు. టీడీపీ ముఖ్య నాయకులు ముద్దరబోయినతో పలు మార్లు చర్చలు జరిపారు. చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడించారు. చంద్రబాబు నచ్చచెప్పడంతో అలకవీడిన ముద్దరబోయిన తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. సోమవారం కర్నూలు ఎన్నికల ప్రచారంలో ఉన్న చంద్రబాబును కలవడానికి అనుచరులతో కలసి వెళ్లారు. దీంతో నూజివీడు నియోజకవర్గంలోని టీడీపీలో సంక్షోభం సద్దుమణిగింది. రాష్ట్ర పార్టీలో ముద్దరబోయినకు కీలకపదవి ఇచ్చి గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో ఆయన సేవలను వినియోగించుకోనున్నట్టు సమాచారం.

'నందిగం'తో ప్రాణహాని... రక్షణ కల్పించండి

- సీఈవోకు కట్టా ఆనంద్‌బాబు ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బాపట్ల పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి నందిగం సురేశ్ నుంచి తనకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని స్వతంత్ర్య అభ్యర్థి కట్టా ఆనంద్‌బాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాను అమరావతి సచివాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. 'నువ్వొక వలంటీర్‌వి. నా మీదే తిరుగుబాటు చేసే ధైర్యం నీకెవడిచ్చాడు? నామినేషన్ ఉపసంహరించుకోకపోతే మే 13లోపు నిన్ను చంపేస్తా. వచ్చే ఏడాది నా పేరు మీద సినామా తీస్తా' అని సురేశ్, అతని అనుచరులు బెదిరిస్తున్నారని వివరించారు.

చంద్రగిరి టీడీపీ అభ్యర్థికి రక్షణ కల్పించండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీకి తక్షణం వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ కల్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం ఆదేశాలిచ్చారు. తమకు సెక్యూరిటీ కల్పించేలా తిరుపతి జిల్లా ఎస్పీ, పోలీసులను ఆదేశించాలని కోరుతూ పులివర్తి వెంకట మణిప్రసాద్ నానీ, ఆయన సతీమణి, కుమారుడు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరపున న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపించారు.

మద్యం అక్రమ రవాణా బాగా పెరిగింది:సెబ్

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోకి పొరుగు నుంచి తీసుకొస్తున్న అక్రమ మద్యాన్ని ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కమిషనర్ రవిప్రకాశ్ తెలిపారు. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర సరిహద్దుల్లో రూ.119కోట్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. 2019లో పట్టుబడ్డ మద్యం విలువ 13.11కోట్లు కాగా ఈ ఎన్నికల్లో ఇప్పటికే 119కోట్ల మద్యం పట్టుబడిందని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడైనా అక్రమ మద్యం నిల్వ ఉన్నట్లు, సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే 9491030853 నంబర్‌కు సమాచారం ఇవ్వొచ్చన్నారు. సెబ్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 9154106528 లేదా 8121909444కు గానీ సమాచారం ఇవ్వాలని కమిషనర్ కోరారు.

ల్యాండ్ చట్టంతో భయపెడుతున్న వైసీపీ

- జనం భూములు కొట్టేయడానికి దుర్మార్గపు ఎత్తుగడ: టీడీపీ ధ్వజం

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలను భయపెడుతోందని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి జివి రెడ్డి సోమవారం ఇక్కడ తమ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రజల ఆస్తులను ప్రభుత్వం చేతుల్లోకి తీసుకువెళ్తుంది. ఈ చట్టం వచ్చిన తర్వాత భూ సమస్యలపై సివిల్ కోర్టుకు వెళ్లే అవకాశం లేదు. టీఆర్వో వద్దకు వెళ్లాలి. భూముల కబ్జాకు వైసీపీ నేతలే వివాదం సృష్టించి టీఆర్వో వద్ద తేల్చకుండా పెండింగ్‌లో ఉంచి సెటిల్‌మెంట్ పేరుతో దండుకోవడానికి ఇది అవకాశం కల్పిస్తుంది' అని చెప్పారు. తమ ప్రభుత్వం వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తుందని జీవీ రెడ్డి తెలిపారు.

'ఫ్లోటింగ్ బ్రిడ్జి' ప్యాకప్..!

పేరు కోసం తిప్పలు.. రోడ్డున పడ్డ పరువు
కాంట్రాక్టర్‌కు భారీగా నష్టం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్‌లో తొలి 'ఫ్లోటింగ్ బ్రిడ్జి' కథ ముగిసిపోయింది. పేరు కోసం తాపత్రయపడిన విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పరువు బంగాళాఖాతంలో కలిసిపోయింది. కేరళలోని త్రిస్సూర్‌లో సముద్ర తీరాన ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి (అలలపై తేలియాడే వంతెన)ని చూసి అలాంటిదే విశాఖ తీరంలోనూ ఏర్పాటుచేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులు గతేడాది నవంబరులో ప్రతిపాదించారు. దీనిని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించి, కాంట్రాక్టర్‌ను రప్పించారు. ప్రాజెక్టు వ్యయమంతా ఆ సంస్థే పెట్టుకునేలా... లైసెన్స్ ఫీజుగా నెలకు రూ.15 లక్షలు వీఎంఆర్‌డీఏకు ఇచ్చేలా ఎంవోయూ చేసుకున్నారు. ముందు తెన్నేటి పార్కు వద్ద ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టినా.. అటవీ శాఖ అధికారులు అంగీకరించలేదు. దాంతో ఆర్‌కే బీచ్‌లో కురుసుర సబ్‌మెరైన్ వద్ద నిర్మాణ పనులు చేపట్టారు. ఇక్కడ సురక్షితం కాదని నిపుణులు హెచ్చరించినా పట్టించుకోకుండా రూ.1.6 కోట్లతో పనులు పూర్తిచేసి ఈ ఏడాది ఫిబ్రవరి 25న వైసీపీ నాయకులతో దీన్ని ప్రారంభించారు. కానీ, ఆ మరుసటిరోజే ఆ బ్రిడ్జి తెగిపోయింది. వ్యూ పాయింట్ దూరంగా కొట్టుకుపోయింది. ఆ తర్వాత మళ్లీ వాటిని ఏకం చేసినా ఫలితం లేకపోయింది. పర్యాటకులు దానిపైకి ఎక్కకుండానే మూసేయాల్సి వచ్చింది. తప్పు జరిగిందని అంగీకరించకుండా, మరోచోట ఏర్పాటు చేస్తామని చెప్పి చేతులు దులుపుకొన్నారు. ఇప్పుడు అక్కడి బ్లాకులు, ఇతర పరికరాలన్నీ పూర్తిగా ప్యాకింగ్ చేసేసి తీరాన పడేశారు. ఎక్కడ పెడతారో, ఎప్పుడు పెడతారో తెలియదు. దీనివల్ల కాంట్రాక్టర్‌కు భారీగా నష్టం వాటిల్లినట్టు చెబుతున్నారు. ఇది పైలట్ ప్రాజెక్టు కాబట్టి నష్టమేమీ లేదని అధికారులు చెబుతున్నా, కాంట్రాక్టర్ తనకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఎంత ఇస్తారు? ఏ ప్రాతిపదికన ఇస్తారనేది చూడాలి.



ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణానికి ఉపయోగించిన బ్లాకులను ప్యాకింగ్ చేసి పక్కన పడేసిన దృశ్యం

సంపద సృష్టితో మరింత సంక్షేమం..!

- లోతైన కసరత్తుతో పథకాల రూపకల్పన
- నేడు కూటమి మేనిఫెస్టో విడుదల
- చంద్రబాబు, పవన్, బీజేపీ నేతల సమక్షంలో ప్రకటన

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి తమ మేనిఫెస్టోను మంగళవారం విడుదల చేయనుంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నివాసంలో మధ్యాహ్నం 12 గంటలకు మేనిఫెస్టో విడుదల ఉంటుందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. బాబుతోపాటు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ముఖ్య నేతలు ఇందులో పాల్గొననున్నారు. గతంలో 2023లో రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడులో పరిమితంగా కొన్ని అంశాలతో సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ తన మేనిఫెస్టోను విడుదల చేసింది. అప్పటికి కూటమి ఏర్పాటు కాలేదు. తర్వాత ఆ పార్టీతో జనసేన, బీజేపీ కూడా కలిశాయి. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన ఆరు హామీలకు మరి కొన్ని అంశాలను జత చేసి ఇప్పుడు మూడు పార్టీలు కలిసి పూర్తి స్థాయి మేనిఫెస్టోను విడుదల చేస్తున్నాయి. సూపర్ సిక్స్ తర్వాత మరో ప్రధానమైన హామీని చంద్రబాబు ప్రకటించారు. పేదల పింఛనును రూ.4,000కు పెంచుతామని, బీసీ వర్గాల వారికి వయో పరిమితి తగ్గిస్తామని హామీ ఇచ్చారు. దానిని కూడా ఇప్పుడు ఈ మేనిఫెస్టోలో చేరుస్తున్నారు. ఇవిగాక రాజధాని అమరావతి నిర్మాణం వంటి మరికొన్ని అంశాలను కలిపి తాజా మేనిఫెస్టో విడుదల కానుంది. మూడు పార్టీలకు ప్రజలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన వినతులు, అగ్ర నేతల ఆలోచనలు, వివిధ సందర్భాల్లో ఇచ్చిన హామీల కలబోతగా మేనిఫెస్టో ఉంటుందని టీడీపీ వర్గాలు తెలిపాయి. 'నేటి అవసరాలు తీరుస్తాం... రేపటి ఆకాంక్షలు సాకారం చేస్తాం' అన్న నినాదంతో మేనిఫెస్టో ఉంటుందని, అప్పులు, పన్నుల బాదుడుతో కాకుండా సంపద సృష్టితో సంక్షేమం ఇస్తామన్నది కూటమి ఆలోచన అని ఆ వర్గాలు వివరించాయి. 'రాష్ట్ర సమగ్ర అభివృద్ధితో పాటు ప్రజల వ్యక్తిగత జీవితాల్లో మార్పు తెచ్చేలా ఒకో పథకం, కార్యక్రమం ఉంటాయి. లబ్ధిదారుల, రాష్ట్ర రాబడులు, నిధుల లభ్యత తదితర అంశాలపై లోతైన కసరత్తు తర్వాతే పథకాల డిజైన్ జరిగింది' అని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

సంపద సృష్టికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్

- అప్పులకు, పన్నుల బాదుడుకు జగన్ ట్రేడ్ మార్క్: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని తెలుగుదేశం పార్టీ వ్యాఖ్యానించింది. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న ప్రతి సందర్భంలో రాష్ట్ర ఆదాయం విపరీతంగా పెరిగిందని ఆ పార్టీ పేర్కొంది. అప్పులకు, పన్నుల బాదుడుకు జగన్ ట్రేడ్ మార్కని, అవి లేకుండా సంపద సృష్టించడం ఆయనకు చేతగాదని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్ర విభజన తర్వాత భారీగా ఆదాయం వచ్చే హైదరాబాద్ నగరం తెలంగాణకు పోయింది. ఏపీకి అప్పులు మాత్రం మిగిలాయి. ఆ సమయంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదేళ్లలో రాష్ట్ర ఆదాయాన్ని రెట్టింపు చేశారు. కొత్తగా పన్నులేవీ వేయకుండా ఆయన దీనిని సాధించారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బాదుడు ద్వారా ఆదాయం పెంచే ప్రయత్నం చేశారు. ఇవిగాక అప్పులు విపరీతంగా తెచ్చారు. తెచ్చిన అప్పుల్లో పెట్టుబడుల కోసం వినియోగించింది కేవలం పావు శాతం మాత్రమే. టీడీపీ ప్రభుత్వం పరిమితంగానే అప్పులు తెచ్చింది. తెచ్చిన వాటిలో 50 శాతం పెట్టుబడులుగా పెట్టింది' అని ఆయన చెప్పారు. 'సంపద సృష్టి ఒక కళ. దానికి కష్టపడాలి. స్వార్థం తగ్గించుకోవాలి. దార్శనికతతో పనిచేయాలి. రాష్ట్రం మీద, ప్రజల మీద మమకారం ఉండాలి. ఇవి చంద్రబాబుకు ఉన్నాయి కాబట్టి సంపదను పెంచి చూపించారు. జగన్‌కు ఇందులో ఒక్కటి కూడా లేవు. అందుకే ఉన్న వృద్ధి కూడా దిగజారింది' అని విజయకుమార్ పేర్కొన్నారు.

వనరులను, ప్రజలనూ దోచేశారు

- కేంద్రం ఇచ్చిన ఉచిత బియ్యాన్నీ పందికొక్కుల్లా తినేశారు: ఎన్డీయే కూటమి నేతలు

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మొత్తం వనరులను, ప్రజలను దోచేసిన వైసీపీని ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలంటూ ఎన్డీయే నేతలు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జగన్‌కు ఉన్న విపరీతమైన డబ్బు పిచ్చితో నదుల్లో ఇసుక, అడవుల్లోని ఎర్రచందనం, ప్రజల భూములు, వాటి లోపలున్న వనరులు అన్నీ దోచేశారంటూ వారు మండిపడ్డారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బొండా ఉమామహేశ్వర రావు(టీడీపీ), లంకా దినకర్(బీజేపీ), రాయపాటి అరుణ(జనసేన) విలేకరులతో మాట్లాడారు. 'ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర సంపద దోపిడీ, ప్రజలపై పన్నుల బాదుడు తప్ప అభివృద్ధి ఎక్కడా కనిపించలేదు. మద్య నిషేధం పేరుతో ఓట్లు అడిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యాన్నే ఆదాయ వనరుగా చేసుకున్నారు. నాసిరకం మద్యాన్ని జే బ్రాండ్లతో అధిక ధరలకు అమ్మి పేదల రక్తాన్ని వైసీపీ ముఖ్యులు పీల్చేశారు. స్మార్ట్ మీటర్ల మీద రూ.కోట్లు దోచుకున్నారు. ప్రజలపై 11 సార్లు కరెంటు బిల్లుల భారం మోపిన వైసీపీ 'ఫ్యాన్'ను వచ్చే ఎన్నికల్లో ఆపేయండి. రాష్ట్ర ప్రగతి కోసం కూటమి అభ్యర్థుల సైకిల్, కమలం, గాజుగ్లాసు గుర్తుకు ఓటేయండి. కేంద్రం పేదలకిచ్చే ఉచిత బియ్యాన్ని సైతం పందికొక్కుల్లా తినేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ సర్వ నాశనం చేసిన జగన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ప్రజలు తరిమి కొట్టండి. జగన్ పాలనలో రూ.14 లక్షల కోట్ల అప్పు, రూ.8 లక్షల కోట్ల దోపిడీ, కేంద్ర పథకాలకు స్టిక్కర్ వేసుకోవడం తప్ప చెప్పడానికి ఇంకేమీ లేదు' అంటూ నేతలు పెదవి విరిచారు.

1న ఢిల్లీకి రండి


- అమిత్‌షా డీప్‌ఫేక్ వీడియో కేసులో.. సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసుల సమన్లు
- రేవణ్ణ కేసు నుంచి మళ్లించడానికే: టీపీసీసీ
- 15 రోజులు సమయం కోరామన్న లీగల్‌సెల్
- నోటీసులకు భయపడేది లేదు: రేవంత్

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లు రద్దుచేస్తామంటూ అమిత్‌షా చెప్పినట్టుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన డీప్‌ఫేక్ వీడియో కేసు దర్యాప్తులో భాగంగా.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని విచారించాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించారు. సోమవారం ఈ మేరకు రేవంత్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. బుధవారం(మే 1న) ఉదయం 10.30కు ఢిల్లీలోని ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ అండ్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్ సెల్(ఐఎఫ్ఎస్‌వో) ఇన్‌స్పెక్టర్ నీరజ్ చౌదరి ఎదుట విచారణకు హాజరవ్వాలని ఆ నోటీసుల్లో ఆదేశించారు. విచారణకు వచ్చేప్పుడు రేవంత్ వినియోగించే మొబైల్ ఫోన్‌తోపాటు.. అన్ని ఎలక్ట్రానిక్ ఉపకరణాలను తీసుకురావాలని సూచించారు. రేవంత్‌తోపాటు.. అమిత్‌షా ఫేక్ వీడియోను షేర్ చేసిన మరో నలుగురు కాంగ్రెస్ నేతలకు కూడా ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేశారు. వీరిలో కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మన్నె సతీశ్, సోషల్ మీడియా బృందంలోని నవీన్, శివకుమార్, తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి అస్మా తస్లీమ్ ఉన్నారు. రేవంత్ నోటీసును సచివాలయంలో అధికారులకు, మిగతా నలుగురికి సంబంధించిన సమన్లను గాంధీభవన్‌లో టీపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ రామచంద్రారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సోషల్ మీడియా, లీగల్‌టీమ్‌తో చర్చించారు. ఈ కేసులో ఇప్పటికే అసోం రాజధాని గువాహటికి చెందిన రీతంసింగ్ అనే వ్యక్తిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. గువాహటి హైకోర్టు న్యాయవాది రీతంసింగ్.. అసోం కాంగ్రెస్ ఎన్నికల వార్‌రూమ్ సమన్వయకర్త అని.. షా డీప్ ఫేక్ వీడియోను సృష్టించింది అతనేనని పోలీసులు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఎవరో పోస్టులు పెడితే.. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న తనకు నోటీసులు ఇవ్వడానికి ఢిల్లీ పోలీసులు గాంధీభవన్‌కు వచ్చారంటూ సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. నోటీసులకు భయపడేది లేదని, తాము కూడా దీటు గా బదులిస్తామని స్పష్టం చేశారు. షా వ్యాఖ్యలను వక్రీకరించి డీప్‌ఫేక్ వీడియో చేసిన ఘటనలో సీఎం రేవంత్‌రెడ్డిని కోర్టుకీడుస్తామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. అమిత్‌షా డీప్‌ఫేక్ వీడియో కేసులో రేవంత్‌ని వెంటనే అరెస్టు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రేవంత్-మోదీ కలిసినట్లేనని భావించాల్సి వస్తుందని అన్నారు.

ప్రైవేటు వ్యక్తుల పక్షాన ప్రభుత్వం పిటిషన్ వేయడమా?

- నిందితునికి లేని బాధ సర్కారుకు ఎందుకు?
- సందేశ్‌ఖాలీ కేసులో సుప్రీంకోర్టు ప్రశ్న

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: సందేశ్‌ఖాలీ కేసులో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వైఖరిని సోమవారం సుప్రీంకోర్టు తప్పుపట్టింది. కొందరు ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాలను కాపాడడం కోసం రాష్ట్ర ప్రభుత్వమే ఓ పిటిషన్‌దారుగా ఇక్కడికి రావాల్సిన అవసరమేముందని ప్రశ్నించింది. సందేశ్‌ఖాలీలో కొందరు మహిళలపై నేరాలకు పాల్పడ్డారని, భూములు ఆక్రమించారంటూ వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశిస్తూ ఈ నెల పదో తేదీన కలకత్తా హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. దీన్ని పరిశీలించిన జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సం దీప్ మెహతాల ధర్మాసనం.. ఈవిషయంలో ప్రభుత్వం పిటిషన్ వేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. ఇందుకు పశ్చిమ బెంగాల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ సమాధానం ఇస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని వ్యాఖ్యలుండటంతో పిటిషన్ వేయాల్సి వచ్చిందని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఆ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉంటే వాటిని తొలగించాలని హైకోర్టునే ఆశ్రయించి ఉంటే సరిపోయేది కదా అని ప్రశ్నించింది. తొలుత సింఘ్వీ వాదనలు ప్రారంభిస్తూ ఈ పిటిషన్‌ను 2 వారాల తర్వాత విచారణకు చేపట్టాలని కోరారు. ఉత్తర్వుల్లోని కొన్ని అంశాలపై ప్రభుత్వం సవాలు చేయాలనుకుంటోందని చెప్పారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కల్పించుకొని కేసు పెండింగ్‌లో ఉన్న అంశాన్ని ఇతరత్రా వినియోగించుకోకుండా ఆదేశించాలనికోరారు. ధర్మాసనం స్పందిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు అమలుకాలేదని ఒకవేళ అవతలి పక్షం వారు కోర్టు ధిక్కరణ పిటిషన్‌వేస్తే.. కేసు సుప్రీంకోర్టు పరిధిలో ఉందని హైకోర్టుకు చెప్పమని సింఘ్వీకి సూచించింది. దీనిపై ఆయన జవాబు ఇస్తూ తాను 2వారాల తర్వాత విచారణ చేపట్టాలని కోరుతున్నానన్నారు. ధర్మాసనం స్పందిస్తూ "భూ ఆక్రమణలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపైనే దర్యాప్తు జరపాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది కదా" అని గుర్తు చేసింది. ఇందుకు సింఘ్వీ జవాబిస్తూ దీనిపైనే చెప్పాల్సింది చాలా ఉందన్నారు. ధర్మాసనం జవాబిస్తూ "మీ కోరిక మేరకే కేసును వాయిదా వేస్తు న్నాం. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందన్న కారణం చూపి హైకోర్టులో కేసు విచారణను సాగదీయకూడదు"అని స్పష్టం చేసింది. కొన్ని పత్రాలు సమర్పించాల్సి ఉన్నందున కేసు ను వాయిదా వేయాలని సింఘ్వీ కోరారు. దీనిపై బెంచ్ వ్యాఖ్యానిస్తూ "ఈ పిటిషన్‌తోపాటే ఇవ్వకుండా ఎవరు అడ్డుకున్నారు. ఇది పద్ధతి కాదు"అని పేర్కొంది. ఈ సందర్భంగానే జస్టిస్ సందీప్ మెహతా రాష్ట్ర ప్రభుత్వంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ కేసులో నిందితుడు అప్పీలు చేస్తే అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వానికి బాధ ఎందుకు?" అని ప్రశ్నించారు. కేసును జూలైనెలకు వాయిదా వేశారు. కాగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ముఖ్యంగా పోలీసు బలగాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీశాయని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. "సీబీఐకి అవసరమైన సహకారం అందించాలంటూ హైకోర్టు చాలా యథాలాపంగా ఉత్తర్వులు ఇచ్చింది. ఇది రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను గుంజుకోవడం కిందకే వస్తుంది" అని పేర్కొంది.



కాంగ్రెస్ అభ్యర్థి కాన్వాయ్‌పై వైసీపీ దాడి

- దళిత మహిళకు గాయాలు..చోద్యం చూసిన పోలీసులు
- దాడి చేసినవారిని వదిలేసి ప్రశ్నించిన భర్తను అదుపులోకి..

పెదవేగి, ఏప్రిల్ 29: ఏలూరు జిల్లా దెందులూరులో వైసీపీ నేతల దాడులు, దాష్టీకాలకు అంతులేకుండా పోతోంది. దెందులూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి సోమవారం రాత్రి ఏలూరు రూరల్ మండలం గుడివాకలంకలో ఎన్నికల ప్రచారం ముగించుకుని, తిరిగి స్వగ్రామం పెదవేగి మండలం ముండూరు వెళ్తున్నారు. దెందులూరు మండలం గంగన్నగూడెం దగ్గర ప్రచారంలో ఉన్న వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి వర్గీయులు.. ఎమ్మెల్యే ఎదుటే కాంగ్రెస్ పార్టీ కాన్వాయ్ వాహనంపై దాడిచేశారు. వాహనం అద్దాలు పగిలి, లోపల ఉన్న దళిత మహిళ గెడ్డం సుజాతకు గాయాలయ్యాయి. దీనిపై ఆమె భర్త సురేశ్ ప్రశ్నిస్తుండగా పోలీసులు.. అతడిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఆలపాటి నరసింహమూర్తి పార్టీ కార్యకర్తలతో ఆందోళనకు దిగారు.

ఆ అధికారం ట్రైబ్యునల్‌కు లేదు: ఏపీ

- కృష్ణా నదీ జలాల వివాద ట్రైబ్యునల్‌లో వ్యాజ్యం

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి కృష్ణా నదీ జలాలను తరలించే అంశంలో కృష్ణా నదీ జలాల వివాద ట్రైబ్యునల్ జోక్యం చేసుకోజాలదని ఆంధ్రప్రదేశ్ అభిప్రాయం వ్యక్తం చేసింది. గోదావరి జలాలను కృష్ణా నదిలోకి పంపాక.. వినియోగంలోకి వచ్చే జలాలపై అధ్యయనం చేసే అధికారం కృష్ణా నదీ జలాల వివాద ట్రైబ్యునల్‌కు లేదని పేర్కొంటూ సోమవారం ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 28 ప్రాజెక్టులకు కృష్ణా నదీజలాలను కేటాయిస్తూ కేడబ్ల్యూడీటీ-1 తీర్పిచ్చిందని తెలిపింది. ప్రాజెక్టుల వారీగా కృష్ణా జలాల కేటాయింపులపై రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89లో స్పష్టం చేసినట్లుగా ఏపీ వెల్లడించింది. ఈ కేటాయింపులన్నీ 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా జరిగినట్లుగా ట్రైబ్యునల్ దృష్టికి తీసుకువచ్చింది. ప్రాజెక్టుల వారీగా జరిగిన కేటాయింపుల్లో జోక్యం చేసుకుని కొత్తగా కృష్ణా జలాల పునఃపంపిణీపై సమీక్షించడం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

కాస్త తగ్గిన విద్యుత్తు డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ 250 ఎంయూ నుంచి ఆదివారంనాటికి 246.265కు దిగింది. విద్యుత్తు డిమాండ్‌ను తట్టుకోవడానికి రూ.20.543 కోట్లతో 27.360 మిలియన్ యూనిట్ల కరెంటును బహిరంగ మార్కెట్లో డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. రాష్ట్ర జెన్కో థర్మల్ విద్యుదుత్పత్తి సంస్థల్లో బొగ్గు నిల్వలు మాత్రం రెండు రోజులకు సరిపడా మాత్రమే ఉన్నాయి.

డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలి

అమరావతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలని, మ్యాచింగ్ గ్రాంట్‌ను సీపీఎస్ ఉద్యోగుల ప్రాన్ అకౌంట్లలో తక్షణమే జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఉద్యోగుల అసోసియేషన్.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని ఏపీసీపీఎస్‌ఈఏ కోరింది. సోమవారం అమరావతి సచివాలయంలో ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీష్, మరియదాస్ సీఎస్‌కు వినతిపత్రం అందజేశారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే అరాచకాలకు అడ్డుకట్ట

- వేలు నరుక్కోవడమే కాదు ప్రాణ త్యాగానికైనా సిద్ధం
- మూడ్రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న కోపూరి లక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 29: వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ద్వారానే రాష్ట్రంలో అరాచకాలకు అడ్డుకట్ట పడుతుందని ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి లక్ష్మి స్పష్టం చేశారు. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో తన వేలు నరుక్కొని నిరసన వ్యక్తంచేసిన ఆమె గత మూడ్రోజులుగా గుంటూరులో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా గంజాయి విక్రయాలు, యువతను రౌడీషీటర్లుగా మార్చడం, సంతకం ఫోర్జరీ చేసే నాయకులను తయారు చేయడమే జగన్ చేసిన అభివృద్ధి అని విమర్శించారు. రామాంజనేయకాలనీలో నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఎమ్మార్వో సంతకాలను ఫోర్జరీ చేసి వైసీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించి, అమ్ముకున్నారని లక్ష్మి ఆరోపించారు. అన్యాయం అని ప్రశ్నిస్తే రౌడీలను ఉసిగొల్పి చంపడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

బెంగాల్ టీచర్ల భర్తీ స్కాంపై సీబీఐ విచారణ నిలుపుదల

- 25 వేల ఉద్యోగాల రద్దుపై మాత్రం స్టేకు నిరాకరణ
- సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: ఉపాధ్యాయుల భర్తీ కుంభకోణంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సోమవారం సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ స్కాంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల పాత్రపై సీబీఐ దర్యాప్తు జరపాలంటూ కలకత్తా హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. స్కూల్ సర్వీసు కమిషన్ ద్వారా నియమితులైన 25,753 టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందిని తొలగిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై మాత్రం స్టే విధించడానికి నిరాకరించింది. తదుపరి విచారణను మే 6న చేపట్టనున్నట్టు తెలిపింది. 25వేలమంది ఉద్యోగుల నియామకాలను రద్దు చేయడం తీవ్రమైన విషయమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఉద్యోగాలు పొందిన వారిలో అర్హులు ఎవరు? అనర్హులు ఎవరు? అన్నదాన్ని విడదీసి చూడలేమా? అక్రమాల ద్వారా లబ్ధిపొందిన వారెవరో గుర్తించలేమా? అని ప్రశ్నించింది. కుంభకోణంలో భాగస్వాములైన రాష్ట్ర ప్రభుత్వ అధికారులను గుర్తించేందుకు దర్యాప్తు జరపాలని సీబీఐని ఆదేశిస్తూ కలకత్తా హైకోర్టు గతంలో ఉత్తర్వులు ఇచ్చింది. నియామకాలను కూడా రద్దు చేసింది. దీనిని సవాలు చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

ఐరాస సీపీడీ సమావేశానికి పేకేరు సర్పంచ్



ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29: న్యూయార్క్ (అమెరికా)లో మే 3న నిర్వహించనున్న ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి 57వ పాపులేషన్ అండ్ డెవలప్‌మెంట్ కమిషన్(సీపీడీ) సమావేశంలో పాల్గొనే భారతదేశ బృందానికి పశ్చిమ గోదావరి జిల్లా, ఇరగవరం మండలం పేకేరు గ్రామ సర్పంచి కునుకు హేమకుమారి ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ నుంచి ఆమెకు ఆహ్వానం అందింది. స్ఫూర్తిదాయక మహిళా సాధికారతపై ఆమె తన అనుభవాలను యూఎన్ సమావేశంలో పంచుకుంటారు. కాకినాడ జేఎన్‌టీయూలో 2022లో ఎంటెక్ పూర్తిచేసిన హేమకుమారి పేకేరు గ్రామ సర్పంచ్‌గా 2021లో ఎన్నికయ్యారు. అంతకుముందు ఐదేళ్లపాటు తణుకు ముళ్లపూడి వెంకట్రాయ మెమోరియల్ పాలిటెక్నిక్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం సర్పంచ్‌గా ఉంటూనే ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల చాంబరు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

కొవిషీల్డ్‌తో దుష్ప్రభావాలు

లండన్, ఏప్రిల్ 29: యూకేకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ ఆస్ట్రాజెనెకా తయారు చేసిన కొవిడ్ టీకా కొవిషీల్డ్‌తో అత్యంత అరుదుగా రక్తం గడ్డకట్టే అవకాశముందని సంస్థ అంగీకరించింది. ఆక్స్‌ఫర్డ్ వర్సిటీతో కలిసి ఆస్ట్రాజెనెకా కొవిడ్ వ్యాక్సిన్లను తయారు చేసింది. వాటిని కొవిషీల్డ్, వాక్స్‌జెవ్రియా పేర్లతో ప్రపంచవ్యాప్తంగా విక్రయించింది. అయితే ఆస్ట్రాజెనెకా టీకాలు తీసుకున్న తర్వాత ఆరోగ్య సమస్యలు వచ్చిన పలువురు యూకేలోని ఓ హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో భాగంగా కోర్టుకు సమర్పించిన పత్రాల్లో ఈ టీకా వల్ల దుష్ప్రభావాలు వచ్చే అవకాశాలున్నాయని సంస్థ వెల్లడించింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 30 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

ధీరూభాయ్ అంబానీ ఇన్‌స్టిట్యూట్‌లో

డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ

గుజరాత్‌లోని ధీరూభాయ్ అంబానీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(డీఏ-ఐఐసీటీ)- ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రాములలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌ని అనుసరించి విడివిడిగా ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లు, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు.



డిగ్రీ ప్రోగ్రామ్‌లు

బీటెక్, బీటెక్(ఆనర్స్) ప్రోగ్రాములు ఉన్నాయి. ఆలిండియా కేటగిరీలో మొత్తం 225 సీట్లు ఉన్నాయి. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ)లో 131, ఆనర్స్(ఐసీటీ)లో 47, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్‌లో 26, ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్‌లో 21 సీట్లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి నాలుగేళ్లు. మొదటి అయిదు సెమిస్టర్లలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, హ్యూమానిటీస్, మేథమెటిక్స్, బేసిక్ సైన్సెస్ సంబంధిత కోర్సులు ఉంటాయి. అయిదు నుంచి ఎనిమిది సెమిస్టర్లలో ఎలక్టివ్ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. డిగ్రీ, ఆనర్స్ ప్రోగ్రాములకు కోర్ ఫౌండేషనల్ కోర్సులు ఒకేవిధంగా ఉంటాయి. ఆనర్స్ ప్రోగ్రామ్‌కి మాత్రం నాలుగో సెమిస్టర్‌లో అయిదు కోర్సులను అదనంగా ఎంచుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులను జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఎమ్మెస్సీ

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 120 సీట్లు, డేటా సైన్స్‌లో 60 సీట్లు, అగ్రికల్చర్ అనలిటిక్స్‌లో 30 సీట్లు ఉన్నాయి. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి మూడు సెమిస్టర్లలో కోర్సు వర్క్‌లు, చివరి సెమిస్టర్‌లో ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

ఎంపిక: దేశవ్యాప్తంగా నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పరీక్ష సమయం 90 నిమిషాలు. ఐటీ విభాగానికి నిర్వహించే పరీక్షలో ఇంటర్ స్థాయిలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 60 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. మేథమెటిక్స్‌కు 30%, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ లాజికల్ రీజనింగ్‌కు 20%, సీ ప్రోగ్రామింగ్‌కు 30%, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్‌కు 20% వెయిటేజీ ఇస్తారు. డేటా సైన్స్ విభాగానికి నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, బేసిక్ కంప్యూటర్ సైన్స్(ప్రోగ్రామింగ్), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. అగ్రికల్చర్ అనలిటిక్స్ విభాగానికి నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్, సైన్స్, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి ఒక్కోదానిలో 15 చొప్పున మొత్తం 45 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

ఎం డిజైన్: స్పెషలైజేషన్ 'విజువల్ కమ్యూనికేషన్ డిజైన్ అండ్ ఇంటరాక్షన్ డిజైన్'. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా గ్రాఫిక్ డిజైన్, ఇంటర్ఫేస్ డిజైన్, ఫిల్మ్ మేకింగ్, యానిమేషన్, ఫొటోగ్రఫీ, డిజైన్ రీసెర్చ్ తదితర అంశాలు బోధిస్తారు. మొత్తం సీట్లు 20.

ఎంపిక: అభ్యర్థులను సీడ్ వ్యాలిడ్ స్కోరు, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. సీడ్ స్కోరు లేనివారు సంస్థ నిర్వహించే డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్టు రాయాల్సి ఉంటుంది. డీఏటీ ఎగ్జామ్‌లో మూడు పార్ట్‌లు ఉంటాయి. ఒక్కోదానికి 20 మార్కులు కేటాయించారు. మొదటి పార్ట్‌లో డ్రాయింగ్ స్కిల్స్, విజువలైజేషన్ అంశాలపై టెస్ట్ ఉంటుంది. రెండోదానిలో డిజైన్ ఐడియమ్స్, విజువల్ ఆర్ట్స్, సోషల్ అండ్ కల్చరల్ అంశాలపై అవగాహనను పరీక్షిస్తారు. మూడో పార్ట్‌లో కమ్యూనికేషన్ డిజైన్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. డీఏటీ స్కోర్‌కి 60 శాతం, ఇంటర్వ్యూకి 40 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎంటెక్(ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ): కోర్సు వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రాములో మొత్తం 56 సీట్లు ఉన్నాయి. గేట్ అభ్యర్థులకు 42, నాన్ గేట్ అభ్యర్థులకు 14 సీట్లు కేటాయించారు. స్పెషలైజేషన్ల వారీగా మెషిన్ లెర్నింగ్‌లో 21 సీట్లు, సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్‌లో 17 సీట్లు, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్‌లో 11 సీట్లు, వైర్‌లెస్ కమ్యూనికేషన్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్‌లో 7 సీట్లు ఉన్నాయి.

ఎంపిక: గేట్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ ద్వారా నాన్ గేట్ అభ్యర్థులకు ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో గేట్(ఈసీ/సీఎస్) సిలబస్ ఆధారంగా మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర.

పీహెచ్‌డీ

రెగ్యులర్, పార్ట్‌టైమ్ విధానాలు ఉన్నాయి. అభ్యర్థుల అర్హతలను అనుసరించి ఫైనాన్షియల్ అసిస్టెన్స్, రీసెర్చ్ ఫెలోషిప్, డీఏ-ఐఐసీటీ ఫెలోషిప్ సౌకర్యాలు కల్పిస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, మేథమెటిక్స్ అండ్ ఫిజికల్ సైన్సెస్, హ్యూమానిటీస్, ఆర్ట్స్, సోషల్ సైన్సెస్, డిజైన్

అర్హత: సంబంధిత విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంసీఏ/ఎమ్మెస్సీ/ఎంఫిల్ పూర్తిచేసి ఉండాలి. నెట్ జేఆర్ఎఫ్/డీఎస్‌టీ ఇన్‌స్పైర్ అర్హత పొంది ఉండాలి.


ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ), ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. సీబీటీలో స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం సబ్జెక్ట్ పేపర్లు రాయాల్సి ఉంటుంది. గేట్ వ్యాలిడ్ స్కోర్/నెట్ అర్హత ఉన్నవారికి; ఐఐటీ/ఐఐఎస్సీ/ఐఐఐటీ/డీఏ-ఐఐసీటీ నుంచి ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ పూర్తిచేసినవారికి; డీఎస్‌టీ ఇన్‌స్పైర్/ఎన్‌బీహెచ్ఎం/జెస్ట్/పీఎంఆర్ఎఫ్/విశ్వేశ్వరాయ/యూజీసీ/సీఎస్ఐఆర్ ఫెలోషిప్ అర్హత ఉన్నవారికి; స్పాన్సర్డ్/ఎక్స్‌టర్నల్ కేటగిరీ అభ్యర్థులకు ఎంట్రెన్స్ టెస్ట్ నుంచి మినహాయింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిగ్రీ ప్రోగ్రామ్‌లకు జూన్ 17; పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు మే 20
- **పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 16
- **ఎం డిజైన్, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ అనలిటిక్స్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** జూన్ 24, 25
- **పీహెచ్‌డీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** జూన్ 26, 27
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** పీజీ, పీహెచ్‌డీ అభ్యర్థులకు జూలై 15న; డిగ్రీ అభ్యర్థులకు జూలై 22న
- **వెబ్‌సైట్:** www.daiict.ac.in/admissions

ఓయూలో డిప్లొమా

ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్రెంచ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్మన్- ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో జూనియర్/సీనియర్/అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి. జూనియర్/సీనియర్ డిప్లొమా ప్రోగ్రామ్‌ల వ్యవధి నాలుగు నెలలు. అడ్వాన్స్‌డ్ డిప్లొమా వ్యవధి ఏడాది.



అర్హత వివరాలు: జూనియర్ డిప్లొమా ప్రోగ్రామ్‌నకు ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. సీనియర్ డిప్లొమాకు కనీసం 50 శాతం మార్కులతో జూనియర్ డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. డిగ్రీ స్థాయిలో ఫ్రెంచ్/జర్మన్ సెకండ్ లాంగ్వేజ్‌గా చదవి కనీసం 50 శాతం మార్కులు సాధించినవారు కూడా అర్హులే. లేదంటే వర్సిటీ నిర్వహించే స్పెషల్ ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అడ్వాన్స్‌డ్ డిప్లొమాకు కనీసం 50 శాతం మార్కులతో సీనియర్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఓయూ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 6
- **తరగతులు ప్రారంభం:** జూలై 8 నుంచి(ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు)
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

మద్రాస్ ఐఐటీలో 'వాటర్ సెక్యూరిటీ' పై పీజీ

మద్రాస్ ఐఐటీ - జర్మనీకి చెందిన రెండు యూనివర్సిటీలతో కలిసి 'వాటర్ సెక్యూరిటీ అండ్ గ్లోబల్ చేంజ్'పై మాస్టర్స్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఆర్‌డబ్ల్యూటీహెచ్, ఆచెన్; టీయూ డ్రెసడెన్‌తో కలిసి ఆఫర్ చేస్తోంది. మూడు యూనివర్సిటీల మధ్య మొబిలిటీకి కూడా అవకాశం ఉంది. అంటే ఐఐటీ మద్రాస్‌లో ఒక అకడమిక్ ఇయర్ చదివిన తరవాత ఆ రెండు వర్సిటీల్లో చెరొక సెమిస్టర్ చేయవచ్చు. అలా మూడు వర్సిటీల్లో చదువుకునే అవకాశం ఉంది. సంబంధిత ప్రభుత్వ ఏజెన్సీలు, కంపెనీలు, ఎన్జీవోలతో కలిసి ఇంటర్న్‌షిప్‌లు, మాస్టర్ థీసిస్ చేసే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ, జాతీయ అవసరాలను తీర్చే విధంగా ఈ కోర్సును తీర్చిదిద్దారు. అలాగే విద్యార్థులు ఎంచుకునేందుకు స్పెషలైజేషన్స్ కూడా ఈ కోర్సులో ఉన్నాయి. మొత్తమ్మీద దీన్ని ఇంటర్నేషనల్ ఇంటర్‌డిసిప్లినరీ కోర్సుగా అందిస్తున్నారు. మొదటి బ్యాచ్ ఈ ఏడాది జూలై 29 నుంచి ఆరంభమవుతుంది. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఏప్రిల్ 30లోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు వెబ్‌సైట్: https://abcd-centre.org/masterprogram/

గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్

న్యూఢిల్లీలోని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్)- 'గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీప్యాట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇందులో సాధించిన మెరిట్ ఆధారంగా అనుబంధ యూనివర్సిటీలు/కళాశాలలు/సంస్థల్లో ఎంఫార్మసీ, పీహెచ్‌డీ అడ్మిషన్స్ ఇస్తారు. అలాగే స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తారు.



అర్హత: ఇంటర్ తరవాత నాలుగేళ్ల బీఫార్మసీ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. లేటరల్ ఎంట్రీ అభ్యర్థులు కూడా అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అడ్మిషన్స్ ప్రారంభమయ్యేనాటికి ఫలితాలు వచ్చి ఉండాలి. బీటెక్(ఫార్మాస్యూటికల్ అండ్ ఫైన్ కెమికల్ టెక్నాలజీ)/తత్సమాన కోర్సులు చేసిన అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

జీప్యాట్ వివరాలు: ఈ పరీక్షని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 125 ప్రశ్నలు అడుగుతారు. ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అండ్ అలైడ్ సబ్జెక్ట్స్ నుంచి 38, ఫార్మాస్యూటిక్స్ అండ్ అలైడ్ సబ్జెక్ట్స్ నుంచి 38, ఫార్మకాగ్నసీ అండ్ అలైడ్ సబ్జెక్ట్స్ నుంచి 10, ఫార్మకాలజీ అండ్ అలైడ్ సబ్జెక్ట్స్ నుంచి 28, బీఫార్మసీ కోర్సుకు సంబంధించిన ఇతర సబ్జెక్ట్‌ల నుంచి 11 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 500. ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. తప్పుగా గుర్తించిన సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

ముఖ్య సమాచారం

- **పరీక్ష ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.3,500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 8
- **ఎడిట్ విండో ఓపెన్:** మే 11 నుంచి 14 వరకు
- **ప్రీ ఫైనల్ ఎడిట్ విండో ఓపెన్:** మే 21 నుంచి 23
- **ఫైనల్ ఎడిట్ విండో ఓపెన్:** మే 28 నుంచి 30 వరకు
- **డెమో టెస్ట్:** మే 27 నుంచి
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 3 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, గుంటూరు, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **జీప్యాట్ 2024 తేదీ:** జూన్ 8
- **ఫలితాలు విడుదల:** జూలై 8
- **వెబ్‌సైట్:** https://natboard.edu.in

ఎన్‌హెచ్‌పీసీలో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు 57

మండి(హిమాచల్ ప్రదేశ్)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ఐటీఐ అప్రెంటిస్: **39 ఖాళీలు**
2. డిప్లొమా అప్రెంటిస్: **13 ఖాళీలు**
3. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: **5 ఖాళీలు**

ట్రేడ్/విభాగం: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్, సర్వేయర్, ప్లంబర్, సివిల్, సీఓపీఏ, ఎలక్ట్రికల్, జీఎన్ఎం, నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, ఫార్మసిస్ట్.

అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత.

వయోపరిమితి: 18-30 సంవత్సరాల మధ్య ఉండాలి

శిక్షణ వ్యవధి: ఏడాది

ఎంపిక ప్రక్రియ: ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేషన్ మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30

వెబ్‌సైట్: www.nhpcindia.com

ఐఐసీటీలో ప్రాజెక్ట్ స్టాఫ్

మొత్తం ఖాళీలు 42

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్... ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న ప్రాజెక్టు స్టాఫ్ భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టుల వివరాలు


1. సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: **5 పోస్టులు**
2. ప్రాజెక్ట్ అసోసియేట్-1: **25 పోస్టులు**
3. ప్రాజెక్ట్ అసోసియేట్-2: **2 పోస్టులు**
4. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3: **1 పోస్టు**
5. రీసెర్చ్ అసోసియేట్: **2 పోస్టులు**
6. జూనియర్ రీసెర్చ్ ఫెలో: **4 పోస్టులు**
7. ప్రాజెక్ట్ అసిస్టెంట్: **3 పోస్టులు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత. గేట్, నెట్ స్కోరుతో పాటు పని అనుభవం ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీలు: 2024 మే 1, 2

ప్రదేశం: సీఎస్ఐఆర్-ఐఐసీటీ, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://www.iict.res.in



హెచ్ఏఎల్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

హైదరాబాద్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్): **3 పోస్టులు**
2. అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్): **3 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 35 సంవత్సరాలు మించకూడదు.

వేతనం: నెలకు రూ.30,000 - రూ.1,20,000

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ద మేనేజర్(హెచ్ఆర్) రిక్రూట్‌మెంట్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఏవియానిక్స్ డివిజన్, బాలానగర్, హైదరాబాద్ చిరునామాకు పంపాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 8

వెబ్‌సైట్: www.hal-india.co.in/career

సీఎంఎస్ఎస్‌లో మేనేజర్లు

న్యూఢిల్లీలోని సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ.... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 15

పోస్టుల వివరాలు

1. అసిస్టెంట్ జనరల్ మేనేజర్: **5 పోస్టులు**
2. మేనేజర్: **8 పోస్టులు**
3. ఆఫీస్ అసిస్టెంట్: **1 పోస్టు**
4. వేర్‌హౌస్ మేనేజర్: **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ, ఐసీడబ్ల్యూఏఐ, సీఏ, ఎమ్మెస్సీ, బీకాం, బీఫార్మా, ఎంఫార్మా, బీఈ, బీటెక్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.


వయోపరిమితి: అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు; మేనేజర్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు రూ.1,00,000 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు, రూ.50,000 మేనేజర్, వేర్‌హౌస్ పోస్టులకు రూ.30,000 ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుకు.

దరఖాస్తుకు చివరి తేదీ: మే 20

వెబ్‌సైట్: https://cmss.gov.in/

లిటిల్స్




ప్రజల తెలివి!

అక్బర్ రాజ్యంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారు. ఆయన దగ్గర ఉండే సలహాదారులు, మంత్రులూ కూడా గొప్పవారు. ఇక బీర్బల్ హాస్యచతురత, సమస్యను పరిష్కరించే విధానం అద్భుతం. తన ప్రజలు బావున్నారని ఎప్పుడూ చెప్పేవాడు. అలా ఎప్పుడూ తనకు తాను చెప్పుకుండేవాడు. ఒక రోజు అక్బర్, బీర్బల్ ఇద్దరూ గడ్డిమీద నడుస్తున్నారు. అప్రయత్నంగా 'ఈ ప్రజలెంత మంచి వాళ్లు. నా రాజ్యంలో ఎలాంటి ఇబ్బంది లేదు' కదా అన్నాడు. వెంటనే బీర్బల్ ఇలా అన్నాడు.. 'రాజావారు మీ రాజ్యంలో అందరూ సుభిక్షంగా ఉన్నారు. అయితే మీరు అనుకున్నంత మంచివాళ్లు ప్రజలు కారు' అన్నారు. ఈ మాటతో నేను నీ మాటలతో ఏకీభవించలేను.. ఏకీభవించను కూడా అన్నారు. బీర్బల్ నవ్వి ఊరుకున్నాడు. నేను ఓ విషయం చెప్పాలి. 'జనాలను చూస్తేనే కదా.. వారు ఎలా ఉండేది తెలిసేది' అన్నాడు.


ఒక రోజు అక్బర్‌తో రహస్యంగా మాట్లాడాడు బీర్బల్. అక్బర్, బీర్బల్‌తో పాటు సైన్యం ఓ పెద్ద గ్రామానికి వెళ్లింది. అక్కడ ఉండే దారులు, మురికి నీళ్లు పోవటానికి కాలువలు లేవని గుర్తించారు. పేదవారు తమ ఇంటి ముందు స్థలం రహదారి పనుల నిమిత్తం పోయినా.. భయపడాల్సిన పనిలేదని రాజుగారు సెలవిచ్చారు. అధికారులు ఆ తర్వాత రోజువెళ్లి ఆ పనుల గురించి ఆరా తీశారు. పని తెలిసిన వాళ్లు వచ్చారు. రహదారికి ఎంత పోతుంది.. ఇంటి స్థలం ఎంత ప్రభుత్వం పాలవుతుందని చెప్పారు. ఆ తర్వాతనే నష్టపరిహారం కట్టించారు. కూలీలు ఆ తర్వాత వచ్చి పనులు సాగించారు. 'మా ఇల్లు చాలా పెద్దది. మా ఇంటి ముందు స్థలం పోయింది. మా చేను చిన్నదయిపోయింది' లాంటి మాటలు మాట్లాడుతూ జనం రాజుగారి దగ్గరకు వచ్చారు. 'ఆ పనులు చేశారు. మంచిదే. మా జాగా ధర ఎక్కువ. అయితే తమరు తక్కువ డబ్బులు ఇచ్చారు' అంటూ మొరపెట్టుకున్నారు. వెంటనే 'నష్టపరిహారం పెంచండి మహాప్రభూ' అంటూ వేడుకున్నారు. 'పేదవాళ్లు కదా.. అందునా నా దేశ ప్రజలు.. మీరు ఇలా అడగకూడదు. మీకు హక్కు ఉందంటూ అక్బర్ హుకుం జారీ చేశారు అధికారులకు. వాళ్లు వచ్చి పేదలను సంతోషపరిచేట్లు డబ్బు ఎక్కువనే ముట్టచెప్పారు.

ఆ తర్వాత బీర్బల్ మరో ప్రణాళిక వేశారు. దాన్ని రాజుగారు చెప్పారు. ఈ సారి అక్బర్ అక్కడకు వెళ్లలేదు. అదే గ్రామంలో 'భూమి పన్నులు పెంచుతున్నాం. ఇంతకుముందు కంటే ఎక్కువ సవరిస్తాం' అని దండోరా వేయించారు. జనాలు ఒకటే గుంపు. అందరూ సన్నద్ధంగా ఉండాల్సిందే. రాజుగారి మాట కదా! అంటూ గర్వంగా పొంగిపోయాడు అక్బర్. ఆ మరుసటి రోజు రాజ్యంలోకి విపరీతంగా జనాలు వచ్చారు. అయ్యా.. మాకు ఏమీ లేదని వచ్చారు. 'ఒకప్పుడు డబ్బులకోసం ఆస్తి ఎక్కువ ఉందని చూపించిన వాళ్లే ఇలా మాకు ఆస్తి తక్కువ ఉంది అని' చెప్పటం హాస్యంగా అనిపించింది అక్బర్‌కు. వామ్మో ఈ జనాలు తెలివైనవాళ్లే అనుకున్నారు. అప్పుడు అర్థం అయింది అక్బర్‌కు. 'కేవలం జనాలు రాజుగారి మాటలు వింటారు. ఎవరూ కట్టుబడి పని చేయరు. ఎవరు ఏమి చేయాలనుకుంటే అదే చేస్తారు. మనం ఎవరినీ మార్చలేం. ప్రజలేమీ అమాయకులు కాదు' అంటూ బీర్బల్‌కే చెప్పారు అక్బర్. 'నేను చెబితే విన్నారా? జహాపనా. విషయం తెలుసుకున్నారు సంతోషం' అన్నారు. అక్బర్‌కు తెలివి వచ్చింది.


ఎన్ని కేకులు ఉన్నాయి?




దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 294

		8			6	2		
6				4				5
7				2			6	
					7		5	
2	5						8	7
	7		1					
	9			3				4
1				7				8
		2	4			6		

సుడోకు - 293 సమాధానం

2	4	9	5	6	3	1	8	7
8	6	7	1	2	4	5	9	3
3	5	1	7	9	8	2	4	6
5	8	2	9	3	7	4	6	1
9	3	6	4	1	5	7	2	8
7	1	4	6	8	2	3	5	9
1	2	8	3	4	9	6	7	5
6	9	5	2	7	1	8	3	4
4	7	3	8	5	6	9	1	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.